
సృజన

109

నవంబరు
1980

ఆధునిక సాహిత్యవేదిక మాసపత్రిక



ఈ సంచిక
రు. 3

సృజన దగ్గర కొత్తపుస్తకాలు

1. కళలూ-శాస్త్రీయ విజ్ఞానం - కొ. కు. విరసం ప్రచురణ రు. 6.00
2. మరోప్రస్థానం - శ్రీ శ్రీ ,, 5 00
3. మరో ఝంఝు - కవితా సంకలనం ,, 3.00
4. కళలు-సాహిత్యం ఎవరికోసం? - వ్యాసాలు సృజన ప్రచురణ 1.00
5. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం-
   కవిసేనకు సమాధానం - టి.ఎమ్.ఎస్. ,, 1.00
6. రగులుకొనే రాక్షసిబొగ్గు - సురా యుగ ప్రచురణ 5.00
7. రష్యన్ భల్లూకప్పట్టులో అఫ్ఘనిస్తాన్-కె వి.ఆర్. క్రాంతి ప్రచురణ 4.00
8. జనం కదిలింది-జాగ్రత్త, పెర్మటాంగ్‌టింగి
   నాటికలు-రుద్రజ్వాల, పోకల నరసింహారావు రాడికల్ ప్రచురణ 2.00
9. పల్లవి - చెరబండరాజు పాటలు — 2.00
10. కొలిమి - సాగర్ కవితలు — 1.50

ఈ పుస్తకాలు సృజన దగ్గరేకాక పీస్‌బుక్ సెంటర్, 3-4-74/3, లింగంపల్లి, హైదరాబాదు 500 027 దగ్గరకూడా దొరుకుతాయి. విరసం ప్రచురణలుమాత్రం సి. ఎస్. ఆర్. ప్రసాద్, సి-108, శ్రీనివాసనగర్ కాలనీ, గుంటూరు 522 006 దగ్గరకూడా దొరుకుతాయి.

విప్లవ కథకు కొ. కు. స్మారక బహుమతి

కొ. కు స్మారకంగా ఈ సంవత్సరంనుంచి ఒక విప్లవ కథకు కుటుంబరావుగారి భార్య వరూధినిగారు రు. 500 ల బహుమతి ప్రకటిస్తున్నారు. నిర్ణేతలుగా రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావుగార్లు వ్యవహరిస్తారు.

SṚJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'. Printed at Swati Press, Ramachandra Rao Road, Vijayawada for Venkataramana Mudranalayam, Warangal.

Working Editor: VARAVARA RAO

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

109 మాసపత్రిక నవంబర్ 1980

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 3-00

కాలంతో యెదిగిన మేధావి కొ. కు.

కాలంతోపాటు ఎదిగిన మేధావి కొడవటిగంటి కుటుంబరావు. "నూరుపూలు వికసించి వేయి ఆలోచనలు సంఘర్షించడం" సమాజాభివృద్ధికి అవసరమని విశ్వసించిన వైజ్ఞానికుడాయన. అనుభవం, అధ్యయనం, అభ్యాసం, కృషి రచన చేయడానికి కావలసిన సామగ్రిగాని, రచయిత కావడానికి ఒక ప్రత్యేకమైన 'ప్రతిభ', రచన చేయడానికి ఒక 'ఏకాంత' మూడ్ అక్కర్లే దని ఏభై యేళ్ళఎన్నడూ ఆపని తన కలం పని ద్వారా అక్షరాలా నిరూపించాడు కొ.కు.

సమాజంలో శాశ్వత విలువలు వుంటాయనుకోవడం ఎట్లా అశాస్త్రీయమో శాశ్వతంగా వుండే సాహిత్యం వుంటుందనుకోవడం కూడా అలాగే అత్యాశ అని యేదో మాట వరుసకు (మాడెస్టీతో) కాదు సీరియస్‌గా తాను ఆమోదించి మనకు చెప్పాడాయన. అయితే అభివృద్ధి నిరోధకమైన ఆలోచనలకు మాత్రమే కాలంచెల్లిపోతుందిగానీ, శాస్త్రీయమైన ప్రతిపాదనలు కాలానుగుణ్యమైన సృజనాత్మక అన్వయం ద్వారా సమాజప్రగతికి అవసరమైన పునర్నవించే విలువలుగా వికసిస్తాయి. నిన్నటి సమాజంలో గురజాడ లేకపోతే నేటిసమాజంలో కుటుంబరావులేడు. నేటి సమాజంలో కొకు శ్రద్ధగా, జాగ్రత్తగానాటిన విత్తనాలురేపటికొత్తతరం ఊహలకువెలుగు.

ప్రక్రియలను పరిపుష్టం చేయడానికి తాను సృజన చేయలేదు. ఆయా దశల్లో, ఆలోచనలు ప్రతిపాదించే అవసరం కొరకు ఆయన రచనా ప్రక్రియలను వాడుకున్నాడు. కథ, నవలరాసిన రోజుల్లో ఆయన సృజనాత్మకకళలో ఆయన మార్క్సిస్టు అవగాహన వెన్నెలలా విరిసి వ్యాసంలో అది వెలుగులా పరచుకున్నది.

ఆయన కథకుడు. సంఖ్యవల్లనే కాదు, వస్తువు శిల్పంవల్ల కూడ అరుదైన కథకుడు. ఉత్తమ నవలా రచయిత. ఆయనే ఒక చోట చెప్పినట్లు ఆప్రక్రియల్లో సాధన చేయడం కొరకు రాయలేదు, ఒకేసారి రాసివుంటే ఆయన 'చదువు' నవల

ఈనాడు మనం చేరుస్తున్న 'ఎన్నదగిన' తెలుగు నవలల్లో చేరివుండే 'పెద్దనవల' అయివుండేది కాదు. ఆయన దృష్టి ఎక్కువగా ఎంతసేపూ ఈ సమజానికి ఒక కళాకారుని స్థానం నుంచో, ఒక నాయకుని వేదికనుంచో, ఒక ఉపదేశకుని పీఠం నుంచో మనం చెప్పవలసిందేనా—మనం తెలుసుకోవలసిందేమీ లేదా అన్నజిజ్ఞాస. అయితే ఏభై ఏళ్ళు ఎన్నో ప్రక్రియల ద్వారా చెప్పాడు గదా. మొనొలాగ్ కావడా వికి చెప్పలేదాయన, డైలాగ్ కావడానికి చెప్పాడు— రానురాను చివరి రోజుల్లో ఈ జిజ్ఞాస ఎంతగా పెరిగిపోయిందంటే 'బుద్ధికౌలత' పైగానీ 'జానపద-ప్రజా'కళా రూపాలపైగానీ ఆయన చేసినచర్చంతా 'పైకి ఆలోచించడమే.' (Loud thinking)

విరసం దశాబ్ది ఉత్సవాలకు తాను రాగలిగితే విరసం యువతరం నుంచి నేర్చుకోవడానికే కానీ వాళ్ళకు తానేదో చెప్పాల్సి వుందని కాదనికూడ ఆయన నిజం గానే నమ్మాడు. ఎందుకంటే ఒక మార్క్సిస్టు మేధావిగా తనకున్న భౌతిక అనను కూలతల స్పృహ ఆయనకుంది. ఆయన రచన చేయడానికి అందుబాటులో, అవగా హనలో, పరిశీలనలో, అనుభవంలో వున్నది మధ్య తరగతి జీవితం. ఈ అనుభ వాన్ని విశ్లేషించడానికి తన జీవితానుభవానికి తోడుగా వున్నది పుస్తక విజ్ఞానం, మార్క్సిస్టు తత్త్వశాస్త్రాల అధ్యయనం కలిగించిన చైతన్యం.ఇదివిప్లవోద్యమం కొడిగట్టిన ఏభైలలో, అరవై తొలిరోజుల్లో ఆ దీపాన్ని గాలికి వదిలేసిన అంసం నుంచి అందుకొని కాపాడుకోదలుచుకున్న విరసంకు అందించడానికి ఆయనకు శక్తి నిచ్చింది. ఆ చైతన్యమే ఈ వ్యవస్థ గురించి 'దిగంబరకవుల' కున్న భావాలే తన వని చెప్పుకోగలిగే యువకునిగా ఆయనను కాపాడింది. ఈ చైతన్యమే వేయి నక్స ల్బరీలు వికసించాలని కోరుకోవడానికి, యువకులతో పాటు పూనుకొని విరసం స్థాపించడానికి ఆయనలో వైశాఖ (విశాఖ!) వసంతాన్ని వీచింది.

ఈ సమాజంలోనే ఎవరూ తటస్థులుగా వుండడానికి అంతిమ పరిశీలనలో అవకాశం లేదని విశ్లేషించే మనం కొ.కు. విప్లవోద్యమంలో తటస్థుడుగా వున్నా డని అన్నామంటే అది ఆయనకే కాదు మనకు మనం అపచారం చేసుకోవడం. విప్లవోద్యమంలో ఆయన ఎవరో కోరుకున్న పక్షం కాకుండా తాను కోరుకున్న పక్షం వహించాడు. విమర్శనాత్మకంగా విరసంతో వున్నాడాయన.

విచారమల్లా నక్సల్బరీ, శ్రీకాకుళం వెలుగులో విరసం ఏర్పడిన తర్వాత

విరివిగా తెలుగుదేశంలో తిరిగే అవకాశంగానీ, తెలుగుదేశంలోని విప్లవోద్యమంతో సన్నిహిత సంబంధం పెట్టుకునే వెసులుబాటు గానీ అనారోగ్యం, ఉద్యోగ విధుల కారణంగా ఆయనకు లేకపోవడమే.

అందువల్ల నే ఆయన అనుభవం ఒక్కసారి నక్సల్బరీ తరం అనుభవానికి మింగుడపడలేదు. లేదా నక్సల్బరీ తరం అనుభవం ఆయన అనుభవం పరిధిలో ఇమడలేదు. ఆయన కామన్ సెన్స్‌తో ఊహించింది నక్సల్బరీ అవగాహనకు అతక లేదు. ఎంత పండిన అనుభవమైనా, ఎంత నిశితమైన బుద్ధి అయినా దాని కొలత ప్రజల ఆచరణపై సానపెట్టకుండా సరిగా చేయడం సాధ్యం కాదు.

విప్లవోద్యమంతో సజీవ సంబంధాలున్న యువవిప్లవ రచయితలతో, విజ్ఞాన శాస్త్రం, మానసికశాస్త్రం విశేషంగా చదివిన మార్క్సిస్టు మేధావులతో చర్చల ద్వారా ఆయన ఈలోటును పూరించుకోవాలని చాల ప్రయత్నం చేసాడు. స్వయంగా వచ్చి చర్చించి తెలుసుకోవాలనుకున్నాడు. అనారోగ్యం సరేసరి ఆయన మరణమే ఆ ప్రయత్నానికి గొడ్డలి పెట్టయింది.

సాహిత్యమంటే సందేశమనే భ్రమలు ఆయనకెన్నడూ లేవు. సాహిత్యమంటే ప్రజల ప్రయోజనానికన్నదే అర్ధ శతాబ్దకాలమూ ఆయనలో చెదరకుండా నిలిచిన విశ్వాసం, అయితే ఉపదేశాల స్థాయినుంచి సాహిత్యాన్ని చర్చ, సంభాషణల స్థాయికి తెచ్చిన ఆలోచనలు ఆగిపోవడం మనిషి మరణం గురించి కలిగించే కలతను మించిన వెలితి. మనను ఆయన ఆలోచించడానికి సాహసించమన్నాడు. తనను ఆరాధించమని అనకపోవడమలా వుంచి ఆమోదించమని కూడ ఎన్నడూ అనలేదు. ఈ సుదీర్ఘ ఆలోచనా పథంలో ఆయన నడచివచ్చిన,గడచివచ్చినభావాలతో సహా మనం సంఘర్షిస్తూ జీవిస్తూ వున్న ఈజీవితాన్ని సాహసించిచర్చించి,విమర్శించి హృదయపూర్వకంగా స్వీకరిద్దాం. మానవుణ్ణి మానవునిగా గుర్తించినపుడుమాత్రమే కొ.కు. శాశ్వతంగా "స్వర్గస్తుడు" కాకుండా మన మధ్య తన భావాలతో సంఘర్షణను ప్రేరేపిస్తూ బతికి వుంటాడు.

—వరవరరావు.

3.11.80.

"కుటుంబ చింత"

మార్క్సిస్టు అవగాహనలో నేను ఓనమాలైనా నేర్చుకున్నానంటే అది కుటుంబరావు వద్దనే. అంటే అతనో అధ్యాపకుడూ నేనో శిష్యుణ్ణీ అని కాదు. కొ.కు. తో మాట్లాడడమే ఒక Marxian education!

కొ. కు "విరసం" మూల స్తంభాలలో ఒకడు. ఆ మాటకొస్తే ఆధునికాంధ్ర సాహిత్య భవనానికే అతడో పునాదిరాయి. గుత్త ధనానికీ, గుప్త ధనానికీ ప్రబల విరోధి అయిన కుటుంబరావుకి తెలుగు వచనమే గొప్ప గుత్త ధనం। అయితే అది గుప్త ధనం మాత్రంకాదు.

విరసం వరంగల్ యూనిట్ ఆయన సంస్మరణ సభ జరుపుతూ, "విరసానికి ఒక పెద్ద దిక్కు పోయింద"ని విచారం వెలిబుచ్చింది. అదే నా విచారం కూడా ఎంచేతనంటే కుటుంబరావు నాకన్నా పెద్ద.

కుటుంబరావుల తర్వాత శ్రీశ్రీల తర్వాత విరసానికి దారిచూపించే దిక్కు మాత్రం అచంచలంగా నిలిచేఉంటుంది. అతి స్పష్టంగా ఆహ్వానిస్తూనే వుంటుంది.

మద్రాసు

12-9-'80

—శ్రీ శ్రీ

శ్రీ కొ.కు. గారి గురించి

దాసరి సుబ్రహ్మణ్యం

దాదాపు ముప్పై సంవత్సరాల దీర్ఘకాలం, శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారితోపాటు ఒకే పత్రికలో పని చెయ్యటం, మరవరాని గొప్ప అనుభవంగా నేను భావిస్తున్నాను. వయస్సులో ఆయన నాకన్నా కొంచెంపెద్ద. చందమామ పత్రికలో చేరేనాటి వరకూ, మా యిద్దరి జీవితానుభవాలూ కూడా, కొంచెం హెచ్చుతగ్గుల్లో ఒకే లాంటివి. ఇద్దరం ఒకే ప్రాంతానికి చెందినవాళ్ళమైనా, 1952 వరకూ ఆయనతో నాకు వ్యక్తిగత పరిచయం అంటూ లేదు. ఇద్దరం ఆ సంవత్సరం చందమామ ఆఫీసులోనే మొదటిసారిగా కలుసుకున్నాం.

ఎవరెవరో తెలియక, కొంచెం దూరదూరంగా నిలబడి, మరెవరితోనో మాట్లాడుతున్న నన్నూ, శ్రీ కొ. కు. గారిని చేతులు పట్టుకుని లాగి, యీయన ఫలానా ఫలానా అంటూ పరిచయం చేసిన వ్యక్తి శ్రీ గట్టుపల్లి అంజనేయులుగారు. ఆయన వేరు వేరు పరిస్థితుల్లో మా యిద్దరికీ ఆప్త మిత్రుడు.

ఒకసారి శ్రీ కొ. కు ఏదో చదువుతూ అగి, తలఎత్తి, "ఈయన, నేను సోషలిస్టు సమాజంలో బతకటం లేదని తప్పు పడుతున్నాడు" అన్నాడు.

ఆయనకున్న రాజకీయ, శాస్త్రీయ విశ్వాసాలకూ, చందమామలో ఆయన తీర్చిదిద్దే కథా సాహిత్యానికీ మధ్య ఏదో వైరుధ్యం వున్నదన్న అపోహ సోషలిస్టు సమాజాన్ని కాంక్షించే వ్యక్తుల్లోనే వుండటం ఆశ్చర్యకరమైన సంగతి. అలాంటివాళ్ళు సోషలిస్టు సమాజాలను స్థాపించుకున్న దేశాలనుంచి వచ్చే, జానపద కథా సాహిత్యాన్ని చూసి వుండరు.

చందమామలో నాకూ, శ్రీ కొ. కు కు వున్న అనుబంధాన్ని పురస్కరించుకుని, ఆయన వ్యక్తిత్వం, ఆలోచనలపై ఏదైనా రాయమన్నారు సృజన సంపాదకులు. ఇది నాకు దుస్సాధ్యమైన కార్యం! శ్రీ కొ. కు వ్యక్తిత్వం (రచయితగా), ఆలోచనా ధోరణి ఏమిటో ఆయన రాసిన కథలూ, నవలలూ, వ్యాసాల ద్వారా తెలుగు నాట ఆసక్తి వున్నవాళ్ళందరికీ తెలిసే వుండాలి. వ్యక్తిగా ఆయన ఎంత ఉదారుడో, సౌజన్యమూర్తో, ఆయనతో కొద్దిపాటి పరిచయం అయినా వున్నవారందరూ ఎరిగినదే.

నాకు తెలిసినంతలో, అర్థమైనంతలో గత పదేళ్ళ కాలంగా తాను నమ్మి బల

కళాజీవి కె. కె.

ఎస్. వి. ఎస్. రావు

"కేవలం మేధాశక్తి మాత్రమే ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించలేదు. దాని వెనక నుండేది ఒక అపూర్వ వ్యక్తి అని మనం గుర్తించాలి" అన్నాడు ఎమర్సన్ గోథేను గూర్చి వ్రాస్తూ. కీర్తిశేషుడు కొడవటిగంటి కుటుంబరావు విషయంలో ఆ సూక్తి అక్షరాలా నిజం. అభ్యుదయరచయితలందరికీ మార్గదర్శిగాను ప్రతినిధిగానూ కె. కె. చిరస్మరణీయుడు. సాహిత్యమే బుద్ధిజీవితానికి పరాకాష్ఠ అని వ్రాకుచ్చేడు లెస్సింగ్. కె. కె. మృతిద్వారా అంధ్రదేశం ఒక మహామేధావిని కోల్పోయిందని దిగులు పడాలి మనం. ఎందువల్లనంటే ఉత్తమ రచయితల ప్రాముఖ్యతను నిర్ణయించేవి రచనా కౌశలం మేధాశక్తి మాత్రమే కావు. మానవ జీవితంపట్ల సామాజిక పరిస్థితులపట్ల నిర్దుష్టమైన అవగాహన ఎంతో అవసరం. అంతే కాక కె. కె. రచనల్లో సామాన్య పాఠకులు కూడ గ్రహించగల అంశాలు సాహిత్యం ద్వారా తన అభ్యుదయ భావాలను ప్రజలకందించడంలో షా, రసెల్, మెకాలే ఫక్కీలో ఆత్మ విశ్వాసం, స్పష్టత, బిగువైన శైలియిత్యాదులు. వీటన్నిటిని మించి

పరిచిన రాజకీయ లేక సాహిత్య ధోరణి ఒకటీ, ఆచరణలో జరుగుతున్నది మరొకటీ అన్న భావం ఆయనలో వున్నదని.

తెలుగు సాహితీ రంగంలో, ఈ అర్ధ శతాబ్ద కాలంలో శ్రీ కొ. కు నిర్వహించిన పాత్ర అద్వితీయమైనది. ఆయన అభిప్రాయాలతో ఏకీభవించలేని వారు కూడా, ఏ 'ఒక్క' వ్యక్తినీ ఈ విషయంలో ఆయనతో సముడుగా ముందుకు తేలేరు.

ఆయన మరణించే నాటి వరకూ దేశ, ప్రపంచ రాజకీయాలను గురించి అతి శ్రద్ధగా చదువుతూండేవారు. Decent of man అనే పుస్తకం- జీవపరిణామానికి సంబంధించినది-ఎక్కడ దొరుకుతుందా అని ప్రయత్నిస్తున్నారు, చనిపోయేదానికి వారం రోజులు ముందు వరకూ. తీరా, ఆఖరి క్షణాల్లో చదువుతున్న పుస్తకం, బొలీవియాలో చేగువేరా గెరిల్లా పోరాట ఓటమి గురించి, రెజిస్ డిబ్రే రాసినది.

మార్క్సిజంలో, శ్రామిక నియంతృత్వంలో శ్రీ కొ.కు కు గల విశ్వాసం అచంచలమైనది. ఎన్నో ఆర్థికమైన యిబ్బందులకూ, యితర వత్తిళ్ళకూ ఆయన ఏనాడూ తల వంచలేదు. ఇది మధ్య తరగతి నుంచి వచ్చిన మార్క్సిస్టు మేధావుల్లో అంతగా కనబడని ప్రత్యేక లక్షణం.

నా వంటి పాఠకులను ఆకర్షించిన ప్రత్యేక లక్షణం కె. కె. లో కనపడిన రస హృదయం. సంపూర్ణమైన వ్యక్తిత్వం. కె. కె. ఉత్తమ రచయితా మార్క్సిజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్న మేధావి మాత్రమే కాదు. ఆ ఉద్యమ మూల పురుషుల స్థాయిలో భావుకత్వం, కళా దృష్టి గల సహృదయుడు కె. కె. ఉదాహరణకు సంగీత కళను గూర్చి సాధికారంగా ప్రస్తావించగల అభ్యుదయ పరులు బహు కొద్దిమంది. చిన్నతనంలో తనని ఆకర్షించిన మరాఠీ నాటకాలు బాల గంధర్వ గాత్రి సంగీతం గూర్చి జీవన్ పురి (శుద్ధదేశి) వంటి రాగాలతో సహా వివరించేడు ఒక వ్యాసంలో నలభై ఏళ్ళ తరువాత. రఘురామయ్య జొన్న విత్తుల ఇత్యాది నటులు పిలూ, జింగ్లీ వంటి రాగాలను ఆంధ్ర నాటక రంగంలో అనుకరించడం బాల గంధర్వ కావాలనే మాల్‌కౌస్ (హిందోళం)లో రిషభాన్ని చేర్చడం వంటి పాత అనుభవాలు మనకు అందించగలడు కె. కె. సంగీతానికి సాహిత్యం భావం ప్రధానాంశాలనీ, వీటిని నిర్లక్ష్యం చేయడం నుండే మన సినిమా సంగీతం హీన స్థితికి దిగజారిందని కె. కె. విమర్శించాడు. అసభ్యత ఒక్కటే కాక కె. కె. ఉద్దేశంలో చవుకబారు సినిమా సంగీతంలో సంగీత హృదయం లోపించడమే విచార కరం. రేడియో కార్యక్రమాలను, సినిమా పరిశ్రమను విమర్శించడంలో కూడా కె. కె స్వయంగా వైజ్ఞానికుడు కనుక 20వ శతాబ్దంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరికరాలు, ప్రచార సాధనాలు సామాన్య ప్రజలకు మేలు చేసాయని గుర్తించాడు కె. కె. అయితే పెట్టుబడిదారి సమాజంలో కళలన్నీ వ్యాపార దృష్టికి బలికావడం సహజం. సినిమా కళకు భవిష్యత్తు వున్నదని చిన్న చూపు చూడరాదనే కె. కె. భావన. కె. కె. కు సినిమా రంగంతో గల పరిచయం అందరకీ విదితమే కాని నలభై ఏళ్ళ క్రితం కె. కె. సంగీత దర్శకత్వం చేపట్టడం ఎందరికెరుక? సినిమా అనేది భారీ పరిశ్రమ గనుక యిప్పట్లో అభ్యుదయ పరులు చిత్రసీమపై ఆశలు పెంచుకోవడం అనవసరం. కాని సినిమా కళనుండి నాటక రంగం నేర్చుకోదగిన గుణపాఠాలు సూచించాడు కొన్ని కె. కె. ఇతివృత్తాన్ని సంభాషణలను ఎన్నుకోవ డంలో లేనిపోని చాదస్తం మానుకొని అవసరమైన మార్పులతో ఆకర్షణీయమైన పద్ధతిలో దర్శకులు అందుబాటులో వున్న నటులను ఉపయోగించుకోగలిగితే నాటక కళను పునరుద్ధరించవచ్చునని అభిప్రాయ పడ్డాడు. సినిమాలు తీయడానికి పెట్టుబడి అవసరమయినట్లే నాటక కళకు కూడా కొద్దిపాటి పెట్టుబడి అవసరమని కుటుంబ రావుగారి సలహా. ఇతివృత్తం ఎలాంటిదైనా ప్రదర్శనం ప్రేక్షకులను బలంగా ఆక ర్షించాలి అంటాడు కె. కె.

చార్లీ చాప్లిన్ చిత్రాలను సమీక్షిస్తూ హాస్యం ద్వారా కరుణ రసపూరిత మైన పాత్రలు సృష్టించినా చాప్లిన్ చేపట్టిన విలువలు ఆదర్శాలు మధ్య తరగతికి చెందినవే అనీ శ్రామిక వర్గానికి సన్నిహితమైన పాత్రలు ధరించినా వాస్తవికత

శూన్యమని కె. కె. అభిప్రాయం. కళాకారుల ఆశయాలు ఎలాంటివైనా వర్గ సమాజంలో కళాకారుడి స్వాతంత్ర్యానికి హద్దులుంటాయని రుజువు చేశాడు ఒక వ్యాసంలో. అందుకే వ్యక్తులను గాక వ్యవస్థనే పూర్తిగా మార్చవలసి ఉంటుంది. 'చిత్ర నిర్మాత ప్రజల కళావసరాలకు శత్రువూ కాడు. పోషకుడూ కాదు. డబ్బు వచ్చిన చిత్రాన్ని కళ నెపంగా విమర్శిస్తే ఆయన సహించడు. తన చిత్రంలో ఎవరికైనా కళ కనిపిస్తే ఆయనకు అభ్యంతరం ఉండదు' అన్నాడు కె. కె. ఇలా అనడంలో కొంతవరకు నిజం లేకపోలేదు. అయితే కె. కె. అభిప్రాయం యీ నాటి సినిమా రంగానికి వర్తించదు.

ఆధునిక యుగంలో ముఖ్యంగా ఆంధ్ర దేశంలో కళానీపుపట్ల అభ్యుదయ పరులలో గోచరించే అసంతృప్తి, భిన్నాభిప్రాయాలు కె. కె. వ్యాసాలలో కనిపిస్తాయి. కళలన్నీ సామూహిక కృషిగా ఉద్భవించిన వర్గ సమాజంలో ప్రతీ కళ ఒక వృత్తి కింద లాభకరమైన వ్యాపారం కింద పరివర్తన చెందుతుంది. కళాకారులు సాంఘిక ప్రయోజనానికి కృషిచేయాలనడం పరిపాటి. కాని 'సాంఘిక' "సామాజిక" వంటి పదాలు అస్పష్టమైనవని కె. కె. వివరిస్తూ "కళలన్నిటిలో సామూహిక తత్వం విధిగా ఉండి తీరాలని నేను సూచిస్తున్నాను" అన్నాడు. 'నిజమయిన అభ్యుదయ కళలన్నీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో శ్రామిక వర్గ ప్రయోజనానికి అనుకూలంగానే ఉంటాయి. ఈ దృష్టితో చూస్తే Abstract Art అనేది వెర్రి తల అని స్పష్టమవుతుంది. కళాకారుడి వ్యక్తిగత స్వాతంత్ర్యం అన్నది ఉట్టి మృగతృష్ణ. ఇటువంటి సిద్ధాంతాలు కళాసృష్టిని ఏ స్థితికి తెచ్చాయంటే నూటికి 90 మంది ఏ సంగీతం నుండీ, ఏ చిత్రలేఖనం నుండీ ఆవంత చైతన్యం పొందలేని స్థితికి దిగజారిపోయారు. రాను రాను మనకు వెండి తెర ఒకటే-అదైనా సెక్స్ భరితమైతే- కళా సాధనంగా మిగిలిపోయే రోజు ఎంతో దూరంలో లేనట్టు కనబడుతుంది' కె. కె. యిలా అన్నాడు పదేళ్ళ క్రితం. పై వాక్యాలలో 'పరోక్షం' గానో అనడం అనుమానాలకు దారి తీయవచ్చు. కె. కె. అభిప్రాయంలో "....వాటి స్వభావం సామూహికంగా ఉండాలి, అంటే శ్రామిక వర్గానికి చెందనివాళ్ళు కూడా వాటి ప్రభావానికి బలంగా గురి కావాలి." సినిమాలపై విపరీతమైన మోజు యిటీవల పెరగడానికి కారణం సామాన్య ప్రజానీకానికి అదొక్కటే అందుబాటులో ఉండడం వల్ల. మన ఎకడమీలు మధ్య తరగతి విద్యావంతులు అయితే యిక్ష్వాకుల కాలం నాటి సంగీతాన్ని నాట్యాన్ని లేకుంటే అర్థ రహితమైన ఆధునిక చిత్రకళను పోషించినంత కాలం పరిస్థితులు యిలాగే ఉంటాయి. సాహిత్యంతో పాటు వీటి పైన కూడా అభ్యుదయ పరులు శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది.

కె. కె, కవిత్వం వ్రాసినట్లు నాకు తెలిసినంతమట్టుకు ఆధారాలు లేవు. కాని ఉత్తమ కవిత్వాన్ని ఆస్వాదించగలిగిన రస హృదయుడు. 'దాహం దాహం అని

మదరమాగిన జామిపండు

కుటుంబరావుగారి సాహిత్యవ్యక్తిత్వం

కె. వి. రమణారెడ్డి

జామిపండు కొడవటిగంటి కుటుంబరావుగారికి (కొ. కు.) చచ్చేంత యిష్టం. చనిపోయేరోజున జామిపండొకటి తెప్పించుకు తిని, వేరే కారణాల వల్ల చనిపోయాడు. ఆయన వ్యక్తిత్వం కూడా అ పండు లాంటిదే. పిందె దశ నుంచీ పరిపక్వదశ దాకా ఒకే రుచినివ్వని యీ "పేదవాడి యాపిల్" (poorman's Apple) మొదట వగరొగరుగా తర్వాత దోరై పులుపులుపుగా పండుతూ తియ్యతియ్యగా మదరమాగి పుల్లనే లేనంత కమ్మకమ్మగా భేదాలు చూపుతుంది. కొ.కు కి సరిపోయే యదార్థ సంకేతం యిదే.

వ్యక్తిత్వాన్నుంచి సాహిత్య వ్యక్తిత్వాన్ని విడదియ్యడం సాధ్యమనుకున్నా సహజమేనా అన్నది ప్రశ్న. వ్యక్తిత్వం సాహిత్య వ్యక్తిత్వాన్ని విలక్షణం చెయ్యక మానదు. ఒకానొక అఖండ పదార్థాన్ని ఖండించడం, ముక్కల్లో దేనికీ మంచిది కాదు, మన మంచికీ కాదు. పెనవేసుకుపోయిన గట్టి బంధాన్ని మళ్ళీ దాని తొలి స్థితికి —వేర్వేరుగా వుండే స్థితి— ప్రయత్న పూర్వకంగా తీసుకు వస్తే, పెనబడి వుండినప్పటి గట్టిదనం పోయి, తెంచి తుంచి పోగులు పెట్టడానికై తేనే వీలు కలిగించే పని. వ్యక్తిత్వం సేంద్రియ జీవ పదార్థం. దాన్ని విడగొట్టడం చెడగొట్టడమే. కృత్రిమమైన యీ ప్రయత్నం సత్ఫలితాల నివ్వదు. పరిపూర్ణమైన అవగాహన కలిగించదు. అందుకని అలాంటి దాన్ని విడిచేయడం సవ్యమైన పని.

కొ.కు వ్యక్తిత్వం సాగుతూపోయేదే గాని నడమ ఆగేది కాదు. దానికి అలసటలేదు. అది దూసేదికాదు. కళ్ళు జిగేల్మనిపించదు. మెరుపుతీగలా గాక ఇంటి దీపంలా, మందంగానే కావచ్చు వెలుగునిచ్చేది. శ్రీ. శ్రీ. కవితకు "పేరడీ"

కేక వేస్తే ఎవరు చెప్పుకుంటారు. తిరిపెమున కిద్దరాండ్రా పరమేశా గంగ విడుపు పార్వతి చాలున్ అనడంనుండే శ్రీనాథుడు కవి అయ్యాడు' అంటాడొక వ్యాసంలో. కె. కె. మహాకవి కాకపోయినా ఒక మహావ్యక్తి.

అనిపిస్తూనే తన ప్రకృతికి కామెంటరూ, సాహిత్యం "వెలిగేదీ వెలిగించేదీ" కావాలని కొ. కు యే ఒకసారి రాశారు. పద్యంలా మద్యంలా గాక, సరళం స్వచ్ఛం అయిన కొ.కు వచనం శుభ్రమైన మంచి నీళ్ళలాగుంటుంది. తేలికే బటువు. తేలికదనమంతగా కష్టసాధ్యమైంది ఏదీ వుండదు. మరో భాషలో ఆలోచించి యీ భాషలో రాయకుండా, వికృత సౌందర్యంగల వివిధ విదేశీ సాహిత్య ధోరణులను అరిగించీ అరిగించుకోక కాయితాల మీది కెక్కిస్తున్నానని కక్కెయ్యకుండా, సాదాగా (విరలంకార సుందరంగా) సాఫీగా "స్టెడీగా" "స్టడీ" ఫలితంగా వెలువడిన సాహిత్యం కొ.కు.ది. అది మన పెరటి చెట్టు తొడిగిన పువ్వు. పువ్వూ తావీ వేరుగాదు. ఇలా చూసిన కొ.కు. వ్యక్తిత్వమూ సాహిత్య వ్యక్తిత్వమూ ఆ పువ్వులోని రెండు రేకులే, అగాథమనిపించని విధంగా పిల్ల కాలవలాగా తన జ్ఞాన వాహినిని నాలుగు దశాబ్దాలపాటు నిరంతరాయంగా "మనుష్యు"ల పొలాలకు మలిపిన యీ వ్యక్తిలో, మాటగానీ రాతగానీ, ఎంత వేగమో అంత స్థిమితం, ఎంత లోతో అంత పైపై దనిపిస్తుంది.

సూక్ష్మం మరొక కొ.కు. విలక్షణం. తానుఇష్టపడుతూవచ్చిన హోమియోపతి వైద్యం మార్క్సిజం లాగుందని, లేదా, యిది దాని లాగుందని అనుకోడమే కాదు, నోరు విడిచి అన్నారు కూడా కొ.కు. సెట్టి ఈశ్వరరావు గుర్తు చేసుకు చెప్పారిటీవలే-బొంబాయిలోనో సిమ్లాలోనో వుండి దక్షిణాదికి తిరిగివచ్చాక. ఈశ్వరరావుగారి వెంట విజయవాడలో "ప్రజాశక్తినగర్" కు వెళ్ళి మాటల్లో మాటగా యీ పోలిక చెప్పారు. విన్నవాళ్ళు విస్తుపోయి వుంటారు. వారి దృష్టికి మార్క్సిజం గహనం, తనకు అవగాహన ద్వారా వుద్యానం. ఇది పెరగాలి కాని పిచ్చిగా ఎటుబడితే అటు కాదు. అప్పుడప్పుడూ యీ పిచ్చి పెరుగుదలను కత్తిరించే తోటమాలీ కావాలి, పిచ్చి మొక్కలను పెరికేసి కలుపు దీసే కూలీ కావాలి. వురకలతో పరుగులతో ముందుకి దూసుకుపోతున్న శాస్త్రవిజ్ఞానం నుంచి ఎప్పటికప్పుడు తెలివిగా వాడుపుగా సారం పిండి, మార్క్సిజాని కెక్కించకపోతే, అది ముడుచుకుపోయి 'డాగ్మా' మిగులుతుందేమో గాని, కార్యాచరణకు దారి జూపే శాస్త్రజ్యోతి కాలేదు. ఆ నాటి నుంచీ చివరిదాకా కొ.కు పదే పదే రాసీ, చెప్పీ, ఎందరినో తృప్తి పరచలేని, యీ చిన్న విషయం, నిజానికి, ఒక విశేషమే.

సిసింద్రీలో చిచ్చుబుడ్లో "ఆకాసువ"లో—బాణాసంచా-కొ.కు సాహిత్యంలో కనిపించవు. అందుకే చలాన్నో మరొకర్నో అనుకరించలేదు సరిగదా, అనుసరించనూ లేదు. తాను ఫ్రాయిడ్‌నీ యాడ్లర్‌నీ యాంగ్‌నీ చదివి మనోవిజ్ఞానశాస్త్రం మథించక పోలేదుగాని, దాన్ని వ్యక్తిపరంగానే వినియోగించాలి తప్ప సమాజపరంగా కాదనీ, సమాజపరంగా అవి నిరుపయోగమేగాక వుపద్రవకరమనీ ఇటీవలే

నాతో అన్నారు. కొ.కు మరోవైపు "బుద్ధికౌలత"ను సిద్ధాంతంగా ప్రతిష్ఠాపించే పనిలో వున్నారు. ఆయన వుద్దేశం, యీ సిద్ధాంతం అతీంద్రియ శక్తులకు సంబంధించిందే కాదు, భౌతికమైనదే. "మనస్సు" నటుంచి మెదడూ దాని చర్య అయిన బుద్ధి భౌతికాలే. మార్క్సు అన్నట్టు "మనస్స"నేది భౌతిక అభివృద్ధి తాలూకు అత్యున్నత పరిణామమే. (Mind is the highest development of matter) అయితే యిరవై ముప్పయ్యేళ్ళ క్రితమే కమ్యూనిస్టు పార్టీ దినపత్రికల్లో అంకుర ప్రాయంగా ప్రతిపాదించిన యీ సిద్ధాంతం "ఆంధ్రజ్యోతి"లో ప్రచురణ అయ్యే నాటికి మొలకకూడాగాక చేతమానై కూచుంది. ఆ వెనకటి రోజుల్లోకి కనుబొమలెగరేశారు బెజవాడ కమ్యూనిస్టులు. తర్వాతలేచాయి పుకార్ల లాంటి మాటలు- కొ.కు కి దెయ్యాలంటే నమ్మకం, పునర్జన్మనూ కాదనరు, ఇతర గ్రహాలలోని జీవులెవరో వచ్చి కాశ్మీరులో మార్తాండ దేవాలయాన్ని కాకుంటే ఈజిప్టులోని పిరమిడ్లను నిర్మించి తుర్రుమని పోయారంటారు-ఇలా, కొ.కు. కోరిందీ కోరుకుందీ ఒకే ఒకటీ: మార్క్సిజం జడప్రాయం కాగూడదు. సేంద్రియ పదార్థంలాగా ఎదగాలి, పెరగాలి, విస్తరించాలి, వికసించాలి.

చలమేవిటీ, అంతకంటె వెయ్యిరెట్లు బలంగా అప్పట్లో అమ్మశక్తిలా అమెరికా నుంచి పెట్టుబడిదారీ ప్రపంచానికీ వాటి ద్రవ్య విధానాలకు బలవంతాన గుంజకు కట్టేసినట్లుగా వుండిన మనదేశం లాంటి వలస దేశాలకూ విజృంభించి ప్రగల్భించి విధ్వంసిస్తూ వచ్చిన "ది గ్రేట్ డిప్రెషన్" ఆర్థికంగా ఎంతో అనర్థాన్ని కలిగించినా, "హంగ్రీ థర్టీస్"లో ఆకలినీ షోభనీ దైన్యాన్ని విడిచివెళ్ళి గిరగిరా గిరగిరా తృణావర్తుడు బాలకృష్ణుణ్ణి ఆకాశానికెత్తి తిప్పేసినట్టుగా కొత్తకారు రచయితల్ని వూపేసి గిరగిరా తిప్పేసింది. అందువల్ల సాహిత్యానికి లాభించింది. "డిప్రెషన్ చెంబు" లాంటి ఇతరుల కథల్నటుంచి, శ్రీ.శ్రీ.ని "మహాప్రస్థానం"రచనకీ కొ.కుని "అరుణోదయం" వగైరా నవలలకీ పరోక్షంగానైనా పూనించింది. ఇద్దరి చదువులూ అక్కరకు రాలేదు. ఇద్దరినీ నిరుద్యోగమూ పేదరికమూ పట్టుకున్నాయి. ఇద్దరినీ "దేశమ్మకాకులు'లాగా మహానగరాలైన మద్రాసుకో బొంబాయికో యింకా చిన్నవైన సిమ్లాకో ఖర్గపూర్‌కో తోసి దేశదిమ్మర్లనిపించాయి. అప్పటికే మన జాతీయవాదం నీరసించింది. "లవణోద్యమం" లాఠీ దెబ్బలెన్నోతిన్న కాంగ్రెసు వాదుల్ని (ఇంకా 'కాంగ్రెసు వాలాలు'కాలేదు.) జైళ్ళకు పంపినంతగా ఉద్యమాన్ని విజయపంతం చెయ్యలేదు. భ్రమలు పొరల్లా తొలిగి యువకులు కొందరు కమ్యూనిస్టు పార్టీని ఆంధ్రదేశానికి దిగుమతి చేస్తూంటే, ఉత్తర భారతదేశంలో నాసిక్ జైల్లో జె.పి, లోహియా, మసానీ, అశోక్ మెహతా, యూసుఫ్ మెహరవీల చేత కాంగ్రెసు సోషలిస్టు పార్టీ (సీయస్పీ)ని యేర్పాటు చేయించిన ఆ రోజుల్లో, ఎవరో

మిత్రుడు యాదాలాపంగా గాక నిజాయితీతో* అన్న ఒక మాట కొ.కు. చేత "కేపిటల్"ను చదివించి మార్క్సిస్టుని చేసింది. శ్రీశ్రీ కవికాబట్టి యిలాంటివి గాకపాస్టర్నాక్, మయకోవస్కీ, నజ్రుల్ ఇస్లామ్‌లను వంట బట్టించుకున్నాడు. వచ్చినా కవి కాదలచని కొ.కు. కవిత్వాన్ని ఈసడించలేదు గాని, తన తెనాలి జీవితం రోజుల్లోనే "నవ్య మానవతావాదం" ప్రభావంలో పడకుండా తప్పుకో గలిగి కేటాగా నిలుచో గలిగారు. ఇటీవల కొ.కు గురించి రాస్తూ, పురాణం సుబ్రహ్మణ్యశర్మ ఒకచోట కుటుంబరావుగారి అన్న వెంకటసుబ్బయ్య కథలు రాసే వారని అన్నారు. కథలు ఏవైనా రాశారేమో తెలీదుగాని కవితలు మాత్రం రాశారు. ఉన్నట్టుండి యిల్లూ వాకిలీ విడిచి "లోకం మీదికెళ్ళారు". సాహితీ సమితి పాతై నవ్య సాహిత్య పరిషత్తు (న. సా. ప.) వింతగా మారుతూ తన యింట్లోకి వచ్చి కూచుని పలకరించి పోతున్న రోజులవి. పేరులో వున్నంత భేదం సారంలో లేని యీ రెండు సంస్థలూ కొ. కు సాహిత్య వ్యక్తిత్వం మొగ్గ తొడిగేందుకైనా పనికి వచ్చాయి. అది "పూర్వపాదశ". అప్పట్లో కొంతకాలం ఆయన న.సా.ప. సభ్యుడేగాని యింతలో తెనాలి వదిలి పొట్టచేతబట్టుకు మద్రాసుకూ అక్కడి నుంచి బొంబాయికీ మరిఅక్కడ నుంచి సిమ్లాకూ పోవలసి వచ్చింది. నూతికప్ప చెరువు కప్పగాకుండానే సముద్రం కప్ప అయినంత మార్పు భౌతికంగా జరిగినా, చాలాకాలం కొ. కు. సాహిత్య వ్యక్తిత్వం చెరువు కప్ప స్థితినే తలదాల్చి,బస్తీల మధ్య తరగతి కింది మెట్టువారి జీవితాలను యితివృత్తంగా యిచ్చింది.

సాహిత్య వ్యక్తిగా పుట్టీ పుట్టడంతోనే ఎదిగి పెరిగి పోలేదు. శిల్ప ప్రాధాన్యంతో రాసి, తనకీ మొఖం మొత్తిన "కీటకదశ" కొద్దికాలం కాదు, పది పదకొండేళ్ళ పాటు సాగింది. శిల్పానికి అతిశయ ప్రాముఖ్యం, వస్తువుకి అల్పత్వమే. ఆ తర్వాతనైనా కొ.కు. శిల్పాన్నే వదిలేశారా? వదిలెయ్యమని వుపదేశించారా? లేదు. లేదు. 'ఈనాడు'లో చలసాని ప్రసాదరావు వేసిన అభాండం మాత్రమే గాని, ఉచిత రీతిలో శిల్పాన్ని మన్నిస్తూనే, యితివృత్తాన్ని అణగారిన స్థితి నుంచి పైకెత్తమన్నారు, అంతే. విప్లవ రచయితల మీద దాడికి ప్రసాదరావుకి యిదో దుడ్డుకర్రలా వుపయోగపడ్డ మాట, నిజం. కొ.కు. శిల్పం కొట్టవచ్చేటంత మదించిందెన్నడూ లేదు. శరీర నిర్మితిలో ఏ అవయవం ఏ స్థానంలో వుంటే అమరిక కలిగి అందమనిపిస్తోందో, శిల్పమూ యితివృత్తమూ తమతమ ఉచిత స్థానాలనూ వాటి వింతలనూ తప్పి ముందుకు నెట్టుకురాగూడదు. విప్లవ రచయితల కథల్లో శిల్పమే లేదనడం నిరాధారమైన, పరనిందతో గూడిన ఆరోపణే. మావో ఏనాన్ గోష్ఠిలో చెప్పిందానికీ కొ.కు. చెప్పిందానికీ యీ అంశంలో పెద్ద భేదమేదీ లేదు. శిల్పంకోసం వెర్రి వ్యామోహంతో వెంపర్లాడవద్దు, యితివృత్తాన్ని ఎంపిక చేసుకుని విశ్వసనీయంగా చిత్రిస్తే, శిల్పం కావలసిందల్లా జల్పం కాకుండా వుంటుంది.

"విమర్శాత్మక వాస్తవవాదం" కొ.కు. లో అసలే లేదంటూన్న మధుసూదనరావు గారితో నేను కొంచెం విభేదిస్తున్నాను. సోషలిస్టు భావ స్పృహ కొ. కు. లో మధ్య వచ్చిందేగాని మొదటి నుంచీ వున్నది కాదనేది నా మొదటి అంశం. సోషలిస్టు విప్లవం లేకుండానే "సోషలిస్టు వాస్తవవాదం" రాదనేది రెండోది. మహా అయితే, సోషలిస్టు స్పృహ వుండవచ్చు. సుదూర సోషలిస్టు సమాజానికి అంకురాలు కొందరి రచనల్లో వుండవచ్చుగాని, ఈ "పర్‌స్పెక్టివ్" వున్నంత మాత్రాన్నే ప్రతి రచనా సోషలిస్టు వాస్తవవాద రచన కాబోదు. సోషలిజం భౌతిక వాస్తవం అయ్యాకే సాహిత్యంలో యీ తరహా ధోరణికి పునాది ఏర్పడుతుంది. మధ్య తరగతి యితివృత్తాన్ని తన కథల్లో నవలల్లో ఆమోదప్రాయంగా మాత్రం చిత్రించలేదు కొ.కు. విమర్శించారు. కొ.కు. విమర్శకూ వీరేశలింగం ఖండనకూ తేడా వుంది. వీరేశలింగం చేతి కలం పరశువు, కొ.కు. చేతి కలం దబ్బనం కూడా కాదు, చాలా పదునైనా తేలిగ్గా చర్మం దాటి మాంసాన్ని పొడుస్తూ అంత బాధ అనిపించని సూది, లేదా శ్రీ.శ్రీ. మాటల్లో "శస్త్రకారుని మహేంద్రజాలం" అపహాస్యం చేసినా అవమానం కలగని విధంగా, అవహేళన చేసినా సాదా నవ్వుతాలులాగా, కొ.కు. హాస్యాన్ని మహా వాడుపుగానూ తెలివిగానూ వుపయోగించుకున్నారు. మొగమోటం లేదనేగాని మొరకుతనం కూడా లేని నాగరికమైన నాజూకు కొ.కు. హాస్యం విశిష్టత. ఈ సూక్ష్మం గురజాడది. గురజాడనీ వీరేశలింగాన్నీ అభిమానిస్తూ వచ్చాడు గనకనే, ఆ భావవారసత్వాన్ని పునర్నవం చేసిన "అభ్యుదయ రచయితల సంఘం"లో సభ్యుణ్ణయ్యానని తానే రాశారు. ఇంతకీ, కొ.కు. పుట్టి పెరిగిన సమాజం, దాని భావ వాతావరణం, భూస్వామిక - పండిత - సంప్రదాయాన్ని కొద్ది కొద్దిగా వదిలించుకొని, పెట్టుబడిదారీ స్వలాభ తృష్ణ చోదక శక్తిగా నెమ్మది మీద మారుతూ, పూర్తి తృప్తినివ్వక, మౌలిక సామాజిక సమస్యల పరిష్కారానికి నిజాయితీతో బలంగా పూనకుండా భూస్వామిక - పండిత సంప్రదాయానికి నగిషీలు చెక్కి నాణ్యం చేసి, కొత్త దుస్తులు వేసి, నవీనమనే భ్రమ కలిగించిన భావ వాతావరణం. దీన్ని గుర్తించారు గనకనే కొ.కు. విమర్శకు దిగారు. సమాజ వాస్తవికతను యథాతథంగా గాక, విమర్శాత్మకంగా చూసి, పెట్టుబడిదారీ కపట నవీనతను దాటుతూ సోషలిస్టు భావ బీజాలను తమ సాహిత్యాలనిండా వెదజల్లారు. అంటే, నిజమైన భావ విప్లవానికి బాట వెయ్యడం మొదలెట్టారన్న మాట. కవిత్వం ద్వారా శ్రీ. శ్రీ. ఉర్రూతలూపితే, వచనం ద్వారా కొ.కు. ఆలోచనకు మారాకు వేయించారు. ఇందులో యిద్దరూ యిద్దరే అయినా, కొ.కు. తనపాత్రను తగ్గించి శ్రీ.శ్రీ. పాత్రను తగ్గించడం జరిగింది. వాస్తవంలో, "మహాప్రస్థానం" తాలూకు పౌరాణిక సంకేతాలూ, పండితులకే కొరుకుడు పడని సంస్కృత సమాసాల యినప గుగ్గిళ్లూ, శ్రామిక

జన ప్రాముఖ్యతను గుర్తించి స్వాగతం చెప్పిన కవితలతోబాటు డాడాయిస్టు, సర్రియలిస్టు ధోరణులున్న కవితలు శ్రీశ్రీని వదల్లేదు గాని "కులంగాడి అంత్యక్రియలు"తోనో యింకా ముందుగానో కొ.కు.ను వదిలాయి. కవిత్వానికి గం అకర్షణగానీ మన్ననగానీ వచనానికి లేకపోవడమనేది, ఒక సమాజం వెనకబాటుతనానికే నిదర్శనం. పైగా "గాఢ" వర్ణాలూ అగాధ వుద్రేకాలు "సుప్త చైతన్యం" తాలూకు ఆదిమ సహజాతాలూ వచనానికి, ముఖ్యంగా కొ.కు. వచనానికి సరిపడని సంగతులు. ఆ వచనమైనా వీరేశలింగం "సులభగ్రాంధికాన్ని" అటుంచి, చలం విశ్వంఖల వ్యావహారికానికీ, లేక శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రీ మల్లాది రామకృష్ణశాస్త్రీ శ్రీనివాస శిరోమణీ వగైరా బ్రాహ్మణ అగ్రహారిక భాషా శైలికీ దూరమై, కవిత్వాంశను తొక్కేసిన సాదాసాఫీ వచనమే - నిరాడంబరం, సహజం, వాస్తవ విహితం, నాగరకం (అర్బేన్). ఆరుద్ర కాబోలు, కొ.కు. వచనాన్ని తొలిపొద్దు కారణాలు చిరుచురుకులతో సరిపోల్చాడు.

"బాలగంధర్వ" మొదలు కపిలవాయి రామనాథశాస్త్రి దాకా, యింకా ముందుకొచ్చి బాల మురళీకృష్ణ దాకా మారుతూ వచ్చిన సంగీత ధోరణులేమి, వీధి నాటకాల మొదలు మూకీ, టాకీ చిత్రాల సుగుణ దుర్గుణాలేమి, "తత్వాల" మొదలు జనం పాటల దాకా జానపదగేయ రూపాలలో వచ్చినఎదుగు బొదుగులేమి, డార్విన్ న్యూటన్స్ మొదలు ఐన్‌స్టీన్ జేమ్సుజీన్స్‌ల దాకా పెరిగి మారుతూ వచ్చిన శాస్త్ర విజ్ఞాన పరిణామాలేమి, దినమాత్ర జీవనం గలిగిన చిల్లర విషయం మొదలు యుగాల మేరకు వ్యాపించే చారిత్రక సంఘటనల పరిజ్ఞానం విషయంలో కోశాంబీ దాకా (చనిపోయే రోజున కోశాంబీ మెమోరియల్ వ్యాస సంపుటి చదివి నోట్సు తీసుకున్నారు) నేమి- యిలా కొ.కు. వ్యక్తిత్వం, సాహిత్యంలో గిరిగీసుకు కూర్చోక, ఏక కాలంలో అనేక ముఖాలుగా ప్రసరించే మూలపదార్థం కాగలిగింది. అయితే, తానేం చెప్పినా చెప్పకపోయినా, వీటన్నిటినీతాను మార్క్సిజమని గ్రహించి చేబట్టిన కొలబద్దను వాడకుండా, తన చైతన్య పరిధిలోకి తెచ్చుకోలేదు. అలా తెచ్చుకున్నదాన్ని ఏదో రచనా రూపంలో పంచిపెట్టకుండా దాచిపెట్టుకోలేదు. శాస్త్ర విజ్ఞాన విషయ వ్యాపనం ఆయన ప్రకటించని ధ్యేయాల్లో ఒకటి. తాను "హిమ ఖండం" (ఐస్‌బెర్గ్) లాంటి మనిషి. అందులో కనిపించే పై భాగం కంటె కనిపించని కింది భాగం పరిమాణంలో చాలా హెచ్చు. తనది నది కాదు. నదులు సంగమించిన కడలి. మానుషశాస్త్రం, జెనెటిక్స్, అర్థికశాస్త్రం, పారమార్థిక "శాస్త్రం" సైకాలజీ, ఇంకా ప్రయోగ దశ దాటి పూర్తి శాస్త్ర-హోదా పొందని పేరాసైకాలజీ, చరిత్ర, రాజకీయం, సాహిత్య కళ, సౌందర్యశాస్త్రం) ఈ స్టటిక్స్) మరెన్ని శాస్త్రాలలో చెయ్యి తిరిగిందో లెక్కదేల్చి చెప్పడం తేలికపని కాదు. బెనారస్‌లో

సగమే చదివిన ఎం. ఎస్‌సి. డిగ్రీ చదువు వొట్టినే పోలేదు. జిజ్ఞాస చివరిదాకా కూడా మందగించలేదు. అది జ్ఞానతృష్ణే.

"తత గాంధీ యుగ మేగుదెంచె" నని దామరాజు పుండరీకాక్షుడు (?) చెప్పింది మొదలు రాజకీయోద్యమాలంటే ఆసక్తి చూపుతూ, "జాతీయ పాఠశాల"లో చేరాలని మారాం పెట్టి అలాంటివి పుట్టిలో పుట్టి మఠిలో మాడిపోయిన చందంగా త్వరలో మూతబడిపోయాక, మామూలు సర్కారుబడుల, కాలేజీల, యూనివర్సిటీల చదువు దాకా మెట్లెక్కి వెళ్ళారు కొ.కు. విద్యార్థి దశలో తనలోనూ తదితరుల లోనూ వచ్చిన భావాల మార్పుని "చదువు" నవలలో చెప్పారు. కమ్యూనిస్టు వుద్యమానికి తెలుగు దేశంలో గుంటూరుజిల్లా పుట్టిల్లేమో! తాను తెనాలిలో వుంటూ అలూరి వెంకటసుబ్బారావు షరీఫ్ చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి వగైరాలతో "యువ" పత్రిక స్థాపించి అప్పుడప్పుడూ తో నడపలేక భారంగా నడిపే రోజుల్లో తొలి కమ్యూనిస్టులు ప్రెస్ కార్మికులను కూడగట్టి సమ్మె చేయించినప్పుడు, యజమానిలోనూ పనివారిలోనూ తనకు కనిపించిన లోపాలను గుణాలుగా మార్చి చెప్పలేదు. సిమ్లా నుంచి తిరిగి వచ్చాక, మద్రాసులోని "ఆంధ్రపత్రిక"లో స్థిరపడక ముందు, ఈ కమ్యూనిస్టు వుద్యమ ప్రారంభకులతో ముఖపరిచయమైనా కలగడమటుంచి, అ.ర సం. లో చేరి దానికోసం బాగా ప్రచారం చేసిపెట్టి దానికి పేరు ప్రతిష్ఠలు కల్పించడంలో కొ.కు. నిర్వర్తించిన పాత్ర చెప్పుకోదగింది. సామాజిక జీవితం తాలూకు పునాదికీ ఉపరి నిర్మాణానికీ అన్యోన్యత వుందని ఎవరైనా చెప్పగలరు. పునాది ఎంత బాహాధికం మౌలికం అయినదైనా కావచ్చుగానీ, వుపరి నిర్మాణంలోని వివిధాంశాల ప్రభావం పునాదిపై వుండవచ్చునని ఎందరో అనరు. ఆర్థిక నిర్ణాయక వాదాన్ని (Economic Determinism) గురించి ఎంగెల్సే చెప్పివున్నా, తాము మాత్రం అసమగ్రమైన అవగాహన మూలాన అదే మార్క్సిజమని అనే వాళ్ళుంటారు. కొ.కు. చేసింది దీన్ని సరిదిద్దడం. మీదు మిక్కిలి, ఆయన వివరంగా చెప్పింది ఇంకొకటి వుంది: ఈ వుపరి నిర్మాణంలోని అంశాల్లోనూ ఒకో చారిత్రక సందర్భంలో ఒకో అంశం ప్రబలాతి ప్రబలమై, తదితర వుపరితల అంశాలనే గాక పునాదిని సైతం సోకి తాకే అవకాశం వుంటుంది. గతి తర్కంలో యిది నవ్యమైన ధోరణి.

సామాజిక విప్లవం ముందూ వెనకా భావ విప్లవం జరుగుతుందనే విషయంలో కొ.కు. ముందు జరిగే దానికే ఎక్కువ ప్రాముఖ్యమిస్తూ వి. ర. సం. సభ్యుల్లో నా లాంటి వాళ్ళతో కాస్త ఘర్షణ పడ్డారు. ఎన్నో వుత్తర ప్రత్యుత్తరాల ద్వారా యిందు గురించి స్పష్టత ఏర్పడింది. భావం ముందా, పదార్థం ముందా అనే

మీమాంస దండగ పని. భౌతిక పరిస్థితుల్లో మార్పులే భావాల మార్పుకి మూలం. మారిన భావాలు భౌతిక పరిస్థితుల్ని సరికొత్తగా మార్చవచ్చు. ఇలా ఇది ఒక నిరంతరమైన గతిక్రమం (ప్రోసెస్). ఇక "బుద్ధికొలత" సిద్ధాంతం భౌతిక వాదమే, సృజనాత్మక భౌతిక వాదమే నంటూ వచ్చారు కొ.కు. ఇందులో భావవాదచ్ఛాయ లున్నాయని మధుసూదనరావుగారు నిర్ధారణ చేశారు గాని, నాకనిపించే దేమంటే, భౌతిక వాదంలోనైనా యీనాడు మనకు బోధపడనివి ముందొక నాడు బోధపడి, మానవ మేధస్సు దశలోనూ గుణంలోనూ మరింత పెరుగుదల చూపవచ్చు. ఈ దృష్ట్యా "బుద్ధికొలత" సిద్ధాంతాన్ని ఒక్క కలం గీటుతో కొట్టివెయ్యడం మంచిది కాదేమో; వెయ్యేళ్ళదాకా యెందుకు. నూరేళ్ళ కిందటి దాకా బుద్ధి పరిధిలోకి రాకుండా, "సైంటిఫిక్ ఫిక్షన్" అనిపించుకున్న అంశాలు యదార్థమైనవే, భౌతికమైనవేనని యిప్పుడిప్పుడే మనకు తెలీడం లేదా? యోగం, భూతప్రేత పిశాచాదులు, పునర్జన్మ, సూక్ష్మ దృష్టికి ముందుగానే తోచే కాకతాళీయాల్లాంటి ఘటనలు—యిలాంటివెనోగాని, టెలిపతీ కూడా యేమోగాని, టెలీవిజన్, సూపర్‌సానిక్ శబ్ద రాహిత్యం, అంతరిక్షంలో భారరాహిత్యంతో పాటు ఇక్కడ కాలం గురించి మనం పెట్టుకున్న మానాలకు భిన్నతే-యిలా యెన్నెన్నో అంశాలు భౌతిక విజ్ఞాన భాండాగారానికి వచ్చి చేరుతూ వున్నాయి. వార్థకం వల్ల కలిగే బుద్ధి చాంచల్యం, అస్తాస్తం (Senility) వల్లనే యీ వాదాలు పుట్టుకొస్తున్నాయని కొ.కు. విషయంలో చెప్పడం సరికాదనిపిస్తుంది.

మన దేశంలో 19వ శతాబ్దం చివరికల్లా మొలకెత్తిన పెట్టుబడిదారీ విధానం భూస్వామిక అవశేషాలతో రాజీపడి, వలసాధిపతులతో గూడా దీర్ఘకాలికంగానేమో వైషమ్యం, అప్పుడప్పుడు మాత్రం సఖ్యత అనే ద్వంద్వ వైఖరినవలంబిస్తూ, రాజకీయోద్యమ తరంగాలు వెనుతిరిగే ముందు వలసాధిపతుల వద్ద నుంచి రాయితీలెన్నో పొందుతూ, చివరికి 1947లో పీడిత ప్రజా కోటితో నిమిత్తం లేకుండానే 'శాంతి' యుతంగా రాజ్యాధికారాన్ని చేటక్కించుకుంది. ఆ చారిత్రిక దశలో విహారిన కొ.కు. సాహిత్య వ్యక్తిత్వం యీ నయవంచనల నన్నింటినీ తరచి చూసి సాహిత్య రూపంలో యెండగట్ట గలిగింది. స్వవర్గ పరిమితులను నాటే క్రమం పూర్తిగాకముందే, వయోధికత మూలంగా గుండెపోటు వల్ల అది అదృశ్యమైంది. కాని, అక్షర రూపంలో దృశ్యంగానే వుంది. కొ.కు. యిచ్చిపోయింది పెన్నిధి. అందులో చెల్లని నాణేలేవేనా వుంటే, వాటిని చలామణి చెయ్యంగాని, చెల్లేదే హెచ్చు. భావ విప్లవాన్ని పెంచి పెద్దను జేసి, దాని కోసమని 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘానికి దాని ఫలాలనుకాస్తకాస్తరుచిచూపినకొ.కు. వచనంలో ఏ కొంగి పీరుడు. ఉత్పత్తి అయిన రాశి నటుంచి, దాని విలువను మదింపు వేసి

కుటుంబరావు
సాహిత్య తత్త్వం

త్రిపురనేని మధుసూదనరావు

సాహిత్యంలో మూఢవిశ్వాసాల్ని గురించి బాధపడేవాళ్ళు చాలా మంది వున్నారు. ప్రకృతిమీదా, సమాజంమీదా శాస్త్రీయమైన అవగాహన కలిగించవలసిన సాహిత్యం మూఢవిశ్వాసాల్ని ప్రచారంచేయటం అన్యాయమే. కులాల్నీ,మతాల్నీ సమర్థించడం, దేవుళ్ళనీ, దెయ్యాల్నీ అవాహహన చేయటం, స్త్రీని కించపరచటం వంటి పనుల్ని సాహిత్యం ద్వారా చెయ్యటం సామాజిక ద్రోహమే. ప్రగతిశీల వాదుల్లో ఈ విషయంలో ఏకాభిప్రాయం వుండటం కూడా సంతోషించతగ్గ విషయమే. గురజాడవంటి సంస్కరణవాదులకంటే పూర్వం వున్న కవులందరూ సాహిత్యంలో మూఢవిశ్వాసాల్ని చెప్పినవాళ్ళే. మనిషికంటే మతానికీ కులానికీ, మనిషి ఇంద్రియాలకంటే ఆత్మకీ ప్రాధాన్యం ఇచ్చినవాళ్ళే. ఈ ప్రపంచంకంటే పరప్రపంచం గొప్పదని చెప్పినవాళ్ళే. ఈ లోకంలో జీవించటంలో పరమార్థం ఈ లోకంలో జీవించటం కాదు. పుణ్యలోకాల్లోకి ప్రవేశించటానికి అర్హతని సంపాదించుకోవటమే ఈ లోకంలో జీవించటానికి పరమార్థం. 'విశ్వశ్రేయః కావ్యం' అంటే కూడా విశ్వశ్రేయస్సు అంటే పుణ్యలోక ప్రాప్తి అనే అర్థం. కాబట్టి సాహిత్యానికి మూఢవిశ్వాసాల్ని ప్రచారం చేసిన చరిత్ర సుదీర్ఘ చరిత్రే. అనందం, బ్రహ్మానందం, చిదానందం, రసానందం వంటి దేనికీ పనికిరాని సంఘ వ్యతిరేక ప్రయోజనాల్ని సాహిత్య ప్రయోజనాలుగా చిత్రీకరించి మానవతని అవమానించారు.

తెలుగు వాళ్ళకి ప్రాచీన లిఖిత సాహిత్యం లేదు. నన్నయ నుంచీ ప్రారంభం అయిందని చెప్పబడుతున్న సాహిత్యం మధ్యయుగాల సాహిత్యమే. రాచరి

కన్నీటితోనో కీర్తనతోనో ఆగిపోకుండా, కొ.కు. వెలిమి భావాలే కలిమిగా భావిస్తూ సాగిపోతేనే, ఆయనను నిజంగా గౌరవించినట్టు. సూర్య కిరణాలు చెట్టు ఆకుల పచ్చనకు కారణమంటారు. కిరణాలు కొ.కు. రచనలే. రచించడమే గాక, జీవించడమే ఆగిపోయాక కూడా. మిగిలేది రశ్మి. సమగ్రంగా గాఢంగా అధ్యయనం చెయ్యందే, అది మనలో యింకి సొంతం కాబోదు.

కంతో సురక్షితం చేయబడిన భూస్వామ్య వ్యవస్థ భావజాలాన్ని ప్రతిబింబించిన సాహిత్యాన్ని మధ్యయుగాల సాహిత్యం అంటారు. వ్యాసుని సంస్కృత భారతంలో వున్నంత 'ప్రాచీనతా' గుణం కూడా నన్నయ భారతంలో లేదు. రాచరిక – భూస్వామ్య వ్యవస్థ చట్రంలోకి భారతాన్ని అనువదించటం జరిగింది. అంటే భారత అనువాదం సామాజిక అనువాదంకానీ పండిత పరిశోధకులు ప్రచారం చేస్తున్నట్లు సాహిత్య అనువాదం కాదు. కేవలం సాహిత్యానువాదం వర్గ సమాజంలో జరగదు. వర్గ ప్రయోజనాలకి అనుగుణ్యంగానే అనువాదాలు జరుగుతాయి. అంటే సామాజిక ప్రయోజనాలకోసం వర్గ పరిధిలోనే నన్నయనుంచీ జరిగిన అనువాద క్రమాన్ని మనం పరిశీలించాలి. కమ్యూనిస్టు మానిఫెస్టోనీ, మావో మిలటరీ రచనల్నీ, వైరుధ్య, ఆచరణల్నీ వాటికోసమే ఎవడూ అనువాదంచెయ్యడు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం, వర్గ పోరాటం కోసం, వర్గ యుద్ధ స్వరూపాన్ని తెలుసుకోవటం కోసం అను చేయటం జరుగుతుంది. అనువాదాల మూలకారణాల్ని అనువాదకుడు ప్రకటించిన వుద్దేశాల్తోనే తెలుసుకోలేం. చారిత్రిక, సామాజిక దృష్టితో పరిశీలించినప్పుడే అనువాదాల సామాజిక పాత్రని అర్థం చేసుకో గలుగుతాం.

ప్రకృతిని గురించీ, సమాజాన్ని గురించీ సత్యాలుగా రుజువైన విషయాల మీద కూడా పౌరాణిక దృక్పథాన్ని వదలకుండా వుండటాన్ని మూఢ విశ్వాసం అనవచ్చు. ఫ్యూడల్ సమాజంలో మతం ప్రధాన భావజాలంగా వుంటుంది. పరిమాణాత్మక మార్పులు కూడా మతం ముసుగులోనే జరుగుతాయి. మతం స్వతంత్ర శక్తి కాదు. అంటే మతంగా మతం మంచీ చెయ్యలేదు చెడూ చెయ్యలేదు. అనిర్దిష్ట మతం కూడా వుండదు. మతం పేరుతో వర్గాలూ, బృందాలు దోపిడీలు చేస్తాయి. యుద్ధాలు చేస్తాయి. రెండు మతాలు యుద్ధం చెయ్యలేవు. రెండు మతాల పేరుతో రెండు వర్గాలో, రెండు జాతులో రెండు దేశాలో యుద్ధం చేస్తాయి. అందుకని మూఢ విశ్వాసాలన్నీ మతాలకి అంటగట్టి మతవ్యతిరేక యుద్ధ ప్రకటనలు చేయటం ఒక పెద్ద మూఢ విశ్వాసం. మత సంబంధమైన సామాజిక మూలాలు వెతికి వాటికి వ్యతిరేకంగా బాణం ఎక్కుపెట్టాలి. మధ్యయుగాల సాహిత్యంలో మూఢ విశ్వాసాలుగా కనిపించేవి దాదాపు అన్నీ పాలక వర్గ భావజాలంలోనూ, యుగభ్రమల్లోనూ భాగాలే. అందుచేత మతాల్నీ, మూఢ విశ్వాసాల్నీ సిద్ధాంత స్థాయిలో ఖండించి, నిరాకరించటమే పెద్దపోరాటం అని ఇప్పుడూ భావించటం నిరర్థకమైన వ్యవహారం. వర్గ పోరాటంలో భాగం కాని మత వ్యతిరేక, మూఢ విశ్వాసాల వ్యతిరేక పోరాటం భావవాదస్థాయిలో, ఆదర్శవాద స్థాయిలో వుండిపోతుంది. మతం జీవితానికి తలక్రిందు ప్రతిబింబం. మతాన్ని కాళ్ళమీద నిలబెడితే మతం ప్రతిబింబించిన జీవితాన్ని విశ్లేషించవచ్చు. అప్పుడు మతంపోయి జీవితం మిగులుతుంది. మనిషి తన నుంచే దేవుడ్ని సృష్టించాడు. ఆ దేవుడికి తానే లొంగిపో

యాడు. సామాజిక మానవతని సాధిస్తే దేవుడు మరి కనపడడు. మతాన్ని, మూఢ విశ్వాసాల్నీ శాస్త్రీయ దృష్టితో పరిశోధించిన అధునిక రచయితల్లో కుటుంబరావుది ప్రత్యేక స్థానం.

"నాకు విశ్వాసం మనిషిలోనే కానీ, దేవుడిలో లేదు" (కొ. కు.)

కొ. కు. జీవితంలో, సాహిత్యంలో ఎన్నడూ దేవుడిని విశ్వసించలేదు. చరిత్రలోని యే అంశాన్ని పరిశీలనకు తీసుకున్నా కొ. కు. మనిషినుంచీ వివరించ టానికే పూనుకున్నాడు. మనిషిని గురించి అవగాహన చేసుకోవటానికి మానవాతీత శక్తుల్ని ప్రమాణంగా గ్రహించే ఆస్తికవాదాన్ని కొ. కు. తొలిదశలో కూడా చేయలేదు. భారతదేశంలో పెట్టుబడిదారీవర్గం లాభాల్ని పొంది ప్రజలు తీవ్రమైన కష్టాలుపడిన ఆర్థిక సంక్షోభపు రోజులనుంచీ సాయుధ విప్లవమే జాతి విముక్తికి మార్గం అని బోధిస్తున్న నేటివరకూ కొ. కు. మనిషిమీద విశ్వాసంతోనే రచ యితగా జీవించాడు. "దేవుడి పుట్టుకే పాపిష్టిది" (కొ. కు.) ప్రకృతిశక్తుల మధ్య సంబంధాల్నీ, ప్రకృతిలో సంభవించే సంఘటనల్నీ మానవత్వ, జంతు, దైవత్వ ఆరోపణ చేయటం వర్గేతర సమాజ జీవితంలో అనివార్యం. తర్వాత వర్గ సమాజంలో ఈ ఆరోపణలకే మతరూపం ఇవ్వడం జరిగింది. వర్గసమాజంతోనే మానవులమీద అధికారం చెలాయించే దుష్టశక్తిగా దేవుడు పాలకవర్గం పాలుతాగి పెరిగాడు. అందుకే దేవుడిజన్మ పాపిష్టిది అన్నాడు కొ. కు. "సమష్టి దృక్పథం పోయి వ్యష్టి దృక్పథం వచ్చేసరికి దేవుడి అవసరం కలుగుతున్నట్టు కనిపి స్తుంది" (కొ. కు.) ఆదిమగణ సమాజాల్లోనేకాదు వర్గసమాజాల్లో కూడా సమష్టి దృక్పథం వున్నప్పుడు భక్తులకు కూడా దేవుని గురించిన స్పృహ వుండదు. దేవుడిని పదిమంది కలిసి చూసినట్టు చెప్పటం ఎక్కడాలేదు. ఎవడు చూసినా ఒంటరిగానే చూశాడు. దేవుడు కూడా పక్కవాడికి కూడా కనబడకుండా తన భక్తుడికే కనబడటం జరిగినట్లు ప్రచారంలో వుంది.సమాజాన్ని వదిలిపెట్టినవాళ్ళకీ జీవించటం మానేసినవాళ్ళకీ దేవుడి అవసరం ఎక్కువలా వుంది. అడవుల్లోనూ, కొండల్లోనూ ఏకాంతవాసం చేసేవాళ్ళకి తప్ప దేవుడు ఎవరికీ ప్రత్యక్షంగా కనబడి నట్టులేదు. సమష్టి కార్యాల్లో దేవుడి ప్రసక్తివి తేవడం ప్రమేయాన్ని నిరూపించడం కష్టం. స్వాతంత్ర్య ఉద్యమానికీ, అక్టోబర్ విప్లవానికీ దేవుడు కారణం అంటే జనం మొఖంమీద వుమ్మేస్తారు. సమష్టి దృక్పథం సమష్టి కార్యాచరణ నుంచీ పెరుగుతుంది? సమష్టికార్యాచరణ పెరిగే పరిణామంలో దేవుడిని గురించిన ఆలోచన కూడా తరుగుతూ వస్తుంది?

"హేతువాదాన్ని నమ్మాలన్న ప్రేరణ ప్రతివ్యక్తిలోనూ వుంటుంది. దాన్ని సక్రమంగా పని చెయ్యకుండా చెయ్యడమే దేవుడిపాత్ర" (కొ. కు.) దేవుడిని

గురించి ప్రచారం చేసేవాళ్ళు పరమ హాస్యాస్పదమైన వ్యక్తులు. పళ్ళపొడిని గురించీ, అమృతాంజనం గురించీ ప్రచారం చెయ్యటంలో అన్నా అర్థం వుంది. దేవుడిని జనం నమ్మటం వల్ల ప్రయోజనాన్ని పొందే స్వార్థపర వర్గాలు వున్నాయి. అందుకని జనం ఎక్కడ మరచి పోతారో అని ఈ వర్గాలు దేవుడిని గురించి ప్రచారం చేస్తూ వుంటాయి. దేవుడికీ మన నిత్య జీవితానికీ సంబంధం వున్నట్టు ఒక్క వుదాహరణ కూడా ఇవ్వలేం. హేతువాది కాకుండా మనిషి ఒక్క చిన్నపని కూడా చెయ్యలేడు. ఆశ్చర్యం ఏమంటే హేతువాదం చెయ్యకుండా దేవుడిని గురించిన ప్రచారం కూడా చెయ్యటం సాధ్యంకాదు. "కష్ట సుఖాలు మిధ్య అనుకొని రెండింటికీ అతీతంగా వుండమని మతబోధకులు చెప్పారు. రెండింటికీ అతీతంగా వుండదలిస్తే జీవించటం దేనికీ?" (కొ. కు.) కష్టాల్ని తగ్గించుకుంటూ సుఖాల్ని పెంచుకునే మార్గం చూడాలి కానీ కష్ట సుఖాలకి అతీతంగా వుండటం దేనికి? పోనీ అలా చెప్పిన వాళ్ళు నిజంగా కష్ట సుఖాలకి అతీతంగా వున్నారా? పరమ సాధువుగా పేరు తెచ్చుకున్న వినోబాభావే పుష్టికరమైన ఆహారాన్ని తృప్తిగా భోంచేస్తూ జనాన్ని కష్ట సుఖాలకి అతీతంగా వుండమంటున్నాడు. దీనికి అర్థం మీరు కష్టపడండి, మేం సుఖంగా వుంటాం అని కాక ఇంకా యేముంది? "మనం మనకి లభ్యమై ఉన్న భౌతిక జ్ఞానాన్నీ, సమాజ జ్ఞానాన్నీ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే మానవ జీవితం చాలా బాగుపడుతుంది." (కొ. కు.) దేవుడూ మతం వంటి వాటి పుట్టుకనూ పాత్రనీ విశ్లేషించి భౌతిక, సమాజ జ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించటం, అతీత శక్తుల లౌకిక పునాదిని ఎత్తి చూపటం కొ. కు. ఆలోచనా పద్ధతిలో ఒక భాగం.

2

సాహిత్య కళారంగాలమీద కొ.కు. దృష్టి శాస్త్రీయమైనదే కాదు, విప్లవాత్మకమైనదికూడా. కళని గురించీ సాహిత్యం గురించీ కొ.కు ఏ రకమైన మూఢ విశ్వాసానికి తావు ఇవ్వలేదు. చాలామంది అభ్యుదయ దృక్పథం వున్నవాళ్ళకి కూడా సాహిత్యంలో మూఢవిశ్వాసాలమీద స్పష్టమైనవైఖరి వున్నప్పటికీ, సాహిత్య స్వరూపంమీద అనేక మూఢవిశ్వాసాలు వుంటాయి. కొ.కు. సాహిత్య స్వరూపాన్ని భౌతికవాద దృక్పథంనుంచీ పరిశీలించాడు.

"మన బూర్జువా సంస్కృతి ఫ్యూడల్ సాంకర్యం గలిగినది. ఫ్యూడల్ సంస్కృతిని నిర్మూలించి పైకి వచ్చినదికాదు. దానితో చేతులుకలిపి రాజీపడినది." (కొ.కు.) ఈ ఒక్క వాక్యంలో కొ.కు. ఆధునిక సామాజిక వ్యవస్థని బహుముఖంగానూ లోతుగానూ విశ్లేషించాడు. మన సాంస్కృతిక రంగాన్ని అర్థం చేసుకోవ

టానికి ఈ సూత్రీకరణ ఎంతో వుపయోగపడుతుంది. పారిశ్రామిక పునాదిమీదకూడా ఫ్యూడల్ భావజాలపుజెండా ఎగురుతూ వుండటం మన సాంస్కృతిక పోరాటాన్ని సంకీర్ణంచేస్తూవుంది. మనం దేన్నీ సరళరేఖలో అర్థం చేసుకోలేం. అన్నీ వక్ర రేఖలే. కొన్ని సందర్భాల్లో బిందువును గుర్తించడం అసాధ్యం అయిపోతుంది. బూర్జువా సంస్కృతి ఆకారం ఫ్యూడల్ సంస్కృతి సారాంశం. చాలామంది ప్రముఖ ఆధునిక రచయితలు వాస్తవానికి సారాంశంలో ఫ్యూడల్ భావజాలంవున్న రచయితలే. అభ్యుదయ రచయితల్లోకూడా ఎంతోమంది భూస్వామ్య ఆలోచనా పద్ధతుల్ని వదిలించుకోలేకపోయారు. వీళ్ళకితెలిసిన మార్క్సిజాన్ని తమ ఫ్యూడల్ భావజాలచట్రంలో ఇమిడ్చారు. లెనిన్‌ని అవతారపురుషుడుగా వర్ణించిన అభ్యుదయ కవులూ, మార్క్స్‌ని మహర్షి చేసిన అభ్యుదయ కవులూవున్నారు. హిందూమతాన్ని నిరాకరించి బౌద్ధధర్మాన్నీ, క్రైస్తవ మతాన్నీ ప్రస్తుతించిన అభ్యుదయ మేధావులు వున్నారు. యువకుడుగా వున్నప్పుడు మార్క్సిస్టు వీరాలాపనల్నిచేసి నడివయస్సు నుంచీ యం.యన్. రాయ్‌నో, అరవిందునో, జిల్లేళ్ళమూడి అమ్మనో ఆశ్రయించిన వాళ్ళు ఎంతోమంది వున్నారు. మార్క్సిజానికి ఈ గతిపట్టడానికి కారణం మౌలికంగా ఫ్యూడల్ భావజాలంనుంచి బయట పడకపోవడమే. యౌవనంలో ప్రగతిశీలవాదంచేసి ముసలితనంలో భగవద్గీత పారాయణంచేసే సంకరజాతి వుండటానికి కూడా ఇదే కారణం. ఫ్యూడల్, బూర్జువా సంస్కృతుల సాలెగూడులో పడకుండా తుదివరకూ అభ్యుదయ, విప్లవవాదిగా నిలచిన రచయిత కొ.కు. ప్రాచీన, ఆధునిక సంస్కృతిని గురించి సామాజిక, వర్గ విశ్లేషణ చేయటంలో కూడా కొ. కు. కి మన ఆధునిక సంస్కృతిమీద వుండిన ఈ అవగాహనే దోహదం చేసింది.

"సాహిత్యంలో జీవిత విశ్లేషణ వుంటుంది. జీవితం స్పష్టం చేయలేనిదాన్ని సాహిత్యం స్పష్టం చేస్తుంది" [కొ. కు.]

జీవిత పరిభాషలోనే సాహిత్యం వుంటుంది. జీవితం నుంచీ జీవితాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవడం కష్టం కావచ్చు. జీవితం తన తత్వాన్ని తానే స్పష్టం చేయలేదు. ఎంత నిశితమైన దృష్టి వున్నా యే ఇతర సాధనాల సహకారం లేకుండా జీవితాన్ని విశ్లేషించటం సాధ్యం కాదు. సాహిత్యంలో జీవితం ప్రతిబింబిస్తుంది కాబట్టి జీవితాన్ని గురించి సాహిత్యం నుంచీ అవగాహన చేసుకోవడం సాధ్యం అవుతుంది. సాహిత్యానికి, జీవితానికి ఈ శాస్త్రీయ సంబంధాన్ని అంగీకరించాడు కాబట్టే— "ఈనాడు రచయితలకు పెద్దగా భాషాజ్ఞానమూ, పాండిత్యమూ ప్రాచీన సాహిత్య పరిచయమూ అవసరము లేదన్నది యేనాడో నిర్ణయమయింది. కానీ వారికి ప్రపంచ జ్ఞానమూ, జీవితానుభవమూ సామాజిక దృక్పథమూ కూడా

అవసరం లేదన్నది రానురాను రుజువవుతున్నది. ఇతివృత్తాలలోగాని, పాత్ర పోషణలోగాని, సన్నివేశాలలోగాని ఎలాటి వాస్తవికతా అవసరం లేదు" అని వ్యంగ్యంగా అన్నాడు. భాషాజ్ఞానం, పాండిత్యం, ప్రాచీన సాహిత్య పరిచయం ఈనాటి కవులకి అవసరం అనేదీ కొ. కు. అభిప్రాయం. వీటికంటే ముఖ్యంగా ప్రపంచ జ్ఞానం, జీవితానుభవం, సామాజిక దృక్పథం వాస్తవిక రచనలు చేయటానికి అంటే సాహిత్యంలో జీవిత విశ్లేషణని స్పష్టం చేయటానికి చాలా అవసరమనేది కొ. కు. అభిప్రాయం. ఈ విశ్లేషణా దృష్టిగల కథల్నీ నవలల్నీ చదవటం మన పాఠకులకి అలవాటు లేదు. జీవితాన్ని స్పష్టం చేయకుండా వీలైనంత గందరగోళ పరచే సాహిత్యాన్ని, విశ్లేషణా ఫలితమైన ఆలోచనకన్నా వర్ణనా ఫలితమైన ఆవేశంపాలు ఎక్కువ వున్న సాహిత్యాన్ని మాత్రమే మన పాఠకులు చదవగలరు. ఈ విస్పష్టమైన జీవిత విశ్లేషణా అంశం అధికంగా వుండటం వల్లనే కొ.కు. కథలకీ, నవలలకీ అనన్య ప్రచారం రాలేదు. అయితే కాలగమనంలో తెలుగు పాఠకులు కొ. కు. సాహిత్యాన్ని సమీపిస్తారు. అధ్యయన పద్ధతిలో మనం ఎదిగామా లేదా అనే దానికి కొ. కు. నవలల్నీ కథల్నీ ఆసక్తితో చదవగలుగుతున్నామా లేదా అనేది కొలబద్దగా వుండేదశ తప్పకుండా వస్తుంది. మనం అటువేపే నడుస్తున్నాం. జీవిత విశ్లేషణ, వివరణ శాస్త్రాల లక్ష్యమనీ వర్ణన ఆవేశం సాహిత్య లక్షణమని చాలామందికి తప్పుడు అభిప్రాయం వుంది. ఎక్కువ చదివితే 'సృజనాత్మక' రచనలు చెయ్యలేమని ప్రకటించిన చాలామంది బాల రచయితలు మనకి అసంఖ్యాకంగా వున్నారు. యేమీ చదవకుండా యేమీ తెలియకుండా వీళ్ళు యేమిటి? ఎలా : రాయదల్చుకున్నారో మనకి తెలీదు. చదివినదాన్నీ, తెలుసుకున్న దాన్నీ రచనకి ఎరువులుగా ఉపయోగించుకోవటం చాతగాక అసలు చదువేవద్దు తెలుసుకోనేవద్దు అనడం అర్థరహితం.

"ప్రజల అనుభవాన్ని స్పృశించలేని కళ సిద్ధాంత రీత్యా ఎంతో ఉదాత్తమైనది, అయినప్పటికీ అది ప్రజలలో వాంఛనీయమైన అభిరుచులను పెంపొందించలేదు" (కొ. కు.) రచనలో జీవితాన్ని విశ్లేషించటం అంటే జీవితానికి సిద్ధాంతాన్ని ప్రత్యామ్నాయం చెయ్యటం కాదు. జీవిత విశ్లేషణకీ, జీవిత చిత్రణకీ సిద్ధాంతాన్ని వుపయోగించుకోవటం. కళలో విశ్లేషణ ద్వారా విస్పష్టం చేయదలుచుకున్న జీవితాన్ని ప్రజల అనుభవాన్ని స్పృశించే విధంగా చేయగలిగినప్పుడే అది మంచి రచన అనిపించుకుంటుంది. కథలోనో, నవలలోనో బిందువునుంచీ కదిలిన జీవిత విశ్లేషణా రేఖని మధ్యలో ఆపి సిద్ధాంత ఉపన్యాసం యిస్తే దాని రేఖాస్వరూపం చెడిపోతుంది. ఇలాంటి రచయితలవల్ల సాహిత్యానికీ జీవితానికీ కూడా నష్టమే.

3

సాహిత్య విమర్శ పోనీ విమర్శ సాహిత్యంలో సంస్కృతిలో ఒక భాగం. కొత్త శాస్త్రిల్లోనూ శాస్త్ర చర్చల్లోనూ పరిచయం వున్నవాళ్ళకి విమర్శ స్వరూపం ఇంకా లోతుగా తెలుసు. విమర్శ, వాదోపవాదాలు చర్చాంశ ప్రతిదాంట్లోనూ అనివార్యంగా వుంటుంది. వాదోపవాదాలూ, విమర్శలేకుండా శాస్త్రంకానీ,సంస్కృతి కానీ పురోగమించవు. వాదోపవాదాలకిదూరంగా శాస్త్రజ్ఞుడు పరిశోధనలో విమగ్నం కావచ్చు. కానీ ఆ పరిశోధనని రాసేటప్పుడు దానిలో అంతర్లీనంగా అయినా వాదోపవాద అంశం వుంటుంది. కుటుంబరావుకి వాదోపవాదాలన్నా, చర్చ అన్నా చాలా ఆసక్తి. ఆయన సృజనాత్మక రచనల్లో కూడా విమర్శ వుంటుంది. అందుకని కుటుంబరావు విమర్శని కేవలం రూఢి అర్థంలో ప్రచారంలో వున్న విమర్శగా భావించకూడదు. ఆధునిక విజ్ఞానశాస్త్రిల నుంచీ మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌ల రచనా పద్ధతినుంచీ రూపొందిన భౌతిక గతి తర్క విమర్శ. విమర్శనాంశం లేకుండా కొ. కు. చేసిన రచన అంటూ లేదు.

"సాహిత్యంలో సంఘర్షణలు సిద్ధాంత సంఘర్షణలే. ఇది గిడుగుమీద విమర్శల్తో ప్రారంభం అయింది. విరసంమీద విమర్శతో కొనసాగుతోంది." (కొ. కు.) సాహిత్యంలో సంఘర్షణలు కేవలం వాదవినోదులైన రచయితల మధ్య సంఘర్షణలు కావు. అవి సిద్ధాంత పరమైన సంఘర్షణలు. మధ్య యుగాల సాహిత్యంలో సంఘర్షణలు జరగకపోలేదు. కానీ అవి సిద్ధాంత సంఘర్షణలు కావు. వాటి ఆకారంలో భేదమే కానీ సారాంశంలో అవి అన్నీ భావవాదాలే. గిడుగు వ్యవహారిక భాషా వుద్యమం బూర్జువా వర్గ ఉద్యమం. భాషా విషయంలో తరతరాలుగా వస్తున్న ఫ్యూడల్ భావ జాలంమీద గిడుగు యుద్ధం చేశాడు. వ్యవహారిక భాషావాదం వరకూ గిడుగు భౌతికవాద పరిధిలోనే చేశాడు. గ్రాంథిక భాషావాదులు ఆ వాదాన్ని ఆధ్యాత్మికవాద పునాదినుంచీ చేశారు, అందుకనే గిడుగుమీద విమర్శలు సిద్ధాంత సంఘర్షణలు. విరసంమీద విమర్శలు స్పష్టంగానే సిద్ధాంత సంఘర్షణలు. గతితార్కిక భౌతిక వాదులకీ నానారకాల భావ వాదులకీ మధ్య సంఘర్షణయే విరసం మీద వస్తున్న విమర్శలకి పునాది. కొ. కు. విరసం మీద వచ్చిన విమర్శల్ని సాహిత్యంలో సిద్ధాంత సంఘర్షణలుగా భావించే వాదోపవాదాలు చేశాడు. విరసాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్ళ సిద్ధాంత పునాదిని ఎత్తి చూపించారు. "విమర్శ అనేది ఒక రకం ప్రచారం" (కొ. కు.) ప్రచారం అంటే ఒక విషయాన్ని అందరికీ తెలియ జేస్తూ ఆ విషయం మీద సుముఖం చేయటానికి ప్రయత్నం చేయటం. ఏ రంగంలో అయినా విమర్శ వ్యాపారం ఇదే. సాహిత్యం లోనూ, శాస్త్రంలోనూ కూడా ప్రచారాంశం వుండినా వాటి ప్రధాన వ్యాపారం అది

కాదు, శాస్త్ర విషయాన్ని కానీ, సాహిత్య విషయాన్ని కానీ అశాస్త్రీయ, భ్రమాజనిత సిద్ధాంతాల నుంచీ విముక్తం చేస్తూ ప్రజల్లో సరియైన అవగాహనని కలిగించటం విమర్శ లక్ష్యం. సాహిత్య కళారంగంలో కంటే శాస్త్రంలో కంటే విమర్శలో వర్గ స్వభావం ఎక్కువగా వుంటుంది. సాహిత్యంలో వ్యక్తం అవుతున్న వర్గ పునాదిని విశ్లేషిస్తూ ప్రగతి శీలవర్గ పోరాటం వైపు సాహిత్యాన్ని మళ్ళించే కార్యక్రమాన్ని విమర్శ నిర్వహిస్తుంది. శాస్త్ర పరిశోధనలకి వస్తుతః వర్గ స్వభావం లేకపోయినా జీవితానికి అన్వయించటంలో, వుత్పత్తి రంగంలో వుపయోగించటంలో వర్గ స్వభావం వుంటుంది. ఆ వర్గ స్వభావాన్ని వివరిస్తూ శాస్త్ర పరిశోధనల్ని ప్రజాపరం చేయటానికి విమర్శ ఆయుధంగా ప్రయోగించబడుతుంది. కళాసాహిత్య రంగాల్లో కంటే కూడా సామాజిక, విజ్ఞాన శాస్త్ర రంగాల్లో విమర్శ నిశిత ప్రచార సాధనంగా పనిచేస్తుంది. కొ. కు. తన విమర్శని ఈ విస్తృతార్థంలోనే ప్రచార సాధనంగా వుపయోగించాడు. ప్రచార సాధనంగా విమర్శ ఎలా వుండాలి?

"విమర్శలోకూడా నిజానికి కొన్ని లోపాలుండే అవకాశం వున్నది. ఆ సంగతి గుర్తించటం అవసరం. అందులో ఒకటి తెలిసినవాడికే తెలియ చెప్పటం. జీవితం తాలూకు అనేక రంగాలలో ఇలాంటిది చూస్తాం. మతం వారిని మాత్రమే మెప్పించే మతప్రచారం. కమ్యూనిస్టు భావాలను ఆమోదించిన వారిని మాత్రమే ఆనందపరిచే కమ్యూనిస్టు ప్రచారం. మార్క్సిస్టు దృక్పథం గలవారికి మాత్రమే అర్థమయ్యే కళావిమర్శ" (కొ.కు.) ఒక ప్రచారంగా విమర్శ వుద్దేశం ఏమిటి? తాను ప్రచారం చేయదలచుకున్న విషయం తెలియని వాళ్ళకి తెలియచేయటం. తాను ప్రచారం చేయదలుచుకున్న విషయాన్ని ఆమోదించని వాళ్ళుకూడా ఆమోదించే పద్ధతిలో చెప్పటానికి ప్రయత్నించటం. ఇది కమ్యూనిస్టులు తీవ్రంగా ఆలోచించ వలసిన విషయం. మార్క్సిస్టులకే మార్క్సిజాన్ని చెపుతూ కూర్చోవటం, మార్క్సిస్టులకే అర్థమయ్యేవిధంగా మార్క్సిస్టు దృక్పథాన్ని గురించి రాయటం వల్ల ఏమి ప్రయోజనం వుంది? ఎంతవరకు ప్రయోజనం వుంది? బతుకంతా మార్క్సిస్టులకే పాఠశాలలు పెట్టి మార్క్సిజాన్ని చెప్పటం పనికివచ్చే పనేనా? కొ.కు. రచనాపద్ధతి మార్క్సిస్టులు కానివాళ్ళకి మార్క్సిజాన్ని చెప్పటానికి వీలుగా వుంటుంది. మార్క్సిస్టులుకానివాళ్ళు మార్క్సిజాన్ని ఆమోదించే తార్కికపద్ధతిలో వుంటుంది.

4

"మానవ సమాజంలో రెండు తాత్త్విక దృక్పథాలున్నాయి. ఒకటి భౌతిక వాదం. రెండు ఆధ్యాత్మికవాదం. ఈ రెంటి మధ్యా వైరుధ్యం వున్నది" (కొ. కు.) కుటుంబరావు భౌతిక వాది. భౌతికవాద కోణం నుంచీ జీవితాన్నీ సాహిత్యాన్నీ చరిత్రనీ, విజ్ఞాన శాస్త్రాల్నీ పరిశీలించాడు. ప్రధానంగా కుటుంబరావు భౌతిక వాదా

నికి విజ్ఞాన శాస్త్రాలు పునాది. విజ్ఞాన శాస్త్రాలు భౌతికవాదానికి ప్రమాణాలు అయినప్పటికీ చాలా మంది శాస్త్రజ్ఞులు ఆధ్యాత్మిక వాదులుగా వుండిన విషయం అందరికీ తెల్సిందే. సామాజిక సమస్యలకి విజ్ఞాన శాస్త్ర పరిశోధనల్ని అన్వయించుకోలేక చాలా మంది శాస్త్రజ్ఞులు ఆధ్యాత్మికవాద సుడిగుండంలో పడిపోయారు. కుటుంబరావు ఆది నుంచీ భౌతికవాది. ఆది నుంచీ అంటే సాహిత్య రచన ప్రారంభించినప్పటి నుంచీ. 1940 ప్రాంతంలోనే కుటుంబరావు మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. సమాజానికి సాహిత్యానికీ వున్న సంబంధాన్ని విజ్ఞాన శాస్త్రాల నుంచీ గ్రహించి మార్క్సిస్టు దృక్పథంతో సుసంపన్నం చేసుకున్నాడు. నవలల్లో, కథల్లో ఒక సంఘటనని చిత్రించేటప్పుడు దానికి కారణమైన యంత్రాంగాన్ని వర్ణించటం, మానవ సంబంధాల్ని హేతుబద్ధంగా వర్ణించటం కుటుంబరావు శాస్త్రీయ దృక్పథానికి ప్రమాణాలు. కార్యకారణ యంత్రాంగాన్ని ప్రదర్శించకుండా రాసే అలవాటు కుటుంబరావుకి లేదు. పదార్థం అంటే మనిషి మనస్సుకి బాహ్యంగా స్వతంత్రంగా వుండేది మాత్రమే అని అర్థం కాదు. మనిషి ఇంద్రియాల మీద పనిచేస్తూ ఆ యింద్రియాల నుంచీ ఇంద్రియజ్ఞానాల్ని పుట్టించే బాహ్య వాస్తవికత అని అర్థం. ఇలా నిర్వచించుకోలేకపోతే పదార్థానికీ మనుషులకీ సంబంధం వుందని చెప్పలేం. పదార్థం వున్నదనీ చెప్పలేం. పాత్రల చలనాలూ, సన్నివేశాలూ స్పష్టంగా పాఠకుని హేతువుని కదిలించేవిగా చిత్రించటం కుటుంబరావు సాహిత్య తత్త్వం. అభ్యుదయ సాహిత్య ఉద్యమంలో వున్నప్పటి నుంచీ సాహిత్యానికుండే విప్లవకర శక్తిని వివరిస్తూనే వచ్చారు. 1970 నుంచీ విరసంతో కలిసినప్పటి నుంచీ భౌతికవాదాన్ని, విప్లవాన్నీ సాహిత్యానికి రెండు కళ్ళుగా చెపుతూ వచ్చారు. మార్క్సిజాన్ని ఆమోదించని వాడు, మార్క్సిస్టు కానివాడు విప్లవ రచయిత కాజాలడని ప్రకటించాడు.

"విప్లవం అనేది భౌతికవాదం నుంచీ తప్ప పుట్టజాలదు. విప్లవం అంటే విరుచుకుపడిపోయి నోట నురుగులు కక్కేవాళ్ళ అజ్ఞానులు. ఎందుచేతనంటే ఎన్నో విప్లవ దశలు గడవకుండా మనం ఇక్కడిదాకా రాలేదు. గత సమాజంలోని విప్లవాల సత్ఫలితాలన్నిటినీ పుష్కలంగా అనుభవిస్తున్నవాళ్ళే భావి విప్లవాలను గురించి దడదడలాడుతున్నారు. మనం ఇవాళ అత్యున్నతమైన సామాజిక దశకు వచ్చామనుకునే మూర్ఖులు, ఈ వ్యవస్థలో సుఖజీవనం గడుపుతున్నామనుకునేవాళ్ళు తప్ప ఎవరూ విప్లవపరిణామాలు రాకూడదని అనుకోరు"(కొ.కు.) భౌతికవాది కానివాడు విప్లవాన్ని సాధించలేడు. విప్లవాన్ని ఆమోదించలేడు. సామాజిక విప్లవాన్ని వ్యతిరేకించటానికి నిజానికి ఎవరికీ యేమీ కారణంలేదు. అయితే ఈ వ్యవస్థలో సుఖజీవితం గడుపుతున్నామనుకునేవాళ్ళు ఈ వ్యవస్థతోబాటు తమ

సుఖజీవితం కూడా పోతుందని విప్లవాన్ని నిరాకరిస్తున్నారు. నిజానికి విప్లవంవల్ల అందరూ ఇంకా సుఖజీవితం జీవించవచ్చు.

"జీవితపరిణామం, ప్రజాపోరాటం మీద ఆధారపడివున్నది. ఆ పోరాటంలో ప్రజల చేతిలో వజ్రాయుధంలా పనిచేసేదే నిజమైన సాహిత్యం. అదే విప్లవ సాహిత్యం. ఇందుకు అంగీకరించనివారు జీవితపరిణామం ప్రజాపోరాటం మీద ఆధారపడలేదని రుజువుచెయ్యాలి. చెయ్యలేదు" (కొ. కు.) విప్లవంలో సాహిత్యం విప్లవకారుల చేతుల్లో ఆయుధంగా వుండాలి అనే స్పష్టమైన వైఖరి కొ. కు. విరసం దశాబ్దంలోనే తీసుకున్నారు. కొ. కు. సాహిత్య విమర్శలో 1970 ముందూ తర్వాతా చాలా మార్పువుంది. విరసానికి పూర్వం కొ. కు. సాహిత్య విమర్శ కొ. కు. సాహిత్యానికి విమర్శవంటిదే. విరసం దశాబ్దిలో కొ. కు. సాహిత్య విమర్శ మార్క్సిస్టు సాహిత్య విమర్శగా స్పష్టంగా వుంది. విరసం తెలుగు సాహిత్య విమర్శలో సాధించిన విజయాలకి మార్గదర్శక సూత్రాల్ని నిర్మించింది కుటుంబరావే.

5

కుటుంబరావు అసాధారణశక్తుల కీకారణ్యంలోకూడా ప్రవేశించారు. ఈ విషయంలో మాత్రం అభిమానులుకూడా అనుసరించలేదు, కొ.కు. అభిమానులు భజన మందిరాలలో నిలయవిద్వాంసులుకాదు. భౌతికవాదాన్నీ, అభ్యుదయ సాహిత్యాన్ని విజ్ఞానశాస్త్రాన్నీ విప్లవాన్నీ అభిమానించేవాళ్ళు కొ.కు. అభిమానులు. శ్రీశ్రీ అభిప్రాయాల్ని ఆమోదించనివాళ్ళు శ్రీశ్రీ కవిత్వాన్ని అభినందించిన సందర్భాలు వున్నాయి. ఇది మోసమో, అమాయకత్వమో చెప్పలేం కానీ ఇదివాస్తవం. కొ.కు. అభిప్రాయాల్ని ఆమోదించేవాళ్ళే ఆయన సాహిత్యాన్నికూడా ఆమోదించారు. అందుకనే కుటుంబరావు బుద్ధికౌలత సిద్ధాంతాన్ని కానీ అసాధారణ శక్తులమీద ఆసక్తినికానీ ఆయన అభిమానులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇన్‌ట్యూషన్, ప్రికాగ్నిషన్, సైకిక్ పవర్‌వంటి వాటిని గురించి కొ.కు. చాలాకాలంనుంచీ చెప్తూనే వున్నాడు. ఇదంతా ప్యారా సైకాలజీకి సంబంధించింది. అసలు సైకాలజీకీ సబ్జక్టివ్ సైకాలజీకీ ఇంకా శాస్త్ర ప్రతిష్ఠ రాలేదు. ఇక ప్యారా సైకాలజీని ఎక్కడ భరించేది. రష్యాలోనూ, అమెరికాలోనూ అ మాటకొస్తే ఇండియాలోనూ కూడా పేరా సైకాలజీని గురించి విస్తృతంగా పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. ఎవరో వేద వ్యాసుడట భారతం రాసిన ఆయన కాదు ఐ. ఎ. ఎస్ వేద వ్యాసుడు సోవియట్ రష్యాలో ఆధ్యాత్మిక పరిశోధనలు అనే పుస్తకం ఒకటి రాసాడు తెలుగులో. అదంతా ప్యారా సైకాలజీకి సంబంధించిందే. కానీ ఇక్కడ 'ఆధ్యాత్మిక' అనే మాట వాడడం తప్పు. అసాధారణ లేదా ఇంద్రియేతర శక్తుల పరిశోధనలు

అనాలి. మత విషయాలతో ఆధునిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనల్ని హాస్యాస్పదంగా అన్వయించి చిన్మయానందస్వామిలాంటి వాళ్ళకి ప్యారా సైకాలజీ పేరుతో జరుగుతున్న పరిశోధనలు ఇంకా విందు చేస్తాయి. ప్యారా సైకాలజీలో కూడా కొ. కు. ఒక విభాగానికి సంబంధించిన పరిశోధనల్నే చర్చలోకి తీసుకున్నాడు. Extra-sensory perception (E.S.P.) కి సంబంధించిన పరిశోధనల్ని మాత్రమే చర్చలోకి తీసుకున్నాడు. ఈ విషయంలో J. B. S. Halden నుంచీ కొ. కు. క్లూ తీసుకున్నట్టు కనిపిస్తుంది.

"I do not see why a dialectical materialist should reject priori the possibility of such alleged phenomena as telepathy and clairvoyance" "టెలిపతి దూరదృష్టి దూరశ్రవణాలవంటి విషయాలు సంభవతని గతి తార్కిక భౌతికవాదిముందే ఎందుకు నిరాకరించాలో నా కర్థం కావడంలేదు" అన్నాడు హాల్డన్. ఏ విషయంమీద పరిశోధనని అయినా గతితార్కిక భౌతికవాది నిరాకరించడు. పరిశోధనలో, పరిశీలనలో, ఆచరణలో రుజువుకాకుండా గతితార్కిక భౌతికవాది దేన్నీ అంగీకరించడు. "Who ever believes that the only important reality is the realm of ideas of the spirit, should not occupy himself with science ('Born')" "భావాలు మాత్రమే ఆత్మమాత్రమే వాస్తవం అని విశ్వసించేవాడు విజ్ఞానశాస్త్రంతో వ్యవహరించటం అనవసరం" అని ఒక శాస్త్రజ్ఞుడు స్పష్టంగాచెప్పాడు. మార్క్సిజాన్ని అవగాహన చేసుకోవటంలో హాల్డన్ చాలా సందర్భాల్లో దారితప్పిపోయాడు. ఏ విషయాన్ని అయినా భౌతిక జీవితంనుంచి పదార్థక్రమంనుంచీ వివరించటానికి పూనుకోవాలికానీ భావాలనుంచీ, ఆత్మనుంచీకాదు. కొ.కు. పాశ్చాత్యదేశాల్లో జరిగిన పరిశోధనల్ని చదివి దెయ్యాల్నీ భూతాల్నీ తన వాదానికి వుదాహరణగా చెప్పటం జరిగింది కానీ ఆయన వాదం వాటికే పరిమితంగాలేదు. పరలోకాల్నీ, అతీత శక్తుల్నీ, ఆత్మనీ కొ.కు. అంగీకరించాడనటం వాస్తవం కాదు. మనిషి మెదడు నుంచే బుద్ధికొలత సిద్ధాంతాన్ని చెప్పాడు. Quantum mechanics, సాపేక్షసిద్ధాంతం వెలుగులో బుద్ధికొలతని గురించి వివరించటానికి ప్రయత్నించాడు. మానసిక ఘటనలు ఒక కాలానికి ఒక స్థలానికి బద్ధంగా వుండవు. "The ability or memory was not located in any special place" (J. B. S. Halden) క్వాంటమ్ మెకానిక్స్‌లోని Field theory తో కొ. కు బుద్ధికొలత సిద్ధాంతాన్ని అన్వయించాడు. జామ చెట్టునుంచీ జామకాయ పడుతున్నప్పుడు దాని చలనం పదార్థఅంశమే. దానికి ఆ సమయంలో స్థల కాల చలనం విడిగా వుండదు. స్థల కాలాలు యేకమైన సూక్ష్మచలన రూపం అది. అలాగే బుద్ధికొలత సిద్ధాంతం: స్థల కాలా

లతో అధీనంకాని మెదడుతో సంబంధం వుండిన నైపుణ్యాన్ని బుద్ధికౌలతఅన్నాడు. ఈ నైపుణ్యం అసాధారణంగా కొంతమందికే ఎందుకు వుంటుంది, అందరికీ ఎందుకు వుండదు అనేదానికి కొ. కు. దగ్గర సమాధానం లేదు. నిజానికి కొ. కు. ఈ బుద్ధికౌలత సిద్ధాంతంతో బాధపడివుండటం అనవసరం. తనకే స్పష్టంకాని విషయాన్ని చెప్పటానికి ప్రయత్నిస్తే మిగిలేది గందరగోళమే. శకుంతల లెక్కలు వేగంగా పరిష్కరించటంలో ఆశ్చర్యం యేముంది? సాధనతో అవి సాధ్యం ఎందుకు కాదు? మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావోల్లో కూడా అసాధారణశక్తులు వున్నాయని కొ. కు. అనడం మరీ దిగ్భ్రమ కలిగించే విషయం. శకుంతలని గణితశాస్త్రంమీద నాలుగు పుస్తకాలు రాయమనండి తేలిపోతుంది అసాధారణశక్తి. అవధాన కవిత్వంలో కవిత్వం ఎంత గొప్పదో శకుంతల గణితశాస్త్ర అవధానంలో గణితశాస్త్రం కూడా అంతే గొప్పది- గణితశాస్త్రానికి ఆమెచేసిన దోహదం యేమీ లేదు. కొ. కు. ఎన్ని మార్గాల్లో శ్రమపడినా బుద్ధికౌలత సిద్ధాంతం అసలు పునాది మార్మిక, యౌగికవాదంలోనే వుంది. అది intuitionism. ఏమన్నా తేడావుందో తెలీదుకాని దేశపాండే పుస్తకానికి డాంగే రాసిన పీఠిక గుర్తుకువస్తోంది. "Intuition as an instrument of superior knowledge, is a condition of matter in its process of thinking, to which human body can be conditioned" (The universe of vedanta. page 15) నిజానికి ఈ "అసాధారణ సృజనాత్మక ప్రతిభ" ని గురించి వాల్కోవ్ అనే సోవియట్ శాస్త్రజ్ఞుడు 'Man and the challenge of Technology' అనే పుస్తకంలో చర్చించి నిరాకరించాడు. ఇంద్రియాల్తో సంబంధం లేకుండా మెదడు జ్ఞానాన్ని సంపాదించుకునే అవకాశం వుందనే E S P సిద్ధాంతాన్ని కూడా వాల్కోవ్ ఖండించాడు. "Like every other human faculty, intuition is not entirely inborn, but by training and developing the more general faculty of Phantasy, the play of imagination" (Volkov p. 195-96) అని ప్రతిభ సాధన ద్వారా వచ్చేదే అని చెప్పాడు. కొస్త అజాగ్రత్తగా చదివితే వాల్కోవ్ వాక్యాల్లో బుద్ధి కౌలత సిద్ధాంతానికి పునాదులు కనిపించే మాట వాస్తవమే. రష్యా వాళ్ళు మానసికమైన, శారీరకమైన అసాధారణ శక్తుల్ని (mystic powers) అధ్యయనం చేయటానికి 'Psychotronics' అనే కుహనా శాస్త్రాన్ని ప్రచారం చేశారు. కుటుంబరావు బుద్ధికౌలత సిద్ధాంతానికి పతంజలి యోగశాస్త్రం నుంచీ ఈ రష్యా వికారుల కుహనాశాస్త్రం దాకా అన్నీ అనారోగ్యకరమైన మత్తుపదార్థాలుగా వుపయోగ పడ్డాయి. ఆలివర్ లాడ్జ్ లోకాంతర విషయాల్ని మీడియం ద్వారా విన్నాడని కొ. కు. పరవశించిపోయాడు. తన సిద్ధాంతానికి అనుకూలమైనవిగా వుండే

విరసంలో కొడవటిగంటి

చలసాని ప్రసాద్

అంతా సంశయమే శరీర ఘటనంబంతా విచారంబె లో
నంతా దుఃఖ పరం పరాన్వితమె మేనంతా భయభ్రాంతమే
యంతా నంత శరీర శోషణమె దుర్వ్యాపారమే దేహికిన్
జింత నిన్ను దలచి పొందరు నరుల్ శ్రీకాళహస్తీశ్వరా!

'కాళహస్తీశ్వరా!' బదులు 'కార్ల్‌మార్క్స్!' అంటే నేటి మన మితవాద కమ్యూనిస్టులకు ఈ పద్యం చక్కగా సరిపోతుంది. తెలుగుదేశంలో మితవాద కమ్యూనిస్టు పార్టీ వారికి అస్థాన సంక్షిప్తుల వారున్నారు. వారే శ్రీమాన్ ఏటుకూరి బలరామమూర్తిగారు. ఆంధ్రుల చరిత్రను, భారత తత్వ శాస్త్రాన్ని, ఒకటేమిటి, అన్నింటిని వారు సంక్షిప్తం చేసేశారు. ఇటీవల (విశాలాంధ్ర- 2-11-80) శ్రీ కొడవటిగంటి కుటుంబరావుని కూడా వారు మడింపు వేసి కుదించేశారు. అక్కడితో ఆగారా? లేదు. ఆ వ్యాసంలోనే వారు అంతర్జాతీయ కమ్యూనిజాన్ని, మావోను, సాంస్కృతిక విప్లవాన్ని, నక్సల్బరీ ఉద్యమాన్ని, విరసాన్ని, దుమ్మెత్తి పోశారు.

కొడవటిగంటి కుటుంబరావుగారి సాహితీ కృషికి తెలుగు అక్షర ప్రపంచం నివాళులర్పించింది. రచనా వ్యాసంగంతో తన తరువాతి రచయితలను విపరీతంగా

వాటిని నిర్విచక్షణగా వుపయోగించటానికి కూడా చివరిదశలో కొ. కు. వెనుదీయ లేదు.

"మెదడులో Cerebral Cortex కి మాత్రమే సంబంధంలేని విషయాలు వున్నాయి. ఇంద్రియాల ద్వారా జ్ఞానం పొందటం అనేది ఈ Cortex ద్వారా సాధ్యం అవుతున్నమాట నిజమే. Nonsensory functioning కూ మెదడుకి వుండే Space - Time rules బుద్ధి కొలతకి వర్తించవు" (కొ. కు.) మెదడులో Cerebral Cortex మాత్రమే సంబంధంలేని విషయాలు కూడా వున్నమాట నిజమే. కానీ వాటికి ఇంద్రియాల్తో సంబంధం లేదని చెప్పటానికి ప్రమాణాలు లేవు. బుద్ధికొలత సిద్ధాంతం శాస్త్రీయం అనీ భౌతికవాద పరిధిలోకి వస్తుందనీ కొ. కు. ఋజువు చేయటంలో విఫలం అయ్యాడు. అయితే ఈ సిద్ధాంత ప్రభావం కొ. కు. ఇతర రచనల మీద లేదు. ఉద్దేశ పూర్వకంగానే లేకుండా చూసుకున్నాడు. అజ్ఞాత విషయాలు వుంటాయి కానీ అతీత విషయాలు వుండవనే తన విశ్వాసంతోనే కొ. కు. బుద్ధి కొలత సిద్ధాంతాన్ని వివరించటానికి ప్రయత్నించాడు.

(విరసం దశాబ్ది ఉత్సవాల్లో చేసిన ప్రసంగ వ్యాసం 19-10-80)

ప్రభావితం చేసిన వాడే ఉత్తమ రచయిత అని విమర్శకులంటారు. ఈ కొలబద్ద ప్రకారం కొ.కు. మేటి రచయిత. కథలకు ఒరవడి పెట్టారు. కథల తీరుతెన్నులను తీర్చి దిద్దారు. కొ.కు. నుంచి ఉత్తేజం పొంది ఎందరో తమ కలాలకు పదును పెట్టుకున్నారు. తమ మూగ గొంతులు విప్పారు.

కొ.కు. ఆలోచనా శిల్పి, అక్షర శిల్పికాడు. ఆయనలో సిద్ధాంత పుష్టేగాని శైలీ విన్యాసం కనిపించదు. భావాల పటుత్వమే గాని ఆయనలో భాషా పటాటోపం మచ్చుకు కూడా కనిపించదు. ఆయన శైలి వాహినిలా ఉరకలెత్తక పోయినా ఊట నీటిలా కదలాడి మనసులో పరుగులెత్తుతుంది. కాని తనదంటూ ఒక శైలి కొ.కు.కి వుంది. శిల్పాన్ని లొంగదీసుకున్నాడు గాని శిల్పానికి లొంగిపోలేదు చాలా మంది రచయితల విషయంలో "ఎంత బాగా చెప్పాడురా" అని మనం మెచ్చు కుంటాం. కాని కొ.కు. విషయంలో "ఎంత మంచి సంగతులు చెప్పాడురా" అని అనిపిస్తుంది. అయితే మనసుకు నాటుకునేలా చెప్పడంలో ఆయన అందె వేసిన చెయ్యి చెప్పే విధానం మీద దృష్టి మళ్ళనివ్వకుండా చెప్పే విషయం మీద మనసు లగ్నమయేలా చెప్పడం కొ.కు. కు వెన్నతో పెట్టిన విద్య. గోరింటాకులో ఎరుపులా, ఆయన రచనల్లోని సారం సాంతం చదివేక, ఆలోచించేక మాత్రమే మనస్సుల్లోకి ఇంకుతుంది.

మధ్య తరగతి వారిని కాచివడ పోశాడు కొ.కు. వాళ్ళ అంతరంగాలు, అనుపానులు క్షుణ్ణంగా అర్థం చేసుకున్నాడు. As a class మధ్య తరగతిని అంత బాగా analyse చేసిన తెలుగు రచయిత లేడేమో। తనకు తెలిసిన జీవితం గురించి మాత్రమే రాశాడు కొ.కు. పేరుకోసం, గొప్పకోసం తనకు తెలియని జీవితం గురించి ఆయన రాయలేదు. మార్క్సిస్టు అవగాహనతోనే ఆయన మధ్య తరగతిని చిత్రించాడు. ఉట్టికీ స్వర్గానికీ మధ్య వేలాడే నడిమి తరగతి వారిని కళ్ళకు కట్టాడు కొ.కు. వ్యాపార సంస్కృతిలో మధ్య తరగతి విలువలు ఎలా మరిగి కరిగి పోతాయో 'పచ్చకాగితం'లో ఎప్పుడో చూపించారాయన.

కథలు, నవలలే కాదు. సాహిత్యంలో విమర్శ, సమీక్ష వ్యాసాలు ఎన్నో రాశారు. సాహిత్య ప్రయోజనం గురించి తేటతెల్లంగా రాశారు. సైన్సు, ఫిలాసఫీ, రాజకీయం, ఆర్థికం- అన్నీ కొ.కు.కు కొట్టిన పిండి. ఎప్పటికప్పుడు సైద్ధాంతిక రంగంలో వస్తూన్న మార్పును శాస్త్రీయరంగంలోని పురోగతిని చాలా ఆసక్తితో అధ్యయనం చేసిన వ్యక్తి కొ.కు.

ఆనాటి నవ్య సాహిత్య పరిషత్తు నుంచి ఈనాటి విరసం వరకు పురోగామి వుద్యమాలతోనే మమేకం అయ్యాడు కొ.కు. వాడుక భాషను ఒప్పుకునే వారికే నవ్య సాహిత్య పరిషత్తులో చోటుండాలని నొక్కి చెప్పారాయన. అలాగే

మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానమే విరసానికి గీటురాయిగా వుండాలని కూడా తెగేసి చెప్పారు. ఈ మాటతో ఏటుకూరి వారికి పచ్చి వెలక్కాయ గొంతులో పడింది. నిజాయితీ, ముందుచూపు వున్నాయి గనకనే కొ.కు. విరసంలో చేరారు.

శాస్త్రజ్ఞానం వదల లేదు గనక కొ.కు. గారి తాత్విక అవగాహన అయోమయం అని తీర్పు చెప్పేశారు ఏటుకూరి బలరామమూర్తిగారు. సైన్సుకు తత్వశాస్త్రం అతీతం గాదని ఎంగెల్స్ ఏనాడో చెప్పాడు. పైగా సైన్సు పరిశోధనలవల్ల వచ్చే ఫలితాలనుబట్టి తత్వశాస్త్రం పునాదులే కదలి పోతాయని కూడా అన్నాడు ఎంగెల్స్. ఏటుకూరి వారేమంటారో? ఆలోచనల్లో, రాతల్లో స్ఫటికంలాగా వుంటారనీ, తేటతెల్లంగా స్పష్టంగా చెబుతారనీ, రాస్తారనీ కొ.కు.కిమంచిపేరుంది. ఈమాట ఎవరూ కాదనలేరు. కొ.కు.గారి తాత్వికతలో 'అయోమయం' అనే అంశం లేనేలేదు.

హేతువు మీద ఆధారపడి పరిశోధనలతో పురోగమించేది సైన్సు. వాస్తవాల పరిశీలన నుంచే హేతువు మొగ్గ తొడుగుతుంది, పరిశోధనలు ఆగిపోవు, అనుక్షణం సాగిపోతూంటాయి. అందుకే సైన్సుకి ముగింపు వుండదంటారు. సైన్సు పురోగతి వల్ల అనేక పాత నమ్మకాలు వమ్ము అయిపోవడం మనం కళ్ళారా చూస్తున్నాం. తలుపులు బిడాయించుకోవడం, closed mind సైన్సుకు పనికిరావు. అన్నిట్లో కొ.కు. ది సైన్సు దృష్టి. ఆయన ఆలోచనలతో వ్యాసాలతో ఎందరో ప్రభావితులయ్యారు. విరసం దశాబ్దంలో ఆయన రాసిన వ్యాసాలు సాంస్కృతిక రంగంలో మేలు బంతులు,

నక్సల్బరీ, శ్రీకాకుళ విప్లవాగ్నుల నుంచి పుట్టింది విరసం. విప్లవోద్యమంలో భాగంగానే విరసం ఏర్పడింది. ఆకాశం నుంచి వూడిపడలా, ఎక్కడి నుంచో వచ్చిపడలా. భారతదేశంలో నూరు నక్సల్బరీలు రావాలని 1970లోనే కొకు స్వాగతం చెప్పాడు. అంతే గాని ఏటుకూరి వారి అరసంలా ప్రభువుల పల్లకీలు మోయలేదు. ఇందిరాగాంధీకి వింజామరలు వీచలేదు. వర్గ సామరస్యం అనే విష గుళికలను పార్లమెంటరీ పంథా అనే పంచదారలో ముంచి పంచిపెట్టలేదు. అరసం వారి ఈ విద్రోహపు చర్యల వల్లనే విరసం ఏర్పాటు తప్పనిసరయింది. తెలుగు దేశంలో సాహితీ సాంస్కృతిక రంగంలో ఇవి చెరిపినా చెరగని సంగతులు. భావ కవిత్వంకన్నా అభ్యుదయ కవిత్వంకన్నా విప్లవ కవిత్వం ఎలా వెనకడుగో ఏటుకూరి వారువివరించ లేదు. సొంతం పప్పులో కాలేశారక్కడ. సాహిత్యసంస్థగా ప్రభువుల కన్నెర్రకు ఇంతగా గురయిన ఉదాహరణ మన తెలుగుదేశంలో లేదు. ఏటుకూరి వారికి కనీసం ఇదయినా కనువిప్పు కలిగించాలని కోరుకుంటున్నా.

అంతర్జాతీయ కమ్యూనిజాన్ని గురించి అవాకులు, చవాకులు, చాలా

మార్గదర్శి...

మొలకలవల్లి కోటేశ్వరరావు

సాహిత్య విమర్శ లేనిదే ఉత్తమ సాహిత్యం లేదు. అలాంటి అత్యున్నత మైనటువంటి సాహితీ విమర్శల్ని తెలుగు పాఠకులకి అందించి సాహితీ పరంగా వాళ్ళని ఎంతో గొప్పగా ప్రభావితం చేసి, వాళ్ళ ఆలోచనా పరిధిని విస్తృతం చేసిన వ్యక్తి కొ. కు. కుళ్ళి కంపుగొట్టిపోతున్న అభివృద్ధి నిరోధక సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు ప్రతిఘటించి, ప్రతిభావంతంగా, శక్తివంతంగా తుత్తునియలు చేసిన మేధావి, సాహితీ విప్లవకారుడు కొ. కు. ఆయన తన తరువాతి తరాలవారికి కూడా మార్గం సుగమం చేసాడు.

గురజాడ శైలిని కొ. కు. పుణికి పుచ్చుకున్నాడు. నెమ్మదిగా ఎలాంటి ఒడుదుడుకులులేకుండా ప్రశాంతమైన సెలయేరులా ప్రవహించేది ఆయన శైలి. ఆయన రచనలు కూడా (కథలు, నవలలు) అదర్శవంతమైన ఊహాత్మక ప్రపంచాన్ని, అద్భుతమైన సరికొత్త జీవితాన్ని చాటి చెప్పేవి కావు. వాస్తవ ప్రాపంచిక దృక్పథాన్ని విడనాడి స్వకపోల కల్పనాలోకాల్లో విహరిస్తూ కుడితిలో పడ్డ ఎలుకలాగ దిక్కూ మొక్కూ లేకుండా గిలగిల్లాడిపోతూ భరించలేని చీదరను కలిగించవు. అతి సామాన్యమైన పాత్రల్ని తీసికొని సామాన్యమైన కథలు రాయటమే ఆయన విశిష్టత.

ఆయన చేసిన రచనలు కాని, సాహిత్య విమర్శలుకాని కేవలం తన స్వంత

చెప్పారు ఏటుకూరి వారు. నిన్న స్టాలిన్‌ను రష్యా కాదన్నా, ఇవేళ మావోను చైనా కాదన్నా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ సామ్యవాద సమాజ నిర్మాణంలోనూ, మరీ ముఖ్యంగా సైద్ధాంతిక రంగంలోనూ ఆ యిద్దరి నాయకుల స్థానాలు వీసమెత్తు కూడా చెక్కు చెదరవు. స్టాలిన్, మావోలు తప్పులు చేయవచ్చు కాని ద్రోహం చేయలేదు. నిజాయితీ, చిత్తశుద్ధి వున్న వ్యక్తి తప్పులు చేయవచ్చుగాని ద్రోహం చేయడు.

పార్లమెంటరీ ఊబిలో కూరుకు పోయిన భారత రాజకీయాలను కొత్త మలుపు తిప్పిన విప్లవోద్యమాలు నక్సల్బరీ, శ్రీకాకుళం ప్రజాపోరాటాలు. ఆ పోరాటాల్లో పుట్టిన శిశువు విరసం. పసిబాల వయసులా పెరుగుతోంది విరసం. విరసం ప్రోగ్రెస్ రిపోర్టు తెలుగు దేశానికి తెలుసు. ఎవరు తమ సొట్టకర్ర అడ్డు పెట్టినా విప్లవ కెరటం ఆగిపోదు. అందుకే అంటారు

'కడలి తరగలా పెదవా
భడవా ఓ కాన్యూట్?' అని.

కుటుంబరావు నవలల్లో ప్రేమదృక్పథం

ఓల్గా

ఆధునిక యుగంలో ప్రేమను ప్రచురంగా సాహిత్యంలో ప్రవేశ పెట్టినవారు భావకవులు. భావ కవిత్వంలో ప్రకృతి కవిత్వం తీసివేస్తే మిగిలినదంతా ప్రేమ కవిత్వమే అనవచ్చు. భావకవులు ప్రేమ ప్రేమ అని ఎంత పలవరించినా వారికి ప్రేమ గురించి సరియైన అవగాహన లేదు. భావ కవిని ప్రేమ ఎందుకు ఎలా కలుగుతుందని ప్రశ్నిస్తే గాలి ఎందుకు వీస్తుంది? పూలు ఎందుకు పూస్తున్నాయి? అంటాడు తప్పితే మనకర్థమయ్యేలా మాట్లాడడు. భావ కవుల అవ్యాజమైన అనిర్వచనీయమైన ప్రేమ సిద్ధాంతాలు సమాజంలో ప్రేమను గురించి భ్రమలను అపోహలను కలిగించాయి. ప్రేమ గురించి సరియైన అవగాహన లేకుండా చేశాయి. అమలిన శృంగారం వంటి పనికిరాని సిద్ధాంతాలు యువతరానికి మేలు చేయకపోగా వింత వింత వాదాలకు ఆలోచనలకు దారి తీశాయి. ఈ ప్రభావం భావ కవుల సమకాలిక రచయితలపై వారి తర్వాతి రచయితలపై వుండి ప్రేమ, పెళ్ళి గురించి ఎన్నో అవాస్తవికమైన రచనలు వచ్చాయి. ఈ సమాజంలో ప్రేమ యొక్క వాస్తవ స్థితి గురించి పట్టించుకుని ప్రేమ అవసరాన్ని చాటిన మొదటి రచయిత చలం. తరువాత

కోరికల మేరకు, స్వంత కల్పనలను ఆధారం చేసుకొని, తనస్వంతం కోసం చేయలేదు. సమాజం కోసమే సమాజాన్ని ప్రతిబింబిస్తూ సమాజ అవసరాలకే తన రచనల్ని వినియోగించాడు.

సాహిత్య రంగంలో సంఘర్షణల్ని, వైరుధ్యాల పాత్రని ప్రతిభావంతంగా సైద్ధాంతికంగా అరటిపండొలిచి నోట్లో పెట్టినట్లు ఎంతో సులువుగా చెప్పాడు. రచనలలో సామాజిక స్వరూపాన్ని గూర్చి, విప్లవ వాస్తవికతను, విప్లవ సాహిత్య సమస్యలను, విప్లవ కథా సాహిత్యాన్ని గూర్చి కొ. కు నిర్మాణయుతంగా చెప్పాడు. అంతే కాదు. ఎంతో క్లిష్టమైనటువంటి మార్క్సిస్టు మేధావులు రాసిన గ్రంథాల్ని కూడా అత్యంత సులువుగా సామాన్య పాఠకులకు సైతం అర్థమయ్యే రీతిలో వివరంగా పరిచయ వ్యాసాలు, సమీక్షా వ్యాసాలు రాసాడు. మానవ జీవితంలో మనస్సు పాత్రని, జ్ఞాన విజ్ఞానాలమధ్య వైరుధ్యాల్నిగూర్చి జిజ్ఞాసాపూర్వకమైన విషయాల్ని చాలా లోతుగా పరిశీలించి అధ్యయనం చేసి వివరించిన తీరే కొ. కు ప్రత్యేకతని ప్రత్యేకించి చెబుతుంది.

విప్లవ రచయితల సంఘానికి చాలా ముఖ్యుడు, సంస్థకున్న పెద్ద దిక్కు ఆయన. మాలాంటి యువ విప్లవ రచయితలకు ఆయన రచనలు ఒక ఆదర్శం, ప్రేరణ. ఆయన మరణం విరసానికి పూరించ శక్యం కాని లోటు.

ప్రేమను సరియైన దృక్పథంతో చూచి దానిని గురించి ఎంతగానో ఆలోచించిరాసిన రచయిత కుటుంబరావు. సమాజంలో ప్రేమ అవసరాన్ని ఆయన గుర్తించారు. సమాజంలో నూటికి తొంభై పైగా ప్రేమ లేని వివాహాలే. ఆ సంసారాల్లోని కుళ్ళను గమనించిన కుటుంబరావు ప్రేమను గూర్చి ఎంతో ఆలోచించి రచనలు చేశారు. ఆయన రాసిన ప్రతి నవలలోనూ ప్రేమ సమస్య వుంటుంది. జీవితాన్ని గమనిస్తూ ప్రేమను అన్ని కోణాల నుండీ చూసి వాస్తవికంగా చిత్రించారు.

ప్రేమ ఎలా కలుగుతుంది? ప్రేమించటానికి కావలసిన సంస్కారం ఏమిటి? ప్రేమకు స్వేచ్ఛకు ఉన్న సంబంధం, ప్రేమలో ఉండే స్వార్థం, ప్రేమలో వర్గాల పాత్ర, ప్రేమకు ఈ సంఘ నీతితో గల సమన్వయం—వీటన్నిటి గురించి ఆయన తన నవలల్లో చర్చించి సరైన అవగాహన యివ్వటానికి ప్రయత్నించారు. ఈ సమాజంలో ప్రేమ స్థితి ఎలా వుందో, అలా వుండటానికి కారణాలేమిటో వివరించారు. ప్రతి మనిషి వ్యక్తిగత జీవితంలో ప్రధానమైన ఈ సమస్యను చాలా స్పష్టంగా వివరించారు.

ప్రేమ ముఖ్యంగా భావైక్యత ఉన్న మనుషుల మధ్య సాధ్యం. భావాలను పంచుకోలేని వ్యక్తులను ప్రేమించటం అసాధ్యమనే విషయాన్ని కుటుంబరావు ప్రతి నవలలోనూ చెబుతారు. ప్రేమకు మానసిక జీవితంతోనూ, శారీరక జీవితంతోనూ సంబంధం ఉండాలి. ఈ రెండింటిలో మానసిక జీవితంలో భాగం వుండటమే ముఖ్యం? మన సమాజంలో జరిగే వివాహాల్లో దంపతుల మధ్య శారీరక సంబంధమే వుంటుంది గాని మానసికంగా ఎక్కడా కలవరు. అందుకే వివాహాలు విఫలమవుతాయి. అసంతృప్తి కలుగుతుంది. శారీరకంగా ఏకం కాలేకపోయిన ప్రేమికులకు కలిగిన తృప్తి కూడా శారీరకంగా మాత్రమే ఏకమైన దంపతుల మధ్య ఉండదు. "జీవితం" అనే నవలలో కుటుంబరావు ఈ విషయాన్ని చెబుతారు. ఆ నవలలోని నాయకుడు ప్రకాశం, రజని అనే అమ్మాయితో మానసికంగానూ, చూడామణి అనే స్త్రీతో శారీరకంగానూ ఏకమౌతాడు. ఉట్టి ప్రేమ గానీ, శుష్క కామంగానీ అతనికి పరిపూర్ణమైన తృప్తినీయవు. కానీ చూడామణికంటే నిస్సందేహంగా అతను రజనికే దగ్గర ఔతాడు. రజనిని గురించే ఎక్కువ ఆలోచిస్తాడు. ఆనందంగానీ, బాధగానీ ఆమె వల్లే ఎక్కువ పొందుతాడు. "ప్రేమించిన మనిషి" అనే నవలలో గోపాలం సరోజ అనే అమ్మాయిని ప్రేమించే ప్రయత్నంలో తన భావాలు, ఆశయాలు విశ్వాసాలు అన్నీ ఆమెతో చెబుతాడు. ఆమె అన్నీ విని "ప్రపంచాన్ని మార్చడమంటే మాటలా?" అనే ఒక్క మాటతో అతని సర్వాభిప్రాయాలను కొట్టిపారేస్తుంది. ఆతర్వాత గోపాలం సరోజనుగురించి ఆలోచించడు.

ప్రేమించటానికి కొంత సంస్కారం కావాలని కుటుంబరావు అభిప్రాయం. ప్రేమ మనిషిలోని మంచితనాన్ని పెంచుతుంది. ఆ వ్యక్తి సంస్కారాన్ని విశాలం

చేస్తుంది. ఒక వ్యక్తిని సంతోషపెట్టాలనీ ఆ వ్యక్తి ఆనందిస్తే తనకు చాలా ఆనందం కలుగుతుందనీ ప్రేమించిన మనిషి గ్రహించగలగాలి. తాను ప్రేమించిన వ్యక్తి యిష్టానిష్టాలు గ్రహించటం, ఓర్పుతో వ్యవహరించటం, ఆ వ్యక్తి కోసం తనకున్న దుర్లక్షణాలను వదులుకోవటం—యివన్నీ చేసే క్రమంలో ప్రేమించిన వ్యక్తి సంస్కారం పెరుగుతుందని కుటుంబరావు చెబుతారు. యవ్వనంలో కామోద్రేకం కలగటం సహజం. దానినే ప్రేమ అనుకుని ఆ కామం తగ్గగానే ఆ మనిషికి విలువ యివ్వక ప్రేమ తగ్గిందనుకుంటారు. ఎదుటి వ్యక్తి మనస్సులో ఒక ప్రపంచం వుందనీ, ఆ మనో ప్రపంచంలోకి తొంగి చూసి అక్కడ తాను చోటు చేసుకోవటమే ప్రేమ అని చాలా తక్కువ మంది అనుకుంటారు. అలా అనుకోవటానికి కొంత సంస్కారం కావాలని కుటుంబరావు అంటారు. ఈ సంస్కారం లేకనే చాలామంది ప్రేమను భ్రమ అనుకుంటారు. కొందరికి వారికి అనుభవమవుతున్న శారీరక సుఖం పట్ల కూడ అసహ్యం కలుగుతుంది. (ఇది కూడా భావైక్యత లేనందువల్లనే) శారీరక ఆనందంకంటే మానసికమైన ఆనందం ఉన్నతమైందనీ, శారీరక ఆనందాన్ని పొందే స్థాయి కూడా లేని మనుషులకు మానసిక ఆనందంతో ముడి వేసుకున్న ప్రేమ భ్రమగా కనిపించటంలో వింత లేదని కుటుంబరావు అభిప్రాయం. "ప్రేమించిన మనిషి" అనే నవలలో కుటుంబరావు "మనిషిలో గల సంస్కారాన్ని బట్టి వ్యామోహాలుంటాయి. ఏ మనిషికి ఏ మనిషిమీద వ్యామోహం ఉంటుందో దాన్ని బట్టి ఆ మనిషిని అర్థం చేసుకోవచ్చు" అంటారు. దీనిని బట్టి ప్రేమకు సంస్కారానికి గల సంబంధాన్ని అర్థం చేసుకోవచ్చు,

కుటుంబరావు మార్క్సిజం బాగా తెలిసిన వ్యక్తి. జీవితాన్ని మార్క్సిజం వెలుగులో చూసి వ్యాఖ్యానించగల రచయిత. ప్రేమను కూడా ఆ దృక్పథం నుండి చూసి వ్యాఖ్యానించటానికి ప్రయత్నించారు. సమాజంలో వర్గాలు, వర్గ స్వభావాలు ప్రేమలో ఎలా సంఘర్షణ పడతాయో కుటుంబరావు "ప్రేమించిన మనిషి" నవలలో వివరిస్తాడు. ఈ నవలలో గోపాలం మధ్య తరగతికి చెందిన వ్యక్తి. కార్మిక వర్గ చైతన్యం సంపాదించటానికి ప్రయత్నిస్తుంటాడు. మొదట సరోజ అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆమెది ధనిక వర్గ స్వభావం. ఒక పనిమనిషి విషయంలో సరోజ ప్రవర్తించిన తీరు చూసి ఆమెను అసహ్యించుకుంటాడు. తర్వాత నిస్సహాయురాలైన పని మనిషి మంగిపై జాలిపడి ఆమెను ప్రేమిస్తున్నాననుకుంటాడు. ఆమెకు ఏ సహాయం చేసినా అతనికి తృప్తి లభించేది. కాని ఆమెకు తనకు మధ్యనున్న వర్గ భేదం మూలంగా అతను ఆమెకు దూరంకాక తప్పలేదు. మంగికి సహాయం చేయాలనుకున్నా సమాజం గురించి ఆలోచించక తప్పలేదతనికి. సరోజ "నాకు పెన్ను కొనియివ్వరా" అని అడిగి అతని చేత పెన్ను కొనిపించుకుంటుంది. రెండిడ్లీ తినమని గోపాలం మంగిని బతిమాలితే ఎవరైనా చూస్తారేమోనని భయ

పడుతుంది మంగి. "సరోజకు పద్నాలుగు రూపాయల గిఫ్టు యివ్వటం తేలిక. మంగికి ఒక చీర కొనిపెడితే కొంపలు అంటుకుంటాయి. చీరెదాకా అక్కరలేదు. ఒక చందనం సబ్బు కొని యిచ్చే తాహతు తనకు లేదు. రోజూ ఉదయం రెండు యిడ్డెన్లు తినిపించాలంటే దొంగ ఏడుపు ఏడవాలి" అని తన ప్రేమకు అడ్డు తగిలే వర్గాల గురించి ఆలోచిస్తాడు గోపాలం. గోపాలం కూడా తాను మంగిని ప్రేమిం చాననుకుంటాడు గానీ ఆమె మీద వున్నది దయ, సానుభూతి మాత్రమే అని చివ రకు తెలుసుకుంటాడు. తన వర్గానికే చెంది తనంత చైతన్యం గల పద్మను ప్రేమి స్తాడు. పద్మ మొదటి నుండీ తనని ప్రేమిస్తున్నదని తెలిసినా దూరంగా వున్న గోపాలం ఆవిడ భావాలు తెలుసుకోవటం మొదలుపెట్టిన దగ్గర నుండీ ఆమెను అభిమానిస్తాడు. వారిద్దరూ ఒకే వర్గానికి చెందినవారవటం వలన వారి స్వభావాలు ఆలోచనలు ఒక రకంగానే ఉంటాయి. మొదట గోపాలానికి పద్మ అందంగా కని పించదు. అసహ్యించుకుంటాడు కూడా. కానీ ఆమె 'Modern Philosophers' అనే పుస్తకం చదువుతుందని తెలిసిన మరుక్షణం అతనికి అందంగా కనిపిస్తుంది. "పద్మ నిజంగానే అందంగా వుందా. లేక తన కళ్ళు మారుతున్నాయా?" అనుకుం టాడు. అప్పటి నుండి ఆమెను ఏ సందేహాలూ లేకుండా ప్రేమిస్తాడు. మంగిని పెళ్ళాడదామనుకుని కూడా గోపాలం ఆ పని చేయడు. "తన భార్య అయి మంగి ఒక్క క్షణం కూడా సుఖపడలేదు. తన జీవితం అరువు మంగిని కుంగదీస్తుంది. అంతకన్న రెండిళ్ళలో చచ్చే చాకిరి చేసి తిండికి మాడటం మంగి దృష్టిలో సులు వైన పని" అనుకుంటాడు. మనిషి తన వర్గ స్వభావాన్ని మార్చుకోవటం యెంత కష్టమో, ఈ సమాజంలో వర్గాలు ఎంత బలమైనవో పై వాక్యం వలన తెలు స్తుంది.

చాలామంది నవలాకారులు ఉన్నత వర్గాల స్త్రీలు శ్రామిక వర్గానికి చెందిన వారిని ప్రేమించి పెళ్ళాడటం, లేక ధనికవర్గపు హీరో కూలి అమ్మాయిని ప్రేమిం చడం గురించి రాస్తారు. అలా ప్రేమించినపుడు వాళ్ళకు వచ్చే ఘర్షణలను కూడా చిత్రించరు. సమాజం వాళ్ళను ఎలా చూస్తోందీ, వాళ్ళు వొకరి స్వభావాలతో ఒకరు ఎలా ఒద్దిక ఔతారు; రెండు వర్గ స్వభావాల మధ్య భావైక్యత సాధ్యమా అనే విష యాలు రాయరు. కుటుంబరావు ఈ విషయాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈ నవల రాశారు. సమాజంలో వర్గాలు నాశనం కానంతవరకూ వివిధ వర్గాల మధ్య వివాహాలు జరిగి విజయవంతం కావటం అసంభవం అని కుటుంబరావు అభిప్రా యం. ఇది చెప్పడానికే కుటుంబరావు "ప్రేమించిన మనిషి" నవల రాశారు.

జీవితంలో స్వేచ్ఛ చాలా అవసరం. ప్రేమకు కూడా. ప్రేమించటానికిగానీ, ద్వేషించడానికి గానీ మానసికమైన స్వేచ్ఛ ఉండాలని కుటుంబరావు చాలాసార్లు

అంటారు. స్వేచ్ఛ వున్న చోటే ప్రేమ కూడా వుంటుంది. అన్నింటికంటే జీవితంలో కావలసిందీ, ఎక్కువ ఆనందాన్నిచ్చేదీ స్వేచ్ఛే. స్వేచ్ఛలో పెరిగే ప్రేమకు ఏ జబ్బులూ అంటవు. బానిసత్వంలో ప్రేమ పట్టదు. మన సమాజంలోని వివాహ బంధాలలో స్వేచ్ఛ బొత్తిగా వుండదు. స్వేచ్ఛా ప్రియులై వివాహ బంధాన్ని తిరస్కరించిన స్త్రీ పాత్రలను కుటుంబరావు "నీకేం కావాలి" "పంచకళ్యాణి" "ఎండమావులు" మొదలైన నవలల్లో చిత్రించారు. "నీకేం కావాలి"లో కస్తూరి భోగం స్త్రీ. వివాహాన్ని స్వేచ్ఛ కోసం తిరస్కరిస్తుంది. ఈ సమాజంలో యిల్లాలి కంటే వేశ్యకే ఎక్కువ స్వేచ్ఛ వుంది. ఆర్థిక పరిస్థితులు ఒత్తిడి చేస్తే తప్ప శారీరక సంబంధాల విషయంలో వేశ్యకున్న స్వేచ్ఛ మామూలు సంసార స్త్రీలకుండదు. ఈ సమాజంలో జరిగే పవిత్ర వివాహాల ద్వారా స్త్రీలకు లభించేది కేవలం శారీరకానందమైతే దానికోసం స్వేచ్ఛను చంపుకోవటం శుద్ధ దండగ. వివాహాలు మానసికానందాన్ని యిచ్చేవరకూ కస్తూరివలె బతకటం న్యాయమనే భావాన్ని "నీకేంకావాలి" లో కుటుంబరావు చెబుతారు. ఈ నవలలో కస్తూరి మొదటి నుండీ తన బతుకు తను బతకాలనీ, తనకేది ఆనందాన్నిస్తుందో అది చేయాలనీ అనుకునే వ్యక్తి. హీరోని ప్రేమిస్తుంది. కానీ అతన్ని పెళ్ళాడటానికి వొప్పుకోదు. కనీసం అతని యింట్లో ఉండటానికి కూడా వొప్పుకోదు. "మీ యింట్లో వచ్చి వుంటే నేను కుక్క కన్న నీచం అయిపోనా· నా యింట్లో నేను రాణిని. నన్నడిగేవాడుండడు. నన్ను తప్పు పట్టే వాడుండడు." "నా ఇల్లంటూ నాకుండి, నా కులం నాకుండి, నన్ను ఒకడు అదుపు చెయ్యడానికి లేకుండా ఉంటే, నన్నేం చేసినా యిష్టమే.... నన్ను బానిసదాన్ని చేయాలంటే మాత్రం నా కక్కర్లా. నేనెవరి పెళ్ళాన్నీ కాను. భోగంముండని" అంటుంది కస్తూరి. చాలా ఉన్నతమైన సంస్కారమూ, స్వేచ్ఛాప్రియత్వమూ కల వ్యక్తి. అందుకే సామాన్య స్త్రీలకంటే యెక్కువ ఆనందాన్ని పొందుతుంది. "పంచ కళ్యాణి" నవలలో జానకి వివాహమనే బానిసత్వంలో పడి అక్కడ బతకలేక బయటకు వస్తుంది. ఆ తర్వాతే ఆమె తన జీవితం బాగుందని అనుకుంటుంది. "తన అత్తవారిల్లు వదిలేసి వచ్చిన తరువాత జీవితం ఆమెకు మరింత ఆనందం కనిపించసాగింది. అంతకు పూర్వం తాను సాధారణ సుఖాలుగా భావించిన వన్నీ యిప్పుడు కష్టపడి సాధించుకున్న హక్కుల్లాగా 'కనపడినై' అని స్వేచ్ఛలోని గొప్పతనాన్ని చెబుతారు కుటుంబరావు. "ఎండమావులు" నవలలో సుందరం ప్రేమ బంధాన్ని గొప్పగా భావిస్తుందిగానీ వివాహబంధాన్నీ, దాని ద్వారా వచ్చే నీతుల్ని అసహ్యించుకుంటుంది. రంగారావును పెళ్ళి చేసుకుంటే నీతికి ప్రాముఖ్యం పెరిగి ప్రేమ చచ్చిపోతుందనుకుంటుంది. రంగారావు కష్టాల్లో వుంటే తాను ఏ రకంగానైనా సరే డబ్బు సంపాదించే అవకాశం పెళ్ళయితే ఉండదనీ, పతివ్రతలా అతనితో పాటు పస్తుండాలనీ యింకా అనేక విధాల ఆలోచించి సుందరం వివాహాన్ని తిర

స్కరిస్తుంది. ఈ సమాజంలో స్వేచ్ఛనుకోరే స్త్రీలు ఎలాంటి జీవితాన్ని గడపాల్సి వస్తుందో చూపుతూ, ఆ స్వేచ్ఛ జీవితంలో ప్రేమ ఎంతటి ఔన్నత్యాన్ని పొందుతుందో కుటుంబరావు ఈ మూడు నవలలలో వివరించారు. అలాగే స్వేచ్ఛనూ సమానత్వాన్నీ కోరే పురుషులకు కూడా భార్యలు చూపే బానిస బుద్ధి, పాతివ్రత్యం భరించలేనివిగా ఉంటాయనే విషయం కుటుంబరావు తన రచనల్లో చిత్రించారు. "గడ్డు రోజులు" అనే నవలలో సత్యం భార్య జానకి తనను తాను తక్కువ చేసుకొని భర్తను అధికంగా గౌరవిస్తుంది. కష్టాలన్నీ తానే భరించి భర్తను సుఖపెడదామనుకుంటుంది; ఇద్దరూ కలిసి కష్టాలు పంచుకోవచ్చని అనుకోదు. కూర కొంచెం వుంటే మొత్తం భర్తకే వేసి, నెయ్యంతా భర్తకే వేసి భర్తచేత చివాట్లు తింటుంది. సత్యం ఈ రకమైన దాస్యాన్ని భరించలేకపోతాడు.

ప్రేమ శాశ్వతమనీ, జీవితంలో ఒకరినే ప్రేమించగలమనే నమ్మకాలను కొందరు రచయితలు సాహిత్యంలో స్థాపించారు. కానీ కుటుంబరావు దృష్టిలో ప్రేమ కేవలం శాశ్వతం కాదు. తాత్కాలికం కావచ్చు. ఒక వ్యక్తిని ప్రేమించాలంటే భావైక్యత కావాలి. ఒక వ్యక్తిలోని కొన్ని లక్షణాలను చూసో, భావాలను పంచుకునో ఆవ్యక్తిని ప్రేమించినపుడు ఆవ్యక్తిలో ఆలక్షణాలు, భావాలు ఉన్నంతకాలమే ఈ వ్యక్తి ప్రేమించటం సాధ్యమౌతుంది. ఆ వ్యక్తిలోని ఆ లక్షణాలు నశించినపుడు ఆ వ్యక్తిపై ప్రేమ పోవటం సహజం. ఒక వ్యక్తిపై ప్రేమ నశించకుండా వుండాలంటే ఆ వ్యక్తి తాను ప్రేమించబడినప్పుడున్నట్లే మారకుండా ఉండాలి. ఆ వ్యక్తిని ప్రేమించినవారు కూడా మారకుండా ఆ లక్షణాలను ప్రేమించే స్థితిలో వుండాలి. లేదా యిద్దరూ ఒకే రకంగా మారుతూ వుండాలి. ఒకరిలోనే మార్పు వస్తే, రెండో వారిలో ఆ మార్పు వచ్చే వరకూ, లేదా ఆ ఒకరే తిరిగి మారే వరకూ వారిద్దరి మధ్య ప్రేమ క్షీణిస్తుంది. ఈ విషయం "ఎండమావులు" నవలలో కుటుంబరావు చెప్పారు. ఈ నవలలో సుందరం, రంగారావు ప్రేమికులు. ఇద్దరూ ఒకే విధమైన మనస్తత్వం కలవారు. మధ్యలో రంగారావు మారతాడు. డబ్బు సంపాదించటం, సంఘంలో ఒక స్థానాన్ని సంపాదించటం, నీతిగా బతకటం యిట్లాంటి విషయాలలో సుందరంకు భిన్నంగా ఆలోచిస్తాడు. క్రమంగా సుందరంకు మానసికంగా దూరమౌతాడు. సుందరం అతన్ని వదిలేసి వెళ్ళిపోతుంది. రంగారావు ఆలోచనలన్నీతప్పని అతని జీవితం చెబుతుంది. మళ్ళీ మామూలు రంగారావుగా మారి సుందరానికి దగ్గరౌతాడు. "అనామిక"అనే నవలలో గోవిందరావు సీతను ప్రేమిస్తూనే యింకో అమ్మాయిని పెళ్ళాడాలనుకుంటాడు. ఒక వ్యక్తి ఒకరి కంటే ఎక్కువ మందిని ప్రేమించటం సాధ్యమనీ ఆ ప్రేమలో ఒకరిపై ఎక్కువ ప్రేమ ఇంకొకరిపై తక్కువ ప్రేమ వుండవచ్చనీ 'అనామిక'

లోని కొన్ని పాత్రల ద్వారా రచయిత చెప్పాలనుకున్నాడనిపిస్తుంది. ఈ సమస్యను చర్చకు పెట్టి వదిలినట్లనిపిస్తుంది.

ప్రేమకూ డబ్బుకూ ఉన్న సంబంధం కూడా కుటుంబరావు తన నవలల్లో చిత్రించారు. ఈ సమాజంలో స్త్రీలు ఏ కొంచెమైనా తమ భర్తలను ప్రేమిస్తున్నారంటే తమను వారు ఆర్థికంగా భరించటం వలననేననీ, నీ బతుకు నీవు బతుకు అన్న భర్తను కూడా సామాన్య స్త్రీ ప్రేమించగలిగితే అది నిజమైన ప్రేమ అని కుటుంబరావు అభిప్రాయం.

ప్రేమకూ సంఘనీతికీ ఈ సంఘంలో సమన్వయం కుదరటం కష్టం. ఈ సమాజంలో స్త్రీలకు ప్రేమించే స్వేచ్ఛ లేదు. పురుషుడికి కూడా సంపూర్ణమైన స్వేచ్ఛ లేదు. స్వేచ్ఛ లేకుండా చేసి పెద్దలు వివాహం జరుపుతారు. ఆ భార్యాభర్తలకు ఒకరంటే ఒకరికి ద్వేషం తప్ప ప్రేమ ఉండదు. వారిద్దరి మానసిక ప్రపంచాలు ఎక్కడా కలవవు. ఆ స్థితిలో వారు వేరొక వ్యక్తిని ప్రేమించటమంటే అమలులో ఉన్న సంఘపు కట్టుబాట్లను ఉల్లంఘించటమే. "పంచకళ్యాణి" నవలలో జానకి చలపతి ప్రేమించుకుంటారు. ఇద్దరూ వివాహిత వ్యక్తులే. ఇద్దరికీ సంఘాన్ని ఎదిరించే శక్తి లేదు. అందువల్ల ఎవరి జీవితం వారు జీవించక తప్పలేదు. చలపతి జానకితో "ప్రేమను సంఘ నీతితో సమన్వయించటం కష్టం. అందుచేత ప్రేమ అరణ్యవాసమూ, అజ్ఞాత వాసమూ చేస్తుంది. నేను ఎంత అస్వతంత్రుణ్ణో నిన్ను చూసినప్పుడల్లా తెలిసి వస్తుంది" అంటాడు. ప్రేమించడానికి కూడా స్వేచ్ఛ లేని సమాజం మనది. ద్వేషాలతో మనసులను జీవితాలను విషపూరితం చేసుకుంటున్నా నవ్వుతూ ఆమోదాన్నిచ్చే సమాజం మనది- అనే విషయం కుటుంబరావు ప్రతి నవలలోనూ చెబుతారు. "ఎండమావులు" అనే నవలలో సుందరం సంఘాన్ని లెక్కచేయదు. ఈ సంఘం చెప్పే దొంగనీతులంటే సుందరానికి మంట. ఆ నీతులు మనిషికి మనిషి సహాయపడటానికిగానీ, మనిషిపై నమ్మకాన్ని పెంచడానికిగానీ ఏవిధంగానూ ఉపయోగపడవని సుందరం నమ్ముతుంది. రంగారావుని ప్రేమించి అతన్ని సుఖపెడుతుంది. అతనికి సహాయ పడుతుంది. కానీ పెళ్ళి అనే సంఘపు బంధంతో తనను తాను కట్టివేసుకోదు. రంగారావును కట్టివేయదు. "వారసత్వం" నవలలో సుదర్శనం ఖాను అనే ఆమెను ప్రేమిస్తాడు. కాని ఆమెను పెళ్ళి చేసుకోటానికి సాహసించలేక ఖోతాడు. మొదట అతను ప్రేమించకుండా పెళ్ళాడతాడు. ఆ తప్పు చేయటానికి సంఘం అనుమతిస్తుంది. అదే సంఘం ప్రేమించిన వ్యక్తిని పెళ్ళాడటానికి వీలు లేకుండా చేసి ఆ వ్యక్తితో యింకో తప్పు చేయిస్తుంది. ఈ సంఘంలో అమలులో ఉన్న నీతి సూత్రాల లోపాల వల్లనే అవినీతి పెరుగుతుంది. సుదర్శనం అంటాడు "ప్రేమలేని రంకుతో పెళ్ళాన్ని తెచ్చుకున్నందుకు

యిది శిక్షలాగుంది- ప్రేమించిన దానితో రంకు పోవటం". రెండు సమయాల్లోనూ సుదర్శనం రంకు చేసినట్లే ఫీలౌతాడు. కారణం సంఘం. సంఘనీతి.

'అనామిక' అనే నవలలో గోవిందరావు సంఘపు కట్టుబాట్లు యెదిరించలేక ప్రేమకు దూరమైన మరొక పాత్ర. గోవిందరావులో సంఘాన్ని ఎదిరించే శక్తిలేదు. అతని కోరికలకు అంతబలంలేదు. సీత అనే ఆమెను ప్రేమిస్తాడు. ఆమెకు అదివరకే వివాహమై ఉంటుంది. ఆ వివాహం వలన ఆమె సుఖపడటంలేదని అతనికి తెలుసు. ఆమెతో తాను ప్రేమిస్తున్నానని చెప్పడు. సీత విడాకులు తీసుకోబోతుందని తెలిసి కూడా తన కోరికను వెలిబుచ్చలేదు. సీత ఆత్మహత్య చేసికున్న తర్వాత ఒంటరిగా విలపిస్తాడంతే. ఈ సంఘపు కట్టుబాట్లను ఎదిరించే ధైర్యం అతనిలో లేదు. సంఘం అతని ప్రేమను ఆమోదించదు. అందుకే ఈ సమాజంలో మనుషులను ప్రేమించే కంటే ఆరాధించటం మంచిదని కుటుంబరావు అనామిక నవలలో చెబుతారు.

ఈ సమాజంలో జరిగే వివాహాలపై కుటుంబరావుకు చాలా అసంతృప్తి వుంది. ప్రేమ ఈ సమాజంలో లేదు. స్త్రీలకు ప్రేమించే స్వేచ్ఛ లేదు. పెళ్ళాడిన తర్వాత ప్రేమించడమంటే ఈ విశాల ప్రపంచంలో ఎవరినైనా ప్రేమించగలగట మని కుటుంబరావు అంటారు ప్రేమ విషయంలో స్త్రీ పురుషుల మధ్య ఘర్షణలు, అసమానతలు ఈ సమాజంలో వస్తున్నాయి. ప్రేమించిన ఆడదానికి ఆ పురుషుడు తప్ప మరో ఆలోచన లేకపోవటం, ఈ సమాజంలో జరుగుతుంది. కానీ పురుషు డికి స్త్రీ కాక వేరుగా మరో జీవితం ఉంటోంది. ఇలాంటి పరిస్థితి రావటానికి కారణం ఈ వ్యవస్థ. సమాజంలో స్త్రీ పురుషులకు సమానత్వం ఉంటే ప్రేమలో ఈ తేడా రాదు. నీకు భార్యే సర్వస్వం కాదు అనే భావన పురుషుడికి, నీకు భర్తే సర్వస్వం అనే భావన స్త్రీకి ఈ వ్యవస్థ వారు పుట్టినప్పటి నుండి కలిగిస్తుంది. స్త్రీ కూడా సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటూ ఆర్థికంగా స్వతంత్రురాలైనప్పుడు అతనికి వలెనే మరో జీవితం వుంటుంది. వారిద్దరికీ వేరుగా ఉన్న జీవితాలను కూడా వారు సరిగా అర్థం చేసుకోగలిగితే ప్రేమ నిలుస్తుందని కుటుంబరావు అభిప్రాయం.

ఈ సమాజంలో జరిగే ప్రేమల పెళ్ళిళ్ళ తంతులను చూసి చాలామంది ప్రేమపై అవిశ్వాసం పెంచుకుంటున్నారు. ప్రేమ భ్రమ అనుకుంటున్నారు. "పంచ కళ్యాణి" నవలలో లలిత పాత్ర యిందుకు చక్కని ఉదాహరణ ఈ సమాజంలో ప్రేమ దొరకదనీ, పురుషులంతా దుర్మార్గులేననీ కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరుచుకుంటుంది. తర్వాత రామారావు ఆమెను నిజంగా ప్రేమించినా అర్థంచేసుకో లేక పోతుంది, అసలు ఆడది ఎవరినీ ప్రేమించకూడదనీ, ఆత్మగౌరవం తప్ప ఈ సమాజంలో ఆడదానికి మరేమీ లేదనీ, మగాడిని ప్రేమించి ఆ ఆత్మగౌర

కొ. కు. ప్రాతినిధ్య నవల చదువు

కాత్యాయనీ విద్మహే

"చదువని వాడజ్ఞుండగుఁ
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
చదువగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్ద చదువుము తండ్రీ"

(భాగవతం-సప్తమస్కంధం)

చిన్నప్పటి నుండి చదువు మీద ఆసక్తితో తనంతటతాను చదవటం నేర్చుకొని అత్తగారింటికి వచ్చాక అక్కడ కనిపించే ఒకే ఒక పుస్తకం, భాగవతాన్ని చదువుకుంటుంటే, అత్తవారి వైపు వాళ్ళు ఎద్దేవా చేస్తున్నా సీతమ్మకు చదువుమీద ఉత్సాహం చెడకుండా వుంచింది ఈపద్యం. తనకొడుకు సుందరాన్ని బాగా చదివించాలన్న ఆలోచనకు మరింత బలాన్ని సమకూర్చింది కూడా ఈ పద్యమే. సీతమ్మ, సుందరం- ఈ యిద్దరూ కొడవటిగంటి కుటుంబరావు వ్రాసిన నవల 'చదువు' లోని ముఖ్యపాత్రలు.

'చదువు' ముందుగా అప్పట్లో ఆంధ్రజ్యోతి మాస పత్రికలో సీరియల్‌గా వచ్చి ఆ తరువాత 1952లో మొదటి సారిగా పుస్తక రూపాన్ని పొందింది. ఈ నవలలో 1915 నుండి 1934 వరకు భారత దేశంలో సాగుతున్న జాతీయోద్యమపు నేపథ్యంలో- సుందరం అనే వ్యక్తి జీవితం ద్వారా — తెలుగువాళ్ళ సామాజిక జీవితం ఆ నాటి చారిత్రక పరిణామాలతో సహా చిత్రితమైంది.[1]

వాన్ని చంపుకోవటం అవివేకమని అనుకుంటుంది. ఈ సమాజంపై కసి తప్ప లలితకు సరియైన అవగాహన లేదు. ఈ సమాజం లలిత హృదయాన్ని బండ బార్చింది.

ఈ సమాజంలో కొందరు ప్రేమంటే ఏమిటో తెలియక అంధకారంలో బ్రతుకుతున్నారు. కొందరు ప్రేమ భ్రమ అనుకుంటున్నారు. కొందరు కసితో ఎవరినీ ప్రేమించకూడదనుకుంటున్నారు. సమాజంలో ప్రేమ వివాహాలు జరగాలంటే ఆడదాని స్థాయి సంఘంలో పెరగాలని "పంచకళ్యాణి"లో రామారావు అనుకున్నది నిజమని కుటుంబరావు అభిప్రాయం. స్త్రీ పురుషుల సంస్కారాలు సమాన స్థాయిలో ఉన్నపుడే ప్రేమ వివాహాలు జయప్రద మౌతాయి. ఆర్థిక స్వాతంత్ర్యం స్వేచ్ఛ గల స్త్రీ పురుషుల నుండి ముందు తరాల్లో ఉన్నతమైన ప్రేమను ఆశించ వచ్చనీ, వర్గరహితమైన సమాజంలో ప్రేమ తప్ప మరేదీ వివాహానికి కారణంకాదు గనుక ఆ సమాజంలోని వ్యక్తుల మధ్య వుండే ప్రేమ నిజమైనది అవుతుందనే ఆశ కుటుంబరావు నవలలో అంతర్లీనంగా ఉంటుంది.

ఈ నవలలో చిత్రించబడిన చారిత్రక పరిణామాలకు బీజాలు 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాతి దశల్లో వున్నాయి. ఈ స్వాతంత్ర్య సంగ్రామం మొదటి సారిగా బ్రిటిషు వలస పాలన పట్ల భారతీయుల వ్యతిరేకతను, దానితో పాటు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల యెడ వాళ్ళ ఆకాంక్షను స్పష్టం చేసింది.[2] బ్రిటిషు వలస వాదులకిది పెద్ద హెచ్చరిక అయింది. వలస పాలనా విధానాలను మార్చుకోక పోతే భారతీయుల విశ్వాసాన్ని చూరగొనటం కష్ట సాధ్యమని గ్రహించారు. ఫలితంగా 1858 ఆగస్టు రెండవ తేదీ నుండి భారతదేశం పూర్తిగా బ్రిటిషు ప్రభుత్వపు పాలనలోకి తీసుకోబడింది.[3] దానితో బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రభుత్వానికి భారతదేశంలోని అన్ని రంగాలను వలస వ్యవస్థలుగా మార్చటానికి మరింత వీలు చిక్కింది. దీనితో భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వం - 1813లో బ్రిటిషు పార్లమెంటు చేసిన ఛార్టర్ చట్టం ఫలితంగా మద్రాసు సెంట్ జార్జికోటలో పాఠశాల స్థాపించటంతోటే ప్రారంభమై కొనసాగుతున్న ఇంగ్లీషు విద్యావిధానాన్ని[4] - మద్రాసు, బొంబాయి, కలకత్తాలలో విశ్వవిద్యాలయాలు స్థాపించటం ద్వారా – స్థిరపరిచింది. ఈ ఇంగ్లీషు విద్యావిధానం భారతీయుల సామాజిక జీవితంలో గొప్ప మార్పును తీసుకు వచ్చింది. ఇది అనాది నుండి దేశంలో వున్న సనాతన బ్రాహ్మణ విద్య పరిధి ఎంత సంకుచితమో చెప్పగలగటంతో పాటు క్రమంగా అది బ్రిటిషు ప్రభుత్వ వలస ప్రయోజనాలు కాపాడగలిగింది గానూ, ఈడేర్చ గలిగింది గాను తనను తాను విశదీకరించుకుంది. కులమత భేదాలను పాటించని ఉదార లక్షణాన్ని ప్రకటించి సనాతన దేశీయ బ్రాహ్మణ విద్య మీద వ్యతిరేకత కలిగించింది. భారత దేశానికి ప్రపంచ దేశాలకు మధ్య కొత్త ద్వారాలను తెరిచింది. ఈ విద్యనభ్యసించటం వల్ల గౌరవం, హోదా పెరగటం- అది పాలక వర్గాల విద్య కాబట్టి - జరిగింది. ఈ చదువుల వల్ల వచ్చిన ఉద్యోగాలు అధికారాన్ని, పలుకుబడిని, ఆర్థికంగా మెరుగైన స్థితిని సంపాదించి పెట్టాయి అందువల్ల కూడా భారతీయులు నాటికీ ఈ విద్యవైపు ఆకర్షితులు కాసాగారు.[5] ఈ రకమైన విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టడం వల్ల బ్రిటిషు ప్రభుత్వం రాజకీయంగానే కాక సాంస్కృతికంగా, భౌతికంగా కూడా భారతీయులను పరిపాలించ ప్రారంభించింది.

ప్రాథమికంగా 'చదువు' అనే వ్యవస్థ అవసరమైంది. హిరణ్యకశ్యపుడు చెప్పినట్లుగా చదువు వల్ల 'సదసద్వివేక చతురత' కలుగుతుంది. కానీ ఈ చదువు ఎటువంటి చదువుగా వుండాలో పాలకవర్గం నిర్ణయించటంలోనే యిబ్బంది అంతా వస్తున్నది. ప్రహ్లాదుకు విష్ణుభక్తిని కనపరిస్తే అది చదువుకోక పోవటం వల్ల వచ్చిన అజ్ఞానంగా భావించాడు హిరణ్యకశ్యపుడు. మంచి చెడుల వివేకం కలగాలంటే చదువుకోవాలి, అందుకని అయ్యల వద్ద చదివిస్తాను నాయనా చదువుకో అన్నాడు హిరణ్యకశ్యపుడు కొడుకుతో. హిరణ్యకశ్యపుడి దృష్టిలో చదువు అంటే

విష్ణుభక్తి కూడదని చెప్పే చదువు. హిరణ్యకశ్యపుడు పాలకుడు కాబట్టి ఆయన చదువంటే ఏదనుకున్నాడో అదే చదువుగా చెల్లింది. పాలకవర్గ ప్రభావంలో తప్పనిసరిగా వుండే గురువులు, చండామార్కులు కూడా ప్రహ్లాదుడికి ఆ పాలక వర్గపు చదువే విష్ణుభక్తి కూడదనే చదువే చెప్పారు. మొత్తానికి పాలకవర్గపు అజమాయిషీలో వుండే విద్యా విధానం పాలక వర్గపు ప్రయోజనాలకు అనుగుణంగా వుంటుంది కాని మరోలా ఉండదు అనేది స్పష్టం.

భారతదేశం బ్రిటిషువాళ్ళ వలస విధానంలో ఒక భాగమైనప్పుడు ఇక్కడ వాళ్ళు ప్రవేశపెట్టిన విద్యా విధానం తప్పకుండా వలస విద్యా విధానమే అవుతుంది. ఇది పైకి ఎంత ఉదార స్వభావాన్ని కనపరుస్తున్నప్పటికీ తాను అధిక సంఖ్యాకుల కందుబాటులోకి పోలేదు. భూస్వామ్యము, ధనస్వామ్యము గల ఉన్నత వర్గాలకే పరిమితమై కొనసాగింది. వాళ్ళ అవసరాలతోనే తన ప్రభుత్వ వ్యవహారాలను అది చేసి పెట్టింది. అంతకంటే దేశ ప్రజాజీవితాభివృద్ధి మీద దానికి చూపు లేదు. అలాంటి పరిమిత స్వప్రయోజనాల కొరకు పరాయి ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యావిధానంలో అగ్రవర్ణానికీ, కాస్త సంపన్నవర్గానికీ చెందిన సుందరం ప్రవేశించి, ఎలాంటి మార్పులకు గురి అవుతున్న సామాజిక పరిస్థితుల్లో అతను ఎదిగాడో అందువలన అతని ఆలోచనా విధానమూ, జీవిత దృక్పథమూ ఎలాంటి రూపాంతర పరిణామాలు పొందుతూ అభివృద్ధి అయ్యాయో వాస్తవికంగా చూపించటానికి కుటుంబరావుగారు చేసిన విజాయితీ శిల్ప రచన ఈ 'చదువు' నవల.

సుందరం 1910లో పుట్టాడు*. జలియన్ వాలాబాగ్ ఉదంతాన్ని చెప్పి రచయిత దానిగురించి తొమ్మిదేళ్ళు నిండిన సుందరం (చదువు,1976 పు; 93) ఆలోచిస్తున్నాడని చెప్తాడు. జలియన్ వాలాబాగ్ సంఘటన 1919 ఏప్రిల్ 13న జరిగింది. నవల మాత్రం అయిదేళ్ళ సుందరం అక్షరాభ్యాసంతో ప్రారంభమవుతుంది. అంటే నవల కథ 1915లో ప్రారంభమవుతుంది. అయిదేళ్ళ సుందరం ఇరవై అయిదేళ్ళ వ్యక్తిగా పరిణమించటంతో కథ 1935లో ముగుస్తుంది.

సుందరం అక్షరాభ్యాసంతో ప్రారంభమైన నవల అతను బళ్ళోను,జీవితంలోనూ పాఠాలు నేర్చుకోవటంగా సాగుతుంది. అయితే అతని బడి చదువుకుగానీ జీవితంలో నేర్చుకొనే చదువుకు గానీ ఏ మాత్రం సంబంధం లేకపోవటాన్నే నవల మొదటి నుండి నిరూపిస్తుంది. బళ్ళో మాష్టారి అదిరింపులకు బెదిరింపులకు జడిసి సుందరం బడి మానేసి తల్లి దగ్గరే అక్షరాలన్నీ నేర్చుకున్నాడు. కొడుకుకు చదువు మీద

---

*1909 అక్టోబరు 28న కుటుంబరావు పుట్టాడు. దీన్ని కుటుంబరావుగారి ఆత్మకథా నవలగా కూడా పరిశీలించవలసిన అవసరం వుంది.

శ్రద్ధ కలిగించాలన్న సీతమ్మ ఆలోచన వల్ల, ఆమె యిచ్చిన శిక్షణవల్ల సుందరం చదువు తప్పితే మరోలోకమే వుంటుందని తెలుసుకోలేక పోయాడు. పిల్లలకు సహజమైన ఆటల మీదికి కూడా సుందరానికి మనసుపోలేదు. అదే పనిగా కూర్చుని తల్లి దగ్గర అక్షరాలన్నీ త్వరగా నేర్చుకున్నాడు. అక్షరాలు నేర్చుకునే క్రమంలో సుందరం మనసు పనిచేసిన విధం వివరించబడింది. తెలుగు అక్షరాల్లో ముఖ్యంగా అచ్చుల్లో 'ఋ ౠ, ఌ, ౡ' ల గురించి 'ఎ ఏ'ల గురించి హల్లుల్లో వర్గ పంచ మాక్షరాలలో మొదటి రెండింటి గురించి సుందరం ఆలోచనలలో కొన్ని ఆక్షేప ణలు బయలుదేరుతాయి. ఎ ఏ ల సంగతి అలా వుంచితే మిగిలిన అక్షరాలతో యే ఏడే పదాలు నిత్యజీవితంలో వ్యవహారంలో వినబడవు. ఏ భ్రమల యొక్క, సిద్ధాంతాల యొక్క ప్రభావాలకు లోనుకానిదశలో లోకజ్ఞానం (Commonsense) తో మాత్రమే ప్రవర్తించే పిల్లలు తమ వ్యవహార పరిజ్ఞానపు పరిధిలోకి రాని అంశాన్ని అంగీకరించటానికి తటాపటాయించటం జరుగుతుంది. అయితే ఈ సందే హాన్ని అసంతృప్తిని వ్యక్తం చేసే మార్గంగానీ, విధానంగానీ ఆ వయసుకు వాళ్ళకు తెలిసి వుండక పోవచ్చు. మొత్తం మీద సుందరం 'శ్రద్ధ'గా అక్షరాలన్నీ నేర్చుకు న్నాడు. మేనమామ శేషగిరి పిల్లలతో తమ యింటికి వచ్చే వరకు సుందరానికి లోకంలో తన కంటే బాగా చదువుకొనే వాళ్ళున్నారని గానీ, చదువును మించి యింకా ఎన్నో విషయాలు వుంటాయని గాని తెలియదు. సుందరం, మేనమామ పిల్లలు నరుసు, కృష్ణవేణి చదువులో తనకంటే చురుగ్గా వుండటం చూశాడు. వాళ్ళతో కలిసి వూళ్ళోకి వచ్చిన సర్కసు చూసివచ్చాడు. ఈ చిన్న అనుభవాలే సుందరానికి ప్రపంచంతో సంబంధం ఏర్పరుస్తున్నట్లుగా సుందరం భావించినట్లుగా రచయిత వ్రాశాడు. ఇటా నవల ప్రారంభంలోనే రచయిత సుందరం స్కూలు చదువును, జీవితంలో నేర్చుకునే చదువును సమాంతరంగా చూపిస్తూ పోవటానికి ప్రాతిపదిక సిద్ధం చేశాడు.

తల్లి దగ్గర అక్షరాలు నేర్చుకోవటం పూర్తయ్యాక 'సుందరం సుబ్రహ్మణ్యం బళ్ళో చేరాడు.' ఈ వీధి బడిలో సుందరం హైస్కూల్లో మూడవ తరగతిలో చేరటానికి తగిన అర్హత సంపాదించి పెట్టే చదువు ప్రారంభించాడు. అక్కడ సుందరానికి కొత్త స్నేహాలు ఏర్పడ్డాయి. కొత్త ప్రవృత్తులు పరిచయమయ్యాయి. "పిల్లలు తోటి పిల్లల దగ్గర ఎక్కువ నేర్చుకుంటారు". (చదువు పు : 35) అన్న దానికి నిదర్శనంగా సుందరం తనతో చదువుకొనే సుబ్బులనే కుర్రవాడి పరిచ యలతో చిన్నబిడ్డ గుణం మొదలైన వాటి గురించి, ఇంగ్లీషు వాళ్ళు జర్మనీ వాళ్ళు చేస్తున్న యుద్ధాన్ని గురించి తెలుసుకోవటం- చిత్రితమయ్యాయి.

సుందరం బడికి సమీపంలో వుండే మార్కండేయులు వీధి బడి గురించి చెప్పటంగా - వీధి బళ్ళల్లో చదువులూ, పిల్లల శిక్షలూ ఎంతో ఖచ్చితంగా, అవెంత

భయంకరంగా వుండేవో చూపటం జరిగింది. ఈ వీధి బడులలో "శిక్షణ" పేరుతో సాగే శిక్షణ కార్యక్రమాలు చూసి సుందరానికి చాలా కోపం వచ్చింది. దౌర్జన్యానికి వ్యతిరేకంగా రియాక్టు కావటం సుందరానికి ఏ అక్షరాలూ నేర్పలేదు. బండకొయ్య వేయబడిన ఒక కుర్రవాణ్ణి చూసి కూడా సుందరం చాలా బాధపడతాడు. ఎంతగా వాడు చెడిపోతే మాత్రం అంతగా హింసించాలా అన్న ఆవేదన సుందరానికి కలుగుతుంది. ఏ చదువూ చెప్పక పోయినా సహజంగా మనిషిలో వాస్తవిక పరిస్థితులను అధ్యయనం చేసి అవగాహన చేసుకోవటం వల్ల మానవతా విలువలు ఎలామేల్కొంటాయో ఈ సంఘటన ద్వారా నిరూపిస్తాడు కుటుంబరావు.

దసరా పండుగకు పిల్లలతో, పంతుళ్ళతో కలిసి ఇల్లిల్లూ తిరగటం వల్ల సుందరానికి సమాజంలో వుండే వైరుధ్యాలు మొదటసారి అనుభవంలోకి వచ్చాయి. ఈ వైరుధ్యాలు పోటానికి అతని చిన్నబుర్రకు అతనివర్గంద్వారా అతనికి సంక్రమించిన మనస్తత్వం నుండి - తోచిన పరిష్కారాన్ని కూడా వూహించాడు. తనతో పాటు చదివే పిల్లాడి తల్లి పేడ యెత్తుకోవటం చూసి సుందరం ఆమె తన తల్లిలా లేనందుకు నొచ్చుకునాడు. ఆ పిల్లాడు తనతో చదుకుంటున్నాడు కనక అ పిల్లవాడి యింటి ఆర్థికస్థితిగతులు తన యింట్లోవి లాగానే వుంటాయనుకున్నాడు. అందుకనే వాడి తల్లి తన తల్లిలాగా లేనందుకు బాధపడ్డాడు. అయినా ఆ పిల్లాడు కూడా చదువుకుంటున్నాడు కనక పెద్దవాడై ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తాడని అప్పుడు వాడి తల్లి కూడా తన తల్లిలాగే వుంటుందని సుందరం తనకు తాను సమాధాన పరచుకున్నాడు. ఇక్కడ కుటుంబరావు "చదువుకోదలచిన వాళ్ళు ఎంతకాలమన్నా చదువుకో వచ్చనీ, చదువుకొన్న వాళ్ళందరికీ చదువుకు తగ్గ ఉద్యోగాలు వస్తాయని సుందరం నమ్మకం" (పు 49) అని చెప్తాడు. చదువుకో దలచిన వాళ్ళు ఎంతకాలమన్నా చదువుకోవటానికి ఆర్థిక పరిస్థితులు అనుకూలించాలనీ, చాలా మంది ఆర్థిక పరిస్థితులు వాళ్ళకు చదువుకొనే అవకాశం కల్పించమనీ, చదువుకు, ఉద్యోగాలకు సంబంధం వుండదని, చదువుకుంటే ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ లేదని అర్థం చేసుకొనే ఈడు గానీ, ఆలోచనగానీ సుందరానికి లేవు. వలస విద్యా విధానం చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుందన్న ఆశలు కల్పించి జనాన్ని వాస్తవిక పరిస్థితుల గురించి ఎట్లా ఆలోచించకుండా చేస్తున్నదో కుటుంబరావు ఇక్కడ సూచిస్తాడు.

సుందరానికి చెల్లెలు పుట్టడం, తండ్రి మరణించటం ఆర్నెల్ల తేడాలో జరిగిపోయింది. తండ్రి మరణం వల్ల మారిన తల్లి వేషం, తల్లి దుఃఖంలో మునిగి పోవటం- ఇవి సుందరాన్ని కొత్త సేహాల వైపు మరల్చాయి. ఒక్కసారి పది పన్నెండు మంది పిల్లలతో ఏర్పడిన సంబంధం సుందరానికి ఒక కొత్త జీవితాన్ని పరిచయం చేసింది. మామూలు పిల్లలు ఆడే ఆటలు, చేసే అల్లరి అతడి

ప్పుడు ప్రత్యక్షంగా చూడ గలిగాడు. గోలీలాట, బచ్చాలాట, బిళ్ళంగోడు - ఈ మొదలైన ఆటలు నేర్చుకున్నాడు సుందరం. ఈ మూడు పిల్లలఆటలను గురించి వివరించటంలో కుటుంబరావు ప్రదర్శించిన వాస్తవికత పిల్లల మనస్తత్వాలతో, ఆటపాటలతో ఆయనకు గల సన్నిహితత్వాన్ని ప్రకటిస్తున్నది. తండ్రి చనిపోయేదాకా అమాయకుడుగా, అర్భకుడుగా వున్న సుందరంలో ఈ స్నేహాల వల్ల ఉత్సాహాన్ని, పెరుగుదలను చూసింది అతని తల్లి. అంత వరకు తల్లి, తల్లి చేసే పనులు, చదువు - ఇవి మాత్రమే లోకంగా వున్న సుందరం ప్రవర్తించే ప్రపంచం కొంత విస్తృతం కావటం వల్ల అతనిలో ఈ పరిణామం చోటు చేసుకొని వుండవచ్చు. ఎన్ని ఆటలాడినా, ఎన్ని స్నేహాలు చేసినా సుందరానికి చదువంటే వున్న శ్రద్ధ, గౌరవం మాత్రం తగ్గలేదు. రాఘవాయి అనే తోటి పిల్లాడు ఆటల్లో గొప్పవాడని తెలిసి సంతోషించిన సుందరం అతను చదువు విషయంలో మొద్దని తెలిసి ఆశ్చర్యపోవటంలోనూ, చదువు రానందుకు ఆ రాఘవాయి ఏ మాత్రం బాధపడక పోవటం అతనికి విడ్డూరంగా కనిపించటంలోనూ ఈ విషయం స్పష్టమవుతుంది.

ఆ వేసవి సెలవులు వెళ్ళి స్కూళ్ళు తెరిచాక అంటే 1918 ఆగస్టులో సుందరం హైస్కూల్లో మూడవ తరగతిలో ప్రవేశించాడు. 'చదువు మీద సుందరానికున్న ఆదరాన్ని, హైస్కూలు వాతావరణం రెట్టింపు చేసింది' (పు 68) వీధి బళ్ళో తనతో పాటు చదువుకొనే పిల్లాడు ఆర్థికంగా హీనస్థితిలో వుండటాన్ని చూడ్డం లాంటి అనుభవం మరొకటి సుందరానికి హైస్కూల్లో ఎదురయింది. సుందరం తనతో పాటే చదువుకుంటున్న శివయ్య అనే పిల్లవాణ్ణి మేదరగుడిసెలో చూసి తెల్లబోయాడు. 'శివయ్యను గురించి తెలియకూడని రహస్యం తెలిసినట్లు' సుందరం బాధపడ్డాడు. ఆ పిల్లవాడిని తనతో పాటు యింటికి తీసుకువెళ్ళాడు శూద్రుడని కరుచుకు తాగటానికి గ్లాసుతో మంచినీళ్ళివ్వటానికి తల్లి సందేహిస్తే తనతో పాటు చదువుకొనే పిల్లవాణ్ణి నీచంగా చూడ్డానికి సుందరం మనసు అంగీకరించలేదు. ఈ సంఘటనతో సుందరానికి సమాజంలోని సాంఘిక వ్యత్యాసాలు అర్థం కావటం ప్రారంభమైందని చెప్పాలి.

సుందరం హైస్కూల్లో చేరిన యేడే ఒక సంఘటన జరిగింది. ఇది విద్యారంగంలో పాలక వర్గపు జోక్యం విద్యార్థులలో పాలక వర్గ పక్షపాతాన్ని ప్రోది చేయటాన్ని నిరూపిస్తుంది మొదటి ప్రపంచ యుద్ధంలో ఇంగ్లాండు పక్షాన గాయపడ్డ వాళ్ళకి వైద్యం చేయటానికి గాను నిధులు సేకరించటానికి 'యూనియన్ జాక్' అనే బ్రిటిషు పతాకాలు ఇంగ్లండు వలస దేశాలకు, ముఖ్యంగా స్కూళ్ళకు అమ్మకానికి వచ్చాయి. 'ఆ జెండాలు ఎందుకు కొనాలో మాష్టారు వివరించి చెప్పాడు.' నిజానికి ఆ మొదటి ప్రపంచ యుద్ధం బ్రిటిషు పెట్టుబడిదారులూ వాళ్ళకు మిత్రులయిన ఫ్రెంచి, రష్యను, పెట్టుబడిదారులంతా ఒక కూటమిగా జర్మనీ ఆస్ట్రియా దేశాల

పెట్టుబడి దారులను ఎదుర్కోవటం వల్ల జరిగింది. ఉభయ పక్షాలు విదేశాలను జయించి పంచుకోవటానికీ ఆ యుద్ధం మొదలు పెట్టారు. ప్రజలకు అసలు ఆ యుద్ధం ఎందుకు వచ్చిందో అర్థమే కాలేదు. యీ రకమైన యుద్ధంలో గాయపడ్డ బ్రిటిషు మిత్ర పక్షాల సైనికులకు వైద్య సహాయం చేయటానికి డబ్బు సేకరించాలంటే - అందుకు మళ్ళీ వలస రాజ్యాలే నెలవులయినాయి. సుందరం చదువుతున్నది ఇంగ్లీషు చదువు కాబట్టి, ఆ స్కూల్లో చెప్పేది పాలకవర్గాల చదువే కాబట్టి ఆ మాష్టారు పిల్లలకు జెండాలు ఎందుకు కొనాలో వివరిస్తూ వాళ్ళకు ధర్మం ఇంగ్లాండు పక్షాన వున్నదని ఇంగ్లీషు వాళ్ళ సొత్తు అయిన సామ్రాజ్యాన్ని జర్మనీ వాళ్ళు లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారని, అది బలం గల వాళ్ళు ఎదుటి వాడి జేబులోని డబ్బులు లాక్కోవటం లాంటిదని చెప్తాడు. ఇంగ్లీషు వాళ్ళ సామ్రాజ్యం లాక్కోవాలని చూడటం జర్మనీ తప్పు అన్న ఆ మాష్టారు ఇంగ్లీషు వాళ్ళకంత సామ్రాజ్యం ఎలా వచ్చిందని కానీ ఆ రాకడ యొక్క స్వభావం ఎలాంటిదని కానీ ప్రశ్నించక పోవటం ,ఆలోచించక పోవటం చూస్తే అతినెంతగా వున్న ప్రభుత్వ వ్యవస్థను అంగీకరించి బ్రతికే వ్యక్తో అర్థమవుతుంది. విద్యాలయాలు భావ వినియానికి ప్రధాన స్థానాలు. విద్యార్థులు అప్పుడప్పుడే ప్రపంచాన్ని చూస్తూ అవగాహన చేసుకోవటానికి ప్రయత్నిస్తూ ఆలోచనా మార్గంలో వుండేవాళ్ళు. ఇటువంటి చోట్ల పాలక వర్గం తన కనుకూలమైన వాతావరణాన్ని ఏర్పరచుకోటానికి చదువులో తాను జోక్యం చేసుకుంటుంది. జర్మనీ గెలిస్తే ఏమవుతుందని ఒక కుర్రవాడడిగితే 'ఏమవుతుందీ? మనల్ని జర్మనీ వాళ్ళు పరిపాలిస్తారు. ఇంగ్లీషు మానేసి జర్మను భాష నేర్చుకోమంటారు.' (పు: 79) అని సమాధాన మిచ్చాడు మాష్టారు. "జర్మను భాష నేర్చుకోవాలంటే మళ్ళా తను వీధి బడిలో చేరాలి. ఆ భాష చెప్పటానికి మాష్టర్లుండరు—మేష్టర్లు దొరికి తను జర్మను భాషలో స్కూలు ఫైనలు పాసయేటప్పటికి ఇరవైయేళ్ళే వస్తాయో, పాతికేళ్ళే వస్తాయో" పు: 79) అందుకని సుందరం ఇంగ్లీషు వాళ్ళే గెలవాలని గట్టిగా అనుకున్నాడు. సుందరం చేసిన ఈ ఆలోచనలో ఇంగ్లీషు విద్యను బ్రిటిషు ప్రభుత్వం ఏ ఉద్దేశంతో భారత దేశంలో ప్రవేశ పెట్టిందో ఆ ఉద్దేశం ఫలోన్ముఖం కావటం చూస్తాం. తాము ప్రవేశ పెట్టిన కొత్త చదువులు చదువుకుంటూ తద్వారా ఉద్యోగాలు సంపాదించుకుని ఆర్థికంగా స్థిరపడుతున్న మధ్య తరగతి వర్గం తమ తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని వున్న ప్రభుత్వాలే - అవి ఎంత వైదేశికాలయినా- క్షేమంగా వుండాలను కుంటాయి. ఈ వర్గ స్వభావమే మూడవ తరగతి చదివే సుందరం ఆలోచనా విధానాల్లో కూడా కనిపిస్తుంది.

యుద్ధం ఆగిపోయాక యుద్ధంలో మన వాళ్ళు గెలిచారని సహాధ్యాయుడు నాగేశ్వరరావు సుందరంతో చెప్పాడు. ఇంగ్లండు గెలిచినందుకు దాని వలస

రాజ్యమైన భారతదేశంలో స్కూళ్ళకు కూడా సెలవు యిచ్చారు. యుద్ధంలో 'మనం' గెలవడంతో సుందరానికి ఆనందించ వలసిన అవసరం వుందని మొదట తెలియనప్పటికీ నాగేశ్వరరావు ఉత్సాహం అంటు వ్యాధిలా సంక్రమించింది" (పు: 87) ఇక్కడ మనం అనే మాట ప్రత్యేకంగా ఇన్‌వర్టెడ్ కామాల్లో చూపించ బడింది. అంటే రచయిత ఆ మాటకు ప్రత్యేకమైన బలాన్ని యిస్తున్నాడన్న మాట. నిజానికి యుద్ధంలో గెలిచింది 'మనం' అంటే "భారతీయులం" - కాదు. ఇంగ్లండు గెలిస్తే 'మనం' గెలిచామని భారతీయులు కూడా పండుగ చేసుకున్నారు. పాలక వర్గం విజయాలు జనం విజయాలు కావటం, పాలకవర్గాల పండుగలు ప్రజల పండుగలు కావటం యిక్కడ కనిపిస్తుంది.

సుందరం బళ్ళో సాంబయ్యగారనే మాష్టారొకాయన ఉన్నాడు. ఉమామహేశ్వర పండితుడి ఉపన్యాసం విని జాతీయ భావ ప్రేరితుడై క్రాపు తీయించి గుండు చేయించి పిలక పెట్టుకొని వచ్చాడు బడికి. "ఈ ఇంగ్లీషు వాళ్ళు మన మీద అధికారం చేస్తున్నారు గనక మనం క్రాపులు పెడుతున్నాం. మనం వాళ్ళ మీద అధికారం చేశామనుకో. ఈ దొర ముండా కొడుకు లంతా చచ్చినట్టు బుర్రలు గీకించి పిలకలు పెట్టరూ? (93) అన్నాడు కూడా పిల్లలతో. పాలక వర్గాల సంస్కృతే ప్రజా సంస్కృతిగా చలామణిలోకి వస్తుందన్న వాస్తవిక అవగాహన కనిపిస్తుది సాంబయ్యగారి ఈ మాటల్లో. ప్రజలే రాజులైనప్పుడు రాజుల సంస్కృతి ప్రజల సంస్కృతీ వేరుగా వుండవు. రాజులు ఒక వర్గం వాళ్ళు ప్రజలు మరొక వర్గం వాళ్ళు అయినప్పుడు మాత్రం ప్రజా సంస్కృతి అణిగి పోయి రాజుల సంస్కృతే అసలు సస్కృతిగా చలామణి లోకి వస్తుంది. ఇంగ్లీషు విద్య వల్ల ఇంగ్లీషు వాళ్ళ పాలన వల్ల వారి సంస్కృతీ నాగరికతలు చాప కింద నీరులాగ వచ్చేసి భారతీయుల జీవితంలో ఒక భాగమై పోవటాన్ని సాంబయ్య మాష్టారు గ్రహించాడు. అందుకనే పిల్లలకు పాఠకు లెవరైతే వాళ్ళ వేషభాషలే పాలితులకు ఒంటబడతవని స్పష్టం చేశాడు. అంతేగాక ఆయన పిల్లలకు పటంలో బ్రిటీషువాళ్ళ సామ్రాజ్యం ఎంత వరకు విస్తరించి వుందో చూపించి వాళ్ళు భారతీయులను ఆర్థికంగా ఎంతగా దోచుకుంటున్నారో వివరించాడు. ఆయన మాటలు విని- జెండాలు కొనుక్కోమని చెప్తూ మొదటి ప్రపంచ యుద్ధంలో ధర్మం ఇంగ్లండు పక్షానే వుందని మాష్టారు చెప్తే తన చదువుకు యిబ్బంది కలగగూడదన్న ఆలోచనతో యుద్ధంలో ఇంగ్లండు వాళ్ళే గెలవాలని సుందరం ఎంతగా అనుకున్నాడో, వాళ్ళు గెలిచినప్పుడు మనవాళ్ళు గెలిచారని ఎంత సంతోషించాడో - ఈనాడు వాళ్ళనంతగా అసహ్యించుకున్నాడు. అంటే స్వార్థమనేది, స్వలాభమనేది స్వతహాగా సుందరంలో లేదు. సుందరంలోనే కాదు. ఏ వ్యక్తిలోనూ వుండదు. వాళ్ళ చుట్టూ వుండే సాంఘిక ఆర్థిక పరిస్థితులు

వాళ్ళల్లో ఆ భావనలను పెంపొందింప చేస్తాయి. తన చదువును బట్టి తన అభివృద్ధి వుంది కనక సుందరానికి తనకా చదువు చెప్తున్న ఇంగ్లీషు ప్రభుత్వం వుండాలనే వుంటుంది. మొత్తం మీద చూస్తే వాళ్ళు ఆర్థికంగా తమ దేశాన్ని దోచుకుంటు న్నారు కనక వాళ్ళ మీద అసహ్యముంటుంది. ఈ వైరుధ్యాలలో సుందరం వ్యక్తి గత అభివృద్ధే ప్రధాన పాత్ర వహిస్తుంది. వలస విద్యావిధానమట్లా మనిషిని తన గురించి తాను, తన లాభం కోసం తానుగా బ్రతికేట్లు తయారు చేస్తుంది.

1919 ఏప్రిల్ 13. బ్రిటిషు సామ్రాజ్యవాద వలసవిధానాలకు జలియన్‌వాలాబా గ్‌లో ప్రజలు సామూహికంగా నిరసన తెలిపినరోజు. ఈసామూహిక పోరాట గమ నాన్ని ఆపటానికి జనరల్ డయ్యర్ అమానుషంగా కాల్పులు జరిపించాడు. అయిదో తరగతి పూర్తి చేసి ఆ తరగతిలో ప్రవేశించనున్న సుందరాన్ని ఈ సంఘటన బాగా కదిలించింది. "అధికారంలో వున్న వాళ్ళు ఇటువంటి పనులు ఎట్లా చేస్తారు? సభ చేస్తున్న వాళ్ళను చేతులారా ఎట్లా కాలుస్తారు? ఈ సంగతి ప్రపంచానికంతా తెలుస్తుందని వాళ్ళకు తెలీదా?" (97) అని సుందరం బాధపడ్డాడు. చెడ్డతనం, చెడ్డ బుద్ధులు చదువుకొన్న వాళ్ళల్లో, ఉద్యోగాలు చేసే వాళ్ళల్లో, అధికార్ల లో వుండవని, తక్కువ కులాల వాళ్ళలోనూ, కూలీ నాలి చేసుకునే అలగాజనం లోనూ, బిచ్చ గాళ్ళలోనూ, రౌడీలలోనూ మాత్రమే వుంటాయని అనుకుంటున్న సుందరం యీ సంఘటనతో చాలా కలవర పడ్డాడు.

ఇక్కడ కుటుంబరావు మనుషులకు తెలియకుండానే వాళ్ళలో వర్గ స్వభావం ఎలా వుంటుందో స్పష్టం చేశాడు. వర్గ వైరుధ్యాలు ఏర్పడి వున్న సమాజంలో అధికారులది ఒక వర్గమని, కూలీనాలీలది మరొక వర్గమని సుందరానికి ఆ పదేళ్ళ ఈడుకు స్పష్టంగా తెలియక పోయినా చదువుకుని ఉద్యోగం చేయబోయే తాను కూలీనాలీల వర్గం వాడు మాత్రంకాదని నిర్ణయించుకొని రెండవ వర్గం వైపు అప్రయ త్నంగానే చేరిపోయాడు. అందుకనే చదువుకున్న వాళ్ళు, ఉద్యోగాలు చేసేవాళ్ళు అధికారులు తప్పు చేయరని-నమ్మాడు. సుందరానికున్న యీ భ్రమ ఒకంతట ఒది లేది కాదు కానీ డయ్యర్ చర్యల వల్ల బాగా దెబ్బతిన్నదని (97) అంటాడు కుటుంబ రావు.

1920 ఆగస్టు. సుందరం ఏడవ తరగతికి వచ్చాడు. ఆంధ్రదేశంలో సహాయ నిరాకరణోద్యమం ఉధృతంగా సాగుతున్న కాలమది. ఇందులో భాగంగా స్కూళ్ళను బహిష్కరించమని పికెటింగులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులంద రితో పాటు సుందరం కూడా బడి మానేశాడు. మొదట్లో అతను పికెటింగు జరిపే వాళ్ళ పక్షానే వున్నాడు. క్లాసులకు వెళ్ళే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగేటప్ప టికి సుందరం భయపడ్డాడు. తోటివాళ్ళు చదువుకుంటుంటే తానేదో పికెటింగు పేరు

చెప్పి చదువు మానెయ్యటం అతనికి యిష్టం లేదు. పికెటింగులైనా మరేదైనా తన చదువుకు నష్టం రావటం మాత్రం అతను సహించడు. అప్పుడే ఆ వూళ్ళోఏర్పాటు చేయబడిన జాతీయ పాఠశాలలో చేరదామా అన్న ఆలోచనవచ్చి కూడా అది ఎన్నాళ్ళు సాగుతుందో చూసి అప్పుడు చేరవచ్చులే అని తననుతాను సమాధాన పరచు కున్న సుందరం మన స్తత్వం - విప్లవం గెలుస్తుందన్న గ్యారంటీ ఏర్పడ్డప్పుడే విప్లవంలో చేరదాం లెమ్మన్న మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నది.

సుందరం మేనమామ శేషగిరి సహాయ నిరాకరణోద్యమ ప్రభావంతో తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చి కొడుకు నరుసు చదువు కూడా మాన్పించేశాడు. తాను జైలుకు కూడా వెళ్ళి వచ్చాడు. మేనమామ యింట్లో సంభవించిన మిగిలిన పరిణామాలు అతని అంతగా బాధించలేదు కానీ నరుసు చదువు మానెయ్యటం మాత్రం అతనికి నచ్చలేదు. తనకంటే రెండు క్లాసులు ముందున్న వాడు చదువు మానేసి తనకంటే వెనకబడి పోవటం సుందరానికి కష్టం కలిగించింది. చదువు మానేసిన నరుసు నాటకాలాడటం ప్రారంభించాడు. ఇక్కడ కుటుంబరావు నరుసుకు సుందరానికి వున్న తేడా గురించి చెప్పారు. నరుసు నాటకాలాడటమైనా సరే నలుగుర్ని కూడగట్టుకొని వాళ్ళందరి తోనూ కలిసి యేదో చెయ్యాలని చూస్తున్నాడు. సుందరం కార్యక్రమంలో పెద్ద పరీక్ష పాసు కావటమూ పెద్ద ఉద్యోగాలు చెయ్యటమూ వంటివి వున్నాయి కాని నలుగుర్నీ కూడగట్టి చేసే పనేమీ లేదు. చదువులు మనిషిని సమాజం నుండి మనుషుల నుండి విడదీసి కేవలం తన గురించి తానే ఆలోచించుకొనే వాడుగా చేస్తున్నాయి తప్పితే సమాజం గురించి ఆలోచించేట్లుగా జనంతో కలిసి జీవించేట్లుగా చేయటం లేదు.

సుందరం కేవలం క్లాసు పుస్తకాలే కాకుండా కన్యాశుల్కం లాంటి ఆధునిక సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేయటం ప్రారంభించాడు. ఈ చదువు కేవలం చదువు కోసమే సాగింది. కానీ వాటి ప్రభావాలేమీ అతని మీద పనిచేయలేదు. సుందరం మూడో ఫారంలోకి వచ్చాడు. మాష్టర్లను ఆరాధించటం, తనకు మంచి వాడనిపించిన మాష్టరి గురించి ప్రచారం చెయ్యటం—ఈ రకంగా సుందరం పరిణమించాడు. మూడో ఫారమ్ పాసయి సెలవల్లో నరుసు ఆడే నాటకం చూడటానికి మేనమామగారి వూరు వెళ్ళాడు సుందరం. అక్కడ అతనికేమీ తోచలేదు. అదంతా అతను చదువుతున్న చదువు ప్రభావమేనంటాడు కుటుంబరావు. ఈ చదువు వల్ల సుందరం బాహ్య ప్రపంచంలో యదార్థ వ్యక్తుల మధ్య మసలటం కష్టమైపోతున్నది. చదువు ప్రయోజనం సామాజికమైనదిగా కాక మళ్ళీ చదువుకోవటం గానూ, పుస్తకాలలోని, కథలలోని పాత్రలతో జీవించటం గానూ తయారు కావటం సుందరం చదువు దాహంలో కనిపిస్తుంది. సుందరం తోటి మనిషితో జీవించలేడు గానీ నిర్జీవమైన పుస్తకంతో చక్కగా కాలక్షేపం చేయగలడు. చదువు సామాజిక జీవి

తాన్ని గురించి ప్రజా జీవితాన్ని గురించి వాస్తవికాంశాలు గ్రహించటానికి, అధ్యయనం చెయ్యటానికి ప్రేరణ వ్యవలసి ఉండగా అది మనిషిని పుస్తక ప్రపంచానికే కట్టి వడవెయ్యటం జరుగుతున్నదని కుటుంబరావు సుందరం వ్యవహారం ద్వారా నిరూపించాడు.

సుందరం ఎదిగే క్రమంలో సంఘంలో జరుగుతున్న మార్పులను, సంస్కరణలను గుర్తించటం, వాటి గురించి ఆలోచించటం వుంది. సనాతన సంప్రదాయాల కంటే ఈ మార్పులు సంఘాన్ని ముందుకు తీసుకుపోతాయని అతను నమ్మాడు. ఎప్పుడైతే అతనిలో సనాతన భావాలు, సంప్రదాయాల యెడ వైముఖ్యం ఏర్పడి కొత్త భావాలతో కొత్త మార్గాలు వెతకసాగాడో అప్పుడే అది అతని తల్లికి అతనికి మధ్య తరాల అంతరాలుగా స్పష్టంగా పైకి తేలి కనిపించసాగింది. మేనమామకు యిష్టం లేకపోయినా కృష్ణవేణికి (మేనమామ కూతురు) పదకొండో యేడు వెళ్ళకుండానే పెళ్ళయిందంటే దానికి తన తల్లిలాంటి వాళ్ళే కారణమని అతననుకోవటం ఈ విషయాన్నే నిరూపిస్తుంది.

సుందరం 1922 అగస్టుకు ఫోర్తు ఫారానికి వచ్చాడు. అప్పట్నించే అతను తన చెల్లెలు జానకి స్నేహితురాలు శకుంతల గురించి ఆలోచించటం ప్రారంభించాడు.

సుందరం చెల్లెలు జానకికి పెళ్ళి చేసెయ్యాలని అతని తల్లి ఆత్ర పడటం ప్రారంభించింది. అన్నగారి కొడుకు నరుసుకు యిచ్చి చేయమని చాలామంది సీతమ్మ గారికి సలహా యిచ్చారు. తమ యింట్లో అద్దెకున్న ఆదినారాయణగారి అబ్బాయి కృష్ణమూర్తికయితే బాగుంటుందని సీతమ్మగారికి మనస్సులో వుంది. కృష్ణమూర్తి తనతో చదువుతున్నవాడు. అంతో యింతో ఆస్తి హోదా కలవాడే అయినా సుందరానికి అతనంటే సదభిప్రాయం లేదు. అయినా ఈ నాడుచెల్లెలి పెళ్ళి విషయం వచ్చే సరికి చదువుకుంటున్నవాడు కనక అతనికిస్తే బాగుంటుందని సుందరానికీ అనిపించింది. చదువు మానేసి నాటకాలాడుతున్న నరుసుకు చెల్లెల్నిచ్చి పెళ్ళి చెయ్యటం- నరుసుకన్నా జానక్కి ఎక్కువ చదువు వొచ్చు కనక- సుందరానికి ససేమిరా నచ్చలేదు. ఈరకంగా జీవితంలో ఏ సమస్యనయినా సుందరం చదువు కేంద్రంగానే చూడటం జరిగింది. కృష్ణమూర్తికీ జానకికి పెళ్ళి కావటం అసంభవమని తమకు నరుసుకన్నా మరొక సంబంధం దొరకదని రూఢి అయినా అతను పరిస్థితులతో రాజీ పడలేకపోయాడు. అతనికి యిష్టం లేకపోయినా జానకికి నరుసుకి పెళ్ళి జరిగింది. నరుసు సుందరంతో సంబంధం మరింత దగ్గరయినందుకు ఎంత సంతోషించాడో, గర్వపడ్డాడో సుందరం అంత సిగ్గుపడ్డాడు. చదువునుబట్టి తప్పితే, ఉద్యోగాన్ని బట్టి

తప్పితే, హోదాను బట్టి తప్పితే సుందరం మనుషులను గౌరవించలేని స్థితికి వచ్చాడు.

సీతమ్మగారు కూతురి పెళ్ళికోసం చేసిన అప్పుమీద వడ్డీ పెరిగిపోతున్నది. కొడుక్కు కాలేజీ చదువు చెప్పించే స్తోమత ఆమెకు కనపడటం లేదు. సుందరం అంతటితో చదువు ఆపేసి ఏదైనా ఉద్యోగం చేసుకుంటే బాగుండుననిపించిందామెకు. చదువు మానటానికి సుందరం వొప్పుకోలేదు. కొడుకు చదువు సాగాలంటే సుందరానికి పెళ్ళి చెయ్యటమొక్కటే మార్గంగా కనపడ్డది సీతమ్మగారికి. మామగారే సుందరం చదువు గురించి చూసుకుంటాడనుకుంది ఆమె. స్కూలు ఫైనలు పరీక్షలు పూర్తయిన సంవత్సరం అంటే 1925 వేసవిలో సుందరానికి లక్ష్మితో పెళ్ళయింది.

సుందరానికి తన పెళ్ళి ద్వారా స్త్రీ పురుషుల సంబంధాలు డబ్బు బేరాల మీద ఆధారపడి వుండటం తెలిసివచ్చింది. తల్లి మామగారితో చేసిన కట్నాల బేరం చూసిన సుందరానికి మానవత్వానికి అపచారం చేసినట్లనిపించింది. కాని అతను దాన్ని ఎదిరించలేకపోయాడు. సుందరం ఏ సమస్య గురించైనా ఆలోచించే స్థాయిలోనే వుండటాన్ని, ఆ సమస్యలపరిష్కారానికి క్రియా శీలంగా ప్రవర్తించకపోవటాన్ని యిది నిరూపిస్తుంది.

మనిషికీ మనిషికీ మధ్య ఉండదగిన ఆదర్శ సంబంధం గురించి ఆలోచించే సుందరం (164) తాను చూసే మనుషుల్లో అది కనిపించకపోయేసరికి ఆ ఆదర్శ సంబంధం స్థానే స్వార్థాలు, తగూలూ ఉండటానికి కారణమేమిటో విశ్లేషించి చూడటానికి ప్రయత్నించకుండా—ఆ మనుషులను- అసహ్యించు కొనసాగాడు. అతను నానాటికీ సమాజానికి దూరం కావడానికి కారణమిదే

సుందరం కాలేజీ చదువు కోసం (1925)* మామగారి ఆహ్వానం మీద అత్తవారి వూరు వెళ్ళాడు. చదువంటే సుందరానికి పూర్వమున్న అభిమానమే వున్నా అది క్లాసు పుస్తకాలకే పరిమితం కాలేదు. ఇక్కడ అతను డికెన్సు, హార్డీ మొదలైన వాళ్ళ నవలలు తెచ్చి చదవసాగాడు. మానవ సమాజంతో కొంత సాన్నిహిత్యాన్ని ఈ సాహిత్యం సుందరానికి కలిగించింది. కాలేజీ పాఠాలూ, లెక్చరర్లూ ఇవి అతనికి అంతగా ఆనంద దాయకంగా అనిపించలేదు. మానవ సమాజంలో అతనికేర్పడుతున్న కొత్త పరిచయంవల్ల అతను దాన్ని అధ్యయనం చెయ్యటంలో దృష్టి కేంద్రీకరించటం ప్రారంభించటం వల్ల యిలా అనిపించి వుండవచ్చు.

* కుటుంబరావుగారు కూడా 1925లోనే గుంటూరులో ఇంటరులో చేరారు.

సుందరం మనసు క్రమంగా ఆదర్శాలపై పుకు పోనారంభించింది. అతనికి సమా జంలోని దుర్మార్గాలు అవగాహనకు వస్తున్నాయి. అర్థంలేని ఆచారాలూ, మధ్య తర గతి మిథ్యాడంబరాలు అతన్ని ఆలోచింప చేస్తున్నాయి. కాని అతను వాటి గురించి వాస్తవిక దృక్పథంతో కాక ఆదర్శవాద దృక్పథంతో ఆలోచించటం వల్ల అతనికి సమాజంతో పొత్తు కుదరకపోయింది. ఫలితంగా అతను సమాజం నుండి దూరం కాసాగాడు.

సుందరం వేసవి సెలవులకు తల్లితో కలిసి స్వగ్రామం వచ్చాడు. అప్పటికి తన మిత్రుడు నాగేశ్వరరావు స్కూలు ఫైనలు, సెకెండు ఫారంతో పాసయి— తాలూకా బోర్డాఫీసులో ముప్పై రూపాయల ఉద్యోగం సంపాదించాడు. మిగిలిన వాళ్ళలాగా సుందరం నాగేశ్వరరావు సంపాదిస్తున్నాడే అని అసూయ పడలేదు. తను అతనికంటే పెద్ద చదువే చదువుతున్నాడు గనక తనకెట్లాగూ అంతకంటె మంచి ఉద్యోగమే వస్తుందని సుందరం నమ్మాడు. ఈ రకమైన విద్యా విధానంవల్ల అంతవరకు పొలాల రాబడి మీద బతుకుతున్న జనం నెలసరి జీతాల రాబడిమీద బతి కేట్లుగా పరిణమించారు. స్వతంత్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని మార్కెటు వ్యవస్థ ఏర్పడటంతో వస్తువుకంటే డబ్బుఎక్కువ ప్రాముఖ్యాన్నిసంపాదించుకుంది. మారిన ఈ వ్యవస్థను సమర్థించడానికి డబ్బు రూపమైన ఆదాయాన్ని పొందటానికి ఆశ కల్పించే ఈ విద్యా విధానం వచ్చి మానవుడి బుద్ధిని ఏలటం యిక్కడ చూస్తాము.

సుందరం ఇంటరు పూర్తిచేశాడు. బి. ఎ. లో చేరాడు. జాతీయోద్యమం సాగుతున్నది. 1927–28 డిసెంబరులో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభకు వెళ్ళి వచ్చాడు, 1929 ఏప్రిలు నాటికి బి. ఎ. పూర్తిచేశాడు. సుందరం హైస్కూలు చదువు గురించి యివ్వబడినన్ని వివరాలు అతని కాలేజీ చదువు గురించి యివ్వ బడలేదు. ఈ నాలుగేళ్ళ సుందరం కాలేజీ చదువు అక్కడొక సంఘటనగా, యిక్కడొక సన్నివేశంగా మాత్రమే వివరించబడింది. సుందరం హైస్కూలు వివరాలకు లాగానే కాలేజీ చదువు వివరాలు కూడా చిత్రించబడినట్లయితే కొత్త చదువుల వల్ల వచ్చిన కొత్త నాగరికతల పరిణామం ఇంకాస్త స్పష్టంగా తెలిసేది.

సుందరం బి. ఎ. పాసు కాగానే యిక అతని చదువు పూర్తయినట్లేనని అందరూ భావించారు. ఇక ఏదో ఒక ఉద్యోగం చూసుకుంటాడని కూడా అనుకు న్నారు. కానీ సుందరం మాత్రం కాశీ వెళ్ళి ఎమ్మే ఏలెల్బీ చదువుతానని పట్టు పట్టాడు. తన చదువు ఆగిపోగూడదని ఎంత ఆవేదన పడ్డాడో జీవితం గురించి అంత బాధ పడ్డాడు. చదువంటే భయం కలగకుండా తల్లి కాపాడగలిగింది కానీ జీవితమంటే భయం కలగకుండా ఎవరూ కాపాడలేకపోయారు. 'తాను చదుకుంటా

నన్నంతవరకూ చదువు చెప్పించే భారం తల్లి దేన'ని గట్టిగా నమ్మాడు సుందరం. చివరికి తన పంతం నెగ్గించుకొని ఎమ్మే చదవటానికి కాశీ బయలుదేరాడు సుంద రం. కాశీ వెళ్ళాక సుందరం జీవిత దృక్పథం కొంత విస్తరించింది. చదువుకో టం కోసం వచ్చినవాడు "విశ్వవిద్యాలయ వాతావరణంలో జీవించసాగాడు". సుంద రం మొదటియేడు చదువు దేశంలోని వివిధ ప్రాంతాలవారి పరిచయాలతో సాఫీగా సాగిపోయింది. అతను స్నేహితులతో కలసి అలహాబాదు వెళ్ళివచ్చాడు. రెండో సం వత్సరం జాతీయోద్యమం ముమ్మరమై అందులో టెర్రరిస్టు భావాలు ప్రచారం కాసా గాయి. 1930 జనవరి 26న నెహ్రూ భారత స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ జెండా ఎత్తాడు. 1930 మార్చి నాటికి గాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించాడు. మే లో గాంధీ అరెస్టు అయినాడు. యూనివర్శిటీలో పాఠాలు జరగటం లేదు. మీటింగులు జరుగుతున్నాయి. పికెటింగ్ జరిగి యూనివర్శిటీ మూత పడింది. సుందరం మరో యిద్దరు విద్యార్థులతో ఆగ్రా, దయాల్‌బాగ్ చూసి వచ్చాడు. కాశీ తిరిగి వచ్చేసరికి కాలేజీలు ఎప్పుడు తెరిచేది తరవాత తెలుపుతామని ప్రకటించారు. సుందరం ఇంటికి తిరిగివచ్చాడు.

సుందరం తిరిగి వచ్చేసరికి ఈ ప్రాంతాలలో కూడా జాతీయోద్యమం ముమ్మరమైంది. కాశీలోగాని, తమ ప్రాంతాలలో గానీ తీవ్రతరమవుతున్న జాతీయో ద్యమానికి సుందరం సాక్షిమాత్రుడుగా వున్నాడు తప్పితే ఎందులోనూ పాల్గొన లేదు. పోలీసులు ఉద్యమకారులమీద లాఠీ ఛార్జీ చేశారని విన్నప్పుడల్లా బాధపడే వాడు సుందరం. తెల్లవాళ్ళ మేలు కోసం వాళ్ళ పక్షాన మన వాళ్ళు తమ వాళ్ళనే దండించటం అతను సహించలేకపోయాడు. పోలీసులు కూడా భారతీయులే కదా, వాళ్లూ స్వరాజ్యం రావాల్సిన వాళ్ళే కదా అని సుందరం ఆలోచన. అందుకని పోలీ సుల్ని కూడగట్టుకొనే ఉద్యమాన్ని నడపాలని కూడా భావించాడు. జీతం డబ్బుల కాశించి పోలీసులు దేశ ద్రోహం చేయటం నచ్చక "ఇది తమ ఉద్యమమే నన్న జ్ఞానం వాళ్ళ కుండరాదా?" (పు. 243) అని కూడా అనుకున్నాడు. ఇక్కడ కుటుం బరావు "జ్ఞానంలో సుందరానికి చాలా విశ్వాసం. జీవితంలో రాదగిన మార్పులు రావటానికి అజ్ఞానం తప్ప ఇంకేం అడ్డు రాదని వాడు నమ్మేవాడు" (244) అంటాడు. పోలీసులు భారతీయులే అయినప్పటికి వాళ్ళు పాలక వర్గాలకు కొమ్ము కాచే ఉద్యో గవ్యవస్థలో అగ్ర భాగాన వున్నవాళ్ళు. వాళ్ళకు ఈ జాతీయోద్యమం తమదేనన్న జ్ఞానం కలిగితే సరిపోదు. వాళ్ళకొచ్చేవి వెధవ జీతం డబ్బులే" కాని అవి లేనిది వాళ్ళ బ్రతుకులు గడవవు. జాతీయోద్యమం తమదేననుకొని ఉద్యోగాలు మానేసి జీవితాలకున్న గ్యారంటీని పోగొట్టుకోవటానికి వాళ్ళు యిష్టపడరు. ఇంత చదువు కుని ఆలోచించే క్రమంలో వున్న సుందరమే జాతీయోద్యమంలో క్రియాత్మకంగా పాల్గొనలేదు. దానికి అతని ప్రయోజనాలకు, చదువుకు– భంగం కలగకుండా చూసు

కోవాలనే మధ్య తరగతి మన స్తత్వమే కారణం. ఈ వర్గ స్వభావం కేవలం "జ్ఞానం" తో సమసిపోయేది కాదు. ఆచరణలో చారిత్రక పరిణామక్రమంలో మాత్రమే సాధ్యమవుతుంది. కనుక జ్ఞానం అంటే ఆచరణతో కూడుకొన్నది అని కుటుంబరావు చెప్పదలచుకున్నాడు. సాంఘిక ఆర్థిక చైతన్యాలతో ముడి పడి వున్న అంశమిది. ఇందుకనుకూలంగా జనాన్ని చైతన్యవంతం చెయ్యాలి.

కాలేజీలు మళ్ళీ తెరిచారని వార్త వచ్చింది సుందరానికి. వెళ్ళి చేరాలంటే కనీసం రెండు వందలైనా కావాలి. తేలేనని తల్లి ఖచ్చితంగా చెప్పింది. అందరూ చేరి తన చదువును చెడగొట్టినట్లనిపించింది సుందరానికి. తరవాత నెల రోజులకి నరుసు జానకికి యాభయి రూపాయలు పెట్టి బంగారపు గొలుసు చేయించాడని తెలిసి అతనిని అసహ్యించుకున్నాడు. సుందరానికి యింత జీవితాన్ని చూసినా యింకా చదువు ఆలోచన తప్పితే పరాకలేదు. మేనమామ జైలుకు వెళితే ఆ కుటుంబాన్నే కాక తన తల్లిని కూడా ఎవో నాటకాలాడి వొచ్చిన దానితో- పోషిస్తున్న నరుసు తన చదువుకు సహాయం చేయలేదని అతన్ని అసహ్యించుకున్నాడు. అందుకనే కుటుంబరావు అంటాడు- అతని స్వార్థం అతనిలో నీచ భావాలను రేకెత్తిస్తున్నదని. ఈ రకంగా మొత్తానికి ఎంతో ఉత్సాహంగా ప్రారంభమైన సుందరం చదువు ఎన్నో ఒడి దుడుకులకు లోనవుతూ చివరికి అర్థాంతరంగానే ఆగిపోయింది.

సుందరం ఎమ్మే రెండో సంవత్సరం చదువుతూ జాతీయోద్యమం వల్ల తెలుగు దేశానికి తిరిగి వచ్చాక అంటే 1931లో ఆగిపోయిన కథ మళ్ళీ 1935లో కొనసాగుతుంది. ఈ మధ్య కాలంలో సత్యాగ్రహాలు, హరిజన దేవాలయ ప్రవేశాలు జరిగాయి. అప్పుడు గాంధీ ఆంధ్రదేశంలో పర్యటించాడు కూడా. ఈ సంఘటనలతో సుందరానికున్న సంబంధాన్ని గురించి కానీ, ఈ నాలుగేళ్ళ కాలంలో సుందరం జీవితం పరిణమించిన తీరు తెన్నులు కాని నవలలో ఏమీ చిత్రించబడ లేదు. అంతర్జాతీయ రాజకీయార్థిక పరిణామ సంక్షోభాల ప్రసక్తి, ముఖ్యంగా 1933 లో హిట్లరు అధికారంలోకి రావటం కూడా ప్రస్తావించబడలేదు. 1931 తరవాత ఒక్కసారి 1935లో ఆర్థిక సంక్షోభం యొక్క తీవ్ర స్థితిలో సుందరం జీవితాన్నొక సారి పరిశీలనకు పెట్టటంతో నవల ముగుస్తుంది.

మొదటి ప్రపంచయుద్ధం ముగియటంతోటే ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం యొక్క లక్షణాలు తీవ్రతర రూపం దాల్చిన కాలం 9 5. అదివరకు లేని కొత్త రకం వస్తువులూ, బట్టలూ వచ్చాయి" నిజమే కానీ అవి కొనటానికి ప్రజల దగ్గర డబ్బు లేని స్థితి అది. ఇటువంటి పరిస్థితులలో సుందరం ఆస్తంతా పోయింది. ఉద్యోగం రాలేదు. యింట్లో వస్తువులు అమ్ముకొని తినటంగా వుంది పరిస్థితి. పైగా అతనికొక కొడుకు. చదువుతో ముడిపడి చదువుతో సాగిన సుందరం జీవితం ఇట్లా పరి

ఇమించటానికి గల కారణం ఏమిటి? అతను చదివిన చదువు బ్రిటీషు సామ్రాజ్య వాద, వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా గుమస్తాలను తయారుచేసుకోవటానికి ప్రవేశపెట్టిన చదువు. ఈ చదువు చదివినవాళ్ళకు కూడా ఉద్యోగాలివ్వటంతో పాలకవర్గం తన ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుంటుంది. తనకే లాభమూ లేదనుకుంటే ఉద్యోగాలు కూడా యివ్వదు. అందునా సుందరం హైస్కూలు చదువు ప్రారంభించిన కొద్ది రోజులకే ప్రారంభమైన ఆర్థికసంక్షోభం అతనితో పాటు పెరిగి అతని చదువు పూర్తయ్యే సరికి తీవ్రమైంది. ఆర్థిక సంక్షోభమంటే[6] సామ్రాజ్యవాదానికి మరో పేరైన యుద్ధం యొక్క లక్షణం. పెట్టుబడిదారీ దేశాలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం మార్కెట్లను పెంచుకోవటం కోసం వలస విధానాన్ని అవలంబిస్తాయి. ప్రపంచ దేశాలన్నీ ఏ నాలుగైదు పెట్టుబడిదారీ దేశాల వలసలుగానో విభక్తమైపోయిన తరువాత వలసల పునఃపంపకం కోసం సామ్రాజ్యవాదుల పోటీ సాగుతుంది. మొదటి ప్రపంచ యుద్ధం ఫలితంగా ఆర్థిక సంక్షోభాలేర్పడతాయి. ఇదొక వలయంగా సాగుతుంది. పెట్టుబడిదారుల పోటీ స్వభావం చేత శ్రమ దోపిడి ఎక్కువగా సాగి వస్తువుల ఉత్పత్తి అధికమవుతుంది. వస్తువుల ఉత్పత్తి అధికంగా జరుగుతుండ కాని అప్పటికే ఈ శ్రమ దోపిడీవల్ల జనం సరుకును కొనే ఆర్థిక స్థితిని కోల్పోతుంది. ఫలితంగా అంగట్లో అన్నీ వుంటాయి కానీ జనం కొనలేని స్థితిలో వుంటారు. సరుకు అమ్ముడుపోక ఉత్పత్తులు కొంత మేరకు తగ్గించబడటమో, పూర్తిగా మానివేయబడటమో జరుగుతుంది. ఉత్పత్తి చేయాల్సిన అవసరం లేకపోయేటప్పటికి ఆ మేరకు ఉద్యోగులను కూడా తీసివేస్తారు. కొత్త ఉద్యోగాలసలే కల్పించబడవు. దారిద్ర్యము, నిరుద్యోగము ఈ రకంగా కల్పించబడతాయి.

ఈ పరిస్థితి పెట్టుబడి దారీ దేశాలతో పాటుగా దాని వలస రాజ్యాలలో కూడా ఏర్పడుతుంది. పాలక రాజ్యాలలో ఏది జరిగినా దాని ప్రభావాలు పాలిత రాజ్యాలలో పడతాయి. బ్రిటిషు సామ్రాజ్య వాద వలస రాజ్యమైన భారతదేశంలో కూడా బ్రిటన్‌లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం ప్రతిఫలించింది. ఇటువంటి పరిస్థితులలో సుందరానికి ఉద్యోగం దొరకలేదు.[7] ఏ చదువు వల్ల ఉద్యోగం వస్తుందని తనకున్న భూమి మీద అప్పు కూడా చేసి చదువుకున్నాడో, చివరకు బ్రిటిషు వలస విధానం వల్ల ఆ చదువుకు కూడా ఉద్యోగం సంపాదించలేకపోయాడు సుందరం. తన వ్యాపార ప్రయోజనాల కోసం భారతదేశంలో తమ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టిన బ్రిటిషు వలస వాదులు ఆ యింగ్లీషు విద్యతో భారతీయులను వాళ్ళ వ్యావసాయిక నాగరికత నుండి వేరు చేశారు. సుందరం చదువు ప్రారంభించటానికి ముందున్న ఆరెకరాల పొలాన్ని తన చదువు పూర్తయ్యేసరికి పోగొట్టుకున్నాడు.

సుందరం చదువుతో ప్రారంభమైన నవల అతని కొడుకు చదువుతో ముగు

స్తుంది. తాను చదివిన చదువు వల్ల తనకేమీ ప్రయోజనం కలగకపోయినా కొడుకు పుస్తకం చూసి అక్షరాలు గుర్తుపడుతుంటే సుందరం చూసి సంతోషించాడు. సుందరం చదువుకుంటున్న కొడుకును, కొడుకుకు చదువు చెబుతున్న భార్యను ప్రేమగా దగ్గరకు తీసుకోవటంతో నవల ముగుస్తుంది. పరాయి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ బానిస విద్యా విధానమే తరతరాలకు వారసత్వంగా రావటాన్ని ఇది సూచిస్తుంది. స్వతంత్రం వచ్చాక కూడా ఈ రకమైన విద్యావిధానం మారకపోవటం గమనార్హం.

ఈ విద్యావిధానంలో ప్రత్యక్ష ఫలితాలు లేవుకదా అని దీనిని పూర్తిగా పరిహరించటానికి వీలులేదు. ఈ చదువు నిర్దిష్ట ప్రయోజనాన్ని కాకపోయినా దహరం మీద ఒక విజ్ఞానాన్నైనా కలిగించగలుగుతుంది. పెట్టుబడిదారి వ్యవస్థ గర్భంలోనే దాని విచ్ఛిన్నతకు దారి తీసే కార్మిక వర్గం పెంపొందినట్లుగానే ఆ వ్యవస్థ ప్రయోజనాల కనుగుణంగా ఏర్పడిన విద్యా విధానంలోని అంతరంగిక వైరుధ్యాలే దాని విచ్ఛిన్నతకు దారి తీసే చైతన్యాన్ని పెంపొందిస్తాయి. ఈ చైతన్యం వల్లనే జనం తమను తాము తెలుసుకొని సమాజంలో తమ బాధ్యతలను తెలుసుకొని తమ విముక్తి గురించి ఆలోచించుకొనే విధంగా విద్యా విధానాన్ని మార్చుకుంటారు.

మొత్తానికి "మధ్య తరగతి జీవితం వ్యంగ్య సాహిత్యానికి గొప్ప ముడి సరుకుగా[8] " భావించి విప్లవ కథా సాహిత్యంద్వారా "తమకు కుడి ఎడమల మధ్య జరిగే సంఘర్షణలో జీవిత వాస్తవం వున్నదని మధ్య తరగతికి తెలియచెప్పటం అవసరమని[9] " గట్టిగా నమ్మిన కుటుంబరావు కేవలం మంచినో, కేవలం చెడునో మాత్రమే కలిగి వుండని మధ్య తరగతి మానవ మనస్తత్వంలోని ఎగుడు దిగుళ్ళను వాస్తవిక దృక్పథంతో చిత్రించిన మంచి నవల "చదువు". కొడవటిగంటి కుటుంబరావు తన సాహిత్య వ్యాసాలద్వారా రచయిత అయినవాడు మధ్య తరగతి గురించి ఏయే కోణాలనుండి రచనలు చేయాలని ఆశించాడో దానినితాను స్వయంగా "చదువు" నవల ద్వారా చేసి చూపాడు. కుటుంబరావు నవలల్లోకెల్లా చదువు గొప్ప నవల. ఆయన తన అనేక యితర నవలల్లో చిత్రించిన అంశాలన్నీ చదువులో చూస్తాము. అందువల్ల చదువును కుటుంబరావు నవలలన్నింటికి ఒక ముఖ్యమైన ప్రతినిధి నవలగా తీసుకోవచ్చు.[10]

1980 సెప్టెంబరు వరంగల్ విరసం యూనిట్ నిర్వహించిన కొడవటిగంటి కుటుంబరావు సంస్మరణ సభలో చేసిన ప్రసంగానికిది వ్యాసరూపం.

(పాదసూచికలు పక్క పేజీలో)

తెలుగు కథ - కుటుంబరావు

సి. రామచంద్రారెడ్డి

కొడవటిగంటి కుటుంబరావుగారు ఒక సాహిత్య పరిశోధనశాల లాంటి వారు. ఆయన సాహిత్య జీవితం ఎన్నో సాహిత్య ఉద్యమాలకు కొలమానం, అర్థ శతాబ్దం పాటు సాహిత్య రచన సాగించడం సామాన్య విషయం కాదు. సామాన్యాన్ని అసామాన్యం చేయడంలోనూ, అసామాన్యాన్ని సామాన్యం చేయడంలోనూ కుటుంబరావుగార్కి చాలా నేర్పుంది. ఆయనతోపాటు, ఆ తర్వాత రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించినవాళ్ళు చాలా మంది ఎటూ గాకుండా పోయారు. వాళ్ళలో కొందరు కేవలం కాల్పనిక వాద లో పడిపోయారు. కొందరు కుహనా అభ్యుదయ పథంలో పడి చెద పట్టిపోయారు; కొందరు యుగ భయాల్ని తమ రచనల్లో నింపేసి పాఠకులకి మత్తు చల్లి శ్రీమంతుల జాబితాలో చేరిపోయారు; చాలా కొద్ది మంది మాత్రమే ఆంధ్ర సాహిత్యోద్యమాలతో పాటు ఎదుగుతూ, ప్రజలకు ఉపయోగపడి, చైతన్యాన్ని కలిగించే సాహిత్యం సృష్టించారు.

కుటుంబరావుగారు తెలుగు కథకి నడక నేర్పి, వ్యాసాలకు వాడి, వేడి, స్పష్టత, సరళత్వము, సూటిదనము అందించారు. ఎందరో యువ కథా రచయిత

పాదసూచికలు

1. కె. వి. రమణారెడ్డి: శ్రీ కొడవటిగంటి నవలలు– ఒక పరిశీలన–1966, ఫిబ్రవరి భారతి, పు: 19 మరియు మొదలి నాగభూషణశర్మ: తెలుగు నవలా వికాసం, పు. 353 మరియు ఇంద్రగంటి శ్రీ కాంతశర్మ: సాహిత్య పరిచయం (1978) పు: 201.
2. Marx, Engels; The First Indian war of Independence 1857-1859 (PPM 1978) p: 11, 12
3. మనోరంజన్ ఝా (అను: కుమారి మా. రాజ్యలక్ష్మి) స్వాతంత్ర్య సమరంలో కేంద్ర శాసనసభ పాత్ర (1978) పు: 1.
4. డా. బూదరాజు రాధాకృష్ణ 1980 ఏప్రిల్ అభ్యుదయ, పు: 25
5. ఆంధ్రప్రదేశ్ దర్శిని (1976) పు: 795 798.
6. ఎల్. లియోన్ త్యెవ్ (అను–రాచ ల్లు రామచంద్రారెడ్డి) అర్థశాస్త్రం (ప్రప్ర. మా. 1978) పు: 109–114, 134.
7. నవీన్–కొడవటిగంటి కుటుంబరావు నవలలు–19 వేకువ (త్రైమాసిక)
8, 9. కొడవటిగంటి కుటుంబరావు – సాహిత్యంలో విప్లవోద్యమం (1971) పు: 37, 31.
10. నవీన్–కొడవటిగంటి కుటుంబరావు నవలలు–19 వేకువ (త్రైమాసిక)

లకూ, నవలాకారులకూ కథలు, నవలలు అందరికీ అర్థమయ్యే భాషలో, ధోరణిలో ఎట్లా రాయాలో నేర్పినవారాయన. వచన రచనలో ఆయన్ను చెప్పిన తర్వాతనే మరొకర్ని చెప్పాలి రచయితకు ముఖ్యంగా నిజాయితీ, నిర్భయత్వం, నిర్దిష్టమైన శాస్త్రీయమైన సామాజిక దృక్పథం, కమిట్ మెంట్, సూటిగాచెప్పే లక్షణం, రాజీ లేని వర్గ దృక్పథం అవసరమని నిరూపించినారాయన. ఎంతో క్లిష్టమైన సిద్ధాంత, తత్వ విషయాలను సైతం సులభంగా సరళంగా చెప్ప గలిగిన తాత్వికుడు కుటుంబరావుగారు. తెలుగు కథా ప్రక్రియను విజ్ఞానశాస్త్ర స్థాయికి తీసుకెళ్ళిన సాహిత్య సైంటిస్టాయన.

1930 ప్రాంతంలో ప్రపంచమంతా ఆర్థిక మాంద్యత, సామాన్య మానవులు బతకలేని దుర్భర దారిద్ర్య పరిస్థితి, యుద్ధ భయం దావానలంలా వ్యాపించాయి. ఆర్థిక మాంద్యానికి, దోపిడీకి గురైన సామాన్య ప్రజానీకం అణగారిపోయి ఏడుస్తుంటే కొంత మంది కవులు భావ గీతాల్లో ప్రేమని, విరహాన్ని గానం చేశారు. కొంతమంది వచన రచనా కారులు కథల్లో నవలల్లో జానపద వీరుల్ని, రాణుల్ని వాళ్ళ ప్రేమల్నీ, శృంగారాన్నీ, సాహసాల్నీ చిత్రిస్తూ ప్రజల్ని నిద్ర బుచ్చడానికి ప్రయత్నం చేశారు; కొంతమంది రచయితలు మాత్రం సామాన్యుల కష్టాలకు, కన్నీళ్ళకు కదిలిపోయి వాళ్ళ బాధామయ జీవితాల్ని తమ కవితల్లో, కథల్లో, నవలల్లో చిత్రించి పీడిత ప్రజానీకానికి ధైర్యం, బ్రతుకుపై విశ్వాసం, చైతన్యం కలిగించడానికి ప్రయత్నం చేశారు. అలాంటి వారిలో తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ గారు, కుటుంబరావుగారు ముఖ్యులు.

తను ఎందుకు రచనలు చేయటం మొదలుపెట్టారో కుటుంబరావుగారి మాటల్లోనే తెలుసుకుందాం—"మన సమాజంలో మనుషులకు కనీస ఆలోచనాశక్తీ, చైతన్యమూ లేనందుకు ఆందోళన కనబరుస్తూ నేను....రచనలు ప్రారంభించాను. నేను పెరుగుతున్నకొద్దీ నా ఆందోళన సాంఘిక చైతన్యంకేసి మళ్ళింది. ఈ నాడు నేను గాఢంగా కోరుకుంటున్నది, మనుషులలో విప్లవ చైతన్యం...."

విప్లవ కథా సాహిత్యం ఎలా వుండాలి? అన్నదానికి ఆయన దగ్గర స్పష్టమయిన జవాబులు, అభిప్రాయాలు వున్నాయి. అందులో కొన్ని— "రచయిత తన అనుభవాన్ని దాటిపోరాదు. తనకు సమగ్రంగా తెలిసిన జీవిత భాగం అవగాహన చేసుకుని అందులోని సత్యాన్ని ప్రకటించినంతసేపూ రచయిత మధ్య తరగతి వాడయినా, జమీందారయినా కూడా అభ్యుదయ సాహిత్యం రాయగలడు. రచయితకూ అతను రాసే జీవితానికి ఉండదగిన సంబంధం ఏమిటంటే ఆజీవితం కంటే ఆ రచయిత సన్నిహితంగా వుండి కూడా కొద్దిగా పైగా ఉండి దాన్ని సమగ్ర అవగాహన చేసుకోగలవాడై ఉంటేనే ఉత్తమ సాహిత్యం పుడుతుంది.

"కథా శిల్పంలో సూత్రప్రాయంగా గమనించవలసిన అంశమేమిటంటే కథ అంతా చెప్పాలి. కథ తప్ప మరేమీ చెప్పకూడదు. కథలో ఏకత్వం (Organic unity) సంపూర్ణత్వం ఉండాలి. కథా శిల్పానికి సంబంధించిన ఇతర సూత్రాలేమంటే పరిమిత గ్రహణ శక్తిలో కొంత విశ్వాసం ఉంచాలి. ప్రతి స్వల్ప విషయాన్నీ అంతు లేకుండా వ్యాఖ్యానం చేసి కథ చెప్పటం అంటే బుట్టలో ఏకులు కుక్కటం లాగా చెయ్యకూడదు. చదివేవాడు ఒక్క ముక్కలో తెలుసుకునే విషయాన్ని పది వాక్యాలలో వ్యాఖ్యానిస్తే చదివేవాడి ఆసక్తి ఎటో పోతుంది. కథ సంఘటనను అరటిపండు వొలిచినట్టు వొలిచిపెట్టాలా, లేక చదివేవాడి ఆలోచన రేపి వదలాలా అంటే నా అభిప్రాయం ఆలోచన రేపి వదలాలనే; సరి అయిన సాహిత్యం చదివేవారి భావాలను ఒకమార్గంగా నడపాలిగాని ఒకగమ్యస్థానం చేర్చి వదలరాదు. కథకుడు తీర్పు చెప్పరాదు. కథ చదివినాక చదివినవాడి తలలో భావాలు నలు ముఖాలు పోయినా కూడా శిల్పంలో లోపం వున్నట్టే.

"మంచి చెడ్డల విచక్షణ అటుంచి సాహిత్యం పరిమితంగా సృష్టి కావడంలోనూ, బహుళంగా సృష్టి కావడంలోనూ ఒక ముఖ్యమైన తేడా ఉన్నది. బహుళంగా ఉత్పత్తి అయ్యే సాహిత్యం విధిగా ప్రజలకూ, జీవితానికీ సన్నిహితంగా వచ్చి తీరుతుంది. కొద్దిమంది కథకులే ఉన్నప్పుడు వెలువడిన కథలలో పాత్రలను ఉదాత్తంగా ఉంచటానికి పడిన పాట్లూ, పట్టుకున్న బెరుకూ స్పష్టంగా గోచరిస్తాయి. రచయితల సంఖ్య హెచ్చినకొద్దీ భాష ధారాళంగానూ, పాత్రలు స్వాభావికంగానూ పరిణమించడం జరిగింది. ఇది కథాసాహిత్యానికి జరిగిన సామూహిక లాభం. ఈ ప్రయోజనం ప్రత్యేక కథలలో పాక్షికంగా మాత్రమే ప్రతిబింబించింది.

"కథలలో నిత్య జీవితం తాలూకు పాత్రలుంటున్నాయి. కాని ఒక్కొక్కప్పుడు ఆ పాత్రల స్వరూపానికీ, స్వభావానికీ సంబంధం వుండదు. కార్మికుడికి మధ్య తరగతి మనస్తత్వమూ, మధ్య తరగతి వాడికి జమీందారీ మనస్తత్వమూ అంటగట్టబడింది. అభ్యుదయ సాహిత్యం రచించాలన్న అభిలాషలో అమాయక కథకులు కార్మికులే గుర్తించలేని కార్మికులనూ, కర్షకులే ఆమోదించలేని కర్షకులనూ సృష్టించటం మరింత శోచనీయం. కాని ఈ రకం పొరపాటు క్రమంగా వెనకబడుతున్నట్టు కనిపిస్తున్నది.

"రచయితలకు జీవితానుభవం వుండాలి. జీవిత సత్యాన్ని గ్రహించే నిశితమైన దృష్టి వుండాలి. ఏ కళకైనా అపారమైన సాధన వుండాలి. వాస్తవిక కళకు మరీనూ. మనస్తత్వ పరిశీలనా, రచనా సామర్థ్యమూ ఉండాలేగాని అవి రచనలలో ప్రతిబింబించకపోవు. పని పెట్టుకుని జీవితాన్ని లక్ష్యపెడితే తప్ప ప్రతిబింబించనిదల్లా జీవిత వాస్తవికతే. విజ్ఞానమూ, ప్రజలతో సన్నిహితత్వమూ చాలా వరకు

రచయితకు వుపకరిస్తాయి. రచయితకు తనకు సన్నిహితంగా వుండే జీవిత రంగం లోగల సత్యం బాగా అవగాహన అవుతుంది. కార్మికులతో ఆత్మీయత లేనివాడు కార్మికుల జీవితాన్ని చిత్రించలేడు. సినిమా ప్రపంచంతో పరిచయం లేనివాడు ఆ జీవితం గురించి వాస్తవికతతో కూడిన కథ రాయలేడు.

"శిల్పమూ, భాషా రచయితకి ముఖ్యం కాదని కాదు. అవి చాలా ముఖ్యం. అయితే అవి కథా రచనకు మూల ఉపకరణాలు; ముడి పదార్థం జీవితం. కథా రచన చెయ్యదలచినవారు విరివిగా కథా సాహిత్యం చదవాలి.

"సమాజంలో అసహాయులుగా ఉన్నవారిలో చైతన్యమూ,బెదిరి వున్నవాళ్ళకు ధైర్యమూ, వ్యక్తిత్వం కోల్పోయిన వాళ్ళకు వ్యక్తిత్వమూ ఇవ్వటం కన్నా రచయిత తన రచనల ద్వారా చేయగల ఉత్తమమైన పని ఏమన్నా ఉందా? లేదనుకుంటాను. తనను జీవితం హింసించినపుడూ, కవ్వించినప్పుడూ తనకు కలిగే మనోభావాలను మిగిలిన సామాజికులతో పంచుకోవాలనే ఆవేదన ప్రతి రచయితకూ, కవికీ కథకుడికీ, నాటక కర్తకూ బలంగా ఉండి తీరాలి. అప్పుడే అతని అనుభవము అందరి అనుభవమూ అవుతుంది. అట్లాగే రచయిత ఒక సంఘటనలో ఒక జీవిత సత్యాన్ని చూడగలిగినప్పుడు దాన్ని అందరితోటి పంచుకోవాలి.

"దుర్భరమైన జీవిత సమస్యల కింద నలిగేవాళ్ళు చాలామంది జీవితంలో ఉన్నారు. కథలు చిత్రించవలసినది వాళ్ళను కాదు, ఆ సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నించేవాళ్ళని.

"కొందరురచయితలు విరివిగా రాయటంవల్లనే కావచ్చు, కాకనూపోవచ్చు-కథ రాయటం బ్రహ్మ విద్య అనే భ్రమ మాత్రం ఈ మధ్య కాలంలో పోయింది. దాని స్థానే "ఎవరైనా కథ రాయవచ్చు" అనే అభిప్రాయం కూడా వ్యాపించినట్టు కనిపిస్తుంది. ఇది తప్పు అభిప్రాయమని నేననుకోను. కాని ఈ అభిప్రాయంతో బాటు కథా శిల్పంతో తగు మాత్రం పరిచయమూ, ఆత్మ విమర్శనాశక్తి ఉండాలి అంతే.

"ఈనాడు వచ్చే విప్లవ కవిత్వమూ, విప్లవ కథలూ సమమైన చైతన్యం నుంచి పుట్టినవి కావు. సమంగా చైతన్యాన్ని రేకెత్తించేవి కావు. కాని అన్నీ ఒకే చరమాశయం గలవి, విమర్శకులు వాటిని, లెన్సు సూర్యకిరణాలను కేంద్రీకరించి అగ్నిని పుట్టించినట్లు, కేంద్రీకరించి చైతన్యాన్ని వృద్ధి పరచాలి."

"విజ్ఞానమూ, ప్రజలతో సన్నిహితత్వమూ చాలవరకు రచయితలకు వుపకరిస్తాయి. రచయితకు తనకు సన్నిహితంగా వుండే జీవిత రంగంలో గల సత్యం బాగా అవగాహన అవుతుంది."

కుటుంబరావుగారు తన కథల్లో మధ్య తరగతి ప్రజల జీవితాలను చిత్రించి విశ్లేషించి చూపినారు. తనకు ఏ వర్గం ప్రజలతో బాగా పరిచయముందో వారిని గూర్చి రాయటమే మంచిదని ఆయన అభిప్రాయం. కుటుంబరావుగారికి బాగా పరిచయమున్నది మధ్య తరగతి ప్రజల జీవితాలతోనే. ఆ మధ్య తరగతి ప్రజల ఆలోచనలలో మార్పు తీసుకురావాల్సిన అవసరాన్ని గురించి కుటుంబరావుగారు ఇలా చెప్తున్నారు— "సమాధానపడే శక్తి ఈ నాడు మధ్య తరగతి వాడికి ఉన్నంతగా మరే వర్గానికీ లేదు. పై వర్గం వాళ్ళు తమ క్షేమం కోసం హత్యలు చెయ్యటానికి సిద్ధంగా ఉన్నారు. కింది వర్గం వాళ్ళు తమహక్కులకోసం చావటానికైనా సిద్ధమవుతున్నారు. దురదృష్టవశాత్తు ఈనాడు కథలు రాసే వాళ్ళలో అధిక సంఖ్యాకులూ, చదివే వాళ్ళలో యింకా అధిక సంఖ్యాకులు ఈ మధ్య తరగతివాళ్ళు. తమకు కుడి ఎడమల మధ్య జరిగే ఈ సంఘర్షణలో జీవిత వాస్తవం ఉన్నదని మధ్య తరగతికి తెలియచెప్పటం అవసరం. మధ్య తరగతి ఆత్మ వంచనను, కృత్రిమ విలువలను, దిగలాగుడు మనస్తత్వాన్ని, తాము తప్పుగా పరిగణించే జీవిత ధోరణులతో రాజీ పడి పోరాటం కన్న శాంతి మేలని భావించే వైఖరినీ ఖండిస్తూ కథలు రాయవచ్చు."

మధ్య తరగతి ప్రజల జీవితాలలోని ఆత్మ వంచనను, కృత్రిమ విలువలను దిగలాగుడు మనస్తత్వాన్ని,రాజీ ధోరణిని ఒక పక్క చిత్రిస్తూనే వాళ్ళు జీవితంలో నెగ్గుకు రావటానికి చేసే పోరాటాల్ని కూడా కుటుంబరావుగారు తన కథల్లో చిత్రించారు.

కొడవటిగంటి కుటుంబరావుగారు పేదరైతాంగం గురించీ, కార్మికుల గురించీ ఎందుకు కథలు రాయలేదు? - అనే ప్రశ్న చాలా మంది అడుగుతున్నది. దీనికి జవాబు; తనకు పరిచయం లేని వర్గ ప్రజల జీవితాలను గురించి రాయటం కంటే, తనకు బాగా తెలిసిన, పరిచయమున్న వర్గ జీవితాన్ని తన రచనల్లో చిత్రీకరించటం వలన రచయిత తన కర్తవ్యాన్ని పటుతరంగా నిర్వహించినట్లవుతుంది. కుటుంబరావుగారు అభిప్రాయపడినట్లుగానే, మధ్య తరగతి ప్రజలలో చైతన్యం తీసుకు రావల్సిన అవసరం ఎంతయినా వుంది. ఎందుకంటే విప్లవ పోరాటంలో, యీ మధ్య తరగతి ప్రజలలోని ఎక్కువ మంది కార్మిక, కర్షక సమిష్టి శక్తికి తోడ్పడి విప్లవం విజయవంతం అయ్యేట్లు చెయ్యాల్సి వుంది, అట్లాగ చేస్తారుకూడ. ఇది చరిత్ర రుజువు చేసిన సత్యం. కాబట్టి కార్మికులు, పేద రైతాంగం, కూలీలతో పాటు మధ్య తరగతి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసే సాహిత్యం కూడా సృష్టించాల్సి వుంది. విప్లవ విజయానికి అనుకూలపడే ఏ వర్గాన్నీ మనం వదులుకో కూడదు.

కుటుంబరావుగారి కథల్లోని పాత్రలు మనకు నిజజీవితంలో ప్రతి మధ్యతర

గతి కుటుంబంలోనూ తారస పడుతుంటారు ఆ పాత్రలు వాస్తవ జీవితంలో మధ్య తరగతి వాళ్ళు ప్రవర్తించినట్లే అచ్చంగా ప్రవర్తిస్తాయి. జీవితంలోని దుర్భర కష్టాలకు లొంగిపోయి నిరాశతో కృంగిపోయే పాత్రలంటే ఆయనకు యిష్టం వుండదు. జీవితంతో సంఘర్షిస్తూ విజయం సాధించడానికి ప్రయత్నం చేసే పాత్రల్నే కుటుంబరావుగారు ఎక్కువగా తన కథల్లో చిత్రించారు. ఈ విషయం ఆయన కథల్ని పరిశీలిస్తే సులభంగా తెలిసిపోతుంది.

కథల్లో సందేశం పాత్రల ద్వారా చెప్పించటం కుటుంబరావుగారి పద్ధతి. పాత్రల మధ్య తాను దూరి ఉపన్యాసాలు దంచడం ఆయన చేయరు. ఆయన కథల్లోని పాత్రలు కళల గురించి, సాహిత్యం గురించి, రాజకీయాల గురించి మాట్లాడుకుంటాయి. అదైనా అవసరమున్నప్పుడే కాని రచయితకు యిష్టమైనప్పుడల్లా కాదు. మరీ అవసరమైతేనే గాని తాను పాత్రల మధ్య దూరడు. ఇది మంచి కథారచయితల లక్షణం. రష్యన్ సాహిత్యంలో గోర్కీ కూడ యిలాంటి పద్ధతినే అవలంబించాడు. కేవలం సందేశాల కోసం పాత్రల్ని మూస పోసే పద్ధతికి కూడ కుటుంబరావుగారు విరుద్ధం. తను వాస్తవ జీవితం నుంచి తీసుకున్న పాత్రల ద్వారానే సందేశం వినిపిస్తారాయన.

కుటుంబరావుగారి కథల్లోని సన్నివేశాలు,సంఘటనలూ వాస్తవ జీవితంలోనివిగా అగుపిస్తాయేగాని, కొందరు రచయితలు తమ కథల్లో అనవసరంగా కల్పించే గగుర్పాటు, అర్థంకాని ఉత్కంఠ (Suspence) తో పాఠకుల్ని మభ్యపెట్టే సంఘటనల్లాంటివి కావు. ఆయన కథల్లోని సన్నివేశాలు పాఠకుల్ని ఆలోచింప చేస్తాయి, అంతేగాని ఆవేశంలో ముంచెత్తవు. కథల్లో సన్నివేశ చిత్రణ గురించి కుటుంబరావుగారు "ఏవో సన్నివేశాలు కల్పించి పాత్రల చేత గంభీరంగా మాట్లాడించవచ్చు. కొన్ని సాంఘిక భావాలు ప్రచారం కూడా చెయ్యవచ్చు. కాని మామూలు సంఘటనలే తీసుకుని మామూలుగా మనుషులు చేసే పనులకూ, అవే మాటలకూ ప్రత్యేకత తెప్పించటానికి అపూర్వమైన ప్రతిభకావాలి" అంటారు. ఈ ప్రతిభ ఆయనలో వున్నంతగా చాలా మంది రచయితల్లో లేదు.

కుటుంబరావుగారు శిల్పానికి ప్రాముఖ్యం యివ్వలేదని కొందరి ఆరోపణ. ఇది సరైన అవగాహనతో కూడుకున్న ఆరోపణ కాదు. ఎందుకంటే కుటుంబరావుగారు ఎన్నడూ శిల్పాన్ని నిర్లక్ష్యం చేయలేదు. కానీ శిల్పం కంటే వస్తువుకే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చి, శిల్పం వస్తువును మరుగు పరచకుండా చూశాడు. కొంతమంది చేసినట్టు శిల్పం పేరుతో వస్తువును "అధ్వాన్నపు అడవిలో వదిలెయ్య" లేదు. కె. వి. ఆర్. అన్నట్లు "శిల్పం ప్రముఖంగా కనిపించేట్లు రాయక పోవడమే గొప్ప శిల్పం". రా. వి. శాస్త్రిగారి లేక కాళీపట్నం రామారావుగారి కథల్లో లాగ

కుటుంబరావుగారి కథల్లో నాటకీయత ఎక్కువగా (high Drama) ఉండదు. రా.వి శాస్త్రి, కా.రా. గార్ల కథల్లో డ్రామా వుంటుంది, కవిత్వముంటుంది. అందువల్లే వారి కథలు చదివిన వెంటనే పాఠకుల్ని ఆకట్టుకుంటాయి, ఉత్తేజ పరుస్తాయి. వీళ్ళ కథలు ఒక్కరు చదువుకోవడం కంటే పదిమంది కలిసి చదువుకోవడానికి ఎక్కువవీలుగా, ఉపయోగకరంగా ఉంటాయి. ఈలక్షణాలు కుటుంబరావుగారి కథల్లో తక్కువ. ఆయన కథా రచనలో డ్రామా కంటే కథనానికే ఎక్కువ ప్రాముఖ్యత యిస్తారు. ఆయన కథలు సాధారణంగా, సరళంగా, కానీ పాఠకుల్ని ఆలోచింప చేసే విధంగా, పాఠకులకి తెలియకుండానే కథలోని సందేశం వాళ్ళ సంస్కారం లోకి చేరిపోయే విధంగా ఉంటాయి.

స్త్రీ పురుషుల సంబంధాల విషయంలో చలం దృక్పథం కుటుంబరావుగారి ఆలోచనలపై తొల్దొలుత ప్రభావం చూపింది. కానీ, రానురాను కుటుంబరావుగారు చలం ప్రభావం నుండి బయట పడ్డారు. అలా పడటం కుటుంబరావుగారికి మేలైంది. ఎందుకంటే చలం ముఖ్యంగా కాల్పనికవాది స్త్రీ పురుషుల సంబంధాలు వర్గసమాజంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు నిర్ణయిస్తాయని చలం గ్రహించలేక శాస్త్రీయ అవగాహన లోపించి నేల విడిచి సాము చేసినట్లు యీ సంఘం యొక్క సంకుచిత దృక్పథాలతో పోరాడి పోరాడి, చివరికి విసుగు చెంది అరుణాశ్రమంలో అస్తమించాడు. కుటుంబరావుగారు అట్లాగాక కాల్పనిక వాదం నుండి బయటపడి శాస్త్రీయ అవగాహన పెంపొందించుకుని, వర్గ సమాజంలో స్త్రీ పురుషుల సంబంధాలను నిర్ణయిస్తున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితులను దెబ్బతీస్తేనే గాని, వర్గ రహిత సమాజం ఏర్పడితేనేగాని స్త్రీ పురుషుల సమానత్వం ఏర్పడదని తెలుసుకున్నాడు. ఈ మేరకు తన రచనల్లో యీ అభిప్రాయాలను ప్రతిఫలింప చేశాడు కూడా. స్త్రీ పురుషుల సమానత్వం గూర్చి కుటుంబరావుగారు "యీనాడు పురుష స్వామ్యం అమలులో ఉన్నది. ఈ సమాజంలో స్త్రీకి పురుషునితో సమానత్వం అన్నది అసాధ్యం. అది గుర్తించని స్త్రీలు తప్పంతా పురుషుల దృక్పథంలో ఉన్నదనీ, దాన్ని హితోపదేశాల ద్వారా మార్చితే స్త్రీ జీవితం లోపరహితంగా ఉంటుందని భ్రమ పడుతున్నారు. వివాహ వ్యవస్థ గొప్ప మార్పులకు గురి అయితేనేగాని స్త్రీ పురుషుల సమానత్వం సాధ్యం కాదు. ఇప్పుడు వారి మధ్య ఉండే అసమానత కేవలమూ వ్యక్తిగతమైనది కాదు—సామాజికమైనది" అన్నారు.

కుటుంబరావుగారి కథలు చదవడం వల్ల ఇప్పుడు విప్లవ రచయితలకు ఏమైనా ప్రయోజనముందా? – ఈ ప్రశ్నకు సమాధానం చెప్పుకోవాల్సి వుంది. కుటుంబరావుగారి కథలకంటె ఆయన వ్యాసాలు విప్లవ రచయితలకు ఎక్కువగా ఉపయోగ పడతాయి. ఆయన వ్యాసాలు చదవటం వల్ల సరైన మార్క్సిస్టు అవ

'బుద్ధి కొలత'

నటరాజ్

పాఠకుల్లో క్రియాశీలక శక్తిని ప్రేరేపిస్తూ, సహజంగా, సరళంగా, గంభీరంగా ప్రవహించే కొడవటిగంటి కుటుంబరావుగారి భావ ప్రవాహం, ఆయన 'బుద్ధి కొలత సిద్ధాంతం' తరువాత జటిలమైపోయింది కానీ అయోమయం అవలేదు. తన భావాల పట్ల ఖచ్చితమైన అవగాహన ఆయన గానీ, ఆయన అభిమానులు గానీ నిర్వచించుకోక మునుపే ఆయన మరణించడం బాధ కలిగించే విషయం.

అతీంద్రియ శక్తుల విషయంలో ఆయన మాటలలోనే ఆయన ఫీలవుతున్న భావం పేరా చివర వచ్చేసరికి నిర్దుష్టంగా ముగించబడక "అది అవనూ అవవచ్చు, కానూ కాక పోవచ్చు" అన్న వూగిసలాటగా తయారవుతుంది. ఉదాహరణకు 'భాషలో చెప్పడానికి వీలు లేనిది అనుభూతి కాజాలదు' అంటూనే 'మనో వైజ్ఞానికులు మాత్రం యింద్రియేతర భావ నిర్మితి కలదని వప్పుకుంటారు' అంటారు.

గాహనను వృద్ధి చేసుకోవచ్చు. అయితే, కుటుంబరావుగారి కథలు చదవడం వల్ల అసలు కథ అంటే ఎలా వుండాలి? అన్నది తెలుసుకోవచ్చు. కథా రచయితకు కమిట్‌మెంట్ వర్గ దృక్పథం, శాస్త్రీయమైన సామాజిక విశ్లేషణ, నిజాయితీ,నిర్భయత్వము, కథను సులభంగా సామాన్య పాఠకునికి కూడ అర్థమయ్యే విధంగా చెప్పటం, సూటిగా చెప్పటం, క్లుప్తంగా చెప్పడం (economy of words) అనే సూత్రాన్ని పాటించడం లాంటివి చాలా అవసరమని, విప్లవ కథా రచయితలకు యివి మరీ మరీ అవసరమని తెలుసుకోవచ్చు. తెలుసుకుని కథల ద్వారా విప్లవ భావాలను యింకా విస్తృతంగా ప్రజలలోకి తీసుకుని వెళ్ళవచ్చు.

కొన్ని వందల కథలు, ఎన్నో నవలలు, మరెన్నో సైద్ధాంతిక, వైజ్ఞానిక వ్యాసాలు రాసి తెలుగు సాహిత్యరంగాన్ని సారవంతంచేసి,ఎందరికో చైతన్యాన్నిచ్చి విప్లవోన్ముఖులను గావించిన కుటుంబరావుగారు లేనిలోటు విప్లవ సాహిత్యరంగానికి సమీప భవిష్యత్తులో తీరేది కాదు.

ఆయనను గూర్చి కాళీపట్నం రామారావుగారు వెలిబుచ్చిన అభిప్రాయంతో ఆయనకు నివాళులర్పిస్తూ యీ వ్యాసం ముగిస్తాను—

"అర్థ శతాబ్దానికి పైగా ఆయన తెలుగు జాతికి చేసిన సేవ అంతా యింతా అనరానిది. వ్యక్తికి సమాజం పట్లగల బాధ్యతను గుర్తించి - జ్ఞానం వచ్చింది మొదలు ప్రాణం పోయేదాకా - వారిలా ఆ బాధ్యతను అతి శ్రద్ధతో నిర్వహించిన వ్యక్తిని మరొకరిని చూడబోము."

'విజ్ఞానంలో వాస్తవికత అనుమానం. నిరూపణ కావలసి వుంది' అన్నారు. అంటే విజ్ఞానం ఆయన దృష్టిలో అవాస్తవికమైనదా? అనిపించదూ?

అసాధారణ శక్తులు అభ్యసించి అలవరచుకోవచ్చుననేందుకు ఆధారం వున్నది అంటారు. అలాగే యేమీ అలవరచుకోకుండానే అసాధారణ మానసిక శక్తులతో నయంకాని రోగాలను నయం చేసుకోవడం జరిగిందని ప్రయోగాలు రుజువు చేశాయిట. యెక్కడో, యెప్పుడో శాస్త్రీయంగా రుజువు కాబడినాయా? వివరాలు లేవు.

కాకతాళీయంగా జరిగే కొన్ని పనులను యింద్రియాతీతమైన తెలివిడి అనే దాన్ని కల్పించి దానికి అంటగట్టారు. అందులోనే మరీ ఆశ్చర్యంగా "యింద్రియాల -అంటే మెదడు సహాయం లేకుండా తెలుసుకోవడం- యిలాటివే పలువేల సంఖ్యలో నమోదు అయినప్పుడు యింద్రియాతీత తెలివిడి వున్నదన్నది నిర్ధారణ అవుతుంది" అన్నారు. బ్రాకెట్స్‌లో పైదానికి భిన్నమైన 'నిర్ధారణ అయినాక కూడా సరైన లేదా సరికాని ముందు తెలివుళ్ళు వుంటాయి' అనే ముగింపు.

ఈ విషయంలోనే నాకు రాసిన వుత్తరంలో (తేది 9.8.1980) "ఒక ప్రత్యేక వ్యక్తిలో సైకిక్ పవర్ లేదని రుజువు చెయ్యడం అసలా అలాటిది లేనే లేదని రుజువు చెయ్యడం అవుతుందా?" అని ప్రశ్నించారు. అంటే యింద్రియాతీత శక్తులు (పైపేరాలో) వోలువేల సంఖ్యలో నమోదు అయితే నిర్ధారణ అవుతాయిగానీ, అసలు ప్రత్యేక వ్యక్తిలోసైకిక్ పవర్ లేదని రుజువు చెయ్యడం మాత్రం 'సైకిక్ పవర్' లేద- (అతనిలో కాదు అసలు అస్తిత్వం) రుజువు అవదన్నమాట. అంటే అతీతయింద్రియ శక్తి యెప్పటికప్పుడు అబద్ధమని తేలుతున్నా అది యెక్కడో అక్కడవుండవచ్చునన్నమాట. అతీతమైనది కదా అందుకని కాబోలు.

కటు బరవుగారు యిలా రాసినా తాను యెక్కువగా యేమికోరుకున్నారో దానికి పూర్తిగా డీవియేట్ కాలేదు, 'సామాజిక జీవితానికి విరుపయోగం,' జీవితాన్ని తీర్చిదిద్దదు', 'మనిషిలో కనిపించేవి దైవికశక్తులు యెలాగ అవుతాయి శవంలో శక్తులను చూపిస్తే యేమోగాని' (పైవుత్తరంలో) లాంటి మాటల్లో స్పష్టత కనిపిస్తుంది. 'అతీంద్రియశక్తులు కలవు మాకు' అని చెప్పుకొంటున్న వారు దొంగలని ఆయనకు తెలుసు. అయినా అసలైన అతీంద్రియ శక్తి యేదో వున్నదని నమ్మినా దానికీ పూర్తిగా కమిట్ కాలేదన్న సంగతి ఆశ్చర్యపరచడమే కాదు 'వహవేళ నిజమేనేమో' అనిపింప చేస్తుంది. యిందుకున్నూ, ఆయన యింత మక్కువగా అతీంద్రియ దైహిక శక్తులపై రాసిన భావాలను కోరి మరీ అరుణతారలో వేయించుకొన్న పైనం చూస్తే నన్నూ, యీ విషయంలో ఆయన భావాల్ని బుద్ధికొలత సిద్ధాంతాన్ని సమగ్రంగా పరిశీలించి గతితర్కంతో విమర్శించాల్సిన అవసరం యెంతైనా వున్నదనిపిస్తుంది.

పీడకథ

ఒక్కొడికొక్కో పిచ్చి. సీతారామయ్యకు చిన్నప్పటి్ణించీ కథల పిచ్చి. బళ్ళో చదువుకునేప్పుడు శనాది వారాల కోసం తహతహలాడే వాడు. శనాదివారాలు రాగానే కథల పుస్తకాలూ, పత్రికలూ దొరికినన్ని చేర్చి, ఇంకో పని లేకుండా చదివేవాడు.

మన స్తత్వంలో మనం సాధారణంగా గమనించే అంశం ఏమంటే, ఏది మనకు ఉ దేకంతో కూడిన ఆనందం ఇస్తుందో, అదీ దానికి కారణభూతులైన వాళ్ళూ మన దృష్టికి అమానుషంగా భగవదంశ సంభూతంగా కనిపిస్తారు.అప్పుడు మనలో ఆరాధన పుట్టుకొస్తుంది. దీనికి తార్కాణం ప్రియురాలు. ఇతర కంఠస్వరాలూ, ఇతరుల దర్శనమూ ఇవ్వలేని ఆనందం ప్రియురాలి గొంతూ, ప్రియురాలి ఆకృతీ ఇస్తుంది అందుచేత ప్రియురాలిలో ప్రియుడికి దేవాంశ కనిపిస్తుంది.

సీతారామయ్యకు కథకుల్లో ఇటువంటి అంశే కనిపించేది. అయితే సీతారామయ్యకూ కవికాముకుడికీ ఉన్న తేడా ఏమిటంటే, కవి కాముకుడు తన ప్రణయ గీతాలు పట్టుకుని చచ్చే దాకా వేళ్ళాడతాడు. అవి తుక్కు అన్నవాణ్ణి తిట్టిపోస్తాడు. తుచ్ఛమైన తన కీర్తిని అనేక వేదికల మీదినించి చాటుతాడు. సీతారామయ్య అట్లా కాదు. అతను కథకుల్ని ఆరాధించినంత కాలము ఆరాధించి ఆఖరుకు ఒక శుభ సమయాన చదువుతున్న పత్రిక నేలకేసి కొట్టి, "ప్రెతీ వెధవా కథ వ్రాసే వాడే" అని చీదరించుకున్నాడు.

ఆ ముహూర్తాన ఒక సామాన్య వ్యక్తి, ఒక అనామకుడు, ఆఖరుకు నవ్య సాహిత్య పరిషత్తు సభ్యత్వం కూడా ఎరగని ఒక "కోన్-కిస్కా-హై" గాడు, నవ్య సాహిత్యపరిషత్తు కూడా శీత కన్నేసిన కథాసాహిత్యం మీద విప్లవం చేశాడు.

"ప్రెతీ వెధవా కథ్రాసేవాడే!" అనే తృణీకారభావం ఎప్పుడైతే కలిగిందో అప్పుడే సీతారామయ్యకు, "నేనే కథ ఎందుకురాయగూడదు?" అనిపించింది.

తానే కథ రాయాలనే లోకోత్తరమైన అభిప్రాయం సీతారామయ్యకు కలగటం ఎంతో మేలయింది. లేని పక్షంలో ఈ పాటికి సీతారామయ్య ఆధునిక తెలుగు కథాసాహిత్యం మీద విప్లవం సాగించి సాహిత్యలెనినో, సాహిత్యస్టాలినో, అయికూర్చుని ఉండును.

"నేనీ వెధవల పాటి రాయలేకపోను!" అనుకున్నాడు సీతారామయ్య. అప్రయత్నంగా అతనికి "ఆ వెధవల"పక్షాన పుట్టుకొచ్చిన క్రోధాగ్ని దోవతప్పి

ఎటో మారుపడి పోయింది. సీతారామయ్య తీవ్రంగా కథనుగురించి ఆలోచన మొదలుపెట్టాడు.

అందుబాటులో ఉండాలే గాని, కథ గురించి ఆలోచించటానికి ఈజీచైరుకు సాటి మరొకటి లేదు. దానికి తోడు తలకింద చిన్న దిండూ, కాళ్ళు ఎత్తుగా పెట్టుకోవటానికి ఎత్తయినస్టూలుగాని,ఇంకోకుర్చీగాని ఉంటే మరీమంచిది.అదే రాత్రి పూట నయితే ఆవలింతలు ప్రారంభమయ్యే వేళకు దీపం తగ్గించేసి, ఆలోచించే వాడి తత్వానికి అనుకూలంగా కుడి పక్కకో, ఎడంపక్కకో ఒత్తిగిలిపడుకుని ఆలోచిస్తే మంచిది.

అదృష్టవశాత్తూ సీతారామయ్య దగ్గర ఒక పడకుర్చీ ఉంది. సీతారామయ్య అందులో నడుం వాల్చి తను రాయ బొయ్యే కథను గురించి తీవ్రంగా ఆలోచించ సాగాడు.

త్వరలోనే అతని తల ఒకపక్కకు ఒరగబడి పోయింది. అతని కుడిచెయ్యి తలవెనుక దిండుగా పని చేస్తున్నది. అతని ఎడంచెయ్యి గుండె మీద విశ్రాంతి తీసుకుంటున్నది. ఆలోచనా సమాధి సమగ్రంగా ఏర్పడింది.

"నేను పనికొస్తాను, నన్నుపయోగించుకో!" అన్నాడు ఎదురుగాఉన్న వ్యక్తి.

"ఎవరు నువ్వు?" అన్నాడు సీతారామయ్య

"నన్నెరగవా? నేను పాప్యులారిటీ వోటు పొందిన కథానాయకుణ్ణి!"

"నీకు వోటిచ్చిన వారెవరు? కథలు చదివే వాళ్ళేనా?"

"చదివే వాళ్ళ దగ్గర ఎవరన్నా వోటు తీసుకుంటారా ఏమిటి? నేను రాసే వాళ్ళ వోట్లూ, ప్రకటించే వాళ్ళ వోట్లూ పొందాను."

"నువెవరన్నావు. నీ కులమేమిటి? గోత్రమేమిటి? నీ ఆస్తెంత? నీకేం పని? నువు కాంగ్రెసు వాడివా? ముస్లింలీగు వాడివా? నీ రాజకీయసిద్ధాంతరాద్ధాంత లేమిటి? ఏమీ తెలీకుండా నిన్నెట్లా ఉపయోగించను?"

కథానాయకుడు నవ్వాడు.

"నీకు కథలు రాయటం బొత్తిగా చాతకాదల్లే ఉంది. నా జీవిత చరిత్ర రాసే వాడల్లే మాట్లాడుతున్నావే. నా జీవితంలో ఒక్క సంఘటన గికి అవతల పారేసి గొప్ప కథకుడై పోవటానికి నా కులగోత్రాలడగుతావేమిటెక్కడో!"

"నిన్ను గురించి ఏమీ తెలియక్కర్లేకుండా రాయదగిన నీ జీవిత సంఘటన ఏముంటదబ్బా!"

"ఒక ప్రణయ ఘట్టం రాసెయ్యవోయ్- యూంసేపు తర్కించకా!"

"నీ ప్రణయంతో నీ సంస్కారానికీ, ఆస్తికీ, నీ ఉద్యోగానికీ ఏమీ సంబంధం లేదా ఏమిటి?"

"నన్నెటూ గాని వేళ నవ్వించకు. అర్ధరాత్రివేళ ఆ తోటలో-"

"ఏ తోటలో?"

"ఏదో తోటలో! నీకు సంబంధించని విషయాలు తెలుక్క .... ఆ తోటలో నేను, ఆమె నాకు దక్కదని నిరాశ చేసుకుని పచారు చేస్తుండగా, చీకట్లో మెరుపల్లే ఆమె నా దగ్గరవాలి, నన్ను తన బాహువుల్లో పెనేసి నా ఒళ్ళో వాలిపోవటానికి, నేనెవ్వణ్ణయితే నీకేం?"

"మాటవరస కడుగుతున్నాను, ఆవిడెవరు?"

"బాగుందే? నాకు మటుకేం తెలుసూ? ఆవిడా నా మాదిరిగానే చాల అందగత్తె, అంతకన్న నీకేం కావాలి?.........కొంప తీసి చలం గారల్లే నాకు రోగాలూ రొష్టూ పెట్టకు. నేనింత మందిని వశం చేసుకున్నా గాని, నాకామేశం మాత్రం తటస్థ పళ్ళేదు. కనక దయవుంచి వెంటనే నాకథ రాసి నీ వోటుకూడా నాకు పారెయ్!"

"ఇంత మంది ఓట్లు సంపాదించావు, నా ఒక్కడి వోటూ లేకపోతే ఏం?"

"ఆ మాటలో అర్థం లేదు. వోట్లు నాకోసమా? జన సామాన్యం కోసంగాని! జనసామాన్యానికి నా కథలే కావాలి, నీకు డెమోక్రసీలో ఏమన్నా విశ్వాసంవుంటే, నీ వోటేదో నాకే తగలెయ్!"

" 'కావాలి' అనే మాటను చాలా దుర్మార్గంగా ఉపయోగిస్తున్నావు. వాళ్ళు నీ కథలు కోరుతున్నారు. వాళ్ళకు కావలసిందేమిటో వాళ్ళకు తెలీదు. నన్నాటే వేధించక ఇక పద. తర్వాత వాళ్ళెవరో ముందుకు రండి" అని అతన్ని వెళ్ళగొట్టాడు.

ఒక ఆడమనిషి ముందుకొచ్చింది.

"ఇందాక నీతో మాట్లాడిన వెధవతో నువు చలంగారి మీద అభిమానం ఉన్నట్టు మాట్లాడావు. నన్ను గురించి కథరాయి" తన వొంపులన్నీ ప్రకటిస్తూ.

"ఎవరు నువ్వు?"

"నేనెవరేమిటి? నేనే సుందరమ్మను, చుక్కమ్మను, అరుణను, మాదిగమ్మాయిని, 'కా'ను, 'చా'ను, 'జా'ను! తెలిసిందా?"

"ఏం చేస్తావు నువు?"

"రకరకాల మగవాళ్ళకి స్వర్గం చూపిస్తాను.నన్ను ప్రేమించనిస్తాను నాకోసం యాడవనిస్తాను.నా కోసం పిచ్చెత్తనిస్తాను. నా వొంపులు తనివితీర చూడనిస్తాను."

"నువ్వేం చేస్తావని అడిగాను."

"న్నేనా?" అలోచించింది. "నేనూ ప్రేమిస్తాను"నవ్వింది విజయ సూచకంగా.

"ఎవర్ని?"

"విలవదీసి అడక్కు. అడది అనేక మందిని అనేక విధాలగా ప్రేమిస్తుంది. అందుట్లో కథకుణ్ణి మాత్రం కొంచెం ప్రత్యేకంగా ప్రేమిస్తుంది.

"మధ్య కథకుడెవడు?"

"కథకుడంటే కథానాయకుడన్న మాట. కోనీ నీయిష్టం. నన్నుచూస్తే భయమైతే నువు పాత్రవుగా వుండకు. నాకెట్లాగైనా ఒకటే."

"ఇంత మందిని ప్రేమిస్తే నిన్నెవరూ తన్నరూ?"

"నన్నా! నన్నా! నన్నారాధిస్తారు, నా కోసం ఏడుస్తారు. నా కోసం కుక్కలల్లే —"

"నిన్ను తన్నేటంత నిర్లిప్తుడుండడా" అని అడిగాను. "నీ భర్త-"

"వెధవ! నన్ను సుఖపెట్టలేడు, తన్నగలడా?"

"అది చాతకాక, ఇది చాతైన వాళ్ళు లేకపోలేదు. నీ మాట కాదన్నందుకు క్షమించు."

"నన్నెవరూ తన్నరు. నేనా జాతి కాదు. ఆ జాతివాళ్ళు వేరే ప్రచారానికి!"

"పచ్చిదానా, ఎవణ్ణి ఎవడైనా నడి వీధిలో జుట్టుపట్టుకు తన్నవచ్చును. నీవంటిదాన్ని విన్నారాధించే వాళ్ళే తన్నవచ్చును."

ఆవిడ కళ్ళు అగ్రహంతో మెరిసినై.

"ఎవడ్రా నువ్వు? నీ చచ్చు బొక్కు తెలుగాడవాళ్ళతో మాట్లాడినట్టు నాతో మట్లాడతావా? నేనెవతెననుకున్నావు? మొపాసా, వెల్స్, మైకేల్ అర్లెన్ మొదలైన వాళ్ళ తలల్లోంచి ఊడిపడ్డదాన్ని తెలిసిందా! ఒళ్ళు దగ్గర పెట్టుకు మాట్లాడు."

"అదా నీ రహస్యం? అయితే పద. వేంచెయ్యి, నేనంత సుప్రసిద్ధుణ్ణి కాను. వెనుక ఎవరో రండి."

ఇద్దరు దంపతులు ముందుకొచ్చారు.

"మీరిద్దరూ భార్యాభర్తలా?"

"అవును, మేం హరిజనులం. మేం పొలం పన్లూ, తోట పన్లూ అవీ చేస్తూంటాం. లోకం మమ్మల్ని అస్పృశ్యులనుగా చూసి ఎడ తెగని పాపం అంటగట్టుకోవటమే కాకుండా, మా మీద దారుణమైన అత్యాచారాలు చేస్తున్నది."

"మీరు చదువుకున్న హరిజనులా?"

"కాదు, మాకు చదువెట్లా వస్తుంది? ఎవరు చెప్పిస్తారు? మమ్మల్ని గుళ్ళ ల్లోకే పోనివ్వరే, బళ్ళల్లోకి రానిస్తారా?"

"మీకు గుళ్ళోకి పోవాలని వుందా?"

"ఉండదా!"

"దేనికి?"

"మీరింతా పోరా?"

"నేను బుద్ధెరిగి గుళ్ళోకి పోలేదు. ఎప్పుడన్నా తిరణాలకు పోతాను.అక్కడ ఆ జన సమ్మర్దంలో-అదంతా మీకనవసరం. ఇంతకూ అసలు సంగతేమిటంటే, మీరింత స్వచ్ఛంగా ఎట్లా మాట్లాడుతున్నారు? మీకు కొంత సంస్కారం ఉన్నట్టు కనబడుతుందే, అదెక్కడిది?"

"మీ కథలు రాసేవాళ్ళ సంస్కారమే మాదిన్నీ. మీకు ప్రతిష్ట తేవటానికి మేంగాని, మాకు వొరిగేదేముందేం?"

"బాగానే ఉంది. అయితే మీ కథ ఏమిటి ?"

"కథేముంది? మేమిద్దరమూ ఎంతో ప్రేమతో...."

"ప్రేమా?"

"అవును, ప్రేమే? మేం మనుషులం కామా? మాకు హృదయములు లేవా? మమ్ము భగవంతుడు ప్రత్యేకించి సృజించెనా?"

"కోప్పడకు, కోప్పడకు! ఈ భాగ్యానికి గ్రాంధికం దేనికి?"

"ఉద్రేకం జాస్తి అయినప్పుడు వాడుకభాష చాలదు. ఇట్లా అడ్డ పుల్ల వేస్తే కథ సాగదు మరి."

"కానీ, కానీ! అడ్డం రాన్లే, చెప్పు!"

"మేమంత అన్యోన్యంగా ఆ గుడిసెలో కాపురం చేస్తూంటే, ఇంతలో నాకు జబ్బు చేస్తుంది. నేనొక పూట నడుం వాలుస్తే ఇంట్లో గంజీనీళ్ళుండవుగా? ధన మదాంధులైన ఎక్కువ జాతి వారికి మా దారిద్ర్యం పడుతుందా? వారి కాఫీ లేమో, వారి సినిమాలేమో, వారి చీని చీనాంబరాలేమో, వారి తాగుళ్ళేమో...."

"నువ్వు కమ్యూనిస్టువు కూడానా ?"

"భాగ్యవంతులను చూసి అసూయ పడేవాడు కమ్యూనిస్టు. నేను భాగ్యవంతులను చూసి జాలి పడతాను. మా వంటి దరిద్రులే మంచివాళ్లు. మేమే హరిజనులం. ప్రపంచమంతా దరిద్రులే ఉంటే పాపాత్ములుండరు. నేను కమ్యూనిస్టునా? పాపం శమించుగాక! నాది గాంధీ తత్వం....మళ్ళీ అడ్డొస్తున్నావు! నేనా విధంగా జబ్బుపడి ఉంటే నా భార్య, ఎంతో అభిమానవతి, తగని పతివ్రత, ఆ అర్థరాత్రివేళ ఆ వానలో...."

"అది వానాకాలమా?"

"నీకు కథలు రాయటం చేతకాదల్లే ఉందే?"

"నువ్వా కనుక్కున్నావు? ఏమిటా తిరుగుడు?"

"బయట వానా, ఉరుములూ, మెరుపులూ, హోరుమని గాలి, గుడిసెలో మినుకు మినుకు మంటూ ఆరిపోజూస్తున్న గుడ్డి దీపమూ- అది నా ప్రాణానికి చిహ్నంలే!—ఇదంతా ట్రాజెడీకి ఎటువంటి ఎట్మాస్ఫియర్!"

"ఓహో! తెలిసింది, తరవాత?"

"తరవాత నా భార్యా, తగని పతివ్రత...."

"అదంతా చెప్పావు."

"నీ నస చూస్తే నాకు మండి పోతున్నది. నా భార్య చంటిపిల్లవాణ్ణి చంకనేసుకుని...."

"ఓ చంటి పిల్లాడు కూడానా."

"వాడు భగవంతుడి స్వరూపం. జరగబోయే పాప కృత్యానికి వాడే సాక్షి! చంటి పిల్లాణ్ణి చంకనేసుకుని ఆ వానలో పడి మా యజమాని ఇంటికి పోతుంది. మా యజమాని తప్ప తాగి ఒంటరిగా ఉంటాడు."

"ఒంటరిగా ఏం ఖర్మం?"

"అదంతా నన్నడక్కు. భాగ్యవంతులు వాళ్ళకేం? వంద మందినింట్లో పెట్టుకున్నా, ఉన్న వారిని వెళ్ళగొట్టినా వారికి చెల్లుతుంది. నా గుడిసెలో నేను ఒంటరిగా ఉండటానికి లేదే. ఓ రాత్రివేళ నా గుడిసెలోకి ఏ దొమ్మర దాన్నన్నా చేర్చటానికి లేదే...."

"నా భార్యను చూడగానే మా యజమానికి కామోద్రేకం కలుగుతుంది. తడిసిన బట్టల్లోంచి తళతళ మెరిసే దాని దేహం, ఆ దేహం తాలూకు వొంపులూ...."

"ఆ వొంపులు కాస్త సరి చెయ్యి బాబూ. అన్నట్టు నీ భార్య ఒళ్ళు తళతళా మెరవాల్సిన అవసరం ఏముందీ? నల్లగా ఉండదూ?"

"పోనిస్తూ! నువ్వెక్కడో విమర్శకుడల్లే ఉన్నావు గాని, కథకుడల్లే లేవు. నలుపు సరుకులో నాణెము లేదా? వార్నిష్ వేస్తే చంద్రకొయ్య మెరవదూ?.... ఆ దుర్మార్గుడు, ఆ ధన మదాంధుడు మోహావేశ పరవశుడై నా భార్యను గవయబోవ నా యమ సంభ్రమము చెందియుండ చంకలోని కుర్రాడు కెవ్వన నార్చి...."

"అదంతా నేను రాస్తాను, నువు టూకీగా కథ చెప్పు."

"మా యజమాని నా భార్యను చెరిచేస్తాడు, ఆ పసిగుడ్డు ఎదట. నా భార్య శరీరం తాలూకు వెచ్చదనం వాడి శరీరాన్ని మరింత మత్తెక్కిస్తుంది. దాని పటువైన రొమ్ములు వాడి రొమ్ముకు అదుముకుని, దాని నును పైన తొడలు...."

"ఈ దిక్కుమాలిన వర్ణనంతా దేనికి? నా కొడదాని గొడవే తేలీదనుకున్నావా ఏం? తరవాత?"

"అక్కడ నా భార్యకు మానభంగం అయే ముహూర్తాన ఇక్కడ దీపం ఆరిపోతుంది. నేను మరణిస్తాను. యజమాని నా భార్యను పట్టుకు లాగటంలో పిల్లవాడు కింద పడి చచ్చిపోతాడు. యజమాని చేత పాతివ్రత్యం కోల్పోయి నా భార్య గుడిసెకు వచ్చి నా శవంచుట్టూ ప్రదక్షిణంచేసి, పోయి బావిలోపడి మరణిస్తుంది."

"సరే, దోష గుణం తగిలి మీ యజమాని మరణిస్తాడు. క్షమించు నీ కథ నాకొద్దు. నువ్వు వెళ్ళేటప్పుడు నీ తరవాత మనిషిని పంపించు."

* * * *

ఈ వ్యాపారం సీతారామయ్యకంతకంతకూ రక్తిగా కనిపించసాగింది. ఏ కథకుడూ ఇంత వరకు పాత్రలతో మాట్లాడినట్టు అతనెరగడు. తను ఎన్నడూ మామూలు వ్యక్తులతో ఇంత తెలివిగా మాట్లాడి వుండలేదు. మామూలు మనుషులతో మాట్లాడ్డం కన్న పాత్రలతో సంభాషించటం చాలా తేలిగ్గా ఉంది.

ఒక్కసారిగా అయిదారుగురు వ్యక్తులు, స్త్రీ పురుషులు తోసుకుంటూ లోపలికొచ్చారు.

"మీరంతా ఎవరు?" అన్నాడు సీతారామయ్య.

"మేం యథార్థ వ్యక్తులం!" అన్నాడు వాళ్ళ ప్రతినిధి.

"అంటే— ఇటీవల బయలుదేరిన యథార్థవాదంతో మీకేమన్నా సంబంధం ఉందా? ఎందుచేతనంటే ఈ యథార్థ వాదం నాకు స్పష్టంగా అర్థం కాలేదింకా. యథార్థమనే వంక పెట్టి కొందరు వొత్తి పొడిగజం- ఏ విధమైన ప్రయోజనమూ ఉండటానికి వీల్లే నిది....రాస్తున్నారు. ఉన్నదే రాయటానికి రాత ఎందుకూ; రాయదలుచుకున్న తరవాత ఉన్నదానిమీద సంస్కారంఅంటూ యాడవాలిగా!పోనీ యథార్థవాదం త్యజింతామా అంటే, భావకవులతో వేగలేకుండా ఉన్నాం. వాళ్ళు మబ్బుల్లో కూచుని జీవితంకేసి చూడకుండా ఉన్నారు. కనక ...."

"ఈ ఉపన్యాసమంతా ఏమిటి? మేం యథార్థ వ్యక్తులం, అంటే నీ పరిచితుల్లో వాళ్ళం."

"నేను మిమ్మల్నెరగనే!"

"నువు నీ పరిచితుల్ని మాత్రం ఎరుగుదువా ఏమిటి?"

"కనకనే- నువ్వెరిగున్న వారిలో ఎవరి మీదన్నా దెబ్బ తియ్యాలనుకో, ఎవడన్నా నీ కథ అచ్చెయ్యలేదనుకో, ఎవడన్నా నువ్వవునన్నది కాదన్నాడనుకో, నిన్ను పోషించి కాఫీ డబ్బులిచ్చుకునే వాడికెవడన్నా అవమానం చేశాడనుకో, వాడి

మీద తడాఖా తియ్యటానికి వాడి స్థానే మమ్మల్ని పెట్టి నువ్వా ఆటఆడించెయ్య వచ్చు."

"తెలిసింది తెలిసింది! అదా, యధార్థవ్యక్తులంటే? అవును చాలా ఉత్తమ కథకులూ, నవలా కారులూ, నాటక కారులూ, ఇతర కారులూ మిమ్మల్ని బాగా ఉప యోగిస్తున్నారు. ప్రస్తుతం నేను అనామకుణ్ణి, నాకూ ఓ పేరు వచ్చి, నేనూ ఓ యింటివాణ్ణయి, నన్ను చూసి ఏడిచే దౌర్భాగ్యులు కూడా ఏర్పడ్డప్పుడు నేను తప్పక మీకు కబురు చేస్తాను. ప్రస్తుతం మీరు వేంచెయ్యవచ్చు. మీ సౌహార్థానికి నా ధన్య వాదాలు."

అకస్మాత్తుగా సీతారామయ్యకు భయం వేసింది. తనను ఇంటర్వ్యూ చెయ్య డానికీ అనేకవేలమంది తయారుగా వున్నారనే నమ్మకం అతనికెందుకో కలిగింది. ఇంత మందితోనూ తను తెలివిగా మాట్లాడడం అసంభవం. అసలు మంది మీద ప్రయోగించేది తెలివితేటలు కానే కావు. అందుకనే రచ్చగెలిచేవాడు ఇంట గెలవ లేడు. సభను ఉర్రూతలూగించే వాడు ఇవతలికొచ్చి ఒంటరిగాడికి, సమాధానం చెప్ప లేడు.

వెనక గిరీశం అనుకున్నట్టే సీతారామయ్య కూడా "శీఘ్రబుద్ధిఃపలాయ వం" అనుకున్నాడు. అతను బయటికొచ్చాడో లేదో ఓ లక్ష మంది అతన్ని చుట్టు ముట్టేసినట్టయింది. అందరూ ఒక్కసారే మాట్లాడుతున్నారు.

"మేం, పాశ్చాత్యులు కల్పించిన పాత్రలం. మమ్మల్ని ఉపయోగించు. ఎవరూ కనుక్కోర్లే.... నేను కథకుణ్ణి, నన్నే పాత్రగా ఉపయోగించు. నేనంటే నువేఅన్నమాట! తెలిలా? నీకు జీవితంలో ఏయే కోరికలు తీరటంలేదోఅవన్నీ నీ కథల ద్వారా తీర్చుకో నా ద్వారా. నేనే నువుగా? తెలిసిందా?.... మేం పురాణ వ్యక్తు లం.... మమ్మల్ని గురించి కొత్త దృష్టిలో రాయి. మేం దేవతలం. మమ్మల్ని కూడా ఉపయోగించు— నీ వెధవ వాస్తవికత్వం కట్టిపెట్టు!.... మమ్మల్ని గురించి రాయి. మేం జీవిత శ్లేష్మంలో పడి కొట్టుకుంటున్న ఈగలం. మా దరిద్రమూ, మా విశ్వాసమూ, అసమర్థతా, అవినీతి ఉన్నదున్నట్టు రాయి. గొప్పవాడివవుతావు! పైకొస్తావు! ఒట్టి నిజం లోకానికి చెప్పు! పోపోకు! రా, రా!"

సీతారామయ్య చెవులలో వేళ్ళు పెట్టుకుని పరుగెత్తసాగాడు. అప్పటికే ఆ గొంతులు తనను వెన్నాడుతూనే ఉన్నై. ఇంకా పరుగెత్తుతున్నాడు.....

* * * *

అంతా ప్రశాంతంగా ఉంది. సీతారామయ్య చేలమధ్య నిలబడి ఉన్నాడు. తను నిలబడి వున్న రోడ్డు ఏకో బస్తీకి పోతున్నది. బస్తీ దూరంగా చెట్లమీద మంచి కనిపిస్తుంది. రోడ్డుకు ఒక పక్క ఉన్న చేలో నాట్లేస్తున్నారు. మరో పక్క

కుప్పలు కొడుతున్నారు. "వారే బూసనం" "వాసే యీరమ్మ" "వాసి రత్తీ" అని పిలుపులు మధ్య మధ్య వినపడుతున్నై.

సీతారామయ్యకు వాళ్ళను చూస్తే ప్రాణం లేచివచ్చింది. కనీసం వాళ్ళయినా తమ పనులు తాము చూసుకుంటున్నారు. సీతారామయ్యను ముట్టడించటానికి వాళ్ళేమీ ప్రయత్నం చెయ్యలేదు. వెంటనే సీతారామయ్య వాళ్ళను సమీపించి, "ఏమర్రా మీరంతా నా కథలోకి రండి" అన్నాడు.

ఒక చాపల్లాంటి కళ్ళుగల మిటారి పడుచు ముచ్చటగా మొహంచిట్లిస్తూ "యేందీ!" అంది.

"నువు నా కథలోకి రా!" అన్నాడు సీతారామయ్య.

"యెటకారాలా యెట్టాసి, మా అయ్యతో జెప్పి నీ తిక్కొదలగొట్టిపిత్తా! నా చంగ తెరగవ్!" అన్నది.

ఆడవాళ్ళతో వ్యవహారం తేలదని సీతారామయ్య కాస్త వయో వృద్ధుడైన వాణ్ణి చూసి వాడితో తన కోరిక చెప్పాడు. "మా వోటా నల్ల జేపన కుర్రాయనకచ్చేశాం. నల్లగా నీ దారే నువ్వెల్లు!" అన్నాడు ముసలాడు.

సీతారామయ్య బిత్తరపోయి రోడ్డు వెంబడే బస్తీ చేరుకున్నాడు. బస్తీలో అంతా కుర్రకారు కనిపించారు. అంతా రాడికలిస్టులూ, సోషలిస్టులూ, కాంగ్రెసు సోషలిస్టులూ, కిసానిస్టులూను. 'ఒకడు విప్లవానికి జయ్' అంటున్నాడు. మరొకడు 'అర్ధిక భౌతికతత్వం' అంటున్నాడు. చాలా మంది రష్యాలో ఉన్నామనుకుంటున్నారు. కొందరు 'రష్యా పరిస్థితులకీ, ఇండియా పరిస్థితులకీ తేడా' లేదంటున్నారు. మరొకడు 'సక్రమమైన ఫాసిస్టు వ్యతిరేకత ప్రణాళిక తయారు చేస్తేగాని, ఈ యుద్ధం సరి అయిన అకారం దాల్చదు' అంటున్నాడు.

వాళ్ళ మాటలన్నీ విని సీతారామయ్యకు అగమ్యగోచరంగా ఉన్నప్పటికీ వాళ్ళను చూస్తే ముచ్చటేసింది. వీళ్ళ అజ్ఞానాన్ని చిత్రించటమైనా చెయ్యదగిన పనే ననిపించింది. కొత్త సమస్యలు కొత్త అజ్ఞానాలకు అవకాశం కలిపిస్తాయి. లేని సమస్యల గురించీ, తీరిపోయిన సమస్యల గురించీ అజ్ఞానంగా ప్రవర్తించే పాత్రలకంటే వీళ్ళు చాలా నయం.

"ఏమర్రా! మీరంతా నా కథలో పాత్రలుగా ఉండరాదూ?" అన్నాడు సీతారామయ్య.

"మా సంగతి మా వాడు చూస్తాడులే, నువ్వు రాస్తే చెడగొడుతావు తమరు దయచెయ్యండి!" అన్నాడొక మనిషి.

సీతారామయ్య హతాశుడైనాడు. ఆ పొలాల్లో ప్రపంచం పని తమ పనే అనే విశ్వాసంతో పని చేస్తున్నవాళ్ళూ, ఈ ఊళ్ళో ఎవరి పని అయినా ప్రపంచం పనే

గైర్ హాజర్‌లో

విమానం సకాలంలోనే వాలింది.

రాజావారిని రిసీవు చెయ్యటానికి అన్ని పార్టీల ప్రతినిధులూ విమానాశ్రయానికి వచ్చారు. జాతీయ సమైక్యత సాధించామనటానికి ఇంకేం నిదర్శనం కావాలి?

"ఓహో, మీరూ వచ్చారా?" అన్నారు రాజావారు నన్ను చూసి. అందులో ఎంత అర్థమైనా ఉన్నది ఆలోచించే వాడి', మిగిలిన వారు రావటం లాంఛన. నేను రావటం ఆత్మీయత.

మహారాజా వారి గైర్‌హాజర్‌లో దిబ్బలో చాలా పరిణామాలు జరిగాయి. వాటిని గురించి అధికార పూర్వకంగా ఉత్తరాలు వెళ్ళే ఉంటాయి. అయినా నానోటి మీదుగా విన్నదారి వేరు.

అదే విధంగా తూర్పు యూరప్‌లో కూడా చాలా పరిణామాలు జరిగాయి. వాటిని గురించి పత్రికల్లో చదివాం. కాని ఆయన నోటి మీదుగా విన్నదారి ఎలాగైనా వేరే. ఎంత మంది అయితే రాజావారిని రిసీవు చెయ్యటానికి వచ్చారో అంత మందీ—రాదర్, అంత మందిమీ—హోటల్ బార్‌లో అంటిపెట్టి ఉన్నట్టు గమనించాను.

రాజావారిని అందరూ ఇలా ఒక ప్రశ్నా వేస్తారు.

కోసిగిన్‌గారు బాగున్నారా?

తమకు బ్లాక్ సీ కానియాక్ చాలా ఇష్టమనుకుంటాను? యేస్తుషింకకు నోబెల్ ప్రైజ్ వచ్చి ఉండవలసిందని మాస్కో వర్గాలు అనుకున్న మాట నిజమేనా? కొత్తబాలే—దాని పేరేమిటీ?—సందర్శించారా?

అనేవిశ్వాసంతో, చేసే పని లేక జర్జనభర్జనలు పడుతున్న ఈ కుర్రాళ్లూ తనను నిరాకరించారు. ఇక తన జీవితమంతా తనకు కావలసిన పాత్రలను వెతకటంలో గడపాలి కాబోలు. అదుగో! ఎవరో తనను పిలుస్తున్నారు. వాళ్ళేమయినా తమ వోటిస్తారేమో! పోవాలి.... సీతారామయ్య పరుగెత్తసాగాడు. ఏదో కాలికడ్డం తగిలి బొక్కబోర్లా పడ్డాడు. తలకు ఏదో గట్టి పదార్థం టంగున తగిలింది....

సీతారామయ్య కుర్చీలో లేచి కూర్చున్నాడు. కుర్చీ అడ్డ కర్రకు తల తగిలి కొద్దిగా నెప్పి పెడుతున్నది.

బయట ఎవరో, "సీతారామయ్యగారూ?" అని పిలుస్తున్నారు.

"ఓయ్, వస్తున్నా!" అన్నాడు సీతారామయ్య నిద్రమత్తుతో.

* ('యువ బుక్స్' ప్రచురణ 'వరప్రసాదం' కథల సంపుటి నుండి)

టి. యు — 144 టెస్ట్ ఫైయిట్ జరిగినప్పుడు తమరు అక్కడే ఉన్నారు గదూ?

కొందరు గృహచ్ఛిద్రాలు కూడా ప్రస్తావించారు. వీళ్ళు జర్నలిస్టు రాక్షసులు.

"దిబ్బలో కమ్యూనిస్టు విజృంభణకు కారణమేమంటారు?"

రాజావారు 'ఏమిటి వీడి ఉద్దేశం' అన్నట్టు నాకేసి చూసారు.

"ఆ ప్రశ్నకు రాజా వారి కన్నా నేను సరయిన సమాధానం ఇవ్వగలను. నేను తిన్నగా దిబ్బ నుంచి వస్తున్నాను. మీరు చెప్పేది కమ్యూనిస్టు పార్టీల సంఖ్య ఇబ్బడించటం గురించి అనుకుంటాను, దిబ్బలో ఈనాడు అయిదు కమ్యూనిస్టు పార్టీ లున్నమాట నిజమే. దాన్ని తెలిసిన వాళ్ళెవరూ కమ్యూనిస్టు విజృంభణ అనరు. దిబ్బలో కమ్యూనిస్టుల సంఖ్య ఎంతమాత్రమూ పెరగలేదు. అంతోఇంతో తరిగింది.

"దిబ్బ కమ్యూనిస్టు చరిత్ర సంగ్రహంగా సమీక్షిస్తాను. ప్రూ శ్చా వ్ హయాంలో ఒక కమ్యూనిస్టు పార్టీ రెండయింది. దాని రష్యా పార్టీ, చీనా పార్టీ అన్నారు. ఒకటి రెండవుతుంది అన్న మార్క్సిస్టు సూత్రం ప్రకారం రెండు పార్టీలు నాలుగయాయి. రెండు రష్యా పార్టీలు రెండు చీనా పార్టీలూనూ. ఈ నాలుగు ఇలా వుండగా అయిదోది ఎన్నికలు వద్దనే పార్టీ ఒకటి వచ్చింది. ఈ అయిదు పార్టీలకు ఒకటంటే ఒకటికి పడదు. వాళ్ళ రాజకీయాల్లో ఇవాళ ఇతర పార్టీలేవీ లేవు. అందరూ లెనిన్‌నూ, మార్క్సునూ ఉదహరిస్తారు. వాళ్ళకుజనంతో అసే పని లేదు. జనానికి వాళ్ళతోను అంతగా పనిలేదు. అన్ని పార్టీల మహాసభలకు జనం విరగబడి వస్తారు. దీన్ని కమ్యూనిస్టు విజృంభణ ఎలాగంటారో నాకు తెలీకుండా ఉంది."

ఇంకో జర్నలిస్టు రాజావారి మీద మరొక ప్రశ్న విసిరాడు. "నాలుగో ప్రణాళికలోనైనా దిబ్బను పారిశ్రామికంగా పైకి తెచ్చే యత్నాలు జరుగుతాయా?"

ఈసారి రాజాగారికేసి చూశాను. ఆయన కానిమ్మన్నట్టు తల ఆడించాడు.

"దిబ్బ ఇది వరకే సంపూర్ణంగా పారిశ్రామికమయింది," అన్నాను.

"నిజంగానా?....అన్ బిలీవబుల్!....మొదటిసారి వింటున్నాం...."

అన్నాయి అనేక కంఠాలు.

"గత ఇరవై ఏళ్ళ చిల్లర కాలంలో దిబ్బ నుంచి నలుగురు ఇంజనీర్లు తయారయారు. అందులో ఒకరు దిబ్బ పరిశ్రమలు నెలకొల్పటంలో సహాయపడి లక్షలు గడించి, ప్రస్తుతం పార్లమెంటుసభ్యుడుగా దిబ్బకూ, తిరుగుంటానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రెండున్నర సంవత్సర కాలంలోనూ వారు లోక్ సభలో నోరు విప్పలేదంటే, దిబ్బకు ఎలాంటి సమస్యలు లేవని చెప్పకుండానే తెలిసిపోతోంది. మిగతా ముగ్గురిలో ఒకరు కెనడాకు వలస వెళ్ళి అక్కడ ఒక

గొప్ప వర్క్‌షాప్‌లో ఫిట్టర్‌గా పనిచేస్తున్నారు. మిగిలిన ఇద్దరు ఇంజనీర్లకూ పని చూపలేకుండా ఉన్నాం. దానిని బట్టి దిబ్బ పరిశ్రమలు Saturation కు వచ్చాయని తెలుస్తూనే ఉన్నది. ఇంజనీర్ల Self-sufficiency మే గదా పారిశ్రామిక సమగ్రతకు గీటురాయి! దిబ్బలో తగు మాత్రం నిరుద్యోగం కూడ వుంది. గనక, పరిశ్రమలకు అంగబలం లోటు లేదనీ, లేబరు చాల competetive గా ఉండి ప్రాఫిట్స్ కూడా బాగా ఉంటున్నాయనీ తమరు అనుకోవచ్చు" అన్నాను.

"తిరుగుండం వారు దిబ్బ నుంచి వేరుపడ గోరుతున్నారట నిజమేనా?" అని మరో ప్రశ్న.

"అది చెప్పుకోదగినంత తీవ్రమైన సమస్య కాదు. తిరుగుండం వారికి inferiority complex. అర్హులైన తిరుగుండ్లకు ఉద్యోగాలు ఇవ్వటం జరిగింది, కాని అర్హత గల తిరుగుండ్లు దొరకని పక్షంలో ఉద్యోగాలను ఖాళీగా ఉంచాలని, కొన్ని సీట్లు ఖాళీగా ఉంచటం వల్ల కొంప మునిగిందేమీ లేదని వారి వాదం. అందుచేత వారు ఒక ఉద్యమం లేవదీసి అయిదారు గుర్రబ్బళ్ళనూ, రెండు స్టేటు జీపులనూ తగులబెట్టారు. ఒక ఆస్పత్రిని నేలమట్టం చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ముప్పైయిద్దరు మాత్రమే మరణించారు. అందులో ఒక్కరు కూడా ఉద్యమం వాళ్ళుకారనీ, చనిపోయిన వారిలో అయిదారుగురు ఆడపిల్లలూ, ఇద్దరు ముగ్గురు వీధిబడి పిల్లలూ, ఒక బ్రాహ్మణ వింతతువూ, ఇద్దరు బిచ్చగాళ్ళూ ఉన్నారనీ ఒక సుదీర్ఘ వ్యాసం దిబ్బ టైమ్సులో—ది దిబ్బాటైమ్స్‌లో—పడింది. రిపోర్టు బహిర్గతం చెయ్యకుండా ఉండే షరతు మీద దిబ్బ ముఖ్యమంత్రిగారు శ్రీ రాజా సాహెబ్‌వారి బావమరిదిగారిని ఇంక్వయిరీకి ఏర్పాటుచేసారు, తిరుగుండు రామస్వామి గారిని దిబ్బ కాబినెట్‌లోకి తీసుకునేటట్టు మాట ఇచ్చాక ఆ ఉద్యమం పూర్తిగా పోయింది. దాన్ని గురించి ఇక్కడ ఆలోచించడం అప్రస్తుతం" అన్నాను.

* * * *

దారిలో నేను రాజావారి పక్కనే కూర్చుని వారి అనుభవాలు విన్నాను. సంభాషణ నేనే ప్రారంభించాను.

"ఇంతకు జెక్ ఆక్రమణ రహస్యమేమిటి?" అన్నాను.

"ఈసారి బాల్టిక్ సీకోస్టుకు వెళ్ళాను. బ్రహ్మాండంగా ఉంది" అన్నారు శ్రీవారు.

"డూబ్ చెక్—"

"అమెరికన్లు చంద్రుడి చుట్టూ తిరిగి రావడం రష్యా వాళ్ళకు యిష్టం లేదని ఓ వదంతి లేవదీసారు. అది నిజం కాదు. వాళ్ళు మొదటి నుంచీ అమెరికాలో జాయింట్ ప్రోగ్రాం అమలు చెయ్యాలనే కోరుతున్నారు".

కొ. కు. వ్యాసం

భావ పరివర్తన- విరసం

"Before a brand-new social system can be built on the site of the old, the site must be first swept clean. Old ideas reflecting the old system unavoidably remain in people's heads for a long time. they do not easily give way" -Mao.

[పాత వ్యవస్థమీద సరికొత్త సాంఘిక విధానం నిర్మించాలంటే, మొదట పాత వ్యవస్థను శుభ్రంగా ఊడ్చెయ్యాలి. పాత వ్యవస్థను ప్రతిబింబించే పాత ఆలోచనలు అనివార్యంగా ప్రజల మనసుల్లో చాలకాలం వుంటాయి. అవిఅంత సులభంగా కొత్త వాటికి దారియియ్యవు-మావో.]

మానవ సమాజం ఎన్ని రూపాలలో ఉండగలదో, ఏ రూపం నుంచి ఏ రూపానికి పరిణతి పొందిందో ఆ పరిణామాల వెనక ఉండిన భౌతిక కారణాలు ఏమిటో ఈనాడు విద్యావంతులకు చాలా మందికి తెలుసు. విద్యాధికులు కాని వారికి కూడా అపరిణత సమాజాలను గుర్తించే శక్తి ఉంటుంది. ఇల్లూ వాకిలీ లేకుండా సంచార జీవితం గడుపుతూ, ఏ చెట్ల కిందనో కుటుంబాలతో సహా కొద్దిరోజులు ఉండిపోతూ, ఎలుకలనూ, పిల్లులనూ పట్టితింటూ జీవించే లంబాడీల సామాజిక వ్యవస్థ మనకన్న అరిపణతమైనదని గ్రహించటానికి పెద్దగా విజ్ఞానం అవసరం లేదు. అలాగే మన దేశంలో ఆదిమ జాతుల వాళ్ళూ, అటవిక జాతులవాళ్ళు ఉన్నారు. వారికీ ఒక సామాజిక వ్యవస్థా, కొన్ని నియమాలూ ఉన్నాయి. నిజం చెప్పాలంటే ఆ సామాజిక వ్యవస్థలో ఉన్న కొన్ని మంచి లక్షణాలు మన వ్యవస్థలో లేవు - నిజం చెప్ప

"ఫ్రెంచి, ఇటాలియన్, ఇంగ్లీషు ఆఖరకు యుగోస్లావ్ దేశాలన్నీ జెకోస్లోవేకియా ఆక్రమణనను నిరసించడానికి కారణమేమైనా ఉంటుందంటారు."

"కాని రష్యన్ ఆస్ట్రోనాట్స్ చేసినది పెద్ద ఫీటు. స్పేస్‌క్రాఫ్ట్సను సంధించారు. అద్భుతం"

"అవాంఛనీయమే కాని తప్పని సరి అని జెక్ ఆక్రమణ గురించి కాస్ట్రో అన్నాడట. అందుచేత--"

"కొత్త సోవియట్ సూపర్‌సానిక్‌జెట్ విమానం ఎగరటం ప్రారంభిస్తే మాస్కో నుంచి ఢిల్లీకి రెండు గంటల చిల్లర. ఢిల్లీ నుంచి దిబ్బకు రమారమి రెండు రోజులు నేనే దీర్ఘంగా నిట్టూర్చి, "అదే చిత్రం! మనకు ఢిల్లీ కన్న ఢిల్లీకి మాస్కోకు చాలా దగ్గర పడింది." అన్నాను.

*('సంవేదన' సంచిక-5 ఏప్రిల్ 1969 నుంచి)

టమూ, పరస్పర సహకారమూ, సమిష్టి జీవనమూ మొదలైనవి. అయినా అవి అపరిణత సమాజాలే. వాటికి కాలదోషం పట్టింది.

ఇలాటి అపరిణత సమాజాలలో ఉండే "స్వచ్ఛ సౌందర్యాలను" అర్థంచేసుకున్న నాగరికత మానవులు వాటిని అలాగే కొనసాగనివ్వమని అభ్యర్థిస్తారు. "ఆదిమజాతుల వాళ్ళకు ఇనపనాగలి ఇవ్వకండి. వాళ్ళు బాధపడతారు", అన్నాడు వెరియర్ ఎల్విన్.

కొయ్యనాగళ్ళు మాని ఇనపనాగళ్ళు వాడమంటేనే బాధ కలుగుతుందంటే, వేటాడి జీవించేవాళ్ళు వ్యవసాయం చేపట్టి గ్రామాలు ఏర్పాటు చేసుకుని, స్థిర నివాసాలు కల్పించుకుని, చాలా విస్తృతమైన సమాజాలలో నివసించటం ప్రారంభించాలంటే ఎంతబాధో మనం ఊహించవచ్చు. అవును, అది సామాజిక వ్యవస్థలో ఒక విప్లవ పరిణామం. విప్లవ పరిణామాలు "బాధ" లేకుండా సాధ్యం కావు. మారుమూల పల్లెటూరి వాళ్ళు ఏ మహానగరానికో వచ్చి, రెండు రోజులు కూడా ఉండలేక, తిరిగి తమ గ్రామాలకు పారిపోయి హాయిగా ఊపిరి పీల్చుకోవటం మనకు తెలుసు. ఒకే సమాజంలో రెండు పొరల మధ్య అంత అంతరం ఉన్నది. ఆ పల్లెటూరి వాడికి ఈ మహానగరం జీవితంలోని వేగమూ, "అనాచారమూ", "విశృంఖలత్వమూ" దుర్భరమనిపిస్తాయి.

మొత్తం సమాజంలో కాలక్రమాన విధిగా జరిగే విప్లవ పరిణామాలు, వాటికి సిద్ధంగా లేనివాడికి ఇంకెంత దుర్భరమనిపించవచ్చు!

మరొక వ్యక్తిని తీసుకుందాం. వాడూ గ్రామంనుంచి మహానగరానికి వచ్చిన వాడే. అయితే వీడు గ్రామీణ జీవితంపైన మానసికంగా ఎదిగినవాడు. అంతకన్న పరిణత జీవితం నగరంలో ఉన్నదని గ్రహించినాడు. వాడికి మహానగరం తనకు గ్రామంతో పోలిస్తే, స్వర్గంలాగుంటుంది. మొదటివాడికి వేగం అనిపించినది వీడికి చైతన్యం, విశృంఖలత్వంగా కనిపించినది స్వేచ్ఛ, అనాచారంగా కనిపించినది మూఢాచారాల నుంచి విముక్తి. వీడు తన గ్రామానికి తిరిగిపోలేడు. పోతే యేమాత్రమూ సుఖపడడు. ఖైదులోకో అరణ్యంలోకో పోయినట్టు బాధపడతాడు. వీడు మెట్టు ఎక్కాడు.

కాని అంతటితో వాడికి మోక్షం లభించదు. లేదు. వీడు ఈ మహానగర జీవితం నుంచి స్వీకరించగలడుగాని దానికి ఏమీ ఇయ్యలేడు. తనకు గ్రామంలో ఉన్న పొలాలూ పుట్రలూ అమ్మేసి ఒక వెలుగు వెలిగి అరిపోతాడు.

విప్లవ పరిణామాలు సంఘంలో తోసుకు వచ్చినప్పుడు వాటికి మానసికంగా సిద్ధంగా ఉన్నంత మాత్రాన చాలదు. వాటికి అనుగుణంగా జీవిత విధానాన్ని మలచుకో వలసి ఉంటుంది.

2

మన జీవితం కీకారాణ్యంకన్న అధ్వాన్నంగా ఉన్నది. ఈ జీవితంలో శ్రామికులూ, పాటకులూ, దరిద్రులూ మనుషుల్లాగా బతకటం అసంభవం. వాళ్ళు సమిష్టిగా తలుచుకుంటే జీవితాన్ని క్షణంలో స్తంభింపజేయగలరు. (నిన్న బ్రిటిషు బొగ్గుగని పనివాళ్ళు ఏంచేశారో చూడండి) నాగరికత అలాంటి శక్తిని వారిచేతికి ఇచ్చిందిగాని మన సామాజిక వ్యవస్థ వారికి కడుపునిండా తిండి కూడా ఇవ్వదు అందుచేత ఈ సామాజికవ్యవస్థకు అంగరక్ష వారిలో భావచైతన్యం లోపించటమే.

వలస పాలన మనదేశంలోసాగినప్పుడు పాశ్చాత్యులు మనని కొంతవరకైనా సామాజికంగా అభివృద్ధి కానిచ్చారు. వారిది సత్పరిపాలన అనలేం. ఒకవేళ అందామన్నా సత్పరిపాలనకన్న స్వపరిపాలనమేలు. మనకు స్వపరిపాలన రానే వచ్చింది. తమ పాలకులను ప్రజలే ఎన్నుకునే పరిస్థితిలో దేశంలోని అన్నివర్గాలూ కొంతవరకైనా బాగుపడి ఉండవచ్చు. కాని అది జరగలేదు.

అందుకు రెండు కారణాలున్నట్టు నాకు తోస్తుంది. ఒకటి, బూర్జువా ప్రజాస్వామికానికి కాలదోషం పట్టడం. రెండు, మనదేశంలో బూర్జువా ప్రజాస్వామికం నుంచి లాభం పొందే మనస్తత్వం పాలితులకుగాని, పాలకులకుగాని లేకపోవటం.

ప్రపంచం మొత్తం మీదనే బూర్జువా ప్రజాస్వామికానికి నూకలు చెల్లాయనటానికి చాలా ఆధారాలున్నాయి ఇంగ్లండు అమెరికాలలో ఏ పక్షం పాలనాధికారం వహించినా ఒకే విధమైన ప్రజాద్రోహం జరుగుతూ ఉండటం చూస్తున్నాం. పీడితుల పట్లా. అంతర్జాతీయ అవినీతిపట్లా "బైపార్టిజాన్" విధానాలు చక్కగా కొనసాగుతున్నాయి. కుమ్ములాటలు పార్టీలమధ్య జరిగినప్పుడు వాటికి ప్రజాభ్యుదయంతో ఎలాటి సంబంధమూ ఉండటం లేదు. ఇంతకన్న "శ్రామికవర్గ నిరంకుశత్వం" ప్రజలకు ఎన్నోరెట్లు మేలుచేస్తూ ఉండటంకూడా మనం చూస్తున్నాం. అవే ఈనాడు గట్టిదేశాలు. వాటికోసమే "ఫ్రీవర్ల్డ్" పురాణకాలపు రాక్షసత్వాన్నీ, పైశాచికత్వాన్నీ ఒక వంక అవలంబిస్తూ, మరొకవంక పతనావస్థలో పడిపోతోంది. ఈ విషయం రాజకీయ విజ్ఞులకు వదిలేస్తాను.

మనం బూర్జువా ప్రజాస్వామికానికి కూడా సిద్ధంగాలేమని రోజూ మన పత్రికలు చెబుతున్నాయి. వెనక ఒక కాంగ్రెసు మంత్రి ఒకచోట ఉపన్యాసంచేస్తూ "మీరు మాప్రతినిధిని గెలిపించలేదు: మేము మీ ప్రాంతానికి సదుపాయాలుఎందుకు చేయాలి:" అన్న అర్థం వచ్చేట్టు మాట్లాడాడట. (తరవాత తాను అలా అనలేదన్నాడనుకోండి, కాని ఆ మాట అచ్చేసిన పత్రిక మీద దావాపడెయ్యలేదు మరి)

నిన్నటి (4 మార్చి) "ఆంధ్రజ్యోతి" పత్రికలో ఇలా ఉన్నది. "డబ్బు తీసుకున్నా ఓట్లు (అంటే వోట్లు) మాకు వెయ్యండి" శ్రీ ఇస్మాయిల్ విజ్ఞప్తి

అభ్యర్థులు వోట్లకోసం డబ్బివ్వటం గురించి శ్రీ ఇస్మాయిల్‌కు అభ్యంతరం లేదు. ఆ ఆచారాన్ని ఆయన ఆమోదిస్తూ, వోటర్లకు కృతఘ్నత మప్పుతున్నారు శ్రీ ఇస్మాయిల్. వోటర్లను ఇచ్చిన మాట నిలుపుకోవద్దంటున్నారు. శ్రీఇస్మాయిల్ ఈ మాటను కాంగ్రెసు అధిష్ఠానవర్గం తరపునే అంటున్నారనుకోవాలి. ఈయన రాష్ట్ర కాంగ్రెస్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షులు.

ఇంతకన్నా కూడా విలువైన ముక్క శ్రీ వి. బి. రాజు (తెలంగాణా నాయకులు, పార్లమెంటు సభ్యులు) సెలవిచ్చారు. "రాష్ట్రంలో కాంగ్రెసుకు మెజారిటీ రాకుంటే రాష్ట్రపతిపాలనే."

కాంగ్రెసేతర పార్టీలు ప్రాంతీయంగా నెగ్గినట్టయితే వాటిని తోసిపారేసేటందుకు తగిన ఏర్పాటు మన రాజ్యాంగంలో ఉన్నదని ప్రజలకు శ్రీ వి. బి.రాజు గారు జ్ఞాపకం చేస్తున్నారు. ప్రజలు కుంకలన్న భావంతో వారు అలా జ్ఞాపకంచేసి ఉంటారు. లేకపోతే ఇందులో కొత్తసత్యం ఏమీలేదు స్వతంత్ర భారత చరిత్ర నిండా ఇది ఉన్నదే. ఈ దేశాన్ని కాంగ్రెసు తప్ప మరేపార్టీకూడా పరిపాలించలేదు. పరిపాలించజాలదు.

ఇది ప్రజాస్వామ్యం కాదు. కాదని ప్రజలకు తెలీదు. ప్రజాస్వామ్యమంటే ప్రజలకు తెలీనంతకాలమూ మనకు ప్రజాస్వామ్యం ఉండటానికి వీల్లేదు.

ఎన్నికలు ఉండటమే ప్రజాస్వామ్య లక్షణమన్నది అపోహ. ఏయే నియోజక వర్గాలలో ఏయే కులాల వోటర్లసంఖ్య ఎంత ఉన్నదో బాహాటంగా ప్రదర్శించి, కులంవాళ్ళు తమకులం వాడికే వోటు వేస్తారన్న అభిప్రాయాన్ని రాజకీయంగా వినియోగించుకుంటున్నారు. అభ్యర్థుల ఎన్నికా వారికి పోటీదార్లను ఎన్నుకోవటమూ ఇదే ప్రాతిపదికపై జరుగుతున్నది.

ఇది కూడా ప్రజాస్వామ్యం కాదు. (కులాలవారీ వోట్లు గణజీవితానికి చెందినవి). అయితే ఈ కులప్రాతిపదిక దాఖలాలు చూపుతున్నది, ఫలితాలు ఇస్తున్నది.

ఎన్నికలద్వారా సోషలిజం వస్తుందా, రాదా అన్నది అనవసరమైన ప్రశ్న. వాటిద్వారా ఇప్పటి పరిస్థితిలో మనదేశానికి బూర్జువా ప్రజాస్వామ్యంకూడా రాదు. ఇంకెప్పుడో వస్తుందని నమ్ముకోవటం అవివేకం.

వెనకబడిన దేశాలు ముందుకు రావాలంటే సోషలిజమే శరణ్యమని నెహ్రూ ఏనాడో అన్నాడు. ఆమాటకు కాలదోషం పట్టలేదు గనకనే మన పరిపాలకులు ఆ మంత్రాన్ని శివపంచాక్షరిలాగా జపిస్తున్నారు.

మనదేశంలో సోషలిస్టు ఆర్థికవ్యవస్థా, కమ్యూనిస్టు సమాజమూ ఏర్పడాలంటే సమాజంలో విప్లవకరమైన మార్పులు రావాలి. రేపు రాబోయే మార్పులకు అనుగుణంగా ఇవాళ ప్రజల దృక్పథాలు మారాలి. లాండ్రీమూసేసి చెప్పులషాపు

పెట్టినంత సులభవుకాదు. ప్రజల బుద్ధులూ, నమ్మకాలూ ఉన్నవ్యవస్థను వీలయినంత వరకు ఆధారం చేసుకుని కొనసాగుతాయి. కొన్ని సందర్భాలలో అవి నూరేళ్ళ, వెయ్యేళ్ళ క్రితం ఉండిన సామాజిక వ్యవస్థలను ఆధారం చేసుకుని కూడా నిలబడతాయి. రేపు రాబోయే వ్యవస్థకు అనుగుణంగా భావాలను తీర్చిదిద్దుకోవటమనేది మహామేధావులకు తప్ప సాధ్యంకాదు. ఆ రావలసిన, రాదగిన, రానున్న వ్యవస్థను ఎంత సునిశితంగా చూడగలిగితే అంత ద్రష్ట. మార్క్సు, లెనిన్, మావోలుఆజాతికి చెందిన ద్రష్టలు అందుకే నిజమైన మేధావులు అలాంటి దృష్టలను అనుసరిస్తారు.

ఈనాడు మనం మనచుట్టూచూసే మూఢాచారాలూ, దేవుడి ముడుపులూ విలువ దోపిడీలూ, రాజకీయవంచనలూ, ప్రగతివాదులపైనా, ప్రతిపక్షులపైనా హత్యాకాండలూ, భయంకరమైన అజ్ఞానమూ, దారిద్ర్యమూ-ఇవిపోయి తీరుతాయి: దైవికంగా కాదు, ఇవి ప్రకృతికీ, మానవప్రకృతికి విరుద్ధం గనక: నిజం జ్ఞానంద్వారా కాకపోతే అనుభవం నుంచి అయినా తెలుస్తుంది గనక। ఈ వ్యవస్థ మారుతుంది. ఆ మార్పు ఎలా వుండాలో కూడా మనం ఊహించవలసిన పనిలేదు. మనకన్న తక్కువ పరిణతి గల సామాజిక వ్యవస్థలను మనం గుర్తించ గలుగుతున్నాంగాని మనను అధిగమించిపోయిన సమాజాలను మనంగుర్తించలేకుండా ఉన్నాం.కారణం వెనకచూపు: ముందుచూపు లేకపోవటం.

రానున్న పరిణామం విప్లవ పరిణామమని గుర్తించలేనివాళ్ళు చాలామంది ఉన్నారు. కాంగ్రెసుకు దండిగా వోట్లు వెయ్యడం తప్ప ఇంకేమీ అవసరంలేదని పాలకవర్గం కేకలు పెడుతున్నది. ఇది కాంగ్రెసు మార్కు రాజకీయవిజ్ఞానం అనుకోవాలి కాబోలు.

నామటుకు నాకు మన సమాజం యొక్క పరిణతి ఒక మహాయజ్ఞం రూపంలో తప్ప కన్పించటంలేదు. కుగ్రామం నుంచి మహానగరానికి వెళ్ళేవారిలో రెండురకాలను గురించి మొదట చెప్పాను. ఆ రెండురకాల వాళ్ళూ రానున్న విప్లవానికి ఉపకరించనివాళ్ళే. మొదటిరకం వాళ్ళు సోషలిస్టువ్యవస్థనుచూసి హడలిచస్తారు.రెండోరకం వాళ్ళు అందులో మంచి చూసి కూడా దానికి అనుగుణంగా తమ జీవితాలను మార్చుకోలేక దానికి బలి అయిపోతారు.

పై రెండురకాలూగాక సామాజిక విప్లవాన్ని సర్వశక్తులతోనూ ప్రతిఘటించే అమిత బలసంపన్నమైన వర్గం ఉన్నది. ఆయుధాలూ, ఆయుధధారులూ వారి సొత్తు. వారి ప్రతిఘటన బలాన్నిబట్టి రక్తపాతంజరుగుతుంది-జరుగుతూనే ఉన్నది.

ప్రస్తుత పరిస్థితిలో ప్రజలకు తమ జీవితం గురించి నిజంతెలియాలి.రాబోయే సమాజం గురించి తెలియాలి. అందులో వారు నిర్వహించే పాత్రా, దాన్ని అవతరింపజేయటంలో వారు నిర్వహించిన పాత్రా అర్థంకావాలి.

ఈ జ్ఞానం ప్రజలకు ఎలా కలిగేటట్టు. వారిలో ప్రాథమిక చైతన్యం కలిగాక ఆచరణజ్ఞానానికి తోడవుతుంది కాని ఆ ప్రాథమిక చైతన్యం ఎలా కలుగుతుంది? సినిమాలు కలిగించవు. రేడియో ప్రసంగాలు కలిగించవు. ప్రాచీన సాహిత్యం కలిగించదు. వర్తమాన సాహిత్యంలో చాలాభాగం నిష్ప్రయోజనం. (అది కూడా మతంతో పోటీ చెయ్యగల నల్లమందే.) ఈ పని విప్లవ సాహిత్యంవల్లనే కావాలి.

విప్లవానికి పూర్వం చీనా మనదేశంకన్న ఏమంత ముందులేదు. అలాంటి దేశాన్ని విప్లవాభిముఖం చెయ్యటానికీ, నూతనదశకు చీనా ప్రజలను సుముఖులను చెయ్యటానికీ మహాయజ్ఞం జరిగింది. యుద్ధాలూ, ప్రతీపశక్తుల విధ్వంసమూ, రక్తపాతమూ మాట అటుంచి, విప్లవం విజయవంతం అయాకకూడా సాంస్కృతిక విప్లవం అనేకదశలలో జరిగింది. మావో ప్రజల మనస్సులనేగాక కేడర్ల మనస్తత్వాన్ని కూడా మార్చటానికిఅపారకృషిచేశాడు. "మావోథాట్" విస్తృతంగా ప్రచారమయింది.

ఇదంతా "బ్రేన్‌వాషింగ్" (భావక్షాళన) అని ప్రచారం చేశారు.

ప్రతిదేశంలోనూ, ప్రతికాలంలోనూ ప్రజలకు ఏదోవిధమైన భావక్షాళన జరుగుతూనే ఉన్నది. మతాన్నిమించిన "బ్రేన్‌వాషింగ్" మరి ఉండదు. దాన్ని మనం కనీసం మూడువేల ఏళ్లగా అనుభవిస్తున్నాం. అందుకే మనదేశంలో ప్రత్యక్షజీవితం కన్న లోకాంతరాలు యదార్థం, ఈజన్మకన్న పూర్వజన్మ ఎక్కువనిజం, మనిషి కష్టాలకు మనిషే బాధ్యుడు. వెంకటేశ్వరస్వామి ఉద్యోగాలిస్తాడు, ఆరోగ్యం ఇస్తాడు, (డబ్బు పుచ్చుకుంటాడన్నది అముఖ్యమైన నిజం!) ఎన్నికలలో గెలిపిస్తాడు, చెత్తపిక్చర్లను కూడా కనీసం నూరురోజులు నడిపిస్తాడు.

మన దిక్కుమాలిన సమాజంలో జబ్బుచేస్తే అదిగాలి అనో, చేతబడి అనో అనుకునేవాళ్ళు లక్షల సంఖ్యలో ఉన్నారు.

ఈ ప్రజలను సోషలిజముకుకాదు సరేగదా, ప్రజాస్వామ్యానికైనా అనుగుణంగా తయారు చెయ్యటానికి ఆవడిసోషలిస్టు పాంథికులు ఏం చేస్తున్నారో తెలుసుకోవాలనుకోవటం తప్పుకాదు. ఏమీ చెయ్యటం లేదనుకోవటం కూడా తప్పుకాదు. ఎందుచేతనంటే ప్రజల అజ్ఞానాన్ని బలపరచటానికి ఎన్నికల సమయంలో మరింత తీవ్రకృషి జరుగుతున్నది గనక.

జనసామాన్యంలో క్షాళన కావలసినది చాలా ఉన్నది. వారి జీవితానుభవాన్ని ఆధారం చేసుకుని రచయితలు ప్రజలను పీడించే తప్పుడు ఆలోచనావిధానాలను తప్పక క్షాళనం చెయ్యాలి. అందుకు ఇప్పుడు జరిగే కృషి ఎంతమాత్రమూ చాలదు.

(ఏప్రిల్ 72, సంచిక 81 నుంచి)

కొ. కు. సమీక్షలు :

విప్లవ శాస్త్రం

1. చీనా విప్లవం గురించి స్టాలిన్ (ఇంగ్లీషు)

2. చీనా విప్లవం గురించి మావోసె-టుంగ్ (ఇంగ్లీషు)

రచయిత: చెన్ పో-టా: న్యూబుక్ సెంటర్, కలకత్తా.

ఈనాడు చీనాలో కమ్యూనిస్టు పరిపాలన ఉన్నదన్న విషయం నిక్సన్ కూడా గుర్తించి, చీనా యాత్రచేసి, పూర్వం హంతకులుగానూ, బందిపోట్లుగానూ పేర్కొనబడిన వాళ్ళతో సంప్రదింపులు జరిపి, ఫొటోలూ అవీ తీయించుకున్నాడు గనక శ్రీమాన్ రాజగోపాలాచారిగారు సైతం చీనాలో అనివార్యంగా విప్లవం జరిగిందనీ, అది "హూష్, కాకీ!" అంటే పొయ్యేది కాదనీ అంగీకరించక తప్పదు.

మనదేశంలో విప్లవం లేదని లోకానికి తెలియగలందులకు మన పోలీసు శాఖ వారు మావో సాహిత్యాన్ని జప్తు చేసుకుపోతున్నా అది టన్నులకొద్దీ విదేశాలలో తయారై ఇండియాకు దిగుమతి అయి అమ్ముతున్నది. పెలికాన్ పుస్తకాలూ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ వారివీ, ఇతరులవీ చీనా—మావో పుస్తకాలు అసంఖ్యాకంగా విడుదల అవుతున్నాయి. ఇప్పుడు సమీక్షించే ఈ రెండు పుస్తకాలూ మనదేశంలో తయారైనవి. వీటిలో ఉన్నది చీనా విప్లవ చరిత్రకాదు. విప్లవశాస్త్ర చర్చలు.

"విప్లవశాస్త్రం అంటూ ఉన్నదా?" అన్నాడు స్టాలిన్. అదే మార్క్సిజం-లెనినిజం. విప్లవకారులు అరాజకీయవాదులనీ, వాళ్ళు తమ సహజ దౌష్ట్యంతో ప్రజలను మభ్యపెట్టి, వాళ్ళను హింసాచర్యలకు పురికొల్పి "ధర్మం"గా యేర్పడిన ప్రభుత్వాలను కూలదోసి, "ధర్మ" హీనమైన వ్యవస్థ నెలకొల్ప యత్నిస్తారనీ, అందుచేత వారిని నిర్మూలించటంలో ఏ ధర్మాన్ని పాటించనవసరం లేదనీ ఒక నాయనమ్మ సిద్ధాంతాన్ని ఏనాడో తయారుచేశారు. రష్యా విప్లవం జరిగింది, అక్కడ సోషలిస్టు వ్యవస్థ ఏర్పడి, ఆ వ్యవస్థ కింద దేశం ఆర్థికంగానూ, సాంఘికంగానూ, మిలిటరీగానూ ఊహించరాని అభివృద్ధి సాధించటమే గాక, కిందటి యుద్ధంలో ఫాసిజం నడుము విరగగొట్టిన మీదట ఈ నాయనమ్మ సిద్ధాంతానికి కాలదోషం పట్టింది. దాని ఫలితంగా జరిగినదేమంటే విప్లవం అనే మాటకు న్యూనత తగ్గి కొంత గౌరవం-దూరపు కొండలు నునుపులాటిది-లభించింది. సోవియట్ విప్లవకారులు హంతకులూ దుండగులూ, బందిపోట్లూ కావటం మానేసి మహావీరుల జాబితాలోకి చేరారు. మన పరిపాలకులకు ప్రోలిటేరియన్ రివల్యూషన్ అంటే హడలే అయినా లెనిన్ మహాశయుణ్ణి ప్రజల డబ్బుతో ఆరాధించబూనుకున్నారు.

చెప్పవచ్చిందేమంటే ఇలాటి ఆరాధనల వెనక శాస్త్రీయ విప్లవ దృక్పథా లేమీ ఉండవు. నిజంగా విప్లవాలు చేసేవాళ్ళు అలా చేలకు అడ్డంపడిపోలేరు. వాళ్ళ ప్రతి ఎత్తుగడా నిర్దుష్టంగా వుండాలి. ఎక్కడ ఏ రవంత పొరపాటు జరిగినా తీరని నష్టం కలుగుతుంది. ఈ బాధలు వర్గ నియంతృత్వాలకు లేవు. రాజరికానికి పునాది "రాజు తప్పు చేయడు" అన్న నినాదం. బూర్జువా వర్గ నియంతృత్వానికి అనేక నాలుకలు, అదొక పెద్ద ఆర్కెస్ట్రా. ఆ వర్గం యొక్క అభ్యుదయానికి అనుకూలించేది ఏదైనా చెయ్యవచ్చు. వీలైతే ప్రజలను మభ్యపెట్టడం, వీలుకాకపోతే తుపాకులతో నోళ్ళు మూయటం, మరీ తప్పనిసరిగావస్తే దొడ్డిదారిన ఫాసిజం ప్రవేశపెట్టడం. అత్యధిక ప్రజల కష్టసుఖాల ప్రమేయం ఏమీలేదు. ఆ అత్యధిక సంఖ్యాక ప్రజలపైన ఆధారపడి, తన విజయాన్ని వారి అభ్యుదయంతో అంచనా కట్టేది శ్రామిక విప్లవం. అది కత్తిమీద సాము. అమిత నిర్దుష్టంగా కొనసాగవలసినది. అందులోని ఎత్తుగడలు మేధోవంతమైనవి. పొరపాట్లకు అవకాశాలు హెచ్చు. ఒక వంక మితవాదాన్నీ, మరొకవంక అతివాదాన్నీ సరిచేసుకుంటూ, అడుగడుగునా ఆత్మ విమర్శ చేసుకుంటూ, విప్లవం కొనసాగాలి. దాని సిద్ధాంతాలు సార్వత్రికమైన మార్క్సిజం - లెనినిజంకు సంబంధించినవి: ఆచరణ మాత్రం ప్రాదేశిక సమకాలిక పరిస్థితులకు అనుగుణంగా మలచుకోవలసినది. అడుగడుగునా యేర్పడే వైరుధ్యాలను సమన్వయించాలి; శత్రు కూటమిలోని వైరుధ్యాలను ఉపయోగించుకోవాలి.

ఏ విప్లవమూ ఆకాశంనుంచి ఊడిపడదు. గాలిలో జరగదు. ప్రతి విప్లవానికి పూర్వం చరిత్రా, క్షేత్రమూ, బీజాలూ వుంటాయి. రష్యా విప్లవాన్ని ఎప్పటి నుంచి లెక్కగట్టుతారో నాకు స్పష్టంగా తెలీదు. కనీసం 1905 నుంచి రష్యాలో విప్లవం రాజుతూనే వున్నది. కాని 1949లో మావో చీనా విప్లవం వయసు 109యేళ్ళని అంచనా కట్టాడు. అంటే 1840లో నల్లమందు యుద్ధాలు చీనాలో ఆరంభమయాయి. ("బందిపోట్లు డబ్బిస్తావా, ప్రాణం ఇస్తావా అంటారు. మనం—అంటే బ్రిటిషవాళ్ళం-మీ డబ్బూ, ప్రాణాలూ ఇయ్యండి అన్నాం:" రస్కిన్.)

అది మొదలు వారు (చీనా ప్రజలు) "పోరాడారు. అపజయం పొందారు, మళ్ళీ పోరాడారు, మళ్ళీ అపజయం పొందారు. మళ్ళీపోరాడారు. 109యేళ్ళ అనుభవంగడించారు, అనేక వందల చిన్న పెద్ద పోరాటాలఅనుభూతి పొందారు—రాజకీయంగానూ, యుద్ధతంత్రంలోనూ, ఆర్థికంగానూ, సాంస్కృతికంగానూ, రక్తపాతంతోనూ రక్తపాతంలేకుండానూ—అప్పుడే ఈనాటి ప్రాథమిక విజయంసాధ్యమయింది"-మావో.

చీనా విప్లవవిజయం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిది కాకపోయినా మిగిలిన వాటికన్న అనేకవిధాల విలక్షణమైనది. 1926 డిసెంబరులోనే స్టాలిన్ చీనా విప్లవం తాలూకు విశిష్టలక్షణాలను వివరిస్తూ, రష్యాలాగా కాక చీనా సామ్రాజ్య

వాద వ్యతిరేక పోరాటం ద్వారా విప్లవాన్ని సాధించవలసి వుంటుందని చెప్పాడు. సామ్రాజ్యవాదం ఉడుకుపుచుకుంటున్న తరుణంలో రష్యా విప్లవం జరిగింది. ఫాసిజమును ఎదుర్కొనటానికి అమెరికా, బ్రిటనులు రష్యాతో చేతులుకలిపిన ఫలితంగా తూర్పు యూరపు దేశాలలో సోషలిస్టు వ్యవస్థలు యేర్పడ్డాయి. చీనా విప్లవం ఎలాటి బాహిరసహాయమూ లేకుండానే కొనసాగి చివరకు నెగ్గింది. నిజానికి చీనాలో కమ్యూనిస్టుపార్టీ యేర్పడినది మొదలు కొమింటర్న్ ఆ పార్టీ అనుసరించవలసిన పంథాను గురించి 1927 దాకా అంటే కమ్యూనిస్టులు కొమింటాంగ్‌తో తెగతెంపులు చేసుకున్న దాకా-సలహాలు ఇస్తూనే వచ్చింది.

చీనా విప్లవాన్ని కొమింటర్న్ తప్పుదారి పట్టించిందన్న అపవాదు వచ్చింది. అందుచేత చీనా విప్లవ విజయం పూర్తిగా చీనా విప్లవకారులదీ, వారిని నిర్దుష్టమార్గాన నడిపించిన మావోదీనూ. చీనా విప్లవం 1949లో ఆగిపోలేదని మనకిప్పుడు తెలుసు, మానవ చరిత్రలోనే అపూర్వమనదగిన ప్రోలిటేరియన్ సాంస్కృతిక విప్లవం మావో నాయకత్వంలోనే జరిగింది. (పార్టీనీ, పరిపాలన యంత్రాంగాన్నీ క్షాళన చెయ్యటానికి మావో ప్రజలను తిరగబడమన్నాడు!) ఇంకాఇలాటి సాంస్కృతిక విప్లవాలు జరగాలని మావో అభిప్రాయం,

చీనా విప్లవంలో మరొక విశిష్టతఏమంటే, అది మిగిలిన విప్లవాలకంటె సమగ్రమైనదీ, లోతైనదీనూ. రష్యా మొదలైన సోషలిస్టువ్యవస్థలలోలాగావిప్లవం నీరుకారి పోకుండానూ, రివిజనిజం తలయెత్తకుండానూ చీనా విప్లవపార్టీ చాలా జాగ్రత్తలు తీసుకున్నది, తీసుకుంటున్నది.

టాయ్‌పింగ్ తిరుగుబాటు నుంచి ప్రోలిటేరియన్ సాంస్కృతికవిప్లవందాకా నడచిన విప్లవ దశలను గురించీ, వాటి నాయకత్వమూ, ధోరణీ మొదలైన వాటిని గురించీ చదువుకోవచ్చు. ఈ రెండు పుస్తకాలూ అందుకోసం ఉద్దేశించినవికావు సినిమాలలో చూసే యుద్ధాలలాగే, పుస్తకాలలో చదివే విప్లవచరిత్రలుకూడామనని "ఆనందపరచ" వచ్చుగాని, నిజంగా మనకు అంటవు. రామాయణంలో రామరావణ యుద్ధమూ, భారతంలో కౌరవపాండవ యుద్ధమూలేవా?

ఈరెండు పుస్తకాలూ విప్లవశాస్త్రం ఎలావుంటుందో విశ్లేషించి చెబుతాయి. 1926 డిసెంబరు 10 నుంచి 1927 అక్టోబరు 14 దాకా స్టాలిన్ చీనా విప్లవ పరిస్థితిని మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథంతో విశ్లేషించాడు. ఈ ప్రసంగాలు విప్లవశాస్త్రజ్ఞానం సంపాదించగోరేవారికి చక్కని పాఠాలు, చీనావిప్లవవిజయానికి ఇవి ఏమీ సహకరించలేదని అనుకున్నాకూడా వీటి విలువ గొప్పది.

రెండవపుస్తకం చీనావిప్లవంలో మావో దృక్పథం నిర్వహించినపాత్ర ఎలాటిదో స్పష్టంచేస్తుంది. చీనావిప్లవానికి మావో చేసిన మహత్తరసేవ యేమంటే,

"ఆయన మార్క్సిజం-లెనినిజంయొక్క సార్వత్రికసత్యాన్ని చీనావిప్లవ ప్రత్యక్ష ఆచరణతో సమన్వయించి విప్లవసంథాలో యేర్పడిన అసంఖ్యాక సమస్యలను నిర్దుష్టంగానూ, అద్భుతంగానూ పరిష్కరించాడు." 30 ఏళ్ళపాటు మావోతనపార్టీలోపలా వెలపలా ఉన్న ప్రతీఘాతుకులనూ, అవకాశవాదులనూ నిర్ద్వంద్వంగా ఎదుర్కొని పోరాడాడు. మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల విప్లవ సిద్ధాంతాన్ని ప్రచారం చెయ్యటంలోనూ అమలుజరపటంలోనూ అత్యంత సమర్థుడని రుజువుచేసుకున్నాడు.

సిద్ధాంతానికీ ఆచరణకూ అవినాభావసంబంధం ఉంచటం మార్క్సిజం-లెనినిజం ప్రత్యేకలక్షణం. మార్క్సిస్టు యొక్క మౌలిక కర్తవ్యం వర్గవిశ్లేషణా విధానాన్ని వినియోగించటం. ఇందులో మావో నిపుణుడు.

దాదాపు నూరేళ్ళపాటు చీనా అర్ధవలసదేశంగా ఉండింది. ప్రాచ్యంలో అది అనేక వైరుధ్యాలకు కేంద్రంగా ఉండేది. ఇంపీరియలిస్టు దేశాలన్నీ చీనామీద రాబందుల్లాగా పడి పీక్కుతిన్నాయి. దాన్ని ఆ దేశాలు తమ సరుకుల ఎగుమతికీ, పెట్టుబడి ఎగుమతికీ దివ్యమైన క్షేత్రంగా వాడుకున్నారు. చీనావిప్లవాన్ని అణచటానికి ఆదేశాలన్నీ ఏకమయ్యాయి. ఇతర సమయాలలో చీనాను తమలోతాము పంచుకోవటానికి కృషిచేశాయి. ఈ ప్రక్రియ వారిమధ్య వైరుధ్యాలకుదారితీసి, సామ్రాజ్యవాదులను దుర్బలం చేస్తుందన్న సంగతి మావో గమనించాడు. ఇంతేగాక, సామ్రాజ్యవాదుల కీచులాటలతోబాటు చీనాపాలకులమధ్య కీచులాటలుకూడా పెరిగి సేనాపతుల (warlords) మధ్య అంతులేని యుద్ధాలు సాగాయి. 1912 మొదలుకొని ఈయుద్ధాలకు బయటినుంచి సామ్రాజ్యవాదులూ, లోపలనుంచి దళారీ భూస్వామివర్గాల వాళ్లూ మద్దతు యిచ్చారు.

ఒకవంక సామ్రాజ్యవాదులపీడనా, మరొకవంక ఫ్యూడలిస్టుపీడనా భరించలేని ప్రజలు 1840 మొదలుకొని ఎడతెగని ప్రతిఘటనలు సాగించారు. ఈ ప్రతిఘటనలలో అసంఖ్యాకప్రజలు క్రమంగా పాల్గొన్నారు. అతిదీర్ఘకాల విప్లవం కొనసాగింది. దీని ఫలితంగా ప్రజలు క్రమంగా అమిత బలవత్తరమైన సుసంఘటిత శక్తిగా రూపొందారు. దేశం మొదట సామ్రాజ్యవాదులమధ్య సంఘర్షణకూ, తరవాత విప్లవ, తద్వ్యతిరేక సంఘర్షణకూ కేంద్రమయింది. "ఈ వైరుధ్యాలను పరిష్కరించటానికి ప్రజావిప్లవం తప్ప మార్గంలేదనీ, ప్రాచ్యంలో సామ్రాజ్యవాదులు పన్నిన వుచ్చులు చీనాలోనే మొదటగా తెగాలనీ స్పష్టమయింది."

ఈపని సాధించేశక్తి చీనాప్రజలకున్నది. కాని వారికివిజయం లభించాలంటే ప్రోలిటేరియట్ నాయకత్వం వహించాలి. చీనాలో శ్రామికవర్గం విస్తృతం కానప్పటికీ కేంద్రీకృతమై ఉండేది. ఆ వర్గాన్ని మూడు క్రూరశక్తులు విదేశీ సామ్రాజ్యవాదం, స్వదేశీ ఫ్యూడలిజం, పెట్టుబడిదారీ-మహా తీవ్రంగాపీడించాయి. కార్మికుల

సంఖ్య జనాభాలో అల్పభాగమేఅయినా అర్థప్రోలిటేరియనులైన పేదరైతులతో కలిసినప్పుడు వారి సంఖ్య జనాభాలో సగానికి మించింది. ఈకారణంచేత చీనాలో శ్రామికవర్గం తనపార్టీని (కమ్యూనిస్టుపార్టీని) ఏర్పరచుకుని విప్లవవర్గాలన్నిటికి నాయకత్వం వహించగలిగింది. దీనికి కాలంకూడా కలిసివచ్చింది. ఎందుచేతనంటే రష్యా విప్లవం అనంతరం విప్లవయుగం ఆరంభమయింది. చీనాకు అంతర్జాతీయ సహకారం కూడా లభించింది. చీనా విప్లవం వలస వ్యతిరేక స్వభావాన్ని తప్పక పొంది, ప్రపంచవ్యాప్తమైన వలసవిధానపు పునాదులచే బద్దలు చేస్తుందని 1927 నాడే స్టాలిన్ అన్నాడు. అదే జరిగింది.

కాని అది తేలికగాగాని సులభంగాగాని జరగలేదు. దాని మార్గం దారుణంగానూ క్లిష్టంగానూ, అనేక చుట్టు తిరుగుళ్ళతోనూ కూడుకున్నది. ఆకారణంచేతనే చీనా శ్రామికులూ, ప్రజలూ, కమ్యూనిస్టుపార్టీ బాగా రాటుతేలటం సాధ్యమయింది. ఈ విప్లవానుభవాలసారమే "మావోథాట్" (మావో తత్వం లేక మావో విధానం)

ప్రపంచ ప్రోలిటేరియన్లతోనూ, ప్రాచ్య దేశాలలో దోపిడీకి గురిఅయే శ్రమజీవులతోనూ ఎలాటి సంబంధాలు సృష్టించుకోవాలన్న సమస్యలకుపరిష్కారం కావాలనీ, ఆ పరిష్కారం ఏ కమ్యూనిస్టు పుస్తకంలోనూ దొరకదనీ లెనిన్ అన్నాడు. ఈ సమస్య యొక్క మూలసూత్రాలను లెనిన్, స్టాలిన్‌లు ప్రతిపాదించారు. మావో వారి కృషిని మరింతముందుకు తీసుకుపోయి, చీనా విప్లవకార్యాచరణకు అన్వయించాడు. అయన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని చీనాప్రజల భాషలోకి అనువదించి, అనేక కోట్ల ప్రజలను ఉత్తేజపరిచాడు.

చీనావిప్లవాన్ని మావో ప్రాదేశిక సమస్యగా చూడలేదు. అది ప్రపంచవ్యాప్త వలసవిధాన వ్యతిరేకోద్యమం: ప్రపంచ ప్రోలిటేరియన్ విప్లవంలో ఒక భాగం. పీడిత ప్రజలంతా ఒక పక్షం, విప్లవ వ్యతిరేకులంతా ఒక పక్షం. మధ్యంతరవర్గాలు విచ్ఛిపోతాయి. వాటికి స్వతంత్రప్రతిపత్తిలేదు అని 1927లో మావో అన్నాడు. అ సమయంలో చ్యాంగ్‌కైషేక్ విప్లవోద్యమానికి స్వస్తి చెప్పే ఎత్తుగడలో ఉన్నాడు; కొమింటాంగ్‌లో ఒకవర్గం రష్యాతోగాని, సామ్రాజ్యవాదులతోగాని కలవకుండా మధ్యేమార్గంగా ఉండే ఆలోచన చేస్తున్నది.

1937_45 మధ్య జపానును ప్రతిఘటించి యుద్ధం చెయ్యటానికి అన్ని వర్గాలూ ఏకమయాయి. కమ్యూనిస్టులు కూడా ఆ సమాఖ్యలో వున్నారు. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీలో మితవాద అవకాశవాదం తలఎత్తింది. కొందరు శ్రామికవర్గాన్ని బడా బూర్జువావర్గానికి తోకగా రూపొందించాలని వాదించారు. వారి వాదనలను మావో తీవ్రంగా ఖండిస్తూ, రష్యాలో విప్లవం జరిగి, అంతర్జాతీయ బూర్జువా_పెట్టుబడిదారీ వర్గానికి పెద్దదెబ్బ తగిలిన దశలో పాతకాలపు బూర్జువా

డెమోక్రాటిక్ ప్రపంచవిప్లవానికి కాలదోషం పట్టిందనీ, రావలసినది ప్రపంచప్రోలిటేరియన్ విప్లవమేనని మావో స్పష్టంచేశాడు. వలస, అర్ధవలసదేశాలలో జరిగే విప్లవాలకిది కీలకమైన మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రం.

చీనాలో జరగవలసిన విప్లవం ప్రపంచ ప్రోలిటేరియన్ విప్లవంలో అంతర్భాగమనటానికి మావో కారణాలు వివరించాడు.

"1. విప్లవం సామ్రాజ్యవాదంమీద దెబ్బదీసి, సామ్రాజ్యవాదుల ప్రతిఘటనను ఎదుర్కొంటుంది. సోషలిస్టుదేశం(రష్యా) సహాయమూ, అంతర్జాతీయ ప్రోలిటేరియట్ సహాయములేకుండా చీనా విముక్తి పొందలేదు. 2. సోవియట్ యూనియనుకూ సామ్రాజ్యవాదులకూ మధ్య ఘర్షణ తీవ్రమవుతూవుంటే చీనా ఏదో ఒక పక్షం చేరాలి. ఏ పక్షమూ చేరమన్నది భ్రమ. 3. ఇంపీరియలిజంమీదా, ఫ్యూడలిజముమీదా విజయం సాధించినాక చీనాలో బూర్జువా నియంతృత్వంకింద పెట్టుబడి వ్యవస్థ నిర్మించుకోవాలనటం విడ్డూరంకాదా? కమ్యూనిజం దారిచూపకుండా చీనాలో డెమొక్రాటిక్ విప్లవమే నెగ్గలేదు. తదనంతరం విప్లవదశమాట అటుంచండి. ప్రపంచమంతా ఈనాడు ... విమోచనం కోసం కమ్యూనిజం మీదనే ఆధారపడివుంది. ఈ విషయంలో చీనాకు అపవాదు ఏమీలేదు."

డెమోక్రాటిక్ విప్లవం మొదటిదశ అనీ, ప్రోలిటేరియన్ విప్లవం రెండవదశ అనీ మావో చెప్పాడు. మొదటి దశకు బూర్జువా వర్గం నాయకత్వం వహించలేదని స్పష్టమయాక మావో దాన్ని ప్రజల డెమోక్రాటిక్ విప్లవం అన్నాడు. రెండు దశలకూ ప్రోలిటేరియన్ నాయకత్వం అవసరమయింది. ఆ నాయకత్వం కింద ప్రజాబాహుళ్యం సామ్రాజ్యవాదాన్నీ, ఫ్యూడలిజమునూ, బ్యూరోక్రాటిక్ పెట్టుబడిదారీని ప్రతిఘటించాలి. ఇందులో ప్రజా బాహుళ్యం అనే వారు మావో దృష్టిలో ప్రధానంగా రైతులు. కార్మికులూ, రైతులూ, మేధావులూ తదితర పెటీబూర్జువా వర్గాలూ ప్రోలిటేరియన్ నాయకత్వం కింద చీనా భవిష్యత్తు నిర్ణయించాలి.

విప్లవం యొక్క విజయం ప్రోలిటేరియన్ నాయకత్వంపైనే ఆధారపడివున్నది. చీనాలోని పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలు నడిపిన విప్లవాలు ఫలించలేదు. అయితే ప్రోలిటేరియన్ నాయకత్వానికి గుండెకాయ రైతు సమస్య. ("సంగ్రహంగా చెప్పాలంటే, జాతీయ సమస్య రైతు సమస్యే"-స్టాలిన్.) ఈ విషయంలో లెనిన్, స్టాలిన్‌లు చెప్పిన దాని మీదనే మావో మరింత చెప్పాడు.

"రైతు విప్లవంలో నాయకత్వం వహించటమే ప్రోలిటేరియన్ నాయకత్వానికి అర్హతాచిహ్నం. బూర్జువా డెమోక్రాటిక్ విప్లవానికి బూర్జువా వర్గం నాయకత్వం వహించపోవటానికి ముఖ్యకారణం ఆ వర్గం రైతు విప్లవానికి నాయకత్వం వహించలేకపోవడమూ, అలాటి విప్లవమంటే భయపడి ప్రతిఘటించటమూనూ."

శ్రామిక కర్షకుల సమ్మేళనమే క్రొత్త డెమోక్రాటిక్ విప్లవాన్ని సోషలిస్టు విప్లవంగా పరిణమింప జేయటానికి దోహదం చేసిందని మావో అన్నాడు.

1927 అనంతరం చీనా కమ్యూనిస్టులు నగరాలను వదిలేసి పల్లెపట్టులను కైవసం చేసుకో నారంభించారు. పల్లెపట్టులలో తమ బలాన్ని పెంచుకొని, ఆబలం తోనే నగరాలను చుట్టుముట్టారు, వశపరుచుకున్నారు.

ఇది మావో నిర్దేశించిన విధానం. ఇది సరిఅయిన విధానమన్నది ఆచరణలో రుజువయింది.

మావోకు శత్రువు బలమూ, శౌర్యమూ బాగా తెలుసును. అందుచేత చీనా విప్లవం దీర్ఘకాల పోరాటానికి సిద్ధంగా వుండాలని, విప్లవశక్తులు వ్యవధి మీద బలాన్ని కూడగట్టుకుని, శత్రువును నిర్మూలించే విధంగా రాటుతేలాలనీ హెచ్చరిస్తూ, క్షణకాలంలో విప్లవం అయ్యేపోతుందన్నది పొరపాటని చెప్పాడు. అది సాయుధవిప్లవమే తప్ప, శాంతియుత విప్లవం కాజాలదు. శాంతియుత చర్యలు నేటికీ శత్రువు అస్కారం ఇవ్వటం లేదు. "చీనాలో సాయుధ విప్లవ శక్తులకూ, సాయుధ విప్లవ వ్యతిరేక శక్తులకూ పోరాటం జరుగుతున్నది, చీనా విప్లవానికి ఇదొక ప్రత్యేకతా, సదవకాశమూనూ" అన్నాడు మావో.

చీనా విప్లవానికి స్థావరాలు కావాలి. ముఖ్యపట్టణాలన్నీ శత్రువులఆధీనంలో వున్నాయి. శత్రువుతో ముఖాముఖి యుద్ధాలు తలపెట్టకుండా బలంపుంజు కోవాలంటే మారుమూల పల్లెపట్టులలో స్థావరాలు ఏర్పరచుకోవాలి. ఆ స్థావరాలను సైనికంగానూ, రాజకీయంగానూ, ఆర్థికంగానూ, సాంస్కృతికంగానూ బలమైన విప్లవదుర్గాలుగా రూపొందించుకోవాలి. తరువాత సుదీర్ఘ పోరాటం ద్వారా సమగ్ర విప్లవ విజయం సాధించాలి. ఎంత చిన్నవైనా స్థావరాలు ఏర్పడటం ముఖ్యమని మావో గట్టిగా చెప్పాడు. ఎర్రసేనను సృష్టించుకొనటానికీ, విప్లవ వేగాన్ని పెంపొందించుకొనటానికీ అంతకన్న మార్గంలేదని మావో స్పష్టంచేశాడు. చీనా విస్తృతమైన దేశం. కదలటానికి కావలసినంత చోటు! శత్రువుకు బలం తక్కువగా వుండేవి పల్లెపట్లు. ఆ దౌర్బల్యాన్ని ఆసరా చేసుకొని తొలి విజయాలు అక్కడే సాధించినట్టయితే దీర్ఘకాల విప్లవ పోరాటానికి అవి స్థావరాలుగా పనికి వస్తాయి.

చింగ్‌కాంగ్ షాన్ (చింగ్‌కాంగ్ పర్వతాలు)లో మొదటిస్థావరం ఏర్పడింది. అటుతర్వాత ఇంకా అనేక స్థావరాలు యేర్పడ్డాయి అయినా మావో అనేకతప్పుడు వాదనలను ఎదుర్కోక తప్పలేదు. కొందరు కామ్రేడ్సు చాలాకాలంపాటు స్థావ - లను అంటిపెట్టుకొని ఉండటం గురించి అసంతృప్తి చెంది, సత్వరవిజయాలు

సాధ్యమని సిద్ధాంతీకరించారు. చీనా రాజకీయ ఆర్థిక పరిణితిలో ఎన్నో ఎగుడు దిగుడులున్నట్టు వీరు అంగీకరించలేదు. మావో సరిఅయిన ఆలోచననే చెప్పినప్పటికీ అతివాద దుందుడుకువాదం మూడుసార్లు తాత్కాలికంగా నెగ్గి, విప్లవానికి తీరని నష్టాన్ని కలిగించింది. పట్టణాలను పట్టుకోవాలని తీవ్రవాదులు పట్టుబట్టారు.

గెరిల్లా యుద్ధతంత్రానికిగూడా మావో అత్యంత ప్రాధాన్యం యిచ్చాడు. ("చిన్న చిన్న విజయాలను పోగుచేసుకుని ఘనవిజయాలకు మార్గంచేసుకో") తీవ్రవాదులు గెరిల్లా పోరాటాల విలువ గ్రహించక, ముఖాముఖి పోరాటాలకోసం- అదికూడా తమకన్న బలవత్తరమైన శత్రువుతో -వాంఛించారు. ఈ పొరపాటువల్ల స్థావరాలు పోయాయి. చిత్రమేమంటే, తమ యెత్తుగడ బెడిసికొట్టేసరికి ఈ తీవ్రవాదులే మితవాదాన్ని ఆశ్రయించారు.

జపాను వ్యతిరేక యుద్ధమప్పుడు కూడా వీరు అదే తప్పుడు ధోరణి అవలంభించి, సత్వర విజయాలు కాంక్షించారు. గెరిల్లా యుద్ధతంత్రం మావో సమగ్రంగా వివరించాడు. ప్రచ్ఛన్న (గెరిల్లా) యుద్ధాన్ని ఎప్పుడు ప్రత్యక్ష యుద్ధంగా మార్చవచ్చునో, ప్రత్యక్ష యుద్ధాన్ని అవసరమయితే ప్రచ్ఛన్నయుద్ధంగా ఎలామార్చాలో మావో స్పష్టంచేశాడు.

ముఖ్యమైన విషయమేమంటే, మావో చీనా విప్లవం తాలూకు అన్ని దశలలోనూ, అన్ని రంగాలలోనూ నిర్దుష్టమయిన సూత్రీకరణలూ, నిర్ణయాలూ చేశాడు. మార్క్సిజం-లెనినిజంను వాస్తవపరిస్థితులకు అద్భుతంగా అన్వయించాడు. కుడి యెడమల నుంచి వచ్చిన పెడధోరణులను సరిదిద్దాడు. (అది జరగనప్పుడు నష్టం సంభవించనే సంభవించింది.)

పదిసంవత్సరాల అంతర్యుద్ధ కాలంలో (1927-37) మితవాదం నియమరహితమైన వర్గసమీకరణ ప్రతిపాదించి, ప్రోలిటేరియట్‌కు వ్యక్తిత్వం నిరాకరించింది ("కూటమే తప్ప సంఘర్షణలేదు"). తీవ్రవాదం ఎలాటికూటమినీ ఆమోదించక పోర్లిటేరియనులకు అండనిరాకరించింది ("ఎలాటికూటమీ లేకుండా అచ్చగా సంఘర్షణే") ఇవి శాస్త్రీయ దృక్పథాలు కావు.

విప్లవ సమరంలో అన్ని దశలూ ప్రోలిటేరియన్ విప్లవ విజయానికి సూటిగా వుండవు. ఎత్తుగడలు మలుపులు తిరుగుతాయి. శత్రువును ప్రతిఘటించాలి. అదే శత్రువుతో చేతులు కలపాలి. కాని ఏ దశలోనూ చరమలక్ష్యాన్ని వెనక్కి పట్టించరాదు. ప్రతి ఎత్తుగడా ఆ లక్ష్యాన్ని దగ్గిరపడేసేదిగానే ఉండాలి. ఈ ఎత్తుగడలు శత్రువును నగ్నంగా బయటపెట్టాలి. అతనిలో విశ్వాసం ఉన్నవారికి కనువిప్పుకలిగించాలి. ఊగిసలాడేవారిని విప్లవంకేసి మళ్ళించాలి. క్రమంగా అసంఖ్యాక ప్రజాకోటిని విప్లవానికి అభిముఖం చేసుకుంటూరావాలి. ఇందుకుగాను

లెనినిజమా ? సోషల్ సామ్రాజ్యవాదమా ?

లెనిన్ శతవార్షిక సందర్భంలో మూడు చీనా పత్రికల సంపాదకవర్గాల వారు తయారు చేసిన దీర్ఘ వ్యాసాన్ని ఇంగ్లీషులో న్యూ బుక్ సెంటర్, కలకత్తా చిన్న పుస్తకంగా ప్రచురించింది.

1970 ఏప్రిల్ 22 న లెనిన్ శతజయంతి అనేక దేశాలలో జరిగింది. బూర్జువాల అధిపత్యాన్ని కూలదోయటానికి మానవ చరిత్రలో జరిగిన తొలి ప్రయత్నం పారిస్ కమ్యూన్ తిరుగుబాటు. ఇది జరిగిన నాటికి లెనిన్ వయసు ఏడాది. తర్వాత లెనిన్ ప్రొలిటేరియన్ విప్లవానికి నాయకత్వంవహించి ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించి, ప్రపంచ చరిత్రలో సామ్రాజ్యవాద పతనానికీ, విప్లవయుగానికీ పునాది వేశాడు.

అలాంటి మహనీయుడి శతజయంతిని దేశదేశాలవారు ఎందుకు జరిపారు? విప్లవకారుడూ, విప్లవ యుగకర్తా అనా? లేక ప్రపంచంలో రెండవ స్థానం ఆక్రమించిన సోవియట్ రష్యాకు మూలపురుషుడనా?

మార్క్సిస్టు-లెనినిస్టు మూలసిద్ధాంతాలను తద్దేశతాత్కాలిక పరిస్థితులకు ఎలా అన్వయించాలో తెలియటం గొప్పవిద్య. దాన్ని ఆచరణలో పెట్టడం గొప్ప ప్రతిభ. ఈ విద్యా, ప్రతిభా మావోలో పరిపూర్ణత్వం పొందాయి.

మావోను విప్లవవాదులు ఆరాధించటం సహజం. కాని కావలసినది ఆరాధన కాదు. మావో ఆలోచనావిధానపు అవగాహన. విప్లవాలను ఎగుమతిచెయ్యటం అసాధ్యమన్నట్టే విప్లవ ఎత్తుగడలను కాపీచెయ్యటం కూడా సాధ్యమయేది కాదు. 1927లో తొలి అపజయం సంప్రాప్తమయాక చీనాకమ్యూనిస్టులు కొమింటర్న్ పైన ఆధారపడటం మానేశారు. కాని మార్క్సిజం-లెనినిజమును వదిలిపెట్టలేదు. మార్క్సిజం-లెనినిజమునేగాక, దేశపరిస్థితులనూ, వర్గస్వభావాలనూ, విప్లవదశలలో వాటి మధ్య కలిగే అనుకూల, ప్రతికూల సంబంధాలనూ చక్కగా అర్థంచేసుకోగలవారే విప్లవాలను సాధించగలరు. మావో చెప్పినట్టు విప్లవంలో అపజయాలు కూడా పనికివచ్చే అనుభవమే. అపజయాలను విజయాలుగా మార్చుకునే మార్క్సిస్టుదృక్పథం ఎంతైనా అవసరం.

(అగస్టు 1972, సంచిక 35 నుంచి)

లెనిన్ ఒక సందర్భంలో అన్నాడు : "It has always been the case in history that after the death of revolutionary leaders who were popular among the oppressed classes, their enemies have attempted to appropriate their names so as to deceive the oppressed classes." (పీడిత ప్రజలకు ఆదరణపాత్రులైన విప్లవ నాయకులు చనిపోయిన అనంతరం వారి శత్రువులు పీడిత వర్గాలను మోసగించటానికి వారిపేర్లను సొంతం చేసుకునే ప్రయత్నం చరిత్ర అంతటా జరిగినదే)

కనుక మన ప్రభుత్వాలలాటివి లెనిన్ శతజయంతులను లక్షలు ఖర్చుచేసి జరపటంలో వింతలేదు. అలాగే లెనిన్ పేరు ఉచ్ఛరించటానికి అర్హులుగానివారు, బతకనిబిడ్డ బారెడన్న ధోరణిలో లెనిన్‌కు నీరాజనాలిచ్చారు.

చిత్రమేమంటే, సోవియట్ రష్యాలో కూడా ఇదే ధోరణిలో లెనిన్ భజన సాగటం! లెనిన్ శతజయంతిని ఆర్భాటంగా జరిపిన వర్తమాన సోవియట్ నాయకులు లెనిన్ పేరు ఉచ్ఛరించటానికి తగినవారుకారని నిరూపించటమే ఈపుస్తకం (వ్యాసం) యొక్క ఉద్దేశం. ఈ వ్యాసం చెప్పే కారణాలు పరిశీలిద్దాం. లెనినిజం పతాక ఎగురుతూ ఉంచటంలో చీనా కమ్యూనిస్టులకు ప్రత్యేకమైన ఆసక్తివున్నది. ఎందుచేతనంటే మావో చెప్పినట్టు ఈ ప్రపంచ విప్లవయుగంలో చీనాలో విప్లవం సాధ్యం కావటానికి లెనినిజమే ఆధారమయింది. మార్క్సిజం-లెనినిజం సహాయం తోనే మావో అతి "దారుణమూ, కష్టసాధ్యమూ, క్లిష్టమూ అయిన విప్లవపోరాటాలను" విజయవంతంగా కొనసాగించాడు. అంతేగాక ఈనాడు అమెరికను సామ్రాజ్యవాదంతోబాటు సోవియట్ రివిజనిజమునుకూడా ప్రపంచప్రజలు ప్రతిఘటించవలసి వున్నది. సోవియట్ విధానాలు లెనినిజమును ఏ విధంగా పెడమార్గం పట్టించాయి.

1. లెనినిజము తాలూకు ప్రధాన సమస్య ప్రోలిటేరియన్ నియంతృత్వం.

బూర్జువా రాజకీయ యంత్రాన్ని విధ్వంసంచేసి ప్రోలిటేరియన్ నియంతృత్వం నెలకొల్పాలంటే, అధికారాన్ని హస్తగతం చేసుకొనటానికి హింసాచర్యలు అవసరమని లెనిన్ పదే పదే చెప్పాడు. ఆ మార్గానే అక్టోబరు విప్లవం సాధ్యమయింది.

సోషలిస్టు విప్లవ శకం నడిచినంతకాలమూ సంఘర్షణలు తీవ్రతరమవుతాయనీ, ఈ శకం ముగిసేదాకా దోపిడీదార్లు యధాస్థితి తిరిగి నెలకొంటుందని ఆశిస్తారనీ, అది తిరిగి రావటానికి ప్రయత్నాలు సాగిస్తారనీ, ఆ కారణంగా పెట్టుబడిదారీకి వర్గరాహిత్యానికీ (కమ్యూనిజముకూ) మధ్య నడిచే చారిత్రక దశ అంతటా ప్రోలిటేరియన్ నియంతృత్వం అవసరమనీ లెనిన్ స్పష్టంచేశాడు.

ఈ ప్రాథమిక సమస్యపట్లనే సోవియట్ రివిజనిస్టు రెనిగేడ్ కూటమి లెనిన్ సిద్ధాంతాన్ని నీరుగార్చింది. అందుకనే మావో "అక్టోబరు విప్లవం యింకా అమలులో వున్నదా? అన్ని దేశాలకూ అది యింకా శిరోధార్యంగా వున్నదా? సి. పి. యస్. యు. 20వ కాంగ్రెసులో కృశ్చేవ్ పార్లమెంటరీ పద్ధతిలో అధికారం సంపాదించడం సాధ్యమన్నాడు. అంటే అక్టోబరు విప్లవం నుంచి అన్ని దేశాలూ నేర్చుకోవలసింది ఇక ఏమీ లేదన్నమాట. ఈ తలుపు తెరిచాక లెనినిజముకు ఉద్వాసన చెప్పినట్లే" అన్నాడు.

ప్రపంచంలో మొట్టమొదటి సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారిని పునఃప్రతిష్ఠ చెయ్యటం ఎలా సాధ్యమయింది? ఆ దేశం సోషల్ ఇంపీరియలిస్టు దేశంగా పరిణమించటం ఎలా సాధ్యమయింది?

ఇది వర్గపోరాట ఫలితం. పెట్టుబడిదారీ విధానం అవలంబించిన కొద్దిమంది పార్టీ సభ్యులు పార్టీనీ, ప్రభుత్వ నాయకత్వాన్నీ హస్తగతం చేసుకున్నారు. అంటే ప్రోలిటేరియట్‌కు చెందిన అధికారం సోవియట్ బూర్జువాల వశమయిందన్నమాట. ఇంతేగాక ప్రపంచ సామ్రాజ్యవాదం తన మనుగడకోసం సృష్టించిన "శాంతియుత పరిణామ" నినాదాన్ని సోవియట్ రెనిగేడ్ల ద్వారా సోవియట్ యూనియన్‌కు అంటగట్టింది.

"సోషలిస్టుచారిత్రక దశలో కూడా వర్గాలూ, వర్గవైరుధ్యాలూ, వర్గసంఘర్షణా వుంటాయి. సోషలిస్టు, కాపిటలిస్టు పంథాల మధ్య సంఘర్షణ వుంటుంది, పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదం కూడా వుంటుంది" అని మావో చెప్పాడు. సోషలిస్టు సమాజంలో కూడా అధికారంకోసం వర్గపోరాటం వుంటుంది. "పార్టీలోకీ, ప్రభుత్వంలోకీ, సైన్యంలోకీ దొంగచాటుగా జొరబడిన బూర్జువాలు అదను చూసుకొని అధికారం ఒడిసి పుచ్చుకుని, ప్రోలిటేరియన్ నియంతృత్వాన్ని బూర్జువా నియంతృత్వంగా మార్చేస్తారు".

అక్టోబరు విప్లవం అనంతరం కూడా స్టాలిన్ బూర్జువా విప్లవ విరోధి వర్గముఠాకు ట్రాట్స్కీ, జినోవియెవ్, కామినెవ్, రాడెక్, బుఖారిన్, రీకవ్‌లాటివారిని తొలగించవలసి వచ్చిందంటే వర్గపోరాటం కొనసాగిందన్నమాట. పెట్టుబడిదారీ పంథాను విరోధించి, నియంతృత్వాన్ని స్థిరీకరించుకొనే అనుభవం సోవియట్ యూనియన్‌కు లేకపోయింది. ఆ కారణంచేతనే స్టాలిన్‌మరణానంతరం కృశ్చేవ్—కమ్యూనిస్టుపార్టీలో దాగివుండిన పెట్టుబడిదారీ పంథావాదు—స్టాలిన్‌ను అపఖ్యాతి పాలుచేసే 'రహస్య నివేదిక' ఒకటి ప్రకటించి, అనేక కుయుక్తులతో పార్టీనీ, రాజ్యాధికారాన్నీ చేజిక్కించుకున్నాడు. ఈ విప్లవ వ్యతిరేకచర్యతో ప్రోలిటేరియన్ నియంతృత్వం బూర్జువా నియంతృత్వంగా మారింది. సోషలిజం దెబ్బతిని, పెట్టుబడిదారీ తిరిగి నెలకొన్నది.

కృశ్చేవ్ పోయి బ్రెజ్నేవ్ వచ్చాడు. కాని ఇద్దరూ తోడుదొంగలే. బ్రెజ్నేవ్ రెండవ కృశ్చేవ్. "ఇవాళ సోవియట్ యూనియన్ బూర్జువా, బడా బూర్జువాల నియంతృత్వంకింద, హిట్లరు మోస్తరు జర్మన్‌ఫాసిస్టు నియంతృత్వంకింద వున్నది." అని మావో (1964 మే 11న) అన్నాడు. సోవియట్ బూర్జువావర్గంలో పలుకుబడిగల ఒక శ్రేణి తన రాజకీయ, ఆర్థిక శక్తులను అపారంగా పెంచుకొని పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ, సైన్యంలోనూ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల లోనూ అగ్రస్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ శ్రేణినుంచే బురాక్రాట్ గుత్త పెట్టుబడిదారు వర్గం అవతరించింది. వీళ్ళు పాత కొత్తతరహా బడా బూర్జువాలు: మొత్తం రాజకీయ యంత్రాంగమూ, సామాజిక సంపదా వీరి అధీనంలో వున్నాయి. వీళ్ళు సామాజిక స్వామ్యాన్ని పెట్టుబడిదారీ పంథా స్వామ్యంగానూ, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను జాతీయ పెట్టుబడిదారీ గుత్తకిందా మార్చేశారు. "స్టేట్" పేరు చెప్పి వీరు నిశ్శంకగా ఖజానాను కొల్లగొట్టేస్తున్నారు. సోవియట్ ప్రజల శ్రమ ఫలితాలను అన్ని విధాలా దోచేస్తున్నారు. భోగలాలసలో మునిగితేలుతూ, ప్రజలను కాలదెట్టి నేలరాస్తున్నారు. వీరు "యథాస్థితి కొరకు ఆశించటాన్ని సాధించే ప్రయత్నంగా" మార్చుకున్నవాళ్ళు. అక్టోబరు విప్లవవీరుల సంతానాన్ని అణచి పారేశారు. సోవియట్ యూనియన్‌లోని వివిధ జాతులమీద పెత్తనం చలాయిస్తూ, ఒక చిన్న విప్లవ విద్రోహక జారిస్టుసభ ఏర్పాటు చేసుకున్నారు. ఈ రియాక్షనరీలకు ప్రజలంటే భయమూ, ద్వేషమూనూ.

ఈ భ్రష్ట కూటమిలో అంతర్వైరుధ్యాలున్నాయి. వీరు అందరూ కలిసి కట్టుగా పనిచేస్తూనే పరస్పర సంఘర్షణలు జరుపుతున్నారు. వారి కష్టాలు ముదిరి నప్పుడల్లా ఈ సంఘర్షణలు చాటుగానూ, బహిరంగంగానూ తీవ్రతరమవుతూ ఉంటాయి. అత్యధిక లాభాలకోసం ఈ కూటమి స్వదేశ ప్రజలను దోపిడీచేసి హింసపెట్టటమే గాక, విస్తృతి కోసమూ, దురాక్రమణ కోసమూ కృషిచేస్తూ, ప్రపంచాన్ని పంచుకోవటానికి ప్రపంచ సామ్రాజ్యవాదంతో చేరుతూ, అతి హేయమైన సోషల్ సామ్రాజ్యవాద విధానాలు అవలంబిస్తున్నది.

ప్రస్తుతం ఈ కూటమికి ప్రతినిధి బ్రెజ్నేవ్. పెట్టుబడిదారీ పునరుద్ధరణను సోషల్ ఇంపీరియలిజమ్‌గా మార్చటానికి కృశ్చేవ్ ప్రారంభించిన కృషిని ఈయన కొనసాగిస్తున్నాడు. లాభాలు అనే పెట్టుబడిదారీ సూత్రాన్ని చట్టబద్ధంచేసి ఒక కొత్త ఆర్థిక విధానం అనేదాన్ని ఈయన సర్వతోముఖంగా అమలులోకి తెచ్చాడు ఇందువల్ల బురాక్రాట్ గుత్తదార్లు శ్రామికులను మరింత బాగా దోచుకోగలరు. ప్రజాక్షేమం ప్రసక్తి లేకుండా పన్నుల భారం పెరిగింది. "వెన్నకు బదులు తుపాకులు" అన్నహిట్లరు సూత్రం అవలంబించబడుతున్నది. ఆయుధోత్పత్తి, యుద్ధ

సన్నాహాలూ సోషల్ సామ్రాజ్యవాదానికి అవసరం గనక ఆర్థిక వ్యవస్థ అందుకు అనుగుణంగా' మలచబడుతున్నది.

సోవియట్ రివిజనిస్టు రెనిగేడ్ల కూటమి అవలంబించిన అపసవ్య చర్యల మూలంగా చాలా దుష్ఫలితాలు కలిగాయి. పరిశ్రమలు తరిగాయి. ధాన్యోత్పత్తి పశుసంపదా క్షీణించాయి. ప్రభుత్వ మార్కెట్లో చిత్రంగా కొనుగోలు వస్తువులు కరువయాయి; శ్రమజీవులకు పేదరికం చుట్టుకున్నది.

సోవియట్ రెనిగేడ్లు (తిరోగాములు) సోవియట్ కష్టజీవులు దశాబ్దాల తరబడి కష్టించి కూడబెట్టిన అంతులేని సంపదలు అలాములూ పలాములూ చెయ్యటమే గాక, రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన పశ్చిమ జర్మనీ నుంచి దీనంగా అప్పు యాచించారు; దేశీయ సహజ సంపదను అమ్ముకున్నారు; జపాను గుత్త పెట్టుబడిని సైబీరియాను ఆహ్వానించారు. (అదీ రెండో ప్రపంచ యుద్ధంలో మట్టి కరచిన దేశమే).

"లెనినిజముకు జన్మభూమి (అయిన సోవియట్ రష్యా)కి ఇంత వినాశమూ, అపఖ్యాతీ తెచ్చిన సోవియట్ రివిజనిస్టు రెనిగేడ్లమీద చీనా ప్రజలమైన మేము అత్యంత ఆగ్రహం చెందుతున్నాం; ఈ సర్వతోముఖ పెట్టుబడిదారీ పునః ప్రతిష్ఠ వల్ల బాధపడే సోవియట్ ప్రజాబాహుళ్యంపట్ల సానుభూతి కలిగి ఉన్నాం"

సోవియట్ రష్యాకు ప్రోలిటేరియన్ నియంతృత్వంతో పని తీరిపోయిందని సోవియట్ రెనిగేడ్ ముఠా ఒకప్పుడు అని, ప్రోలిటేరియన్ నియంతృత్వం పని "సమస్త ప్రజల రాజ్యం" చేస్తున్నదన్నారు. రెంటికీ తేడాలేదట. ఈ రెంటినీ వాళ్లు ఏకం చెయ్యటం దేనికంటే, ప్రజలను మభ్యపెట్టటానికీ, బూర్జువా నియంతృత్వాన్ని కప్పిపెట్టటానికీనూ.

"పార్టీ నాయకత్వాన్ని బలపరచటం", "క్రమశిక్షణను బలపరచటం", "కేంద్రీకరణను బలపరచటం" మొదలైన వాటిని గురించి వారుచేసే ఆర్భాటం అంతరార్థం పార్టీనీ, ప్రజలనూ సోషల్ ఫాసిస్టు పాలక కూటమి అదుపులో ఉంచటమూ, తమ పరిపాలనతో తృప్తిపడని వారిని అణచటమూ, రాజకీయార్థిక సైనిక అధికారాలన్నీ వారి చేతిలోకి తీసుకోవటమూనూ, తమ ఫాసిస్టు నియంతృత్వాన్ని బలపరచమని, దురాక్రమణ యుద్ధాలకు సన్నాహాలు చెయ్యటానికి వారు ఈ నాటకమంతా ఆడుతున్నారు.

లెనిన్‌కూ, అక్టోబరు విప్లవానికి అపచారం చేసే తమ దుష్పరిపాలనను మరింత బలపరుచుకోవటానికి వారు మరింత బాహాటంగా విప్లవ విద్రోహక హింస అవలంబిస్తున్నారు. స్పెషల్ ఏజంట్లూ, వేగులవాళ్లూ మితిమీరారు; విద్రోహక చట్టాలూ, తీర్పులూ మితిమీరుతున్నాయి. విప్లవం అన్నది ద్రోహం. ఎక్కడబడితే

అక్కడ ప్రజలను అసత్యారోపణలమీద జైళ్ళలోకి తోస్తున్నారు. అసంఖ్యాకులైన విప్లవవీరులూ, నిర్దోషులూ జైళ్ళకు పోయారు. పిచ్చి ఆసుపత్రులకు పంపబడ్డారు. ప్రజా ప్రతిఘటనను ఎదుర్కోవటానికి టాంకులూ, సాయుధ శకటాలు సైతం పంపబడుతున్నాయి.

"రష్యాలో అత్యధిక సంఖ్యాక ప్రజల పీడన ఉండినంతగా ప్రపంచంలో మరెక్కడా లేదు. రష్యను జాతిగాక ఇతర జాతులు (రష్యాలోనివారు) విజాతీయులుగా చూడబడ్డారు" అన్నాడు లెనిన్. అందుకే, ఎలాంటి హక్కులూలేని ఆ జాతుల వారు చక్రవర్తులను తీవ్రంగా ద్వేషించారు. తిరిగి ఇప్పుడు ఈ కొత్త నయాజార్ చక్రవర్తులు అదే పనిచేసి, రష్యాను వివిధ జాతుల బంధిఖానాగా మార్చుతున్నారు.

సిద్ధాంత రంగంలోకూడా వీరు పూర్తిగా బూర్జువావియంతృత్వ విధానాన్నే అవలంబించారు. శ్రమజీవుల సోషలిస్టు ఆదర్శాలు అణచబడ్డాయి. బూర్జువా ఆదర్శాల కుళ్ళూ, సంస్కృతీ ఉప్పెనలాగా వచ్చిపడింది. సైనిక తత్వమూ, జాతియ, జాతి దురహంకారాలూ బోధించబడుతున్నాయి. సోషల్ సామ్రాజ్యవాదాన్ని పెంపొందించటానికి కళలు సాధనాలుగా ఉపయోగించబడుతున్నాయి. జార్ల పరిపాలనలో చెలరేగిన పోలీసు హింసలూ, దమనకాండా, అవినీతి చూసి "రాళ్ళుసైతం ఆక్రోశిస్తాయి" అన్నాడు లెనిన్. సోవియట్ రెనిగేడ్ ముఠా పరిపాలనను జారిస్టు పరిపాలనతో పోల్చవచ్చు.

"దుర్గాన్ని తేలికగా పట్టాలంటే లోపలనుంచే పట్టాలి" అని స్టాలిన్ అన్నాడు 14 దేశాలవాళ్ళ సాయుధంగా వచ్చిపడినా, వైట్‌గార్డులు తిరగబడినా, అనేక మిలియన్ల హిట్లరు మూకలు వచ్చిపడినా, సామ్రాజ్యవాదులు ఎన్ని ముట్టడులూ,విధ్వంసక చర్యలూ, చక్రబంధాలూపన్నినా చలించని సోషలిస్టుదుర్గం కృశ్చేవ్. బ్రెజ్నేవ్ రెనిగేడ్ ముఠాకు చిక్కిపోయింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు చరిత్రలో వీరిని మించిన రెనిగేడ్లు లేరు.

లెనిన్ రెండవ ఇంటర్‌నేషనల్ రెనిగేడ్లను గురించి చెబుతూ, "మాటలలో సోషలిజం, చేతలలో ఇంపీరియలిజం" అన్నాడు. ఈ నాటి సోవియట్ రివిజనిస్టులు తిరోగమనవాదాన్ని సోషల్ ఇంపీరియలిజంగా మార్చారు. తేడా ఏమిటంటే, ఆనాడు కౌత్‌స్కీలాటి వారికి ప్రభుత్వాధికారం లేదు, వాళ్ళ పరాయి ఇంపీరియలిస్టుల దోపిడీకి సాధనాలు. రాజ్యాధికారం హస్తగతం చేసుకున్న సోవియట్ రెనిగేడ్లు ఇతర దేశాలను దోచి, వాటి ప్రజలను రాజ్యంలో వుంచగలుగుతున్నారు.

"చరిత్ర నేర్పే గుణపాఠమేమిటంటే: సోషలిస్టు రాజ్యంలో రాజకీయాధికారం రివిజనిస్టు ముఠాకు హస్తగతమయిందంటే, సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్‌లో లాగా సోషల్ ఇంపీరియలిజంగానన్నా మారుతుంది; జెకోస్లావేకియా,

మంగోలియన్ పీపుల్స్ రిపబ్లిక్‌లాగా అస్వతంత్రంగానో, వలసగానో మారుతుంది"

సోవియట్ రివిజనిస్టులు "సోదర దేశాలపట్ల అంతర్జాతీయ" అని తియ్యటి కబుర్లు చెబుతూనే శృంఖలాలమీద శృంఖలాలు తగిలిస్తున్నారు. వార్సా ఒప్పందం, పరస్పర ఆర్థిక సహకార సంఘం లాటివి తూర్పుయూరపు దేశాలకు అంటగట్టి, సోషలిస్టు సమాఖ్య అనే దిగ్బంధంలో పెట్టి, "అంతర్జాతీయ శ్రమ విభజన", "విశిష్టోత్పత్తి", "ఆర్థిక సమైక్యత" లో స్వేచ్ఛగా కొల్లగొట్టేస్తున్నారు; ఆయా దేశాల జాతీయ ఆర్థిక వ్యవస్థలను రివిజనిస్టుల అవసరాలకు అనుగుణంగా మలచి ఆ దేశాలను తమ సరుకులకు విక్రయస్థానాలుగానూ, తమ ఉపకార్ఖానాలుగానూ, తోటలుగానూ, కూరలమళ్ళుగానూ, పశుకోష్టాలుగానూ చేసుకొని, అద్వితీయమైన దోపిడీ కొనసాగిస్తున్నారు. ఆ దేశాలను తమ అదుపులో వుంచటానికి తమ సైనిక బలాలను వాటిలో ఉంచి, అతి క్రూరమైన దమనవిధానాలు అమలు జరుపుతున్నారు. జెకోస్లోవేకియాను తమ చెప్పుకింద వుంచి, తమకు కావలసిన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేటందుకు లక్షలకొద్దీ సైన్యాన్ని బాహాటంగా పంపకం చేశారు. ఇది లెనిన్ గర్హించిన జార్ల ఫ్యూడల్ ప్రత్యేక హక్కుల పద్ధతే.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్‌అమెరికాలలోని అనేక దేశాలను తీవ్ర ప్రభావం కిందికి తెచ్చుకునేటందుకు అమెరికన్ సామ్రాజ్యవాదంతో పోటీకి దిగి సోవియట్ రివిజనిస్టు ముఠా "సహాయం" చేస్తానంటూ, అసమ వ్యాపారం ద్వారా యుద్ధసామగ్రినీ, పెట్టుబడినీ ఎగుమతి చేస్తున్నది; ఆ దేశాల అంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలిగించుకుంటూ, అక్కడ యుద్ధస్థావరాలను ఏర్పాటు చేసుకోజూస్తున్నది. వలస విధానపు ఆశయాలతో "ముడిసరుకుల వనర్ల కోసమూ, పెట్టుబడి ఎగుమతి కోసమూ, రాజకీయ ప్రభావం (Spheres of influence) కోసమూ, ఆర్థిక ప్రాంతాల కోసమూ జరిపే సంఘర్షణను" లెనిన్ పేర్కొన్నాడు. ఈ విషయంలో "సోషల్ ఇంపీరియలిజం" పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదమార్గాన్నే అచ్చంగా అనుసరిస్తున్నది.

సోవియట్ రివిజనిస్టులు విప్లవ పోరాటాలను పూర్తిగా బలపరుస్తామంటూనే వివిధ దేశాల విప్లవ పోరాటాలను నీరుగార్చటానికి అతిహేయమైన ప్రతీప శక్తులతో చేతులు కలుపుతున్నారు. పెట్టుబడిదారీ దేశాలలోని విప్లవ ప్రజానీకాన్ని 'తీవ్రవాదులు' అనీ, "మందలు" అని నిరసిస్తూ, ప్రజోద్యమాలను విచ్ఛిన్నంచేయ యత్నిస్తున్నారు. ఇండియా, ఇండోనీషియాలలాంటి దేశాలలో రియాక్షనరీలకు డబ్బూ, ఆయుధాలు అందిస్తున్నారు. అమెరికను సామ్రాజ్యవాదులలాగే ప్రపంచమంతటా కుక్కకాపలా కాస్తున్నారు. ప్రపంచాధిపత్యానికి అర్రులుచాచే రెండు పెద్ద ఇంపీరియలిజములు అమెరికావీ, రష్యావీనూ.

అమెరికను ఇంపీరియలిజముకు వ్యతిరేకంగా సాగే ప్రజాపోరాటాలకూ, సోవియట్ రష్యాలోని అమెరికా వ్యతిరేకతకూ ఎలాంటి సంబంధమూ లేదు. రష్యను రివిజనిస్టులు అమెరికాతో ఒకవంక ఘర్షణపడుతూనే చేతులుకూడా కలుపుతున్నారు. జర్మనీ మధ్యప్రాచ్యమూ, ఆగ్నేయాసియా, జపాను, అణ్వస్త్రాలు లాంటి అతి ముఖ్య సమస్యల గురించి సోవియట్ రివిజనిస్టులు అవలంబించిన విధానమే ఇందుకు నిదర్శనం. సోవియట్‌రష్యా అమెరికాలమధ్యజరిగే ఒప్పందాలన్నీ ఊళ్ళు పంచుకునే బందిపోటు దొంగల తాత్కాలిక ఒప్పందాలే.

బ్రెజ్నెవ్ అధికారంలోకి వచ్చినాక సైనిక విధానాలు మరింత హెచ్చాయి. కృశ్చెవ్ అవలంభించిన యుద్ధతంత్రాలూ, అణ్వస్త్రాల బెదిరింపూ, మిసైల్ అణ్వస్త్ర నిర్మాణమూ, సాధారణ ఆయుధోత్పత్తీ, నౌకా, విమానబలాల పెరుగుదలా కొనసాగాయి. ఈ ఆయుధోత్పత్తి విజృంభణను కప్పిపెట్టడానికి కృశ్చెవ్ "నిరాయుధమూ నిస్సైన్యకమూ నిర్యుద్ధమూ" అయిన ప్రపంచం గురించి ప్రతిపాదనలు చేశాడు. బ్రెజ్నెవ్ వచ్చాక యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టే కృషి తీవ్రమయింది. అంతర్జాతీయ పరిస్థితి విషమించిందనీ, మూడో ప్రపంచయుద్ధం వస్తుందనీ, శత్రువును ముందే నిగ్రహించేశక్తి తమకున్నదనీ, ప్రపంచంలో ఎక్కడ ఉన్న లక్ష్యాన్ని అయినా ఛేదించగలమనీ అంటూ, రక్షణవ్యయాన్ని అపారంగా పెంచేసి, హిట్లరు పద్ధతిలో సరిహద్దులకు యెత్తులు వేస్తూ, దురాక్రమణ యుద్ధాలకు తయారవుతున్నారు. వాళ్ళు జెకోస్లొవేకియాను ఆక్రమించారు, చీనా ప్రాంతాలమీద దురాక్రమణ చేశారు. చీనాను అణ్వస్త్రాలతో బెదిరించారు. అమెరికను సామ్రాజ్యవాదులలాగే రష్యను సోషల్ ఇంపీరియలిస్టులు కూడా ప్రపంచయుద్ధం తెచ్చి పెట్టటానికి సిద్ధపడుతున్నారు.

బ్రెజ్నెవ్ సిద్ధాంతం ;

ఇది ఫాసిస్టు సూత్రీకరణలతో కూడుకుని ఉన్నది.

1. "పరిమిత ప్రభుత" (Limited sovereignty) సోషలిజమును పరిరక్షించటానికి తమకు సంపూర్ణ ప్రభుతకావాలి. ఇతర దేశాల ప్రభుత ఎంతలో ఉండాలో తాము నిర్ణయిస్తారు ! సోషలిస్టు వ్యవస్థను కూలదోసి, తూర్పుయూరపు దేశాలలోనూ, మంగోలియా ప్రజారిపబ్లిక్‌లోనూ పెట్టుబడిదారీ పునస్థాపనచేసే మార్గాలను తామే అవలంబించారు. ఇంకా సోషలిజమును పరిరక్షించేదేమిటి ? ఇతర దేశాలను శాసించే సంపూర్ణాధికారం తమకున్నది. తమను కాదనే అధికారం ఆ దేశలకు లేదు. హిట్లరు ఇలాగే తనుపాలించే హక్కును గురించి వదరాడు. జాతీయ ప్రభుతకు కాలదోషం పట్టిందన్నాడు డలెస్. ఈ బ్రెజ్నెవ్ సూత్రం సామ్రాజ్యవాదులదే.

2 "అంతర్జాతీయ నియంతృత్వం" దీని ప్రకారం సోషలిస్టు వ్యవస్థకు ప్రమాదం రాకుండగలందులకు సోదరదేశాలకు సైనిక సహాయంచేసే హక్కు తమకున్నది. ఒకే దేశంలో ఏర్పడిన ప్రోలిటేరియన్ నియంతృత్వం అంతర్జాతీయ నియంతృత్వంగా పరిణమించినప్పుడు ప్రపంచ రాజకీయాలపై దాని ప్రభావం ఉండగలదని లెనిన్ అన్నమాట నిజమే. అంతర్జాతీయ ప్రోలిటేరియానిజమునూ, ప్రపంచ ప్రోలిటేరియన్ విప్లవాన్ని ఉద్దేశించి లెనిన్ ఈ మాట అన్నాడు. లెనిన్ అన్నమాటను అడ్డం పెట్టుకుని సోవియట్ రివిజనిస్టుముఠా తూర్పుయూరపు దేశాలలోనూ, మంగోలియా ప్రజారిపబ్లిక్‌లోనూ సైనికంగా జోక్యం కలిగించుకుని, వాటిని తన అధీనంలో వుంచుకోవటాన్ని సమర్థిస్తున్నది. ఈ సూత్రాన్ని అడ్డం పెట్టుకుని ఒక సమిష్టిజెండాకింద జెకోస్లోవేకియాను ఆక్రమించింది—అమెరికా కొరియాలో చేసినట్టే।

3. "సోషలిస్టు సమాఖ్య అవిభాజ్యం" సోషలిస్టు సమాఖ్య ఎక్కడ వున్నది? సోవియట్ సామ్రాజ్యం తప్ప! మార్క్సిజం – లెనినిజం ప్రకారం చిన్న పెద్ద సోషలిస్టు దేశాలు కలిసి యేర్పడే సమాఖ్యలో అన్నిటికీ సమానప్రతిపత్తి ఉండాలి; వివిధ దేశాల స్వాతంత్ర్యంపట్లా, సరిహద్దులపట్లా గౌరవం ఉండాలి; పరస్పర జోక్యాలు ఉండరాదు; పరస్పర సహకారం అంతర్జాతీయ ప్రోలిటేరియానిజం అనుసరించి జరగాలి. తన పరిభాషలో "అవిభాజ్యం" అనే దానికి అర్థం ఇతర దేశాలు తమ కబంధ హస్తంనుంచి బయటపడరాదని।

4. "అంతర్జాతీయ శ్రమవిభజన" ఇది కృశ్చేవ్ పాడిన పాతపాట. దీనిని బ్రెజ్నెవ్‌ముఠా చాలా విస్తరింపజేసింది, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు కూడా అనువర్తింపజేసింది. ఆ దేశాలు సోవియట్ రివిజనిస్టులతో సహకరిస్తే తప్ప వాటికి స్వతంత్ర ఆర్థిక ప్రతిపత్తి ఉండదట. ఈ దేశాలు తమ 'సాంప్రదాయిక' సామాగ్రిని రష్యాకు అమ్మాలట. ఇది సామ్రాజ్యవాదులు ఏనాడో అన్నమాటే, చేసినపనే. సోవియట్ రివిజనిస్టుల శ్రమవిభజనకు ఫలితమేమంటే, రష్యా పారిశ్రామికంగా ఉంటుంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు వ్యవసాయికంగా ఉంటాయి. ఈ దేశాలను కొల్లగొట్టే ఉద్దేశం తప్ప ఈ సూత్రంలో మరో అర్థంలేదు.

5. "మా ప్రమేయం". సోవియట్ రష్యా విస్తృతమైన అంతర్జాతీయ సంబంధాలుగల ఒక అగ్రదేశం గనక, దూరప్రాంతాలలో జరిగే సంఘటనల విషయంలో కూడా తమ ప్రమేయం ఉండాలి; తమ క్షేమమూ, తమ మిత్రుల క్షేమమూ తాము చూసుకోవాలి. సోవియట్ నౌకలు తమ దేశక్షేమంకోసం అవసరమైన ప్రాంతాలన్నిటా సంచరిస్తాయి. అగ్రదేశం అయినంత మాత్రాన ప్రపంచమంతటా తన ప్రమేయం ఉండాలని ఏ దేశంగాని అనగలదా? విస్తృతమైన

అంతర్జాతీయ సంబంధాలున్నాయని అన్ని ప్రాంతాలకూ యుద్ధనౌకలను పంపి బెదిరింపు చర్యలు చేయగలదా? జార్లు రష్యా సంక్షేమం పేరనే దురాక్రమణచర్యలు చేశారు. అమెరికావాళ్ళు చేస్తున్నారు. సోవియట్ రివిజనిస్టులధోరణి అందుకు భిన్నంగాలేదు.

ప్రపంచాధిపత్యం గురించి కలలు

రష్యన్ జార్ చక్రవర్తులు "శ్లావ్" సామ్రాజ్యం గురించి కలలు కన్నారు. ఈ నాటి సోవియట్ జార్లు ఆ కలలను అందిపుచ్చుకున్నారు. వీరు జార్లకన్న రెండాకులు ఎక్కువ చదివారు. వీరు అనేక తూర్పు యూరపు దేశాలనూ, మంగోలియా ప్రజారిపబ్లికునూ తమ వలసలు చేసుకున్నారు. చీనాకు "పెద్దగోడ" (Great wall) ఉత్తర సరిహద్దుని ఆక్రమిస్తున్నారు. తమ కబంధహస్తాలను ఆగ్నేయాసియాకూ, మధ్యప్రాచ్యానికీ, ఆఫ్రికాకూ, లాటిన్ అమెరికాకు సైతం చాచారు. తమ యుద్ధ నౌకలను మధ్యధరాకూ, హిందూమహాసముద్రానికీ, పసిఫిక్, అట్లాంటిక్ సముద్రాలకూపంపి, యూరప్, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు తమ సామ్రాజ్యాన్ని విస్తరింప జూస్తున్నారు. ఇది పట్టికల.

ఎందుకంటే స్టాలిన్ చెప్పినట్లు సామ్రాజ్యవాదం పరాకాష్ట అందుతూనే విప్లవం ప్రారంభమవుతుంది. సామ్రాజ్యవాదంలోవుండే వైరుధ్యాలన్నీ సోవియట్ రివిజనిజముకు కూడా వర్తించి తీరుతాయి.

"అమెరికా కాగితపు పులి.... రివిజనిస్టు సోవియట్ రష్యా కూడా కాగితపు పులే" అన్నాడు మావో.

సోషల్ ఇంపీరియలిజం కూడా తన ఆశయ సాఫల్యం బెడిసికొట్టగా, తన పతనానికి అనుకూలించే పరిస్థితులు తానే కలిగించుకుంటుంది. ఈనాడు తూర్పు యూరపు పేలటానికి సిద్ధంగా వున్న మందుగిడ్డంగిలా వుంది.

ప్రపంచ సామ్రాజ్యవాదంతో సోషల్ సామ్రాజ్యవాదం చేరిపోవటంతో సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మరింతఅయాయి. దీనిమూలంగా సామ్రాజ్యవాద విధానమే మరింత శీఘ్రంగా విచ్ఛిత్తికావటం తప్పనిసరి.

"సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులకు ఇంటాబయటా కూడా ప్రతిష్ఠంభనలు ఎదురవుతూ వుండటంచేత పెద్ద ఎత్తున యుద్ధచర్యలకు పాల్పడుతున్నారు. మావో అన్నట్టు ప్రపంచ యుద్ధం విషయంలో రెండు పరిణామాలే సాధ్యం; "అలాంటి యుద్ధం విప్లవాన్ని తెస్తుంది, లేదా విప్లవం అలాటి యుద్ధాన్ని రాకుండా ఆపుతుంది."

ఈనాటి సోవియట్ పాలకవర్గం గురించి చీనా కమ్యూనిస్టుల అంచనా ఇలా ఉన్నది. దీనితో మన మితవాద కమ్యూనిస్టులు ఎంతమాత్రమూ ఏకీభవించరు.

సాహిత్యలేఖ :

....సృజనలో వ్యాసాలు అయోమయంగా ఉండటంమాట కాదుగాని తెలుగు పాఠకులు (అభాగ్యులు) చదవవలసిన రచనలయొక్క తత్వం ఎలాంటిదో బెర్ట్రాండ్ రసెల్, టి. యస్. ఇలియట్, బెర్గ్‌సన్, జేమ్స్ జాయిస్, వర్జీనియా వుల్ఫ్ కూడానేమో వీళ్ళ నుంచి తెలుసుకోవాలంటే అది నేలవిడిచిన సాము అవుతుందని నా వ్యక్తిగతమైన సందేహం ... మన సాహిత్యం ఇప్పటికే చదివినవాళ్ళకు కొన్ని మైళ్ళ ఎడంలో నడుస్తున్నది. మనకి రాజకీయస్వాతంత్ర్యం వచ్చినా (?) సాహిత్య సామ్రాజ్యవాదం నుంచి విముక్తిలేదా? మనం రచించేవన్నీ విశ్వసాహిత్యపు కొలబద్దలతోనే కొలవాలా? ఇవి rhetorical questions కావు, నా అనుమానాలు. వాటికి సమాధానాలు తెలుసుకొనేదాకా నాకు సృజన వ్యాసాలు కొన్ని అయోమయంగా ఉండటం తప్పనిసరే ననుకుంటాను. కవిత్వం రాసేవాళ్ళకు కొంత Pose వేసే అర్హత ఉండవచ్చు. నాబోటి పచ్చివచనం రాసే వాడికి Modesty తప్ప గత్యంతరం లేదు.

మరొక విషయం రాయవలసి వుంది. ఉన్నట్టుండి అకస్మాత్తుగా మనవాళ్ళకు 'ఇజమ్' ల మీద ఒక విముఖత్వం పుట్టుకొచ్చింది. దీన్ని బాల గంగాధరతిలక్ గారే ప్రారంభించారో, ఆరుద్రగారో నాకు కచ్చితంగా తెలియదు. వరవరరావుగారి

మన మార్క్సిస్టు కమ్యూనిస్టులు కూడా పూర్తిగా ఏకీభవించరు. కాని పాశ్చాత్య రాజకీయ విలేఖరుల అంచనాలు ఉంచుమించు ఇదే ధోరణిలో వున్నాయి. కాకపోతే అందుకు వారు రష్యను పాలకవర్గాన్ని తప్పుపట్టరు. సోవియట్ రష్యా జాతీయ విమోచన పోరాటాలను బలహీనపరుస్తున్నదనటానికి ఇతర ఆధారాలు మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. ధనిక దేశంగానూ, సైనిక బలం గల దేశంగానూ రష్యా తన ప్రభావాన్ని ప్రపంచ దేశాలపై చూపుతున్నదేతప్ప, మార్క్సిస్టు-లెనినిస్టు అవగాహనతో ప్రపంచ చరిత్రను రష్యా తీర్చి దిద్దుతున్న జాడలు కానరావు. నిన్నగాక మొన్న ఈజిప్టులో రష్యాకు పెద్ద పరాభవమే జరిగింది. ప్రపంచాధిపత్యం కోసం రష్యా అమెరికాతో పోటీపడటం కూడా ఏమంత విజయవంతమవుతున్నట్టు కనపడదు.

"చీనాలో అయేది మరొక దేశంలో అయేది, నూటికి 90 శాతం ప్రజలు చిట్టచివరకు మార్క్సిజం-లెనినిజమును బలపరుస్తారు. ప్రజాబాహుళ్యంచిట్టచివరకు విప్లవం చేసితీరుతారు. ప్రపంచ విప్లవం విజయం పొంది తీరుతుంది." ఇది మావో విశ్వాసం. ఇలాటి విశ్వాసం ప్రకటించే నాధుడు సోవియట్ రష్యాలో కానరాడు.

(సెప్టెంబర్ ' 72, సంచిక 36 నుంచి)

కుటుంబరావుతో ఇంటర్వ్యూ

నవీన్

ప్రశ్న : రచయితగా మీలో కొంత Maturity వచ్చాక మీరు రాసిన ముఖ్య రచన యేది? ఆ రచన ఏ పత్రికలో అచ్చయింది? ఆరచనకు పాఠకుల నుండి గాని, విమర్శకుల నుండి గాని ఎలాంటి response వచ్చింది?

జవాబు : రచయితగా ఫలాని ఘడియనుంచీ నేను మెచూర్ అయానన్న భావం నాకు ఎప్పుడూ కలగలేదు. వొక రకమైన Immaturity రచనకు ప్రోత్సాహమిస్తుందని నేననుకుంటున్నాను. 'Mature అయినాను' అన్న భావం కలిగాక ఎవరూ కథలు రాయలేరేమో.

ప్ర : రచయితకు 'Mood' వస్తేనే బాగా రాయగలడని చాలామంది అనుకుంటారు. మీరు కూడా 'Mood' వస్తేనే బాగా రాయగలరా?

జ : Mood అంటే ఏమిటో నాకు తెలీదు. అగత్యం ఏర్పడితే రాస్తాను. అగత్యం అన్నది ఏ కారణం చేతనైనా ఏర్పడవచ్చు. Mood వస్తేనే గాని రాయని వాళ్ళు కళాకారులై వుంటారు. నేను కళాకారుణ్ణని పొరపాటునకూడా అనుకోలేదు.

రచనలు కూడా చూశాను.... ఈ విముఖత్వాన్ని కొంచెం Analyse చేస్తే మార్క్సిజమూ, కమ్యూనిజమూ మాత్రమే కనిపిస్తున్నాయి. హిందూయిజం, బుద్ధిజం, గాంధీయిజం, కాపిటలిజం (సిద్ధాంతమేకాదు) మొదలయినవి ఈ విముఖత్వాన్ని ప్రేరేపించే శక్తిగలవి కావు. అందుచేత తిట్టదలిస్తే కమ్యూనిజం, మార్క్సిజములను పేరు పెట్టే తిట్టవచ్చు. స్వరనామాల చాటున దాగనవసరం లేదు. ఈ రెండు ఇజములనూ అందరూ ఆమోదించాలని నేను అనను. కాని యే ఇజమూ అవసరం లేకుండా మన యువ కవులు ఎక్కడికి పారిపోదలిచారో అదైనా తెలిస్తే బాగుండును. అన్ని ఇజములకూ అతీతమైన జీవిత సత్యాన్ని తెలుసుకోవాలని నేను తహతహలాడిపోతున్నాను.

ఈ నాడు కమ్యూనిస్టు వ్యతిరేకత ఒక తీవ్రమైన, నగ్నమైన, జాతీయ అంతర్జాతీయ రాజకీయోద్యమంగా తీవ్రరూపం దాల్చుతున్నది. వియత్నాంలో అది ఆది కాలపు దేవదానవ సమరం ప్రమాణాలను అందుకున్నది. [ఎవరు దానవులో నేను చెప్పనక్కరలేదు] ఈ సమయంలో మార్క్సిజం లెనినిజం గురించి పార్టీ వాళ్ళు గుద్దులాడుకుంటున్నారు. దాన్ని గురించి కవులూ, కథకులూ రాసేదేమీలేదు కూడా. అందుచేత మన యువ రచయితలు పారిపోదలిస్తే కమ్యూనిజం నుంచే పారిపోవాలి. మిగతా ఇజములన్నీ absolutely Safe....

—కొడవటిగంటి కుటుంబరావు, మద్రాసు.

ప్ర : మీరు ఎన్నో నవలలు, కథలు రాసారు. అవన్నీ మీరు Serious గానే రాసారా ? లేక పత్రికల వాళ్ళ బాధ పడలేకనో, లేక మరే యితర కారణాల వల్లనో రాసినవి యేవైనా ఉన్నాయా ?

జ : పత్రికల వాళ్ళ (బాధఅనను) వొత్తిడివల్ల రాసినా సీరియస్ గానే రాశాను. అషామాషీకి ఎన్నడూ రాయలేదు. నేను రాసిన వాటిలో Occasions కు (జర్నలిస్టుగా) రాసిన కథలుకూడా వున్నాయి.

ప్ర : 'చదువు' తప్ప మీరు రాసిన నవలలన్నీ సైజునుబట్టి చిన్న నవలలే. చిన్న నవలలంటే మీకు ప్రత్యేకమైన అభిమానం ఉందనుకుంటాను. కాని వివిధ సమస్యల్ని. సంఘర్షణల్ని. వివిధ మానసిక ప్రవృత్తుల్ని విశదంగా విస్తృతంగా (Comprehensive) చిత్రించే అవకాశం లేదనుకుంటాను. అందువల్ల చిన్న నవల శాశ్వతంగా నిలిచే గొప్ప నవల ఎప్పుడూ కాలేదు అనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా ? ప్రపంచ సాహిత్యంలోని ఏ గొప్ప నవలైనా తీసుకోండి. అదే పెద్దనవలై వుంటుంది.

జ : నేను 'చిన్నసైజు' రచయితనే. Minimum రాయాలనీ, పాఠకుడి టైమ్ వీలయినంత తక్కువగా ఖర్చుచేయాలనీ, నా తెలివితేటలూ 'గొప్పతనమూ' పాఠకుడి మీద రుద్దరాదనీ నా వుద్దేశం 'చదువు' పెరిగిపోవడానికి కారణం అదంతా ఒక్కసారిగా రాయకపోవటమే; నెలకు రెండు ఫిక్షన్లు రాస్తూపోయాను.

ఏ నవలాకారుడూ సమాజంలోని అన్ని సమస్యలను గురించీ రాయలేడు. రాస్తాననుకుంటే ఆత్మవంచన చేసుకుంటున్నాడన్నమాట. ఏ నవలా శాశ్వతంగా నిలవదు. ఈజిప్టు రాజుల శవాలల్లే కృత్రిమంగా నిలిపి వుంచినా వాటివల్ల ప్రయోజనం లేదు. నేను యేది రాసినా పాఠకులు ఒకసారి చదివి అవతల పారేస్తారనే నమ్మకంతోనే రాశాను. అవన్నీ శాశ్వతంగా నిలవాలనీ, నిలిచి ఎవరినో ఉద్ధరిస్తాయనీ నేను ఈనాడు కూడా అనుకోవటం లేదు. ఏ రచన నుంచి అయినా మెదడు absorb చేసుకోదగినది చాలా కొంచెం వుంటుంది. దాన్ని పదిసార్లు చదివి ఎక్కువ లాభం పొందేదేమీ వుండదు. ప్రపంచ సాహిత్యంలోని 'బండలు' ఊడబొడిచాయని అనుకోవటం లేదు.

ప్ర : మీరు Marxist అని మీరే ఒక చోట చెప్పుకున్నారు. తెలుగు దేశంలో కూడా మీరు Marxist అనే Image వుంది? కాని మీ నవలల్లో ఎక్కడా మీరు Marxism ను చిత్రించినట్టు కన్పించదు శ్రీశ్రీ లోనో రాచకొండలోనో వాళ్ళ Marxist దృక్పథం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. అంటే మీరు Marxist దృక్పథాన్ని మీ రచనల్లో ప్రతిబింబించకుండా కావాలనే avoid చేసారా? రచయిత వొక 'ఇజమ్'కు పూర్తిగా Commit అయిపోయినప్పుడు,

కళాకారుడిగా తను తీసుకున్న వస్తువుకు శిల్పందృష్ట్యా న్యాయంచేకూర్చ లేకపోతాడని మీరు నమ్ముతారా?

జ : నా రచనలు క్రిటికల్‌గా చదివే వారికి నేను Marxist ను అని అర్థం కావాలి. కాకపోతే నాలో Marxism జీర్ణం కాలేదన్నమాట. Marxism ను ప్రచారం చేయించడానికి నేను రాయలేదు. జీవితాన్ని గురించే రాశాను. Marxism కు 'Commit' కావటం అంటే ఏమిటి? ఏ ఇజమునన్నా ప్రచారం చెయ్యటానికే రచనలు చేసే వాడు నేల విడిచి సాముచెయ్యక తప్పదేమో.

ప్ర : ఇటీవల వొక పత్రిక మీ 'తార' అన్న నవలను సమీక్షిస్తూ ఇట్లా రాసింది:

"తెలుగు దేశాన్ని యేనాడో విడిచిపెట్టి మద్రాసులో స్థిరపడిన శ్రీ కుటుంబ రావు ఇటీవలి నవలికలలోని పాత్రలు ప్రధానంగా ఊహాజనితాలుగా వుంటున్నవి తప్ప సమాజ పరిశీలన ద్వారా ఉద్భూతమైనవిగా కానరావటంలేదు. పైగా వితంతు సాహిత్యంగా భాసిస్తోంది. బాల వితంతువో, వృద్ధ వితంతువో వారి ఇటీవలి నవలల్లో ప్రముఖ పాత్ర వహిస్తోంది....అందరికీ చిట్ట చివరికి ఏదో విధంగా మద్రాసు తోటీ, సినిమా పరిశ్రమతోటీ సంబంధం ఉండక తప్పలేదు"

ఈ విమర్శను గూర్చి మీరేమైనా చెప్పగలరా?

జ : 'తార' విమర్శకుడు రాసినదంతా నిజమే. నేను తెలుగుదేశం విడిచిపెట్టి 30 ఏళ్ళు కావస్తున్నది, తమిళ జీవితం నాకు తెలీదు. నా పాత్రలను మద్రాసు వాతా వరణంలోనే ఉంచవలసి వస్తున్నది. నాకు తెలీని విషయాలను గురించి రాయ నందుకు ఆ విమర్శకుడు తప్పు పట్టితే అందుకు నేనేమీ చెయ్యలేను. నాది 'వితంతు' (వెధవ) సాహిత్యం అని అనాలని ఆ విమర్శకుడికి దురదగా వుంటే నేను అభ్యంతరం చెప్పను. నా రచనలలో ఏ శాతం వితంతు సాహిత్యమో ఆయన లెక్కలు యిచ్చి వుంటే బాగుండేది. అదీగాక 'వితంతు' సాహిత్యం గురించి ఆయన ఈసడింపుగా మాట్లాడటం నా రచనను ఈసడించటానికైతే పరవాలేదుగాని అది భారతానికే తగులుతున్నది. ఎందుకంటే, పాపం, కౌరవ పాండవుల మూల పురుషులే 'వెధవ ముండా కొడుకులు'. 'కన్యాశుల్కం' లో ముగ్గురు వితంతువులు (పూటకూళ్ళమ్మా, బుచ్చమ్మా, మీనాక్షీ) ఉన్నారు. నేపథ్యంలో ఇంకో అచ్చమ్మ అనే వితంతువు కూడా వున్నది. మిగిలిన ఇద్దరు స్త్రీ పాత్రల్లో ఒకతె వేశ్య. అయినా 'కన్యాశుల్కం' వితంతు సాహిత్యం అని ఆ అజ్ఞాత విమర్శకుడు అన గలుగుతాడనుకోను. ఆయన గురజాడ వారిమీద ఈగ వాలితే యమబాధ పడిపోతా డని వినికిడి. మద్రాసులో వుంటూ సినిమాతో సంబంధంలేని ఆంధ్రులు బహుకొద్ది

మంది. నాకు ఆ పరిశ్రమతో అంతో యింతో సంబంధం ఉన్నది. దానికూడా తప్పు పడితే నాకు తెలిసినది తప్ప నేనే దన్నా రాయవచ్చునన్నమాటా?

ప్ర : మీరు సృష్టించిన పాత్రల్లో వైవిధ్యం లేదనే విమర్శకూడా వుంది. మీ పాత్రలు - ముఖ్యంగా పురుషపాత్రలు - మీ గొంతుతోనే మాట్లాడుతాయని కొందరు రాసారు. ఈ విమర్శకు మీ జవాబేమిటి?

జ : నేను పాత్రలకిచ్చినంత స్వేచ్ఛ కొందరు ప్రసిద్ధ రచయితలే ఇవ్వరని నేననుకుంటాను. నా పాత్రలు నా గొంతుతో మాట్లాడేదీ లేనిదీ నా గొంతు ఎరిగిన వాళ్ళు చెప్పటం సబబు. పాత్రలలో వైవిధ్యం లేకపోతే అది నా అసమర్థతే.

ప్ర : మీ నవలల్లోగాని, కథల్లోగాని వస్తువు మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల లోని ఆర్థిక, సాంఘిక, రాజకీయ వాతావరణం. Marxist అయ్యుండీ కూడా శ్రమజీవులను గూర్చి మీరు రాసింది చాలా తక్కువ. యిందుకు కారణం మీకు శ్రమజీవులతో ప్రత్యక్ష సంబంధం లేకపోవటమేనా? తను రాస్తున్న ప్రజల మధ్య రచయిత స్వయంగా కొంత కాలం జీవించి, వాళ్ళను బాగా అర్థం చేసుకుంటేనే తప్ప వాళ్ళను గూర్చి రాసే అర్హత ఆ రచయిత సంపాదించలేడు అనే భావాన్ని మీరు అంగీకరిస్తారా?

జ : శ్రామికులతో నాకు కొంత సంబంధమున్నది. నేను factories లో ఫోర్ మెన్‌గా పనిచేసినవాణ్ణి. నా కింద పనిచేసినవాళ్ళు నన్ను చూసి గర్వపడిన సందర్భాలు కూడా వున్నాయి. వాళ్ళను గురించి చాలాతక్కువే రాశాను. దానికి కారణం వాళ్ళపట్ల నా కున్న అభిమానం. వాళ్ళను patronize చేస్తూగాని, వాళ్ళని ఉద్ధరించడానికిగాని రాయాలంటే చెయ్యి ఆడదు. ప్రకృతి అంటే కూడా నాకు చాలా ఇష్టం. నా ఇష్టాన్ని మాటల్లో పెట్టాలంటే modesty అడ్డంవస్తుంది. అందుచేత ప్రకృతి వర్ణనల జోలికి పోను. నిజమైన కళాకారుడికి ఇలాంటి inhibition వుండదేమో. రచయిత శ్రామికుడిగా జీవిస్తే తప్ప శ్రామికులను గురించి - అదీ తాను గ్రహించినమటుకే - రాయాలి. వారి మధ్య కొంతకాలం వుండి ఆ అనుభవాలను యథాతథంగా దించి సోమర్ సెట్ మామ్ లాగా పుస్తకాలు డబ్బుకోసం రాయటం నా దృష్టిలో చాలా హేయం.

ప్ర : 'Stream of Consciousness Novel' గూర్చి మీ అభిప్రాయమేమిటి? ఇలాంటి నూతన ప్రక్రియలూ, ప్రయోగాలు (new techniques & experiments) తెలుగులోకి వస్తే తెలుగు నవల ఇంకా అభివృద్ధి చెందుతుందని మీరు భావిస్తారా?

జ : Stream of Consciousness నవలలు నిరుపయోగం. అభాసం. మన

మనసు ఎలా నడుస్తున్నదో తెలుసుకోవడానికి ప్రయత్నించిన క్షణంలో stream తెగిపోతుంది. 'you cannot observe nature without changing it' అన్నది mental process కు అక్షరాలా వర్తిస్తుంది. అందుచేత ఒక పాత్రయొక్క భావ ప్రవంతిని మనం ఊహించి కల్పన చెయ్యవలసిందేగాని, అందులో realism నూటికి నూరుపాళ్ళు సాధించటం సాధ్యంకాదు. అయినప్పటికీ భావప్రవంతిని పరిమితంగా నవలా రచనలో వాడటంలో కొంత సౌలభ్యం తప్పక వున్నది.

ప్ర : ఈ రోజుల్లో అసంఖ్యాకంగా వెలువడుతున్న నవలలను గూర్చి స్థూలంగా మీ అభిప్రాయం ఏమిటి? ఇన్ని నవలలు పుట్టుకురావటం మంచికేనంటారా?

జ : పదిమంది చదివే నవలలు ఒక విధంగా సార్థకమైనవి. పదిరాళ్ళు తెచ్చే నవలలు మరోవిధంగా సార్థకమైనవి. పత్రికలను పోషించే నవలలు ఇంకో విధంగా సార్థకమైనవి. ఎవరూ చదవని నవలలే దండుగ. అందరి అభిరుచులూ నావాటిలాగే వుండాలనిగాని, నాకు బాగా లేని రచనలను యితరులు చదివి ఆనందించరాదనిగాని అనటానికి నాకేమి అర్హత వున్నది?

ప్ర : ఈ నాడు అసంఖ్యాకంగా వస్తున్న కథాసాహిత్యాన్ని గూర్చి మీ అభిప్రాయం?

జ : నవలా సాహిత్యం గురించి చెప్పినదే దీనికి వర్తిస్తుంది.

ప్ర : వ్యంగ్యరచనలు చేయటంలో మిమ్మల్ని మించినవాళ్ళు లేరని నా అభిప్రాయం. (హాకాశంలో హాక్సిడెంట్, పాత్రలు కావాలి మొ॥) ఈ ప్రక్రియను మీరు మీ talent కు తగినంతగా exploit చేసుకోలేదని కూడా నా అభిప్రాయం. మీరేమంటారు?

జ : మీరు సూచించే వ్యంగ్య రచనలు [కేయాస్] నా దృష్టిలో తక్కువ రచనలు. దిబ్బల రాజ్యం కథలను గురించి నేను తక్కువగా అనుకోవటం లేదుగాని వాటిని రాసినందుకు నన్ను 'క్షమించిన' వారున్నారు.

ప్ర : పాశ్చాత్య దేశాల్లో ఈ మధ్య నవలల పట్ల ఆదరణ చాలా తగ్గిపోయిందనుకుంటున్నారు. చాలా మంది పాఠకులు నవలల్ని అసలు చదవటం లేదనీ, non-fiction నే ఎక్కువ చదువుతున్నారనీ, ముందు ముందు ఈ నవల అనేది పూర్తిగా అంతరించిపోవచ్చుననీ ఆ మధ్య 'Encounter' లో ఒక విమర్శకుడు రాసాడు. ఈ విషయాన్ని గూర్చి మీ అభిప్రాయం ఏమిటి?

జ : ఈ మాట నేను ఇంగ్లీషు పత్రికలలో చదివాను. (Encounter లో కాదు)

అయితే నవల అంతరించిపోతుందని నేననుకోను. జీవితాన్ని విస్తృతంగా చిత్రించటానికి నవలను మించిన సాధనం ఏమున్నది? వాస్తవికతతో కూడిన నవలలు మన స్వీయానుభవాన్ని ఎన్నో రెట్లు పెంచుతాయి. non-fiction ఈ పని చెయ్యలేదు.

ప్ర : నవలాకారులుగా ఈ క్రింది తెలుగు రచయితలను గూర్చి మీ అంచనా యేమిటి ?

ఎ] ఉన్నవ లక్ష్మీనారాయణ బి] విశ్వనాథసత్యనారాయణ
సి] అడివి బాపిరాజు డి] గుడిపాటి వెంకటచలం
ఇ] గోపీచంద్ ఎఫ్] బుచ్చిబాబు
జీ] ఆర్. ఎస్. సుదర్శనం హెచ్] రా. వి. శాస్త్రి

జ : ఎ. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' లో ప్రశంసించదగినది ఎంతైనా వున్నది. దానిమీద నేను ఒకసారి రేడియో ప్రసంగం చేస్తే, ఆ నవలను ఏడెనిమిది సార్లు చదివిన ఒక పెద్దమనిషి 'మీరు చెప్పిన పాయింట్లలో ఒకటీ నేను గమనించలేదు' అన్నారు. చదవటంలో తేడాలుంటాయి.

బి. విశ్వనాథ సత్యనారాయణగారి నవలలు నేను చాలా భాగం చదవలేదు. సమకాలీన జీవితాన్ని అర్థం చేసుకోటానికి అవి పనికిరావని నా అనుమానం. కాని ఆయనకు నవలను 'నిర్మించుట' లో ఉన్న శ్రద్ధ చాలామంది నవలా కారులలో కనబడదు.

సి. అడివి బాపిరాజుగారి నవలలు నేను అసలే చదవలేదు. ఏ కారణం చేతనో అవి నాకు అందలేదు.

డి. గుడిపాటి వెంకటచలంగారి నవలలు నవలలుగాకన్న వ్యాసాలుగా ఎక్కువ ఉపయోగకరం. మరొకరైతే వ్యాసాలు రాసివుండే విషయాలను గురించి ఆయన నవలలు రాశారు. మ్యూజింగ్స్ తరువాత రాసి తప్పు దిద్దుకొన్నారను కోండి. ఆయన కథలు మాత్రం సిసింద్రీలు.

ఇ. గోపీచందుగారి నవలలు కూడా నేనంత శ్రద్ధగా చదువలేదు. ఒక నవల చదవలేక పోవటం కూడా జరిగింది. కాని ఆయన తన అనుభవాన్ని యథాతథంగా నవలలలో పెట్టినట్టు కనబడుతుంది. కథలు కొన్ని చాలా మంచివి.

ఎఫ్. బుచ్చిబాబు దృక్పథం నాకు 'విలాయితీ' గా కనబడుతుంది.

జీ. సుదర్శనంగారి ఒక నవలా, ఒక కథల పుస్తకమూ చదివాను. కొన్ని కథలూ, నవలలో కొన్ని సన్నివేశాలూ చాలా గొప్పగా వున్నాయి. ఆయన విమర్శలు చదువుతుంటే చిన్న కెమెరాకు మూరెడు లెన్సు తగిలించినట్టుంటుంది.

హెచ్. రా.వి. శాస్త్రి గారి 'అల్పజీవి' చదివాను. అది ఆయన రచనలకు టిపికల్‌గా లేదు. ఆయనను Master of Monologue అంటాను. ఆ మాస్టరీ ఆయన కథలలోనూ, నాటకం [నిజం] లోనూ, అల్పజీవి లోనూ కూడా స్పష్టంగా కనబడుతుంది. వచనం రాసేవారిలో ఆయన నికరమైన కవి.

ప్ర : శ్రీశ్రీ మిమ్మల్ని 'ఆంధ్రా చెఖోవ్'అన్నాడు. ఈ Compliment ను మీరు స్వీకరిస్తారా ?

జ : చెఖోవ్ విశ్వసాహిత్యంలో వొకడే వున్నాడనుకుంటున్నాను.

ప్ర : నాటకాలు మీ రసలే రాయలేదనుకుంటాను. అంత ముఖ్యమైన సాహిత్య ప్రక్రియ వైపు మీ దృష్టి మరల్చకపోవడానికి కారణం ?

జ : రేడియో నాటకాలు ఒక వంద రాసి వుంటాను. స్టేజి నాటకాలు రాద్దామని వున్నది గాని అడే ట్రూప్ లేకుండా నాటకాలు రాయడం దండగ.

ప్ర : విమర్శ, విమర్శకుడి బాధ్యతలు ఏమిటి ?

జ : విమర్శయొక్క ఆశయం రచనల మంచిచెడ్డలను సరిగా అంచనా కట్ట టమూ, రచనలో నిగూఢంగా ఉండే అందచందాలనూ, లోపాలనూ వ్యక్తం చేయ టమూ. ఎవరన్నా ఇంతకన్నా ఏమనుకుంటారో నాకు తెలీదు. ఈ బాధ్యతలు నిర్వ హించినవాడు సద్విమర్శకుడు.

ప్ర : తెలుగులో విమర్శనా సాహిత్యం తగినంతగా రాలేదు అన్న అభిప్రాయాన్ని మీరు అంగీకరిస్తారా?

జ : నిజంగా విమర్శించదగిన సాహిత్యం కూడా అంతగా రాలేదేమో ?

ప్ర : ఈ మధ్య 'సంవేదన'లో రాచమల్లు రామచంద్రారెడ్డిగారు రాసిన కొన్ని సమీక్షా వ్యాసాల్ని గూర్చి మీ అభిప్రాయం? విమర్శన అంత నిర్దాక్షిణ్యంగా వైయక్తికంగా, క్రూరంగా వుండటం అవసరమంటారా?

జ : విమర్శలో దాక్షిణ్యం ఏమిటిగాని, క్రూరంగానూ, వైయక్తికంగానూ ఉండ నవసరంలేదు. రా. రా. గారి విమర్శలతో నేను ఏకీభవించకపోవటం చాలాసార్లు జరిగింది.

ప్ర : 'దిగంబర కవుల్ని' గూర్చి మీ అభిప్రాయమేమిటి?

జ : కవిత్వం గురించి మాట్లాడే అధికారం నాకు లేదు. నాకుతెలిసినదల్లా జీవితం గురించి వారికున్న అభిప్రాయాలే నావీను.

ప్ర : సాహిత్యానికి, రాజకీయాలకు గల సంబంధం ఎలాంటిది? రెండు వేరు వేరు రంగాలంటారా, లేక రెండూ ఒకటేనంటారా? రచయిత తన కిష్టమైన రాజకీయ దృక్పథాన్ని తన రచనలో ప్రచారం చెయ్యటం అవసరమంటారా?

జ : వేరువేరు రంగాలేగాని ప్రజల దగ్గర కలుస్తాయి. ఒక రంగాన్ని ఒక రంగం బలపరచవచ్చు, ప్రతిఘటించవచ్చు. రచయిత కిష్టమైన రాజకీయ దృక్పథం రంగు అతని జీవితాన్ని ఎలాగూ ప్రభావితం చేస్తుంది. రచయిత పనిపెట్టుకొని ప్రచారం చేయనవసరం ఉండదు.

ప్ర : సాహిత్యం సమాజ శ్రేయస్సుకు లేక సంఘ సంస్కారానికి దోహదం చేస్తుందని మీరు నమ్ముతారా?

జ : నమ్ముతాను. ఏ సమాజం? ఎలాటి సంఘసంస్కారం? అన్నవి ఎవరికివారు తేల్చుకోవాలి.

ప్ర : 'అభ్యుదయ సాహిత్యం' అంటే మీ నిర్వచనం ఏమిటి? Marxist కానివాడు అభ్యుదయ సాహిత్యాన్ని సృష్టించలేడు అనేవాదనతో మీరు ఏకీభవిస్తారా?

జ : 'ముందు చూపు' గలది. సాంఘిక పరిణామాన్ని సరి అయిన మార్గాన ముందుకు తీసుకపోగలది అభ్యుదయ సాహిత్యం. ఇది General Definition ఈనాడు Marxism అర్థం కానివాడు జీవితాన్నే అర్థం చేసుకోలేడని నే ననుకుంటాను. అభ్యుదయసాహిత్యం యేమి రాస్తాడు?

ప్ర : ప్రాచీన సాహిత్యానికి, ఆధునిక సాహిత్యానికి ముఖ్యమైన భేదాలేమిటి తెలుగులో ఆధునిక యుగం ఎవరితో, ఎప్పట్నించి ప్రారంభమైందంటారు.

జ : ప్రాచీన సాహిత్యం గతంనుంచి మంచిని గ్రహించటానికి ప్రయత్నించింది. జరిగిపోయిన కాలాలనుంచి ప్రజలకు మంచీ, చెడూ చెప్పింది. ఆధునిక సాహిత్యం వర్తమానాన్ని చూస్తూ, భవిష్యత్తుకు పనికి వచ్చే మంచి చెడులను వెతుకుతుంది. తెలుగులో ఆధునిక యుగం వీరేశలింగం గురజాడ ద్వయంతోనే నిస్సందేహంగా ప్రారంభమయింది.

ప్ర : ఫ్రాయిడ్ ప్రభావం వల్ల పాశ్చాత్య సాహిత్యాల్లో Sex ను గూర్చి, Unconscious ను గూర్చి అనేక Perversions ను గూర్చి విరివిగా నవలలు, కథలు, నాటకాలు వచ్చాయి. ఇలాంటి రచనలు తెలుగులో చాలా తక్కువ. తెలుగులోకే ఇలాంటి రచనలు రావటాన్ని మీరు హర్షిస్తారా?

లేక ఫ్రాయిడ్ ప్రభావం వల్ల సాహిత్యానికి మేలుకంటే కీడే ఎక్కువ వాటిల్లిందనే వాళ్ళల్లో మీరొకరా?

జ : పాశ్చాత్య సాహిత్యాల్లో మానసిక వ్యాధులను కూడా కళా వస్తువులుగా స్వీకరించారు. ఆ రకం రచనలు నాకు నిరుపయోగంగా కనబడతాయి. పాశ్చాత్య రచయితలు 'వృత్తి' రచయితలు. వారు తమ బతుకు తెరువుకోసం పడే అగచాట్లన్నిటా సాహిత్య ప్రయోజనం ఉంటుందను కోనవసరంలేదు. రచనల మీద బతకవలసిన వాళ్ళు తెలుగులో రాస్తే ఎవరు మాత్రం ఎట్లా అభ్యంతరం చెప్పగలరు?

Market నియమాలను బట్టి సాహిత్యం ప్రచారమైతే దాన్నిఆపటం ఎవరి తరం? ఫ్రాయిడ్‌ను తప్పుపట్టే పనిలేదు. అతని తప్పుడు సిద్ధాంతాలను తప్పుపట్టవచ్చు. Marxism లాగే Freudism కూడా మనుషులను మరింతగా బాగా అర్థం చేసుకునేటందుకు తోడ్పడిందని ఒప్పుకుతీరాలి. Freudism ను Commercialise చేసిన వారి సాహిత్యాన్ని Serious గా తీసుకోనవసరంలేదు.

ప్ర : 'కన్యాశుల్కం' యొక్క గొప్పతనాన్ని తెలుగువాళ్ళకు వివరించి చెప్పిన వాళ్ళల్లో ఒకరిగా మిమ్మల్నీప్రశ్న అడుగుతున్నాను. 'కన్యాశుల్కం' మీద ఒక ముఖ్యమైన విమర్శ వుంది.

'కన్యాశుల్కాన్ని' ఇంత వరకు ఏ నాటక సంస్థ కూడా సంపూర్ణంగా స్టేజీ మీద ప్రదర్శించలేపోయారని, అది స్టేజిమీద ప్రదర్శించడానికి అనువైన నాటకం కాదని, స్టేజీ మీద ప్రదర్శనా యోగ్యంకాని నాటకం గొప్ప నాటకం కాదని, ఆ విమర్శ యొక్క సారాంశం. ఈ విమర్శకు మీ సమాధానమేమిటి?

జ : కన్యాశుల్కాన్ని మొత్తంగా స్టేజి మీద ఆడటం సాధ్యం కాదన్న మాటకు నా అభిప్రాయం కూడా దేనికి? సాధ్యం కాదంటే ప్రదర్శనయోగ్యం కాదని నా అభిప్రాయం కాదు. అందులో ప్రదర్శన యోగ్యం కాని దృశ్యాలేవీ లేవు. అది గొప్ప నాటకం కాదనే వాళ్ళు భరతుణ్ణి, మమ్మటుణ్ణీ సాక్షం తెస్తారని నా అనుమానం. అది గొప్ప నాటకమేనని నా నమ్మకం.

ప్ర : మీ 60 ఏళ్ళ జీవితంలో రచయితగా మీరు నేర్చుకున్న కొన్ని ముఖ్య పాఠాల్ని మా పాఠకులతో పంచుకుంటారా?

జ : 'నా షష్టిపూర్తి' అన్న వ్యాసం ఆంధ్రజ్యోతి వారపత్రిక (14-11-69) సంచికలో నేను నేర్చుకున్న ముఖ్య పాఠాలను గురించి రాశాను.

(సంచిక 13, నవంబర్ 1969 నుంచి కొన్ని భాగాలు)

సృజనలో కొ. కు.

వ్యాసాలు :

శ్రీ శ్రీ వచనరచన	- ఫిబ్రవరి 1970 సంచిక	14
సాహిత్యంలో విప్లవోద్యమం	- ఆగస్టు 1970	16
విప్లవకథా సాహిత్యం	- ఫిబ్రవరి 1971	17
తక్కువరకం రచనలు	- ఆగస్టు 1971	23
వెట్టుబడిదారీ సంస్కృతి	- సెప్టెంబర్ 1971	21
సాహిత్యంలో వైరుధ్యాలపాత్ర	- అక్టోబర్ 71	25
విప్లవ కథలు	- జనవరి' 72	28
భావపరివర్తన - విరసం	- ఏప్రిల్' 72	31
విప్లవ వాస్తవికత	- మే' 72	32
ఎడిటర్ అనేవాడు	- మార్చి' 74	54
భారతీయ సంస్కృతిలో వర్గ దృక్పథం	- ఆగస్టు' 77	70
మానవజీవితంలో మనస్సుపాత్ర	- డిసెంబర్' 78	86
జ్ఞాన విజ్ఞానాలమధ్య వైరుధ్యం	- జనవరి' 79	87
ప్రజాభిప్రాయం	- మే' 79	91
ఒంటరివాడుగా జీవించిన చలం	- జూన్' 79	92
మన సంస్కృతి	- డిసెంబర్' 79	93
ప్రజల భాషా, ప్రజల సాహిత్యమూ	- ఆగస్టు/సెప్టెంబర్' 80	06/107

సృజనలో ప్రచురణార్థం కొ. కు. పంపించిన ఆఖరిరచనల్లో 'ప్రజలభాషా-ప్రజల సాహిత్యమూ' ఆయన మరణించాకనే వెలుగు చూసింది. 'చరిత్ర—పురాణాలు' విరసం ప్రచురించిన ఆయన వ్యాస సంపుటి 'కళలు - శాస్త్రీయవిజ్ఞానం'లో చివరి వ్యాసంగా అచ్చయింది.

సమీక్షలు :

మొట్టమొదటి కన్యాశుల్కము	- ఆగస్టు 1969	12
కందుకూరి వీరేశలింగం డైరీలు, లేఖలు	- జూన్/జూలై' 71	21/22
సాంకేతిక పదకోశం	- డిసెంబర్' 71	27
'హోరు' కథల సంపుటి	- జనవరి' 72	28
'కథ'	- జనవరి' 72	28
పిపీలికాది బ్రహ్మపర్యంతం-శాకీ కథలు	- జూన్' 72	33
శ్మశాన శాంతి - కా రా కథలు	- జూలై' 72	34

సృజన ప్రచురణగా కొ.కు. వ్యాస సంకలనం 'సాహిత్యంలో విప్లవోద్యమం', నవంబర్ 1971లో వెలువడింది.

—సంపాదకుడు : వరవరరావు

కొ. కు. పై సృజనలో

వ్యాసాలు :

సాహిత్య లేఖలు :

* * * *

"తను చేస్తున్న పనియొక్క స్థూల ప్రయోజనాన్ని ఏ కళాకారుడూ సంపూర్ణ[illegible]సివెయ్యరాదు.... కవి తనరచన యొక్క ఆశయాన్ని తృ[illegible]ంచరాదు. భోజనం దగ్గర ఎంత నాజూకూ, అభిరుచీ ఉన్నా, అభ్యంతరం లేదు- భోజనం చెయ్యటం యొక్క ఉద్దేశ్యాన్ని ఏమ[illegible]కుండా ఉంటేసరి"

—కొడవటిగంటి కుటుంబరావు (1940)

* * *

"సమాజంలో అసహాయులుగా ఉన్న వారిలో చైతన్యమూ, బెదిరివున్న వాళ్ళకు ధైర్యమూ, వ్యక్తిత్వం కోల్పోయిన వాళ్ళకు వ్యక్తిత్వమూ ఇవ్వటంకన్న రచయిత తన రచనలద్వారా చేయగల ఉత్తమమైనపని ఏమన్నా ఉందా ? లేదనుకుంటాను."

—కొడవటిగంటి కుటుంబరావు.


(విరసం ప్రచురణ కళలు-శాస్త్రీయ విజ్ఞానం నుంచి)

సృజన దగ్గర దొరికే పుస్తకాలు

1. అభ్యుదయ రచయితల సంఘానికి కాయకల్ప చికిత్స-వ్యాసాలు - కె.వి. రమణారెడ్డి — రు. 1.25
2. తెలంగాణ పోరాట పాటలు - రెండోసంపుటి — 4.00
3. కథ, నవల - జీవితం - విరసం సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు - విశాఖ విరసం. అల్లం రాజయ్య — 0.40
4. ప్రజల పాటలు - అనుభవాలు విరసం సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు - గద్దర్ రామారావు, వంగపండు ప్రసాద్ — 1.25
5. చరిత్ర, భాష, సాహిత్యం-శాస్త్రీయ దృక్పథం- విరసం సాహిత్య పాఠశాల ప్రసంగ వ్యాసాలు- త్రిపురనేని మధుసూదనరావు, పి.సి. నరసింహారెడ్డి — 0.60
6. పోరాటాల శ్రీరాములు - 0.75
7. పోరాట పాటలు - 2.00
8. ప్రజలు విప్లవం కోరుతున్నారు, విప్లవం కుట్రకాదు- కోర్టుప్రసంగం- 0.80
9. కాలిమంటుకున్నది - నవల - అల్లం రాజయ్య 5.00
10. మార్క్సిజం-సాహిత్యం- ఆర్.ఎస్. సుదర్శనంకు సమాధానం త్రిపురనేని మధుసూదనరావు — 1.25
11. గమ్యం - కవితలు - చెరబండరాజు - 2.00
12. ఎర్ర రంగస్థలం - వ్యాసాలు - 1.50
13. జననం - కవితలు - బి. నరసింగరావు - 2.50
14. స్వేచ్ఛ - ,, - వరవరరావు - 2.50
15. విప్లవోద్యమానికి సి.పి.ఐ. విద్రోహం - వ్యాసం - 1.00
16. కోరస్- కవితలు - దామెర రాములు- 2 50
17. చురకలు- ,, - అలిశెట్టి ప్రభాకర్- 1.00
18. మంటల జెండాలు - ,, - 2.00
19. చావుగీతం - ,, సలంద్ర 2.00
20. కాలం కదలికలు ,, ఎం. రాములు - 2.00
21. భారతస్వాతంత్ర్య పోరాటాలు-చరిత్ర- కె.వి. రమణారెడ్డి - 2.50
22. సాంస్కృతిక దళాల నిర్మాణం - ప్రచార కార్యక్రమం - వర్గీస్ - 0.15
23. కథ, నవల- ఇటీవలి ధోరణులు- ఉదయసాహితి ప్రసంగం అల్లం రాజయ్య - 0.75
24. సోవియట్ నౌకాయుద్ధవ్యూహం - 1.00
25. నార్వే పార్టీ లేఖ - 1 00
26. ఆఫ్రికాలో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల ఆటలు- 0 50
27. నయాజారుల పాలనలో సోవియట్ యూనియన్ - 2 00
28. కంపూచియా - 1 50
29. చారుమజుందార్ రచనలు - 3.50
30. Capital Punishment : Legal, Political & human dimensions — Sumanta Banarjee — 2 00

ఏ పుస్తకం కావలసినా ముందే ఆ డబ్బు M.O. చెస్తూ M.O. కూపన్ పై వివరంగా మీ అడ్రసు కావలసిన పుస్తకాలు తెలియజేయాలి V.P. పంపాలంటే అడ్వాన్సుగా రు 2.00 M.O. చేయాలి. — సృజన, హనుమకొండ 506001

SṚJANA, Telugu Monthly Nov. '80 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67



SṚJANA
Hanumakonda-506 001

Rs. 3-00